
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 52

బుధవారం 14-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రైతు కూతురి కలల సేద్యం

ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా ఇంటర్వ్యూ - 13లో



అందం కాదు.. బంధం

అందాల పోటీలు చాలా మారాయంటున్న మిస్ సోమాలియా జైనబ్ - 13లో



అండమాన్‌ని తాకిన నైరుతి

గ్రీష్మ తాపానికి విలవిల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు నైరుతి రుతుపవనాలు అండమాన్‌ను తాకాయి.


- వివరాలు 6లో



పంజాబ్‌లో విషాదం..

పంజాబ్‌లో కల్తీ మద్యం కాటుకు 21 మంది అమాయకులు బలయ్యారు. మరో 10 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

- వివరాలు 6లో



ఎవరు ఆడతారు?

ఐపీఎల్‌లో విదేశీ ఆటగాళ్లు తిరిగి రావడంపై ఉత్కంఠ నెలకొంది. బోర్డులపై బీసీసీఐ ఒత్తిడి పెంచుతోంది.

- వివరాలు 14లో



ధరలు దిగొచ్చాయ్

మరో విడత కీలక పాలసీ రేట్ల కోత అంచనాలకు ఊతమిస్తూ ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి దిగి వచ్చింది.

- వివరాలు 15లో



మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో వాయుసేన జవాన్లతో కలిసి భారత్ మాతా కీ జై అంటూ నినదిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో రన్‌వేపై మిగ్-29 యుద్ధవిమానం. ఎస్-400ను ధ్వంసం చేశామన్న పాక్ ప్రగల్భాలు ఉత్త మాటలని నిరూపిస్తూ మోదీ దాని ఎదుటే నిల్చుని ప్రసంగించారు.

అపూర్వం.. అనూహ్యం.. అద్భుతం

వాయుసేనకు వందనం

మరోసారి తెగించొద్దని పాకిస్తాన్‌కు లక్ష్మణరేఖ గీసి వచ్చారు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పోరాటపటిమను శ్లాఘించిన ప్రధాని మోదీ

- దాయాది నడిబొడ్డున బాంబులు పేల్చారు
- మీ మెరుపువేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసింది
- భారతీయులంతా మీ పోరాటానికి ఉప్పొంగిపోయారు.. ఇది ఎన్నటికీ తీర్చుకోలేని రుణం
- పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో వాయుసేన జవాన్లనుద్దేశించి ప్రసంగం

6లో

"ఇది నవయుగ భారతం. దేశం శాంతినే కోరుకుంటుంది. కానీ శాంతిమయ మానవత్వంపై దాడి చేస్తే ఊరుకోం. అవసరమైనప్పుడు సమరమూ చేస్తాం. యుద్ధక్షేత్రంలో శత్రువును ఎలా అణగదొక్కాలో భారత్‌కు బాగా తెలుసు.

వాయుసేన వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానిక స్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినా వాయుసేన కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురిచూసి కొట్టింది."

\- ప్రధాని మోదీ

మా సైనికులు 11 మంది మృతి

78 మందికి గాయాలు.. పాకిస్తాన్ ప్రకటన

ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపేస్తేనే...

అప్పటిదాకా సింధూనది జలాల ఒప్పందం అమల్లో ఉండదు: విదేశాంగ శాఖ కార్యదర్శి రణధీర్ జైస్వాల్ స్పష్టీకరణ

ముగ్గురు లష్కరే ఉగ్రవాదులు హతం

- వివరాలు 6లో

ఆధారాలు లేకుండా అరెస్టులా..?

అరెస్టు.. పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుంది..

అది పౌరుడి గౌరవం, ప్రతిష్టను ప్రభావితం చేస్తుంది..

- కేసు పెట్టాం కాబట్టి అరెస్ట్ చేసి తీరాలన్న ఆలోచన ఎంతమాత్రం సరికాదు
- మద్యం కేసులో ప్రభుత్వ యంత్రాంగం తీరుపై 'సుప్రీం' విస్మయం
- పోలీసులు తమ విచక్షణాధికారాన్ని జాగ్రత్తగా వాడాలని హితవు
- ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసిన సుప్రీం
- హైకోర్టు తీర్పును చూస్తే.. ఆధారాలు పూర్తిస్థాయిలో పరిశీలించలేదని స్పష్టమవుతోందని వ్యాఖ్య
- తిరిగి విచారించి 4 వారాల్లో నిర్ణయం వెలువరించాలని హైకోర్టుకు స్పష్టీకరణ
- నిర్ణయం వెలువరించేంత వరకు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయొద్దని ఏసీబీకి ఆదేశం



"అరెస్ట్ అనేది.. పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుంది. అరెస్ట్ అన్నది.. వ్యక్తి గౌరవాన్ని, ప్రతిష్టను, సమాజంలో వారి స్థానాన్ని ప్రభావితం చేస్తుంది. అందువల్ల అరెస్ట్ విషయంలో దర్యాప్తు అధికారి తనకున్న అధికారాన్ని చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది.."

\- సుప్రీంకోర్టు ధర్మాసనం..

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రత్యర్థులు, ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న అరెస్టులపై సుప్రీంకోర్టు తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా అరెస్టులు చేయడం సరికాదని పేర్కొంది. కేసు పెట్టిన వెంటనే కారణాలు లేకుండా అరెస్ట్‌లు చేయడం తగదంది. 'ఏదైనా కేసులో అరెస్టు చేయడానికి సహేతుక కారణాలు

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

అద్భుతమైన జ్ఞాపకాలతో వెళ్తున్నా..



న్యాయవ్యవస్థలో సుదీర్ఘకాలం పనిచేసి ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు సొంతం చేసుకున్నానని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సంతోషం వ్యక్తంచేశారు. జీవితాంతం ఈ జ్ఞాపకాలు తనకు తోడుగా ఉంటాయని చెప్పారు.

- వివరాలు 6లో

సంక్షేమ విద్యార్థులకు స్మార్ట్ కార్డులు



సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ లావాదేవీలు, డెబిట్ కార్డుల వినియోగంపై అవగాహన పెంచేందుకు ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది.

- వివరాలు 2లో


దడ పుట్టించే 'డ్రోణా'స్త్రం



ఇజ్రాయెల్-హమాస్, రష్యా-ఉక్రెయిన్ తాజాగా భారత్-పాక్... ఇలా యుద్ధం ఏదైనా.. డ్రోన్, యూఏవీలు ఇప్పుడు సైనిక సంపదలో అత్యంత కీలకంగా మారాయి. సైనికుల ప్రాణాలను పణంగా పెట్టకుండానే కచ్చితమైన దాడులు చేయడం వాటి సొంతం.

- వివరాలు 16లో

కుమ్మక్కు తేలాల్సిందే..!



ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రైవేటు కాలేజీలతో ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లు కుమ్మక్కయ్యారా? ఇతర అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే మరోసారి భేటీ అయ్యి ఫీజులు ఖరారు చేయాలని నిర్ణయించారు.

- వివరాలు 2లో

ఇదం జగత్



యుద్ధం స్టార్ట్ అయినప్పటి నుంచి ఆ గ్లోబ్ ముందు నిలబడి యుద్ధాన్ని నేనే ఆపా అని పెద్దగా అరుస్తున్నారు డాక్టర్!

చార్మినార్ వద్ద మిస్ వరల్డ్ భామల హెరిటేజ్ వాక్



వయ్యారి భామ.. నీ హంస నడక!

పాతబస్తీలో మిస్ వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్

- అరబ్బీ మార్ఫా సంగీతానికి స్టెప్పులేసిన అందగత్తెలు
- చార్మినార్‌ను ఆసక్తిగా తిలకించిన సుందరీమణులు
- లాడ్‌బజార్‌లో షాపింగ్..
- చౌమహల్లా ప్యాలెస్‌లో విందు.. పాల్గొన్న సీఎం

సాక్షి, హైదరాబాద్: నిజాం వారసత్వ వైభవానికి, ఇప్పటికీ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తున్న హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ వద్ద వివిధ దేశాల సుందరీమణులు సందడి చేశారు. చార్మినార్‌ను ఆసక్తిగా తిలకించారు. ఫొటోలకు పోజులిచ్చారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ హెరిటేజ్ వాక్ ఉత్సాహంగా సాగింది. చార్మినార్ వద్ద, లాడ్‌బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్‌పై అందాల భామలు వయ్యారంగా నడుస్తూ స్థానికులను అలరించారు. వీరికి పాతబస్తీలో

మిగతా 5వ పేజీలో ▶

కొనుగోలు కేంద్రాల్లో రైతులు చనిపోతున్నా పట్టించుకోరా?



- ధాన్యపు రాశుల వద్ద రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే
- యాసంగి సీజన్‌లో 40 లక్షల టన్నుల ధాన్యం కూడా కొనలేదు: హరీశ్‌రావు
- ధాన్యపు రాశులు గాలికి.. అందాల రాశుల చుట్టూ ముఖ్యమంత్రి
- బీఆర్‌ఎస్ పార్టీలో నాయకత్వ సమస్య లేదని స్పష్టీకరణ

- వివరాలు 12లో

నిత్యం అబద్ధాలేనా?



- హరీశ్‌రావూ.. ధాన్యం కొనుగోళ్లపై నిజాలివిగో
- గత మూడేళ్లతో పోలిస్తే ధాన్యం సేకరణలో తమ ప్రభుత్వమే భారీగా కొనుగోలు చేసిందని వెల్లడి
- 'ఎక్స్' వేదికగా గణాంకాలు విడుదల చేసిన మంత్రి ఉత్తమ్
- కనీస మద్దతు ధర, సన్న ధాన్యానికి బోనస్, సకాలంలో కొనుగోళ్లు రైతులకు ఊరటనిచ్చాయని ప్రకటన

12లో

కమిటీలతో కాలయాపన వద్దు..



- ఉద్యోగులు అడిగేవన్నీ న్యాయబద్ధమైన డిమాండ్లే
- 16 నెలలుగా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు
- 15 నుంచి తలపెట్టిన నిరసనలు వాయిదా వేస్తున్నాం
- త్రిసభ్య కమిటీ నివేదిక సమర్పణ.. ప్రభుత్వ స్పందన తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ప్రకటన

2లో




మళ్లీ 'కోర్'కునేలా..?

ఇంజనీరింగ్ కోర్ గ్రూపులకు ఆదరణ తగ్గడంపై సర్కారు దృష్టి

- త్వరలో కాలేజీల నిర్వాహకులు, అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- ఈ ఏడాది నుంచి కోర్ గ్రూపుల సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- అంతా సీఎస్ఈ వైపే మొగ్గుతుండటంతో తగ్గుతున్న కోర్ సీట్లు, చేరికలు

ఇంజనీరింగ్‌లో కోర్ గ్రూపులకు రానురాను ఆదరణ తగ్గుతోంది. కంప్యూటర్ సీట్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. ప్రతి ఏటా కోర్ గ్రూపుల్లో సీట్లు మిగిలి పోతున్నాయి. దీంతో కాలేజీలు వాటిని తగ్గించుకునేందుకే మొగ్గుచూపుతున్నాయి. గత ఏడాది వందకు పైగా కాలేజీలు సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గించాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి ఇలాగే ఉంది. దీనిపై ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి సమగ్ర నివేదిక కోరారు. ఇంజనీరింగ్ విద్యలో సమతుల్యత అవసరమని భావిస్తున్న అధికారులు.. కోర్ గ్రూపులను కాపాడేందుకు త్వరలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నిర్వాహకులు, ఉన్నత విద్యా మండలి అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే దిద్దుబాటు చర్యలపై దృష్టి పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు. - సాక్షి, హైదరాబాద్



తగ్గుతున్న చేరికలు

సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఈఈఈ కోర్సుల్లో 2019లో 43,532 సీట్లు ఉంటే 25,823 సీట్లు భర్తీ అయ్యాయి. 2024 సంవత్సరానికి వచ్చేసరికి అంటే ఐదేళ్లలో సీట్లు 25,597కు పడిపోయాయి. 19,739 చేరికలు మాత్రమే నమోదయ్యాయి. మరో వైపు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో గడచిన ఆరేళ్లలో 280 శాతం మేర ప్రవేశాలు పెరిగాయి. సీట్లు కూడా భారీగానే పెరిగాయి. 2019లో కన్వీనర్ కోటా కింద 22,033 సీఎస్ఈ సీట్లు ఉంటే 20,311 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో సీట్లు 61,587కు పెరగగా ఏకంగా 59,485 సీట్లు భర్తీ అయ్యాయి.

ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి గత ఏడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా కోర్ గ్రూపులను మరింత దెబ్బతీసిందని నిపుణులు అంటున్నారు. కన్వీనర్ కోటా కింద ఏదైనా కాలేజీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆఖరి సమయంలో ఐఐటీ, ఎన్ఐటీల్లోనో, డీమ్డ్, ఇతర రాష్ట్రాల కాలేజీల్లోనో చేరుతుంటారు. దీంతో ఖాళీ అయ్యే సీట్లను కాలేజీలు బయటి విద్యార్థులతో భర్తీ చేసేవి. అయితే గత ఏడాది స్లైడింగ్ విధానాన్ని నిర్వహించిన సాంకేతిక విద్య విభాగం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కాలేజీలకు కలిపి స్లైడింగ్ నిర్వహించ లేదు. ఏ కాలేజీకి ఆ కాలేజీలో మాత్రమే స్లైడింగ్‌కు అవకాశం ఇచ్చింది. ఇది కోర్ గ్రూపులను మరింత దెబ్బ తీసింది. 40 వేల ర్యాంకు వచ్చిన వ్యక్తి ఒక కాలేజీలో సివిల్ గ్రూపులో సీటు పొందితే, స్లైడింగ్‌లో ఆ వ్యక్తి సీఎస్ఈ సీటు తెచ్చుకున్నాడు. కానీ 10 వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థి కంప్యూటర్ కోర్సు మాత్రమే కోరుకున్నా, ఆ కాలేజీలో బ్రాంచి లేకపోవడం వల్ల సీటు పొందలేని స్థితి ఏర్పడింది. ఈ విధంగా గత ఏడాది దాదాపు 5,500 మంది విద్యార్థులు నష్టపోయినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో కోర్ బ్రాంచీల్లో చేరిన వారిని అలాగే ఉంచి, కొత్తవారికి అవకాశం ఇచ్చేవారు. దీనివల్ల కోర్ గ్రూపులో చేరినవారు అలాగే ఉండేవారు. దీనిపై పలువురు విద్యావేత్తల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నత విద్య అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు ఇటీవలి కాలంలో కోర్ గ్రూపుల సిలబస్‌లో మార్పులు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాప్టర్లను కూడా చేరుస్తున్నారు. దీనివల్ల కోర్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

స్లైడింగ్‌లో మార్పుతోనూ కోర్‌కు నష్టం

క్లుప్తంగా...

అవినీతి పోలీసు అధికారి ఇంట్లో అక్రమ బుల్లెట్లు

హయత్‌నగర్: లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులకు పట్టుబడిన సూర్యాపేట డీఎస్పీ ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన బుల్లెట్‌లు, వాటి క్యాప్స్, స్టాండ్ బయటపడటం స్థానికంగా సంచలనంగా మారింది.. సీఐ నాగరాజుగౌడ్ కథనం ప్రకారం... లంచం అడిగిన కేసులో సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన సూర్యాపేట డీఎస్పీ కొండం పార్థసారథి, సీఐ వీరరాఘవులుపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు బాగ్ హయత్‌నగర్ దత్తాత్రేయ నగర్‌లోని పార్థసారథి ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. అవినీతి సొమ్ము కోసం సోదాలు చేస్తున్న క్రమంలో అధికారులకు ఆయన ఇంట్లో అనధికారికంగా ఉంచిన బుల్లెట్‌లు (21 లైవ్ రౌండ్‌లు), 69 ఖాళీ కాట్రిడ్జ్ (బుల్లెట్ క్యాప్‌లు), ఒక కాట్రిడ్జ్ స్టాండ్ దొరికాయి. దీంతో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. కాగా సోదాలలో ఆయన ఇంట్లో విలువైన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ఏకరీతి నిబంధనలు

వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక జేఏసీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల కోసం ఏకరీతి నిబంధనలను అమలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక జేఏసీ నాయకులు కాటం శ్రీధర్, అన్వేష్, శ్రీనివాస్, క్రాంతి, మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల విషయంలో గతంలో అనిశ్చితి నెలకొనడం, ఏపీ నుంచి నియమితులైన వారిని కొనసాగించడం వంటి చర్యలు తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేశాయని వారు ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 21 ద్వారా విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు ఏకరీతి నిబంధనలను ప్రవేశపెట్టిందన్నారు. పీజేటీఏయూ చట్టం 1963 ప్రకారం, విశ్వవిద్యాలయ నిర్వహణ సంఘం ఉపకులపతి నేతృత్వంలో ఒక ఎంపిక సంఘాన్ని ఏర్పాటు చేసి, ఈ సంఘం సిఫార్సుల ఆధారంగా నియామకాలు చేపట్టాలని జేఏసీ నాయకులు లేఖలో సూచించారు.

'భాషా పండితుల సమస్యలను పరిష్కరించాలి'




ఎంపీ మల్లు రవికి వినతి పత్రం ఇస్తున్న ఆర్‌యూపీపీ-టీఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: భాషా పండితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌యూపీపీ-టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సి.జగదీశ్, ములకనూరి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంలోని పలువురికి మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీని కలిసి రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులను వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని కలిసి తెలుగు, హిందీ, పీడీల స్పౌజ్ బదిలీలను చేపట్టాలని విన్నవించారు. ఎంపీ మల్లు రవి, శాసనసభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డిని కలిశారు. పండిత పరిషత్ నాయకులు దార్ల రాఘవేంద్రాచారి, జ్యోతిరాణి, ఖాజాహుస్సేన్, షౌకత్ ఆర్జూ, జ్యోతి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మక్కు తేలాల్సిందే..!

ఆ తర్వాతే ఇంజనీరింగ్ కొత్త ఫీజుల ఖరారు

- టీజీఎఫ్ఆర్‌సీ భేటీలో నిర్ణయం
- ఏఎఫ్ఆర్‌సీ ఆడిటర్లు ప్రైవేటు కాలేజీల కొమ్ముగాశారనే ఆరోపణలపై 'సాక్షి' కథనం
- 'సాక్షి' కథనం వాస్తవమేనన్న విద్యాశాఖ అధికారులు!
- ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికీ వెళ్లిన వైనం
- మరోసారి ఆడిట్ నివేదికలు పరిశీలించాలని, కాలేజీలకు వెళ్లాలని నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రైవేటు కాలేజీలతో ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లు కుమ్మక్కయ్యారా? ఇతర అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే మరోసారి భేటీ అయ్యి ఫీజుల ఖరారు చేయాలని నిర్ణయించారు. 2025-26 నుంచి మూడేళ్ల కాలానికి గాను, ఇంజనీరింగ్ కాలేజీల వార్షిక ఫీజుల పెంపుపై తుది నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ ఫీజులు, ప్రవేశాల నియంత్రణ కమిటీ (టీజీఎఫ్ఆర్‌సీ) మంగళవారం భేటీ అయింది. కమిటీ చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగిత రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రైవేటు కాలేజీలు ఇష్టానుసారం ఆడిట్ రిపోర్టులు సమర్పించాయని మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సమావేశంలో సీరియస్‌గా చర్చ జరిగింది. 'సాక్షి'వార్తలో వాస్తవం ఉందనే అభిప్రాయం ఉన్నతాధికారులు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఏఎఫ్ఆర్‌సీ నియమించిన ఆడిటర్లు ప్రైవేటు కాలేజీలకు కొమ్ముగాశారనే ఆరోపణల నేపథ్యంలో ఫీజుల పెంపును గుడ్డిగా ఆమోదించలేమని వారు స్పష్టం చేశారు. దీంతో ప్రైవేటు కాలేజీల జమా ఖర్చులపై ఆడిట్ నివేదికలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఏఎఫ్ఆర్‌సీ నిర్ణయించింది. కాలేజీల ఆడిట్ నివేదికలను ఆమోదించిన ఆడిటర్ల నిబద్ధతపై కమిటీలోని పలువురు సభ్యులు సందేహాలు లేవనెత్తినట్టు తెలిసింది. కాలేజీలతో వారికి గల సంబంధాలపై ఆరా తీయాలని విద్యాశాఖకు చెందిన కీలక అధికారి సూచించినట్టు సమాచారం. అడ్డగోలుగా ఫీజులు పెంచేందుకు వీలుగా ఆడిటర్లతో ప్రైవేటు కాలేజీలు కుమ్మక్కవ్వడం ప్రభుత్వాన్ని అప్రదిష్టకు గురి చేస్తుందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆడిటర్ల నేపథ్యం తెలుసుకోకుండా ఫీజులు పెంచేందుకు అనుమతించకూడదని ఆమె వ్యాఖ్యానించినట్టు సమాచారం.

సీఎంవోలోనూ అధికారుల చర్చలు!

ఏఎఫ్ఆర్‌సీ సమావేశం ఉదయం 11 గంటలకే జరగాల్సి ఉండగా మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగింది. 'సాక్షి'కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఆరా తీసిందని, దీంతో సమావేశానికి రావాల్సిన అధికారులు సీఎంవోకు వెళ్లి చర్చించినట్టు సమాచారం. అలాగే ఫీజులను ఇప్పటికిప్పుడు యథాతథంగా ఆమోదించవద్దనే సూచనలు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సమావేశం మొదలవ్వగానే విద్యాశాఖ అధికారులు ఫీజుల పెంపుపై తీవ్ర అభ్యంతరం లేవనెత్తినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. 'ప్రైవేటు కాలేజీలు ఇచ్చిన ఆడిట్ నివేదికలు పరిశీలించి నిర్ధారించుకున్నారా?'అంటూ ఓ ఉన్నతాధికారి ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో 'ఇది తమ పని కాదని, ఆడిట్ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటామన్నట్టుగా ఏఎఫ్ఆర్‌సీ అధికారులు కొందరు వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాగా 'అసలు ఆడిటర్లు ఎవరు? వారికి గతంలో ఏయే కాలేజీలతో అనుబంధం ఉంది?'అనే అంశాలపై ఆరా తీయాలని విద్యాశాఖ అధికారులు పట్టుబట్టినట్లు సమాచారం. దీంతో అధికారుల మధ్య వాడివేడి వాగ్వాదం జరిగిందని విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో రెండు ప్రైవేటు కాలేజీల ఆడిట్ రిపోర్టులను సమావేశానికి తెప్పించిన విద్యాశాఖ అధికారులు అందులో లోపాలను ఎత్తిచూపినట్టు తెలిసింది. అన్ని కాలేజీల ఆడిట్ రిపోర్టులూ ఇదే విధంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమైన నేపథ్యంలో ఆ నివేదికలు మరోసారి పరిశీలించాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త కోర్సులు పెట్టామని, మౌలిక వసతుల కోసం భారీగా ఖర్చు పెట్టామంటూ.. నివేదికలు ఇచ్చిన కాలేజీలకు స్వయంగా వెళ్లి పరిశీలించాల్సిన అవసరమూ ఉందని కొందరు అధికారులు వాదించినట్లు సమాచారం.

ఆడిటర్లపై సీఎంవో ఆరా

ఏఎఫ్ఆర్‌సీ నియమించిన ఆడిటర్లు ప్రైవేటు కాలేజీలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సీఎంవో రంగంలోకి దిగింది. ఆడిటర్లకు సంబంధించిన వివరాలపై స్వయంగా వాకబు చేస్తోంది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఆడిట్ నివేదికల కోసం నియమించుకున్న ఆడిట్ సంస్థలకు, ఏఎఫ్ఆర్‌సీ నియమించిన ఆడిటర్లకు మధ్య సంబంధాలున్నట్టుగా సీఎంవోకు సైతం ఫిర్యాదులు వచ్చినట్టు తెలిసింది. ప్రైవేటు కాలేజీల ఆడిట్ నివేదికలు పరిశీలిస్తున్న క్రమంలో జరిగిన ఫోన్‌కాల్ సంభాషణలపై వాకబు చేస్తున్నట్టు తెలిసింది.

కలకలం రేపిన 'సాక్షి' కథనం

'నేడు ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు'పేరుతో 'సాక్షి'ప్రచురించిన కథనం కలకలం రేపింది. రాష్ట్ర వ్యాప్తంగా వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. దీంతో విద్యార్థి, ప్రజా సంఘాలతో పాటు అధికార పార్టీ వర్గాలు సైతం దీనిపై తీవ్రంగా స్పందించాయి. ప్రభుత్వం ప్రతిష్ట దెబ్బతింటోందంటూ విషయాన్ని కాంగ్రెస్ నేతలు కొందరు సీఎంవో దృష్టికి తీసుకెళ్ళారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఖరారు కావాల్సిన ఇంజనీరింగ్ ఫీజుల పెంపు వాయిదా పడింది.

కమిటీలతో కాలయాపన వద్దు

- ఉద్యోగులు అడిగేవన్నీ న్యాయబద్ధమైన డిమాండ్లే
- 15 నుంచి తలపెట్టిన నిరసనలు తాత్కాలికంగా వాయిదా... టీజీఈజేఏసీ ప్రకటన



టీఎన్జీవో భవన్‌లో జరిగిన సమావేశం అనంతరం మాట్లాడుతున్న నేతలు జగదీశ్వర్, శ్రీనివాసరావు, హుసేన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం కాలయాపన చేయొద్దని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత చిన్నారెడ్డి అధ్యక్షతన కమిటీ, ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం, తాజాగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. ఇలా కమిటీలు ఏర్పాటు చేయడం వల్ల కాలయాపన తప్ప.. 16 నెలలుగా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని విమర్శించారు. మంగళవారం టీఎన్జీఓ భవన్‌లో టీజీఈజేఏసీ కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించి ఐదు అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు.

ఉద్యోగులను దోషులుగా చూపుతున్న సర్కారు ప్రకటనలు

జేఏసీ అడుగుతున్నవన్నీ న్యాయబద్ధమైన డిమాండ్లేనని, తామెన్నడూ ఏదీ అదనంగా కోరలేదని జగదీశ్వర్ చెప్పారు. కానీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఉద్యోగులను దోషులుగా చూపుతున్నట్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉందని, ఇంకో నెలరోజులు గడిస్తే ఆరో డీఏ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం త్రిసభ్య కమిటీకి వినతులు సమర్పించామని, ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉందని వివరించారు. ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాల వారీగా నిరసనలు చేపట్టాలని టీజీఈజేఏసీ పిలుపు ఇచ్చిందని, ప్రస్తుతం త్రిసభ్య కమిటీకి పరిస్థితిని వివరించినందున నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వానికి త్రిసభ్య కమిటీ నివేదిక సమర్పణ, రాష్ట్ర ప్రభుత్వ స్పందన తర్వాత జేఏసీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అధికారుల కమిటీ నివేదిక సమర్పించిన వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఆర్థికేతర అంశాలతో కూడిన డిమాండ్లను వేగవంతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు-2025 మే నెలలోనే చేపట్టాలని, గత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారికి తిరిగి సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు ఐఎస్‌వో గుర్తింపు

5 స్టార్ క్వాలిటీ రేటింగ్ సైతం..

సాక్షి, హైదరాబాద్: నాణ్యత నిర్వహణ వ్యవస్థలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకున్నందుకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ప్రతిష్టాత్మక ఐఎస్‌వో 9001:2015 గుర్తింపుతో పాటు, అత్యుత్తమ సేవలకు ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్‌ను సొంతం చేసుకుంది. ఈ రెండు గుర్తింపులకు ధ్రువపత్రాలను హైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అందజేయగా.. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చవాన్ స్వీకరించారు. సంస్థ కార్యకలాపాల్లో స్థిరత్వం, సామర్థ్యం, వినియోగదారుల సంతృప్తిని నిర్ధారిస్తూ.. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించడానికి ప్రామాణికంగా ఐఎస్‌వో 9001:2015 ధ్రువీకరణ సూచిస్తుంది. ప్రాజెక్టుల నిర్వహణ, భద్రత చర్యలు, సుస్థిరత, వాటాదారులతో సమన్వయం కలిగి ఉండటాన్ని 5 స్టార్ క్వాలిటీ రేటింగ్ ప్రతిబింబిస్తుందని సంస్థ ప్రతినిధి తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా నమ్మకమైన, సుస్థిర, ప్రజా కేంద్రిత సేవలను అందించే లక్ష్యంలో.. ఈ గుర్తింపులు కీలక మైలురాయిగా నిలుస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకుంటుందని తెలిపారు.

సంక్షేమ విద్యార్థులకు స్మార్ట్ కార్డులు

- వీటి ద్వారానే కాస్మెటిక్ చార్జీల వినియోగం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ లావాదేవీలు, డెబిట్ కార్డుల వినియోగంపై అవగాహన పెంచేందుకు ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ చార్జీల కింద నగదును అందిస్తోంది. వసతిగృహ సంక్షేమాధికారికి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఈ నిధిని విడుదల చేస్తోంది. ఆ నిధి నుంచి విద్యార్థులకు చెల్లిస్తున్నారు. ఇకపై కాస్మెటిక్ చార్జీలను నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి బ్యాంకు ఖాతాను తెరవనుంది. బ్యాంకు ఖాతాలో జమ అయిన సొమ్ము నుంచి విద్యార్థి అవసరాలకు అనుగుణంగా స్మార్ట్ కార్డు ద్వారా ఖర్చు చేసే వెసులుబాటు కల్పించనుంది. ఈ స్మార్ట్ కార్డు డెబిట్ కార్డు మాదిరి పనిచేస్తుంది. ఈ కార్డుల వినియోగం వల్ల విద్యార్థులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెరగడమే కాకుండా డిజిటల్ లావాదేవీల పైన చైతన్యం కలిగించినట్లవుతుంది. ఈ దిశగా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన సబ్బులు, షాంపూలు ఇతర వస్తువులను కొనుగోలు చేసేందుకు స్మార్ట్ కార్డులను వినియోగించేలా వెసులుబాటు కల్పించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ కేంద్రాల ద్వారా కాస్మెటిక్ వస్తువులను కొనుగోలు చేసేవిధంగా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. వసతిగృహాలకు సరఫరా చేసే సరుకుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బెడ్‌షీట్లు, కార్పెట్, బ్యాగులు తదితర సామగ్రి కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి, సెర్ప్ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య రాజధానిగా హైదరాబాద్

- అందుకే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం నిర్ణయం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంగళవారం స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు

కందుకూరు: హైదరాబాద్ నైపుణ్య రాజధానిగా ఎదగాలనే ఆశయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయించి, పనులు ప్రారంభించారని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలకు అవసరమైన నైపుణ్యం ఉన్న వారి కోసం హైదరాబాద్ వైపు చూసే విధంగా ఒక అడుగు ముందుకు వేశామన్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేస్తున్న స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో స్కిల్స్ యూనివర్సిటీ పనులను చేపట్టిందన్నారు. మొదటి విడతలో అకడమిక్ భవనం, విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, వీసీ నివాసం, సూపర్ మార్కెట్, వైద్య చికిత్స కేంద్రం తదితర నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. డిసెంబర్ 9 వరకు నిర్మాణాలు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఇదే ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో స్కిల్స్ యూనివర్సిటీ వీసీ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియా

సీఎస్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా 1998 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రామకృష్ణారావు.. సీఎస్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన నుంచి సందీప్‌కుమార్ సుల్తానియా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకోనున్నారు. కాగా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన సుల్తానియా మంగళవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భట్టి.. సుల్తానియాను అభినందించారు.

గురుకుల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

వచ్చే నెల 3 నుంచి ప్రారంభం: అలుగు వర్షిణి



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో చదివిన, చదువుతున్న విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 239 ఎస్సీ గురుకుల విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమాలను వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకే కాకుండా కోర్సు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. రెండొందల గంటలపాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు.

- ఈ ఏడాది నుంచి డిగ్రీ కాలేజీల్లో 15 కొత్త ఒకేషనల్ కోర్సులు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, 36 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు.
- గురుకులాల్లో ఐదోతరగతిలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, మొత్తం 57,523 సీట్లు ఉండగా, ఇందులో 55 ,504 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. 2019 స్పెషల్ కేటగిరీకి సంబంధించిన సీట్లు ఖాళీగా ఉన్నాయని, తుది కౌన్సెలింగ్ మే 20న చేపడతామని, సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా పాఠశాలల్లో రిపోర్ట్ చేయాలన్నారు.

ఎడ్‌సెట్ గడువు 20 వరకు పొడిగింపు

కన్వీనర్ వెంకట్రామ్‌రెడ్డి వెల్లడి

కేయూ క్యాంపస్: బీఈడీ కోర్సులో 2025-2026 విద్యాసంవత్సరం ప్రవేశాలకుగాను ఎడ్‌సెట్-2025 రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 20వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఆ సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 13 వరకు ఉన్న గడువు ముగియడంతో మరోమారు పొడిగించినట్లు పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కాగా, మంగళవారం వరకు ఎడ్‌సెట్‌కు 32 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. కరెక్షన్స్ చేసుకునేందుకు అభ్యర్థులకు ఈనెల 25న అవకాశం ఉంటుందని చెప్పారు. 26 నుంచి వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎడ్‌సెట్.టీజీసీహెచ్ఈ.ఏసీ.ఇన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెంకట్రామ్‌రెడ్డి సూచించారు. జూన్ 1న నిర్వహించనున్న ఎడ్‌సెట్ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 1న మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రిలిమినరీ 'కీ'ని జూన్ 5న వెల్లడిస్తామన్నారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను జూన్ 9న స్వీకరిస్తారని తెలిపారు. ప్రతీ అభ్యంతరానికి రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, అభ్యర్థి అభ్యంతరం వాస్తవమైతే ఆ రూ.500 తిరిగి చెల్లిస్తామని వివరించారు. జూన్ 21న ఫైనల్ 'కీ'ని, అలాగే ఫలితాలు వెల్లడిస్తామని వెంకట్రామ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఫేక్.. జర దేఖ్!

కేస్ 01

విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ ఇటీవల చేసిన ప్రసంగంలో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పినట్టు ఒక వీడియో ఈ నెల 10న సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడి రూపొందించిన ఫేక్ వీడియోగా పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తేల్చింది.

కేస్ 02

శంషాబాద్ విమానాశ్రయంలో ఒక కరుడుగట్టిన ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుంటున్న వీడియో ఇటీవల వైరల్ అయ్యింది. ఈ వీడియో ఇటీవల జరిగిన మాక్ డ్రిల్‌లోదని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఫ్యాక్ట్ చెక్ ద్వారా బయటపెట్టింది.

కేస్ 03

భారత సైన్యానికి విరాళాలు సేకరించేందుకు కేంద్రం బ్యాంకు ఖాతా తెరిచిందని, ప్రజలు విరాళాలు ఇవ్వాలని వాట్సాప్‌లో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. ఇది నకిలీ సందేశమని, అప్రమత్తంగా ఉండాలని టీజీసీఎస్‌బీ ప్రకటించింది.



- ఇటీవల బాగా పెరిగిన ఫేక్ న్యూస్
- ఏఐ టూల్స్‌తో డీప్ ఫేక్ వీడియోలు సృష్టి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ వార్తలు
- ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదుల వెల్లువ

ప్రస్తుత ఇంటర్నెట్ జమానాలో నిమిషానికో ఫేక్ వీడియో పుట్టుకొస్తోంది. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఎక్స్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్.. ఇలా అందుబాటులో ఉన్న ప్రతి మాధ్యమాన్ని వాడి కొందరు తప్పుడు వార్తలు, నకిలీ వీడియోలను వైరల్ చేస్తున్నారు. దేశంలో 77.4 శాతం ఫేక్ న్యూస్ వ్యాప్తి సోషల్ మీడియా ద్వారానే జరుగుతోంది. డీప్ ఫేక్‌ల కారణంగా 55 శాతం మంది ప్రజలు సోషల్ మీడియా కంటెంట్‌పై నమ్మకం కోల్పోతున్నారని 2024లో ఒక సర్వే తెలిపింది.

సాక్షి, హైదరాబాద్

ఫేక్ న్యూస్ వ్యాప్తి ఇలా..

- దేశంలో సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందే ఫేక్ న్యూస్‌లలో రాజకీయ సంబంధమైనవి 46 శాతం, సాధారణ అంశాలపై 33.6 శాతం, మతపరమైనవి 16.8 శాతం ఉంటున్నాయి.
- 2022–2024 మధ్య నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో ఫేక్ న్యూస్‌పై 12 వేల ఫిర్యాదులు నమోదయ్యాయి.
- పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ద్వారా దేశవ్యాప్తంగా 2019 నుంచి 2025 వరకు సుమారు 50 వేల నకిలీ వార్తలను ధ్రువీకరించింది.
- తెలంగాణ ప్రభుత్వం 2020లో స్థాపించిన ఫ్యాక్ట్ చెక్ పోర్టల్ 2020–2025 మధ్య రాష్ట్రంలో సుమారు 8,000 నకిలీ వార్తలను ధ్రువీకరించింది. వీటిలో 50% రాజకీయ అంశాలు, 30% సామాజిక సమస్యలు, 15% ఆరోగ్య సంబంధిత వార్తలున్నాయి.
- తెలంగాణలో 2022–2024 మధ్య ఫేక్ న్యూస్‌పై 1,200 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి, వీటిలో 70% సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందినవి.
- రాష్ట్రంలో ఫేక్ న్యూస్ వ్యాప్తి 65% వాట్సాప్ ద్వారా జరుగుతోంది.

డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తి ఇలా..

- 2023లో దేశవ్యాప్తంగా సుమారు 50,000 డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు సృష్టించబడినట్లు అంచనా. ఈ సంఖ్య 2024లో 20% పెరిగింది.
- 2023–2025 మధ్య డీప్‌ఫేక్ వీడియో సంబంధిత ఫిర్యాదులు సుమారు 3,500 ఎన్‌సీఆర్‌పీలో నమోదయ్యాయి.
- దేశంలో డీప్‌ఫేక్ కంటెంట్‌లో 60% వాట్సాప్ ద్వారా, 25% ట్విట్టర్ ద్వారా వ్యాప్తి చెందుతోంది.
- రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగంలో 2023–25 మధ్య డీప్‌ఫేక్ సంబంధిత ఫిర్యాదులు 300 నమోదయ్యాయి. రాష్ట్రంలో డీప్‌ఫేక్ కంటెంట్‌లో 50% వాట్సాప్, 30% ట్విట్టర్, 15% టెలిగ్రామ్ ద్వారా వ్యాప్తి చెందుతోంది.

చెక్ పెట్టండిలా..

ఎన్‌సీఆర్‌పీ పోర్టల్: డీప్ ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేయడానికి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (www.cybercrime.gov.in) (www.cybercrime.gov. in)ను కేంద్ర హోం శాఖ అందుబాటులోకి తెచ్చింది.

ఫ్యాక్ట్ చెక్: సోషల్ మీడియాలో వచ్చే సమాచారం నకిలీదా, నిజమైనదా? అని నిర్ధారించుకునేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ యూనిట్, తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ పోర్టల్ (factcheck.telangana.gov.in) అందుబాటులో ఉన్నాయి.

ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

ఏ విషయంలోనైనా ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవు. అన్ని అనుమానాస్పద సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు గమనిస్తున్నారు. తప్పుడు వార్తలపై 87126 72222 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదులు పంపండి.

– ఎక్స్‌లో టీజీసీఎస్‌బీ



మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం

గోరంట్ల మండలం కల్లి తండాలో వైఎస్ జగన్

- వీర జవాన్ కుటుంబానికి పరామర్శ

సాక్షి, పుట్టపర్తి : 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశ సరిహద్దులోని కశ్మీర్‌లో ఈనెల 8న పాకిస్తాన్‌తో జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మురళీ నాయక్ వయసులో చిన్నవాడే అయినప్పటికీ దేశానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. యావత్ భారత్ గర్వపడేలా వీరోచితంగా పోరాడి.. దేశ రక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించిన వీరుడన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మురళీ నాయక్ కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. ఉదయం బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన మురళీనాయక్ స్వగ్రామమైన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చేరుకున్నారు. మురళీనాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మురళి తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ నాయక్‌లకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు భావోద్వేగానికి గురయ్యారు. 'మురళీ.. లే మురళీ.. జగన్ సార్ వచ్చారు.. లేచి సెల్యూట్ చేయి మురళీ'అంటూ తండ్రి శ్రీరామ్ నాయక్ భావోద్వేగంతో పలికిన మాటలు అక్కడ ఉన్న వారందరికీ కన్నీళ్లు తెప్పించాయి. మురళీ నాయక్ తల్లిదండ్రులను పరామర్శించిన అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. యావత్ భారత్ దృష్టిని ఆకర్షించిన మురళీని మన మధ్యలోకి తేలేం కానీ.. ఆయన త్యాగానికి రుణపడి ఉంటామన్నారు. దేశం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు. దేశం కోసం పోరాడుతూ.. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం చేసే సంప్రదాయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మురళీ కుటుంబానికి రూ.50 లక్షలు ప్రకటించడం పట్ల అభినందించారు.



మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్

ఆధారాలు లేకుండా అరెస్టులా?

▶ మొదటి పేజీ తరువాయి

చూపించాలి. కేసు పెట్టాం కాబట్టి అరెస్ట్ చేసి తీరాలన్న ఆలోచన ఎంతమాత్రం సరికాదు. ఇలాంటి యాంత్రిక అరెస్టులు సబబు కాదు...' అని గత ప్రభుత్వ మద్యం విధానంపై నమోదైన అక్రమ కేసుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ విచారణకు స్వీకరించదగ్గ ప్రతి నేరంలో నిందితుడిని అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. అరెస్టుల విషయంలో పోలీసులు తమ అధికారాన్ని జాగ్రత్తగా ఆలోచించి మాత్రమే ఉపయోగించాలని పునరుద్ఘాటించింది.

హైకోర్టు తీర్పును రద్దు చేసిన 'సుప్రీం'...

మద్యం కేసులో రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా రద్దు చేసింది. మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తిరిగి విచారణ జరిపి తగిన నిర్ణయం వెలువరించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆదేశించింది. హైకోర్టు తీర్పును పరిశీలిస్తే.. ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలించలేదన్న విషయం స్పష్టమవుతోందని వ్యాఖ్యానించింది. దర్యాప్తు అధికారి సేకరించిన ఆధారాలను మరోసారి జాగ్రత్తగా పరిశీలించి నాలుగు వారాల్లో ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించాలని హైకోర్టుకు స్పష్టం చేసింది. మిథున్‌రెడ్డి పరువు, ప్రతిష్టలను కూడా కేసు విచారణ సందర్భంగా పరిగణలోకి తీసుకోవాలని తేల్చి చెప్పింది. హైకోర్టు నిర్ణయం వెలువరించేంత వరకు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఏసీబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకు మిథున్‌రెడ్డి...

గత ప్రభుత్వ మద్యం విధానంపై నమోదైన అక్రమ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి తొలుత ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటి షన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికా ర్జునరావు విచారణ జరిపారు. మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ గత నెల 3న తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ జరిపింది.

దర్యాప్తునకు సహకరిస్తున్నారు...

మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, రంజిత్ కుమార్‌లు వాదనలు వినిపిస్తూ పిటిషనర్ ఇప్పటికే దర్యాప్తు అధికారి ముందు విచారణకు హాజరయ్యారని తెలిపారు. మద్యం కేసులో మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేర్చామని రాష్ట్ర ప్రభుత్వ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. హైకోర్టు తీర్పును ఆక్షేపించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆదేశించింది. తీర్పు వెలువరించేంత వరకు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయబోమన్న రాష్ట్ర ప్రభుత్వ హామీని ధర్మాసనం రికార్డ్ చేసింది.

15న సాయంత్రం గుట్టలో బ్రేక్ దర్శనాలు రద్దు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 15న సాయంత్రం భక్తులకు కల్పించే బ్రేక్ దర్శనాలను రద్దుచేశామని ఆలయ ఈవో వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొంటున్న సుందరీమణులు ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా ఈనెల 15న యాదగిరి క్షేత్రానికి వస్తున్నారన్నారు. సాయంత్రం 5 గంటలకు సుందరీమణులు క్షేత్రంలో పర్యటిస్తారని, ఆ సమయంలో భక్తులకు బ్రేక్ దర్శనంతో పాటు జోడు సేవలను రద్దుచేశామని ఈవో పేర్కొన్నారు.

18న గోశాల నిర్వాహకులు, గోపోషకుల సదస్సు

సాక్షి, హైదరాబాద్: మండే ఎండలతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గోశాలలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలు కనుగొనే లక్ష్యంతో ఈ నెల 18న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని శ్రీ వాసవి సేవా కేంద్రంలో రాష్ట్రస్థాయి గోశాలల నిర్వాహకులు, గోపోషకుల సదస్సు నిర్వహించనున్నట్లు సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలీసెట్‌కు 92.64 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్–2025) మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర సాంకేతిక విద్య ఆధ్వర్యంలో 276 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 1,06,716 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 98,858 (92.64 శాతం) మంది హాజరయ్యారు.



బాధ కలుగుతున్నప్పుడు,
జీవితం నీకు ఏదో బోధించాలని ప్రయత్నిస్తున్నదని గమనించు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 14 మే 2025

వెనక్కి తగ్గిన అమెరికా - చైనా

వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హో లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర్ఖత్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది. గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా–చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి.

చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించదగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి. వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సిరావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి.

ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీకారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది. ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు.

అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, ముున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం. నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్యపరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు. సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. ముున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.విదియ రా.12.35 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: అనూరాధ ఉ.10.24 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా.4.29 నుండి 6.13 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.31 నుండి 12.22 వరకు, అమృత ఘడియలు: రా.2.51 నుండి 4.26 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

నీళ్ల కోసం ఇక పాక్ కాళ్లబేరం!

సందర్భం



హ్యాపీమాన్ జాకబ్

ఇండియా, పాకిస్తాన్ మే 10న కాల్పులను విరమించాయి. దీనికి అమెరికా చొరవ చూపినట్టుగా వార్తలొచ్చాయి. ఏప్రిల్ 22 పహల్‌గామ్ దాడి నుంచి మే 10 కాల్పుల విరమణ వరకు గడచిన ఈ స్వల్పకాలంలో ఇరు దేశాల సంబంధాలు మౌలికంగా కొత్త రూపు సంతరించుకున్నాయి.

ఉగ్రదాడికి ముందు ఇండియా–పాకిస్తాన్ సంబంధాలు ఎలా ఉండేవో ముందుగా తెలుసుకోవాలి. రెండు దేశాల నడుమ పరిష్కారం కాని సమస్యలపై ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, కాల్పుల విరమణ సజావుగా కొనసాగుతోంది. సింధూ నదీ జలాల ఒప్పందానికి (ఇండస్ వాటర్ ట్రీటీ–ఐడబ్ల్యూటీ) ఇండియా కట్టుబడి ఉంది. పరిమిత కాల పర్యటనలకు వీలుగా అటారీ–వాఘా సరిహద్దు తెరిచే ఉంటోంది. రాజధానుల్లో హై కమిషనర్లు మినహా సీనియర్ దౌత్యాధికారులు పనిచేస్తున్నారు. ఏదో ఒకరోజు కశ్మీర్ మీద చర్చలు సాధ్యమేనన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉగ్రదాడి మరునాడు, అంటే ఏప్రిల్ 23న, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ఇండియా ప్రకటించింది. అటారీ– వాఘా సరిహద్దును మూసేసింది. రక్షణ సహాధికారుల పోస్టులను రద్దు చేసింది. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ భగ్నమైంది. పాకిస్తాన్ ఒకడుగు ముందుకేసి 1972 సిమ్లా ఒప్పందం రద్దు చేస్తానని బెదిరించింది.

ఉగ్రవాదాన్ని అంతం చేస్తేనే నీళ్లు!

కట్ చేస్తే... మే 11న అకస్మాత్తుగా వైరాలు నిలిచిపోయాయి. మళ్లీ కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దీంతో మారిన పరిస్థితులు ఏవి? దీని తర్వాత మారనివేమిటి? మే 10న రెండు దేశాల డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)లు టెక్నికల్ అగ్రిమెంటు కుదుర్చుకున్నారు. దీని ప్రకారం, నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్–ఎల్‌ఓసీ) పొడవునా కాల్పులు జరగవు. డ్రోనులు, క్షిపణులు ప్రయోగించుకోరు. ఇతర లాంగ్ రేంజ్ ఆయుధాల ప్రయోగం జరగదు. పరస్పర సైనిక దాడులు నిలిచిపోతాయి.

ఇక కాల్పుల విరమణ ఒప్పందం వమ్ము చేయలేనివి ఏమిటో చూద్దాం. ఏప్రిల్ 23న ఇండియా, ఆ తర్వాత పాకిస్తాన్ తీసుకున్న చర్యలను మే 10 ఒప్పందం రద్దు చేయలేదు. ఇది టెక్నికల్ స్థాయి పత్రం తప్ప రాజకీయ ఒప్పందం కాదు. డీజీఎంఓలకు రాజకీయ ఒప్పందాలు చేసుకునే అధికారం లేదు. వీటిని విదేశీ వ్యవహారాల శాఖలు మాత్రమే కుదుర్చుకోగలవు. మరో విధంగా చెప్పాలంటే, ఏప్రిల్ 22 నాటి పరిస్థితిని ఇరు దేశాలూ పునరుద్ధరించలేదు. అందుకే, ఇండియా, పాకిస్తాన్ నడుమ ఇప్పుడున్నది నయా స్టేటస్ కో! అంటే, ఐడబ్ల్యూటీ ఇక ముందు కూడా నిలుపుదలలోనే ఉంటుంది.



◆ సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేత ఇండియా – పాక్ దౌత్య సంబంధాలను మార్చేసిన తీవ్ర చర్య. పాక్ ఇకముందు కూడా కశ్మీర్ పాట పాడుతుంది. కానీ, సింధూ జలాల విషయంలో ఇండియాను సానుకూలం చేసుకోవడమే వారి అసలు లక్ష్యం అవుతుంది. ఇరు దేశాల సంబంధాల్లో ఇప్పటి వరకు కేంద్ర బిందువుగా ఉన్న కశ్మీర్ స్థానాన్ని ఇప్పుడు నీరు ఆక్రమించింది.

సింధు జలాలు ఇండియా ఇష్టానుసారం ప్రవహిస్తాయి. ఈ జలాల గణాంకాలను పాకిస్తాన్‌తో పంచుకోవడానికి ఇండియా సుముఖంగా లేదు. దాయాది దేశ ఆర్థిక వ్యవస్థను, అంతర్గత రాజకీయాలను దీర్ఘ కాలంలో ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

ఐడబ్ల్యూటీ నిలిపివేత ఇండియా–పాకిస్తాన్ దౌత్య సంబంధాల రూపురేఖలను మౌలికంగా మార్చేసిన తీవ్ర చర్య. పాక్ టెర్రరిజానికి స్వస్తి పలికితే తప్ప సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించబోమని ఇండియా తేల్చిచెప్పింది. ఏకపక్షంగానో, లేదా ద్వైపాక్షిక చర్చల అనంతరమో దీన్ని పునరుద్ధరించడం పూర్తిగా ఇండియా చేతిలో ఉంది. మే 10 కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి ఈ అంశం రాదు.

భవిష్యత్ చర్చల్లో పాకిస్తాన్ మెడలు వంచడానికి ఈ ఐడబ్ల్యూటీ సస్పెన్షన్ గొప్ప అస్త్రం అని చెప్పాలి. పాకిస్తాన్‌కు సింధూ బేసిన్ నీళ్లు కావాలంటే, టెర్రరిజం విషయంలో ఇండియా డిమాండ్లకు అది తలొగ్గాల్సిందే. కశ్మీర్ అనేది భావోద్వేగాలకు సంబంధించిన అంశం. అయితే, పాకిస్తాన్ ప్రజలకు నీరు జీవన్మరణ సమస్య. పాకిస్తాన్ ఇకముందు కూడా కశ్మీర్ పాట పాడుతుంది. కానీ, ఐడబ్ల్యూటీ విషయంలో ఇండియాను సానుకూలం చేసుకోడమే ముున్ముందు వారి అసలు లక్ష్యం అవుతుంది. ఉభయ పక్షాల చర్చల్లో కశ్మీర్ అంశం ప్రాముఖ్యం కోల్పోతుంది. దాని స్థానంలో ఐడబ్ల్యూటీ కీలకాంశంగా మారుతుంది. మరో విధంగా చెప్పాలంటే, ఇండియా తీసుకున్న ఐడబ్ల్యూటీ సస్పెన్షన్ అనే ఒకే ఒక్క చర్యతో... ఇరు దేశాల సంబంధాల్లో ఇప్పటి వరకు కేంద్రబిందువుగా ఉన్న కశ్మీర్ స్థానాన్ని ఇప్పుడు నీరు ఆక్రమించింది.

నిగ్రహం బాధ్యత పాక్ మీదే...

1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం అనంతరం, 1972లో సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేసినప్పుడు కూడా ఇండియా ఇలానే వ్యవహరించింది. యుద్ధం ముందు ఉన్న ప్రాదేశిక స్థితిని (1965 యుద్ధానంతరం మాదిరిగా) యథాతథంగా అంగీకరించలేదు. కశ్మీర్ సరిహద్దు పేరును 'కాల్పుల విరమణ రేఖ' నుంచి 'నియంత్రణ రేఖ' (ఎల్‌ఓసీ)గా మార్చింది. ఇలా చేయడం ద్వారా కశ్మీర్‌లో తృతీయ పక్షం జోక్యాన్ని వ్యతిరేకించగలిగింది. అప్పటి నుంచి జమ్ము–కశ్మీర్‌లో యూఎన్ పరిశీలకుల ఉనికి నామమాత్రమైంది.

సారాంశం ఏమిటంటే, పహల్‌గామ్ ఉగ్రదాడి, దాని పర్యవసానాలు ఇండియా–పాకిస్తాన్ సంబంధాలను రెండు విధాలుగా ప్రభావితం చేశాయి. **మొదటిది:** పాకిస్తాన్ కోరుకున్నట్లు కశ్మీర్ అంశం కొంతవరకు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. అయితే ద్వైపాక్షిక చర్చల నుంచి కశ్మీర్‌ను తప్పించడంలో ఇండియా విజయం సాధించింది. పాకిస్తాన్ ఇప్పుడు సర్వశక్తులూ ఐడబ్ల్యూటీ మీదే కేంద్రీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాకిస్తాన్‌కు నీళ్లు కావాలి. ఇండియాకు టెర్రరిజం అంతం కావాలి. ఇప్పటి వరకు, టెర్రరిజం అంతానికి పాకిస్తాన్ అంగీకరించాలంటే ఇండియా కశ్మీర్‌పై చర్చలు జరపాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడది మారింది.

రెండవది: ఇరు దేశాల నడుమ సంఘర్షణ తలెత్తినప్పుడు, వైరాన్ని ఉప–సాంప్రదాయిక (సబ్–కన్వెన్షనల్) స్థాయిని దాటనివ్వలేదని ఇండియా తన చర్యలు, ప్రతిచర్యల ద్వారా చాటిచెప్పింది. భవిష్యత్తులో మాత్రం ఇది కుదరదని, సబ్–కన్వెన్షనల్ దాడులకు సాంప్రదాయిక స్థాయిలోనే ప్రతి చర్యలు ఉంటాయని ప్రకటించింది. అంటే, ఇండియాతో పూర్తిస్థాయి యుద్ధం వద్దనుకుంటే, ఉప–సాంప్రదాయిక స్థాయిలోనూ పోరు ప్రారంభించకుండా నిగ్రహం పాటించాల్సిన బాధ్యత పాకిస్తాన్ మీదే ఉంటుంది.

సింపుల్‌గా చెప్పాలంటే, టెర్రరిజానికి ఇక సాంప్రదాయిక యుద్ధంతోనే జవాబు చెబుతామని ఇండియా స్పష్టం చేయగలిగింది. ఇందుకోసం భారీ మిలిటరీ సంక్షోభం ఉత్పన్నమై అనేక మంది బలి కావలసి రావడం దురదృష్టకరం. వైరి దేశం ఉగ్ర దాడులకు తెగబడకుండా నిరోధకత సాధించడానికి, దాన్ని కొనసాగించడానికి ఈ పాటి మూల్యం చెల్లించక తప్పదు.

వ్యాసకర్త జేఎన్‌యూలో ఇండియా ఫారిన్ పాలసీ బోధకులు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సేంద్రియ సాగులో హిమాచల్ నమూనా

అభిప్రాయం




దేవీందర్ శర్మ

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు ఒక ట్రెండ్ సెట్టర్. నేను రాజకీయాల గురించి మాట్లాడటం లేదు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గీటురాయి లాంటి ధరల వ్యవస్థను రూపొందించడంలో ఆయన చేపట్టిన మార్గదర్శక పాత్రను ప్రస్తావిస్తున్నాను. రసాయన వ్యవసాయం నుండి స్థిరమైన, ఆరోగ్యకరమైన పర్యావరణ అనుకూల వ్యవసాయ వ్యవస్థల వైపు పరివర్తన చెందడానికి ఇది కచ్చితమైన మార్గం.

2022 డిసెంబర్‌లో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, పర్వత ప్రాంతంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి సుఖు చేసిన ప్రయత్నాలను నేను ఆసక్తితో అనుసరించాను. పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, సేంద్రియ ఆవు, గేదె పాలకు రూ. 45, రూ. 55 చొప్పున సేకరణ ధర పెట్టారు. ఇది మంచి ప్రారంభం. ఇటీవలి బడ్జెట్‌లో ఆ ధరలను లీటరుకు మరో ఆరు రూపాయలు రెంటికీ పెంచడం హృద్యంగమం. ఆ తర్వాత ఆయన సేంద్రియ మొక్కజొన్న, గోధుమలను సేకరించడానికి కనీస మద్దతు ధరను వరుసగా కిలోకు రూ. 30, కిలోకు రూ. 40 చొప్పున ప్రకటించారు. మళ్లీ వాటిని రూ. 30 నుండి రూ. 40కి, 40 నుండి రూ. 60కి పెంచారు. అదనంగా, గోధుమలను, మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లడానికి కిలోకు రెండు రూపాయల రవాణా రాయితీని ప్రకటించారు.

సేంద్రియ సాగుకు ధరే ఊతం

పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించే రైతులకు అధిక ధరలు ప్రకటించడం వల్ల పంట రాబడిలో గణనీయమైన పెరుగుదలకు వీలు కలుగుతుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే, వ్యవసాయాన్ని ఇంటెన్సివ్ వ్యవసాయ పద్ధతుల నుండి పర్యావరణ అనుకూల వ్యవస్థలకు మార్చాలనే ప్రయత్నాలకు ధర ప్రోత్సాహకాలు మరింత ఊతమిస్తాయి.



◆ వ్యవసాయాన్ని పర్యావరణ అనుకూల వ్యవస్థలకు మార్చాలనే ప్రయత్నాలకు ధర ప్రోత్సాహకాలు మరింత ఊతమిస్తాయి.

కొన్ని రోజుల క్రితం, సేంద్రియ పసుపు రైతుల కోసం హిమాచల్ ప్రదేశ్ సీఎం ఒక రిజిస్ట్రేషన్ ఫారమ్‌ను ప్రారంభించారు. సేంద్రియ పసుపునకు కనీస మద్దతు ధర కిలోకు రూ. 90గా నిర్ణయించారు. మార్కెట్ ధర కిలోకు రూ. 25 నుండి రూ. 30 వరకు మాత్రమే ఉంది. ధరలలో గణనీయమైన పెరుగుదల సేంద్రియ పసుపు ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

కోవిడ్–19 మహమ్మారి తర్వాత, ప్రజలు శరీర రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంలోని ప్రాముఖ్యతను గ్రహించిన తర్వాత, సేంద్రియ పసుపునకు డిమాండ్ పెరిగింది. ముడి పసుపు ప్రాసెసింగ్‌ను రాష్ట్ర సంస్థలు 'హిమాచల్ హల్దీ' పేరుతో విక్రయిస్తాయని సుఖు వెల్లడించారు. గతంలో సేంద్రియ మొక్కజొన్న కోసం ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంట్లో భాగంగా తుది ఉత్పత్తులను ఐదు కిలోలు, 120 కిలోల సంచులలో విక్రయిస్తారు.

2025–26 నాటికి లక్ష మంది రైతులను సేంద్రియ వ్యవసాయంలోకి తీసుకురావాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగకపోవడం నాకు సంతోషం కలిగిస్తోంది. హామీ ఇచ్చిన ధరలను అందించడం, ప్రత్యేక ప్రాసెసింగ్‌ను, మార్కెటింగ్‌ను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వ మద్దతుతో నెమ్మదిగానే కానీ స్థిరమైన ప్రయత్నం చేయడం అవసరం. కాగితంపై మాత్రమే మిగిలే అసాధ్యమైన లక్ష్యాలను ప్రకటించడం కంటే ఇది చాలా మంచిది.

రాజకీయాలకు అతీతంగా, పర్యావరణ అనుకూల వ్యవసాయ వ్యవస్థల వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. సహజ వ్యవసాయంలో నిమగ్నమైన అనేక వ్యవసాయ సమూహాలు ఇప్పటికే సానుకూల ఫలితాలను చూపిస్తున్నప్పటికీ, తక్కువ మార్కెట్ ధరల కారణంగా ఈ ప్రయత్నం వీగిపోయింది. ఈ తరుణంలో హిమాచల్ ప్రదేశ్ పాటించవలసిన ధరల చట్రాన్ని అందించింది. సేంద్రియ సాగుదారులకు అధిక ఆదాయం రావడానికి తక్కువ ఉత్పత్తి ఖర్చుపై ఆధారపడటానికి బదులుగా, తక్షణ అవసరం ఏమిటంటే అధిక హామీ ధరను అందించడం. అంతే తప్ప తక్కువ సాగు ఖర్చు అవసరమనే వాదన పనిచేయదు.

నీతి ఆయోగ్ కూడా సహజ వ్యవసాయ విస్తరణను అభినందిస్తోంది. కానీ సాగుదారులకు ఆకర్షణీయమైన ధర అవసరాన్ని అది విస్మరించింది. అందుకే హిమాచల్ ప్రదేశ్ సీఎం ప్రారంభించిన కార్యక్రమంలో కొత్తదైన సానుకూల ధోరణిని నేను చూస్తున్నాను. మార్కెట్లు సామర్థ్యాన్ని, నాణ్యతను ప్రోత్సహిస్తాయనే తప్పుడు నమ్మకం ఉన్నప్పటికీ, సేంద్రియ రైతులకు సరైన, హామీ ఇవ్వబడిన ధరలను నిర్ణయించడానికి ప్రభుత్వ జోక్యం అవసరం.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

ఎవరిని అడగాలి?



ఇంటి పనులూ బయటి పనులూ
చింతలూ చిక్కులూ చికాకులూ రోజూ వుండేవే
వాటికి కాస్త విరామమిస్తూ విహారానికని
అపుడపుడు ఊరు దాటి బయటికి వెళ్తొస్తాం
దూరమైనా ఈ పరి ఈ కాశ్మీరానికి వచ్చాం ముచ్చటపడి –
ఏమంద మేమంద మేమందం అంటూ పచ్చగా
మురిసిపోతూ మేం ఉల్లాసపడుతున్న వేళ
అదాటున కాల్పులు! కళ్లెదుటే
మా ఇంటి మనిషి క్షణాల్లో శవమయ్యాడు
భూతల స్వర్గపు పచ్చదనం ఉన్నట్టుండి
ధడేల్మని ఎరుపెక్కుతుందని తెలిస్తే
అసలు ఇటు నిండు కుటుంబంగా వచ్చే వాళ్ళమా!
నిండు మనిషిని పోగొట్టుకునే వాళ్ళమా!
ఇపుడు మాకు ఏ అందాల సంబరాలొద్దు
మా మనిషి మాక్కావాలి, తెచ్చిస్తారా ఊపిరితో –
ఈ సరిహద్దు వివాదాలూ లోయలో కల్లోలాలూ
తుపాకుల కవాతులూ పేలుళ్ళూ దాడులూ
ఇక్కడి చరిత్రా మాకేం తెలుసు! మామూలు మనుషులం
తుపాకులు, ఎదురు తుపాకులతోనే తలపడతాయని తలచాం
కానీ... యాత్రికుల కన్నులను సైతం తుపాకుల్లా చూస్తాయని
గుర్తించి మరీ గురి చూస్తాయని అనుకోలేదు!
ఉన్నట్టుండి ఈ కొత్త చోటున మేం ఎవరికి ఇంతలోనే
ఇంత బద్ధ శత్రువులమెట్లయ్యామో తెలియట్లేదు
ముగ్గురం వచ్చి, ఇపుడిద్దరమే ఇంటికెళ్తున్నాం
మూడో మనిషేదని ఇల్లు కలవరపడుతూ అడుగుతుంది
దాన్ని ఎట్లా ఓదార్చాలి? మా మనిషి లేడు నిద్రాడు లేదు
మరింత బరువైపోయిన మా బతుకు! ఇపుడు ఎట్లా నిలబడేది
క్షణ క్షణం భయం భయంగా వుంది మా బయటా మా లోపలా –
కారణమెవరని ఇపుడు మేం ఎవ్వరినడగాలి?

– దర్భశయనం శ్రీనివాసాచార్య | 94404 19039

అధికార దుర్వినియోగానికి ప్రతీక

అభిప్రాయం




మంగారి రాజేందర్

కృష్ణమూర్తి సుబ్రమణియన్ పేరు ఇప్పుడు దేశమంతా తెలిసిపోయింది. 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'లో ప్రొఫెసర్‌గా చేసినపుడు అతనెవరో దేశ ప్రజలకి తెలియదు. కానీ ప్రభుత్వానికి తెలుసు. ప్రభుత్వానికి ఏదో ఉపయోగపడతాడని భావించి అతడిని చీఫ్ ఎకనామిక్ అడ్వయిజర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ తరువాత ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పంపించింది. అయితే అతడి పదవీ కాలం ఇంకా మిగిలి ఉండగానే అతణ్ణి ప్రభుత్వం వెనక్కి రప్పించింది. వచ్చే అక్టోబర్ వరకు ఆయన పదవీ కాలం ఉంది. అయినా వెనక్కి పిలిపించడానికి కారణం అతడు తాను రాసిన పుస్తకం ప్రమోషన్ కోసం చేసిన అక్రమాలు. ఆ తరువాత ఆయన పేరు దేశమంతా తెలిసిపోయింది!

కృష్ణమూర్తి రాసిన 'ఇండియా @ 100: ఎన్విజనింగ్ టుమారోస్ ఎకనామిక్ పవర్ హౌస్' పుస్తకాన్ని 'రూపా పబ్లికేషన్స్' ప్రచురించింది. తన అధికారాన్ని, పలుకుబడిని ఉపయోగించి 'యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అధికారులను ఆయన పిలిచాడు. తన పుస్తకాన్ని 'బ్యాంక్ కస్టమర్లకి పంచండి' అని ఆదేశం లాంటిది ఇచ్చాడు వారికి. మామూలుగా వెయ్యి కాపీలో, రెండు వేల కాపీలో కాదు రెండు లక్షల కాపీల దాకా కొనాలని చెప్పాడు. అయినా వాళ్ళు సరే అన్నారు. ఆ ప్రభుత్వరంగ బ్యాంకు అతని పుస్తకాలను కొనడానికి 7.25 కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని 'ది ఎకనామిక్ టైమ్స్' నివేదించింది. ఆ డబ్బు కస్టమర్లది. అప్పుడప్పుడు కొత్త సంవత్సరం వచ్చిన సందర్భంగా బ్యాంకులు ఫ్రీ గిఫ్టులను ఇస్తూ ఉంటాయి. అందులో భాగంగా ఈ పుస్తకాలను కొన్నారు.

ఈ పుస్తకం ప్రచురణకి ముందు బ్యాంక్ కేంద్ర కార్యాలయం నుంచి 18 జోనల్ అధికారులకి ఉత్తరాలు రాశారు. ఈ పుస్తకాలను కొనాలని బ్యాంక్ టాప్ మేనేజ్‌మెంట్ నిర్ణయించిందనీ, ఆ విధంగా కొన్న పుస్తకాలను కాలేజీలకు, కస్టమర్లకు, కార్పొరేట్ సంస్థలకు పంపిణీ చేయాలన్నది ఆ ఉత్తరాల సారాంశం. కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తరాలు పంపే సమయానికే ప్రచురణకర్త రూపా పబ్లికేషన్స్‌కి రూ. 7.25 కోట్లలో సగం మొత్తం పంపింది. మిగిలిన సొమ్ముని ప్రాంతీయ కార్యాలయాలు చెల్లించాలని ఆ లేఖల్లో పేర్కొన్నారు. ఈ విషయం గత డిసెంబర్‌లో బోర్డు మీటింగ్‌లో ప్రస్తావనకు వచ్చింది. మార్కెటింగ్ – ప్రచార విభాగాన్ని పర్యవేక్షించే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్ రంజన్ ఈ అడ్వాన్స్ పేమెంట్‌ని ఓకే చేయడానికి నిరాకరించారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని కూడా ఆయన అన్నారు. చైర్మన్ శ్రీనివాసన్ వరద రాజన్‌లు స్పందించలేదు. 'నియమాల ప్రకారం కొనుగోలు చేయాలని చెప్పాను తప్ప, నియమాలు ఉల్లంఘించి కొనుగోలు చేయమని చెప్పలేద'ని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మణిమేఖలై అన్నారు. ఆ తరువాత సపోర్ట్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్‌ని పర్యవేక్షిస్తున్న జనరల్ మేనేజర్ గిరిజా మిశ్రాను సస్పెండ్ చేశారు. దీంతో అతడిని బలి పశువుని చేశారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.





కృష్ణమూర్తి సుబ్రమణియన్

విచ్చలవిడిగా ఖర్చులు చేస్తున్న బ్యాంకులను చూస్తున్నప్పుడు 2012లో 'గుర్‌గావ్ గ్రామీణ బ్యాంక్ వర్సెస్ శ్రీమతి ఖజానీ, ఇతరుల'కు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు 'దేశంలోని గ్రామీణులను భగవంతుడే కాపాడాలి' అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి. ఈ కేసులో ఓ గ్రామీణురాలు బర్రెను కొనుక్కోవడానికి 15 వేల రూపాయలు అప్పుగా తీసుకుంది. ఆ బర్రె జీవితానికి బీమా చేసింది. ఆ బర్రె చనిపోవడం వల్ల నష్టపరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి కోరింది. ఆమె ఇన్సూరెన్స్ కంపెనీకి, బ్యాంక్‌కి నోటీసులను ఇచ్చి ఫిర్యాదుని జిల్లా ఫోరమ్‌లో దాఖలు చేసింది. ఆమెకు నష్టపరిహారం ఇవ్వాలని ఇన్సూరెన్స్ కంపెనీని, కేసు ఖర్చులు ఇవ్వాలని బ్యాంక్‌ని ఫోరమ్ ఆదేశించింది. ఈ తీర్పుని స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా సుప్రీంకోర్టు దాకా తీసుకొని వెళ్ళింది బ్యాంకు. బ్యాంక్ చెల్లించాల్సింది మొత్తం 15 వేల రూపాయలు. అది ఇవ్వకుండా ఉండటానికి బ్యాంక్ ఖర్చు పెట్టిన మొత్తం 13 లక్షలకు మించి! ఈ కేసులో సుప్రీంకోర్టు అన్నమాట – 'ఈ దేశంలోని గ్రామీణులను భగవంతుడే కాపాడాలి!' కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఉదంతం చూసిన తరువాత ఈ దేశంలోని బ్యాంక్ కస్టమర్లను భగవంతుడే కాపాడాలని అనిపిస్తోంది.

వ్యాసకర్త గతంలో జిల్లా, సెషన్స్ జడ్జి

ఎలా జీవించాలి?

సుతుల హితుల విడిచి చుట్టాల విడిచి
యిల్లాలి విడిచి బహుబలాళి విడిచి
రాజు హృదయ మిడియె రాజీవ నయనుపై,
ధనము విడిచి జడ్డు ధనము విడిచి

జ్యోతిర్మయం

(పుట 79 – ప్రథమ స్కంధము, శ్రీ మదాంధ్ర భాగవతము).

ముని శాపంబున త్వరలోనే పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోవలసి వున్నదని గ్రహించిన పరీక్షిన్మహారాజు అందర్నీ, అన్నిటినీ విడిచి దైవచింతనలో గడిపిన వైనాన్ని తెలిపే మాటలు ఇవి –

ఫలరసాదులు కురియవే పాదపములు
స్వాదు జలముల నుండవే సకల నదులు
పొసగ భిక్షము పెట్టరే పుణ్యసతులు
ధన మదాంధుల కొలువేల తాపసులకు

(పుటలు 73, 74 – శ్రీ మదాంధ్ర భాగవతము– బమ్మెర పోతన)– ఇవి కనీసం కౌపీనమైనా లేని శుక మహర్షి చెప్పిన మాటలు.

ఈ జగతిలో గృహస్థులనూ, సన్యాసులనూ ఏ భేదం లేకుండా నిరంతరం మృత్యువు వెంటాడుతూనే ఉంటుంది. ఎవరైనా ఏ క్షణాన అయినా ప్రాణాలు వదలవచ్చు. మరి ఉన్న ఆ స్వల్ప కాలంలో గృహస్థులు ఎలా జీవించాలో, సన్యాసులెలా జీవించాలో తెలుపుతుంది భాగవతంలోని ఈ భాగం. గృహస్థులు ధన, కనక, వస్తు వాహనాలను కూడబెడుతూనే జీవితాన్ని గడపక, అన్నీ వదలాల్సిన రోజు ఒకటి ఉందని గ్రహించి పరీక్షిన్మహారాజు వలె దైవచింతనలో గడపాలి. మరి సాధు సన్యాసులు శుక మహర్షి వలే ప్రకృతిసిద్ధంగా లభించే ఫల, జలాలతో తృప్తి చెందాలే గాని ధన మదాంధులను కొలిచి వారికి ముఖస్తుతి చేసి ధన, ధాన్యాలను తీసుకోరాదు. ఎవరికి తగిన నీతి వారికి బోధిస్తుంది భాగవతం. అందుకే వేల సంవత్సరాలుగా అది నిత్యనూతనం.

– రాచమడుగు శ్రీనివాసులు



ఓరుగల్లుకు ప్రపంచ సుందరీమణులు

నేడు రామప్ప, వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోటల సందర్శన

సాక్షి ప్రతినిధి, వరంగల్: చారిత్రక నగరం ఓరుగల్లులో ప్రపంచ సుందరీమణులు బుధవారం పర్యటించనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు వరంగల్ నగరంలో నాలుగున్నర గంటలు గడపనున్నారు. రామప్ప, వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోటను వారు సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి సాయంత్రం 4:35 గంటలకు 22 మంది బృందం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 5:45 గంటలకు చారిత్రక వేయి స్తంభాల దేవాలయానికి చేరుకుని అక్కడి కార్యక్రమాల అనంతరం 6:40 గంటలకు వరంగల్ కోటకు చేరుకొని శిల్పాలను సందర్శించి వాటి విశిష్టతలను తెలుసుకుంటారు. రాత్రి 9 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

రామప్పకు మరో బృందం: 35 మంది సుందరీమణుల మరో బృందం సాయంత్రం 5:15 గంటలకు ములుగు జిల్లా రామప్పకు చేరుకుని అక్కడి హరిత హోటల్‌లో కొద్దిసేపు సేదదీరి సంప్రదాయ దుస్తులతో రామప్ప ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాశస్త్యం, కాకతీయుల చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుంటారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వరంగల్ పోలీస్ కమిషనర్‌లు ప్రావీణ్య, సత్యశారద, సన్‌ప్రీత్‌సింగ్‌లు, వివిధ శాఖల అధికారులు వారం రోజులుగా సమీక్షలు, ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీష్‌లు రామప్పలో ఏర్పాట్లు పరిశీలించారు. సుమారు మూడు వేల మంది పోలీసులు మూడంచెల బందోబస్తులో పాల్గొంటున్నారు.

వయ్యారి భామ.. నీ హంస నడక!

▶ మొదటి పేజీ తరువాయి

పాపులర్ అయిన అరబ్బీ మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలకగా.. కొందరు మార్ఫా వాయిద్యాల సంగీతానికి అనుగుణంగా స్టెప్పులేశారు. అనంతరం లాడ్ బజార్‌కు వెళ్లారు. చుడీ బజార్ (గాజుల మార్కెట్)లో షాపింగ్ చేశారు.

సెల్‌ఫోన్లలో చార్మినార్.. గ్రూప్ ఫొటో

ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో నగరానికి చేరుకున్న దాదాపు 109 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. కాగా మంగళవారం ప్రభుత్వం హెరిటేజ్ వాక్‌లో భాగంగా వారు చార్మినార్‌ను సందర్శించారు. విశిష్టమైన నగర వారసత్వ వైభవానికి ఈ అందాల ముద్దుగుమ్మలు ఫిదా అయిపోయారు. చార్మినార్‌ను తిలకించడమే కాకుండా దాని ముందు ఏర్పాటు చేసిన వేదికపై గ్రూప్ ఫొటో దిగారు. చార్మినార్ చరిత్ర, గొప్పదనం గురించి టూరిజం శాఖ గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ ఫోన్‌లలో చార్మినార్ అందాలను బంధించారు.

గాజులు, ముత్యాల హారాల షాపింగ్

నగర జీవనశైలి, ఇక్కడి విభిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని ప్రపంచ సుందరీమణులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో చార్మినార్ సమీపంలోని లాడ్ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్యాంగిల్స్, ముజీబ్ బ్యాంగిల్స్, కనహయ్యలాల్, మోతీలాల్ కర్వా, గోకుల్ దాస్ జరీవాల, కేఆర్ కాసత్, జాజు పెరల్స్, ఏ హెచ్ జరీవాల, అఫ్జల్ మియా కర్చీబే వాలే దుకాణాల్లో ఈ మిస్ వరల్డ్ తారలు అందమైన గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువులు తీసుకున్నారు.

నగర విశిష్టతను చాటాలన్న వ్యాపారులు

లాడ్ బజార్ వ్యాపారులు కొందరు సుందరీమణుల వద్ద డబ్బులు తీసుకోవడానికి నిరాకరించారు. మీమీ దేశాల్లో హైదరాబాద్ విశిష్టతను, చార్మినార్ లాడ్ బజార్ ప్రత్యేకతను చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లాడ్ బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిక్షాలు, రంగురంగుల అలంకరణలు ఆకట్టుకున్నాయి. సుందరీమణుల హెరిటేజ్ వాక్ సందర్భంగా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది.


లాడ్ బజార్ గాజులు భలేగా ఉన్నాయంటున్న మిస్ వరల్డ్ పోటీదారులు

వహ్వా.. చౌమొహల్లా

చార్మినార్ సందర్శన అనంతరం మిస్ వరల్డ్ పోటీదారులు చారిత్రక చౌమహల్లా ప్యాలెస్ సందర్శించారు. అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కుటుంబ సమేతంగా ఈ విందుకు హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ వారికి స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీదారులు తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నిజాం వంశాధిపతుల రాజ సింహాసనం, వారు వాడిన సామన్లు, పురాతన సైనిక ఆయుధాలు, వంట సామాగ్రి తదితర వస్తువులను ఆసక్తిగా గమనించారు. సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన చౌమహల్లా ప్యాలెస్ విశిష్టతను తెలుసుకోవడానికి ఆసక్తి చూపించారు. 'ప్యాలెస్ అద్భుతంగా ఉంది. హైదరాబాద్ ఆతిథ్యం మమ్మల్ని ఎంతో మురిపించింది. ఇది మాకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతి. 'తెలంగాణ జరూర్ ఆనా'' అనే నినాదం మా దేశాల్లో వినిపిస్తాం..' అని కంటెస్టెంట్లు ఉత్సాహంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన సినీ నటుడు అక్కినేని నాగార్జున ..'మీ ప్రతిభతో మిస్ వరల్డ్ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుంది. ఈ ఈవెంట్ ద్వారా హైదరాబాద్ ప్రపంచ పటంలో మరింత వెలుగులోకి వస్తుంది..' అని వ్యాఖ్యానించారు. వివిధ దేశాల ప్రతినిధులు హైదరాబాద్ సాంస్కృతిక విలువలను ప్రశంసించారు. 'హిందూ–ముస్లిం సామరస్యం, సహజీవన భావన హైదరాబాద్‌లో ఎంతో బాగా కనిపిస్తోంది. చార్మినార్ పరిసర ప్రాంతాల్లో దీన్ని ప్రత్యక్షంగా చూశాం..' అని నమీబియా ప్రతినిధి చెప్పారు. నేపాల్, ఇండోనేసియా, టర్కీ, తైమూర్, గ్వాటిమాల, గినియా, కామెరూన్, సౌత్ ఆఫ్రికా, గయానా, సీ షెల్స్, పెరూ, వెనిజులా, పనామా తదితర దేశాల మిస్ వరల్డ్ ప్రతినిధులు విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు అలరించాయి.


చార్మినార్ ఎదుట వివిధ దేశాల సుందరీమణుల గ్రూప్ ఫొటో


మిస్ ఇండియా-వరల్డ్ నందినీగుప్తా, మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా, మిస్ వరల్డ్ నిర్వాహకురాలు జూలియా మోర్లేతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎం సతీమణి గీత, సినీ నటుడు అక్కినేని నాగార్జున


నవ్వుల్... పువ్వుల్: డిన్నర్ సందర్భంగా చౌమొహల్లా ప్యాలెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రులు పొన్నం, జూపల్లి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

సీబీఎస్‌ఈ 10, 12 ఫలితాల్లో నేషనల్ టాపర్‌గా 'నారాయణ'

హైదరాబాద్: సీబీఎస్‌ఈ–2025 ఫలితాల్లో నారాయణ జైత్రయాత్ర కొనసాగిందని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. 10వ తరగతిలో 500 మార్కులకు స్పందన–498 త్రిషఘోష్–498, పార్థ్‌బన్సల్,–498, అధిత్రి–497, నితిన్‌నాయక్–497, హరిణి–497, ఎన్.కె.వికేష్–496, ధృవిక–496, అన్విలునియా–496, పునిత్ వర్మ–496 మార్కులతో సంచలనం సృష్టించారు.

12వ తరగతిలో 500 మార్కులకుగాను ఎస్.వాఖిన్ – 495, రేయాన్ష్.డి–495, ఎ.సాయి రాఘవ కౌషిక్–493, అనీషా దాస్–493 మార్కులే కాకుండా, 492, 492, 492, 491, 491, 491, 491, 490, 490, 490, 490, 490, 490 మార్కులతో తమ విద్యార్థుల హవా కొనసాగించారన్నారు. 12వ తరగతి ఫలితాల్లో ఇద్దరు 495పైగా మార్కులు, 490 పైగా మార్కులు 17 మంది, 485 పైగా మార్కులు 51 మంది, 480 పైగా మార్కులను 113 మంది సాధించారని తెలిపారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో ఆలిండియా టాపర్ 'శ్రీచైతన్య'

హైదరాబాద్: సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ 498 టాప్ మార్కులతో ఆలిండియా నం.1గా మరోసారి రికార్డు సృష్టించిందని డైరెక్టర్ సీమ తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 497 మార్కులు ఆపైన, 10 మంది విద్యార్థులు 496 మార్కులు ఆపైన, 26 మంది విద్యార్థులు 495 మార్కులు ఆపైన, 197 మంది విద్యార్థులు 490 మార్కులు ఆపైన, 917 మంది 480 మార్కులు ఆపైన సాధించారని వెల్లడించారు. పాస్ పర్సంటేజీతో ఆలిండియాలోనే కాకుండా ఆయా రాష్ట్రాలలో కూడా తమ సంస్థ నం.1గా ఉందన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీఓ–ఐపీయల్, సీ–ఐపీయల్, ఎంపీయల్, సి–బ్యాచ్, యస్–బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్‌తో అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని సీమ తెలిపారు.

సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. జి.సాయిహర్షిణి 500 మార్కులకుగాను 480 మార్కులు సాధించింది. ఆర్.స్వస్తిక 478, సీహెచ్.ఆన్సిక 477, కె.అంజనాసంతోషి 475, ఎ.అమూల్య 472, వి.ప్రత్యున్నారెడ్డి 470 మార్కులు సాధించారన్నారు.
పదవ తరగతిలో: సీబీఎస్‌ఈ పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో జాతీయ స్థాయిలో రిషి 500 మార్కులకు గాను 498 మార్కులు సాధించాడన్నారు. వివేకానందరెడ్డి 487, జశ్వంత్ 487, హృషి కేశ్‌మూర్తి 485, సాయి కశ్యప్ 484, అభి లాష్‌రెడ్డి 481, సాహిత్య 480 మార్కులు సాధించారన్నారు.

పుష్కరాలకు నీళ్లొచ్చాయి

మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఇటీవలి వానలతో నీటి ప్రవాహం

- కాళేశ్వరం వద్ద 30 సెం.మీ. మేర పెరిగిన నీటిమట్టం
- సరస్వతీ పుష్కరాలకు తప్పిన నీటికొరత గండం

సాక్షి, హైదరాబాద్: అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలకు పెద్ద టెన్షన్ దూరమైంది.. సరిగ్గా పుష్కరాల వేళ, అడుగంటిన నది.. మళ్లీ ప్రవాహ స్థాయికి చేరుకుంది. దీంతో పుష్కరాల్లో భక్తుల స్నానాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పదన్న భయాందోళనలు దూరమయ్యాయి. గోదావరి–ప్రాణహిత నదులు సంగమించే చోట అంతర్వాహినిగా ఉందని భక్తులు విశ్వసించే సరస్వతి నదికి ఈనెల 15 నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. పుష్కరాలు నిర్వహించే కాళేశ్వరం దేవస్థానం చెంత గోదావరి–ప్రాణహిత సంగమ ప్రాంతంలో గత నెలలోనే నీళ్లు పూర్తిగా అడుగంటాయి. పుష్కరాలకు నెల ముందు నుంచి సమస్య బాగా పెరుగుతూ వచ్చింది. దీంతో పుష్కరాల నాటికి నీళ్లు మరీ తగ్గి భక్తులు పుణ్య స్నానాలు చేయలేని దుస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. ఇదే విషయాన్ని దేవాదాయ శాఖ ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. దీంతో మంత్రి శ్రీధర్ బాబు స్పందించి, నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించారు. ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయటం తప్ప ప్రత్యామ్నాయం లేదన్న అభిప్రాయం వ్యక్తం కావటంతో, ఆమేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను అప్పట్లో ఆదేశించారు. కానీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు కాళేశ్వరం దేవాలయానికి దాదాపు 80 కి.మీ. దూరంలో ఉంది. ఇసుక తేలిన నదిలో చాలా నీళ్లు ప్రవాహంలోనే ఇంకుతాయి. పుష్కరాల నాటికి ప్రచండ ఎండలుండనున్నందున ప్రవాహంలో నీళ్లు ఆవిరయ్యే పరిస్థితి ఉంటుంది. వీటిని తట్టుకొని నీళ్లు దేవాలయం వరకు చేరాలంటే నిత్యం 5 వేల క్యూసెక్కుల వరకు విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఎల్లంపల్లిలో కూడా కనిష్ట స్థాయిలోనే నీటి నిల్వ ఉన్నందున, ఉన్న నీటిలో రోజుకు 5 వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తే తాగు, సాగు నీటికి కటకట ఎదురవుతుందన్న ఆందోళన కూడా వ్యక్తమైంది. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలన్న విషయంలో ప్రభుత్వం తల పట్టుకున్న తరుణంలో అకాల వానలు ఆదుకున్నాయి. ప్రాణహిత బేసిన్ అయిన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఇటీవల అకాల వర్షాలు భారీగా కురిశాయి. దీంతో ఒక్కసారిగా ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నెల రోజుల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం కాళేశ్వరం దేవాలయం వద్ద నదిలో నీటి మట్టం ఏకంగా 30 సెం.మీ. మేర పెరిగింది. ప్రస్తుతం 3,500 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. నదీ గర్భంలో గరిష్టంగా 30 అడుగుల మేర నీళ్లున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా 5 అడుగుల ఎత్తు వరకు నీటి నిల్వ ఉన్న ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, అక్కడి వరకు భక్తులను స్నానాలకు అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరాలు కొనసాగే ఈనెల 26 వరకు స్నానాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. దీంతో ప్రభుత్వం ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది.


కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రవాహం

రేపటి నుంచి 26 వరకు పుష్కర సంబురం

హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం: కాళేశ్వరం వద్ద పుష్కర సంబురం గురువారం ప్రారంభం కానుంది. అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి మే 15 నుంచి 26 వరకు పుష్కరాలు నిర్వహించడానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. 15న సీఎం రేవంత్‌రెడ్డి రానుండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్‌ను సరస్వతి ఘాట్ సమీపంలో నిర్మించారు. రూ.కోటితో తయారు చేసిన రాతి సరస్వతీమాత విగ్రహం, రూ.55 లక్షలతో టెంట్‌సిటీ, హారతి గద్దెలు నిర్మించారు. వీటిని సీఎం ప్రారంభిస్తారు. పుష్కరాలకు 12 రోజుల పాటు పీఠాధిపతులు రానున్నారు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన మాధవానందసరస్వతి పుష్కర ప్రారంభ పూజలో పాల్గొంటారు. కాశీపండితులచే 12 రోజులు హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. 330 మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిరోజూ ఉంటాయి. 12 రోజులపాటు దేవాలయంలోని యాగశాలలో యాగాలు నిర్వహిస్తారు.

ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి

వైఎస్సార్ జిల్లా మల్లేపల్లెలో విషాదం

బ్రహ్మంగారి మఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం మల్లేపల్లె చెరువులో ఈతకు దిగి చరణ్ (15), పార్థు (12), హర్ష (12), దీక్షిత్ (12), తరుణ్ యాదవ్ (10) మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవులు కావటంతో మల్లేపల్లెకి చెందిన ఉప్పలపాటి నారాయణ యాదవ్ ఇంటికి అతడి చెల్లెళ్లు సావిత్రి, భవాని హైదరాబాద్ నుంచి పిల్లలతో కలిసి వచ్చారు. గ్రామంలోని చెరువులో ఈత కొట్టాలని భావించిన భవాని పిల్లలు చరణ్, పార్థు, మరో చెల్లెలు సావిత్రి కుమారుడు హర్ష, మల్లేపల్లె గ్రామానికి చెందిన మేకల గంగాధర్ యాదవ్ కుమారుడు తరుణ్ యాదవ్, కాశినాయన మండలం మల్లేరు కొట్టాలకు చెందిన నారాయణ కుమారుడు దీక్షిత్ గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లారు. చీకటి పడినా పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో చెరువు వద్దకు వెళ్లారు. పిల్లల బట్టలు ఒడ్డున ఉండటం.. చుట్టూ ఎక్కడా పిల్లల జాడ కనిపించపోవడంతో చెరువులో పిల్లలు గల్లంతైనట్టు తెలుసుకుని గాలించారు. సమాచారం అందుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పోలీసులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. రాత్రి 11 గంటల తర్వాత మృతదేహాలు లభ్యమయ్యాయి. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐ శివ ప్రసాద్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు.


చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దేవరకద్రలో మధ్యయుగం నాటి రాతి చిత్రాలు

సాక్షి, హైదరాబాద్: మధ్య యుగానికి చెందిన ఆది మానవులు గీసిన రాతి చిత్రాలు వెలుగు చూశాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జినుగరాల గ్రామంలోని పెద్దగుట్ట మీద ఈ చిత్రాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కావలి చంద్రకాంత్ గుర్తించినట్టు.. ఆ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఎరుపు రంగులో ఈ చిత్రాలు గీసి ఉన్నాయి. రథం తరహాలో దిగువన వెడల్పుగా గీసిన ఈ చిత్రాలు.. పైకి వెళ్లే క్రమంలో సన్నగా మారినట్టు ఉన్నాయి. దిగువన ఒక మనిషి, పైన చతురస్రాకారంలో ఉన్న భాగంలో తాబేలు, వాటి పక్కన అంతుచిక్కని ఆకృతుల్లో రకరకాల బొమ్మలున్నాయి. సమీపంలోని ఆదిమానవుల నివాస ప్రాంతానికి చెందిన గుర్తులు కూడా ఉన్నాయి. అవి చారిత్రక, మధ్య యుగానికి చెందినవని ఆదిమానవుల రాతి చిత్రాల పరిశోధక నిపుణుడు బండి మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారని తెలిపారు.



మా సైనికులు 11 మంది చనిపోయారు

- 78 మంది గాయపడ్డారు
- ప్రకటించిన పాకిస్తాన్

ఇస్లామాబాద్: భారత్, పాక్ పరస్పర సైనిక చర్యలో తమ సైనిక సిబ్బందిలో కేవలం 11 మంది చనిపోయారని పాకిస్తాన్ మంగళవారం ప్రకటించింది. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్ సైతం ఉన్నట్లు పేర్కొంది. భారత వైమానిక, క్షిపణి, డ్రోన్ దాడుల్లో సాయుధ బలగాలకు సంబంధించి 78 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఒక ప్రకటనలో పేర్కొంది. మే ఆరో తేదీ అర్ధరాత్రి తర్వాత భారత్ జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, 121 మంది పౌరులు గాయపడ్డారని తెలిపింది. చీఫ్ టెక్నీషియన్ ఔరంగజేబ్, సీనియర్ టెక్నీషియన్ నజీబ్, కార్పోరల్ టెక్నీషియన్ ఫరూఖ్, సీనియర్ టెక్నీషియన్ ముబాషిర్ సైతం ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అయితే వీళ్లంతా ఏ పరిస్థితుల్లో మరణించారో, మరణానికి కారణాలను పాకిస్తాన్ బయటపెట్టలేదు. ఒక యుద్ధవిమానం పాక్షికంగా ధ్వంసమైందని తెలిపింది. అయితే అది ఏ సంస్థ తయారీ, ఏ రకానికి చెందినది అనే వివరాలనూ పాక్స్తాన్ వెల్లడించలేదు. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా 'మర్కా–ఇ–హక్ (ఘన విజయం)' లక్ష్యంగా 'ఆపరేషన్ బునియాన్ అల్ మర్సూస్'ను చేపట్టామని ఆ ప్రకటన తెలిపింది. గాయపడిన సైనికులు, పౌరులను పరామర్శించేందుకు సోమవారం పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ రావల్పిండిలోని కంబైన్డ్ మిలటరీ ఆస్పత్రిని సందర్శించడం తెల్సిందే. గాయపడిన సైనికాధికారులు, జవాన్లను ఓదార్చేందుకు లాహోర్‌లోని కంబైన్డ్ మిలటరీ ఆస్పత్రిని పంజాబ్ మహిళా ముఖ్యమంత్రి మర్యం నవాజ్ సందర్శించారు.

డూప్లికేట్ ఓటర్ కార్డుల సమస్య పరిష్కరించాం

- కొత్త నంబర్లతో కార్డులు జారీ చేశాం
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

న్యూఢిల్లీ: ఒకే నంబర్‌తో ఉన్న రెండు ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డుల(ఎపిక్) సమస్యను పరిష్కరించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం తెలియజేసింది. అలాంటి కార్డులు ఉన్నవారికి కొత్త నంబర్లతో కార్డులు జారీ చేసినట్లు వెల్లడించింది. ఒకే నంబర్‌లో రెండు కార్డులు చాలా తక్కువగానే ఉన్నట్లు గుర్తించామని స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 99 కోట్ల మంది ఓటర్ల ఐడీ కార్డులను క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేశామని తెలిపింది. 4,123 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 10.50 లక్షల పోలింగ్ కేంద్రాల్లో ఈ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొంది. సగటున ప్రతి నాలుగు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఒకరికి ఇలా రెండు కార్డులు ఉన్నట్లు తేలిందని వెల్లడించింది. వారంతా అర్హులైన ఓటర్లేనని, వారికి కొత్త నెంబర్లతో ఐడీలు జారీ చేసినట్లు పేర్కొంది. డూప్లికేట్ ఓటరు ఐడీ కార్డులతో ఓటింగ్ ప్రక్రియలో ఎటువంటి సమస్యలు రాలేదని స్పష్టంచేసింది. ఒకే నెంబర్‌తో రెండు కార్డులు ఉన్నప్పటికీ మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం లేదు కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని ఎన్నికల సంఘం తెలిపింది. డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డుల అంశాన్ని తొలుత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వెలుగులోకి తీసుకొచ్చింది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపించింది. ఒకే ఓటర్ రెండుచోట్ల ఓటు వేస్తున్నట్లు తప్పుపట్టింది.

అండమాన్‌ని తాకిన నైరుతి

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాదికి చల్లని కబురు వచ్చేసింది. గ్రీష్మ తాపానికి విలవిల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు నైరుతి రుతుపవనాలు అండమాన్‌ను తాకాయి. 2009 తర్వాత ముందస్తుగా నైరుతి రావడం శుభపరిణామమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోకి రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. మూడు, నాలుగు రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవుల్లోకి ప్రవేశించి.. క్రమంగా మధ్య బంగాళాఖాతాన్ని కూడా తాకుతాయని తెలిపింది. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 27 నాటికి కేరళ తీరాన్ని, జూన్ మొదటి వారంలో తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించే సూచనలు పుష్కలంగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రుతుపవనాల తాకిడితో.. భానుడి భగభగలు మరో వారం పది రోజుల్లో తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి. రుతుపవనాల సమయంలో ఈసారి ఎక్కువగా వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది.

మరిన్ని ఎస్‌–400లు ఇవ్వండి

రష్యాకు భారత ప్రభుత్వం విజ్ఞప్తి


న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ డ్రోన్లు, క్షిపణులను సమర్థంగా తిప్పికొట్టడంలో ఎస్‌–400 గగనతల రక్షణ వ్యవస్థలు కీలకంగా పనిచేశాయి. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఈ వ్యవస్థలు 'సుదర్శన చక్ర'గా భారతదేశ రక్షణ శాఖకు తురుపుముక్కగా మారాయి. శత్రుదేశాల క్షిపణులను నేలకూల్చడంలో వీటికి తిరుగులేదు. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్‌–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ అందజేయాలని రష్యాకు భారత ప్రభుత్వం తాజాగా విజ్ఞప్తి చేసింది. అత్యంత విశ్వసనీయ వర్గాలు ఈ విషయం వెల్లడించాయి. భారత్ వినతిని అతిత్వరలోనే రష్యా అంగీకరించే సూచనలు కనిపిస్తున్నట్లు తెలిపాయి. ఇటీవలి పరిణామాల తర్వాత గగనతల రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. రష్యా నుంచి ఐదు ఎస్‌–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలు కోసం 2018లో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ డీల్ విలువ 5.43 బిలియన్ డాలర్లు. 2021 నుంచి దశలవారీగా ఐదు వ్యవస్థలు రష్యా నుంచి భారత్‌కు చేరుకున్నాయి.

అపూర్వం.. అనూహ్యం.. అద్భుతం

వాయుసేనకు వందనం

మరోసారి తెగించొద్దని మీరు పాక్‌కు లక్ష్మణరేఖ గీసి వచ్చారు

- నట్టింటికి వెళ్లి నాశనం చేశారు
- ఎయిర్‌ఫోర్స్ పోరాటపటిమను శ్లాఘించిన ప్రధాని మోదీ
- పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్ బేస్‌లో జవాన్లనుద్దేశించి ప్రసంగం


అదంపూర్ ఎయిర్‌బేస్‌లో వాయుసేనకు మోదీ సెల్యూట్ (మోదీ వెనుక ఎస్‌–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్)

న్యూఢిల్లీ: దుష్టదేశ గగనతలాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్లి ముష్కర మిన్నాగుల పుట్టలను నేలమట్టంచేస్తూ, దాయాదిదేశం యుద్ధం ఆపాలని కాళ్లబేరానికి వచ్చే స్థాయిలో శత్రువుల వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసి తిరుగులేని ధైర్యసాహసాలను ప్రదర్శించిన భారత వాయుసేనను ప్రధాని మోదీ పొగడ్తల్లో ముంచెత్తారు. పాక్ సరిహద్దుకు కేవలం 100 కిలోమీటర్ల దూరంలోని పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక స్థావరానికి స్వయంగా వెళ్లి అక్కడి వాయుసేన బలగాలపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు. వారి అసమాన పోరాట పటిమను భుజం తట్టి ప్రోత్సహించి పొగిడారు. తర్వాత అక్కడి ఎయిర్‌ఫోర్స్ జవాన్లనుద్దేశించి దాదాపు అరగంటపాటు ప్రసంగించారు. మరోసారి తెగించేందుకు దుస్సాహసం చేయొద్దని సరిహద్దు వెంట భారతవాయుసేన బలగాలు లక్ష్మణరేఖ గీశాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆదంపూర్ వైమానిక స్థావరంలోని భారత అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థ అయిన సుదర్శన చక్ర(ఎస్‌–400) మిస్సైల్ లాంఛర్లను ముక్కలుచెక్కలు చేశామని పాక్ పలికిన ప్రగల్భాలన్నీ ఉత్తమాటలని నిరూపిస్తూ మోదీ మంగళవారం ఆ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎదుటే నిలబడి ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై జాతినుద్దేశించి ప్రసంగించిన మరుసటి రోజే మోదీ ఎయిర్‌ఫోర్స్‌నుద్దేశిస్తూ మాట్లాడటం గమనార్హం. త్రిశూలం చిహ్నంతో ఉన్న ఎయిర్ కమాండ్ క్యాప్ ధరించి భారత్ మాతా కీ జై అంటూ ప్రధాని ప్రసంగం ప్రారంభించారు.

అనుపమాన పరాక్రమం

''పాక్ గడ్డపై మీరు చేసిన యుద్ధం అనుపమానం. అపూర్వం. అసాధారణం. అద్భుతం. పాకిస్తాన్ నడిబొడ్డున బాంబులు పేల్చారు. కేవలం 20–25 నిమిషాల్లో లక్ష్యాలను నేలమట్టంచేశారు. మీ మెరుపువేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసింది. చూసుకునేలోపే ఛాతీని చీల్చేశాం. మీ పోరాటంతో ప్రతి ఒక్క భారతీయుడు గౌరవంతో ఉప్పొంగిపోయాడు. మేం మీకు రుణపడిపోయాం. ఇది ఎన్నటికీ తీర్చుకోలేని రుణం. ఊహకందనంతటి శక్తియుక్తుల్ని ప్రదర్శించి దేశానికి విజయం చేకూర్చిన మీ నుంచి ఆశీస్సులు తీసుకోవడానికే నేను వచ్చా. ఆపరేషన్ సిందూర్ ధాటికి ఇక లక్ష్మణరేఖ దాటొద్దని పాకిస్తాన్‌కు బాగా అర్థమైంది. తరచూ అణుబాంబులతో బెదిరించాలని చూస్తున్న దాయాదికి మన బలగాలు భారత్ మాతాకీ జై నినాదంలోని అపారశక్తిని బయటకు తీసి చూపారు. భారత్ మాతాకీ జై అనేది కేవలం నినాదం కాదు. దేశం కోసం తమ ప్రాణాలనైనా పణంగా పెడతామని బలగాలు చేసిన ప్రతిజ్ఞ. మన డ్రోన్లు, క్షిపణుల మోత పాక్ గడ్డపై ప్రతిధ్వనించిన ప్రతిసారీ పాకిస్తాన్ సైనికుల చెవుల్లో భారత్ మాతాకీ జై అనే నినాదమే మార్మోగింది. వాయుసేన శౌర్యం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మన సైనిక, వాయు, నావికా దళాలకు నా సెల్యూట్'' అంటూ మోదీ సెల్యూట్ చేశారు.

కన్నేస్తే కనుమరుగు ఖాయం

''భారత గడ్డపై కన్నేస్తే తాము కనుమరుగు అవడం ఖాయమని ఉగ్రపోషకులకు ఆపరేషన్ సిందూర్ తర్వాత బాగా గుర్తుంటుంది. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూరం నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. శత్రువులు ఈ ఎయిర్‌ఫోర్స్‌ను నాశనం చేద్దామని కంకణం కట్టుకుని ఎడాపెడా దాడులు చేశారు. వాళ్ల ప్రయత్నాలను మీరు సులభంగా వమ్ముచేశారు. మన వైమానిక స్థావరాలు, రక్షణ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వాళ్ల 9 కీలక ఉగ్రస్థావరాలను సమాధులుగా మార్చేశాం. 100 మందికిపైగా ముష్కరులను మట్టుపెట్టాం. పాక్‌కు చెందిన ఎనిమిది సైనిక స్థావరాలను నాశనం చేశాం. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత్ గీసిన లక్ష్మణరేఖ ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది'' అని అన్నారు.

ధర్మ సంస్థాపనకు యుద్ధం

''ధర్మ సంస్థాపనే లక్ష్యంగా శత్రు సంహారం కోసం ఆయుధం చేతబట్టి యుద్ధంచేయడం భారతీయుల సంప్రదాయం. మన అక్కచెల్లెళ్ల, కుమార్తెల పసుపు కుంకుమలు, సిందూరాన్ని తుచ్ఛమైన ముష్కరులు తుడిచేయగానే మనం వాళ్ల నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశాం. కనీసం పారిపోయే అవకాశం కూడా ఇవ్వలేదు. పహల్గాంలో వాళ్లు దొంగదెబ్బ తీస్తే మనం మాత్రం నేరుగా వెళ్లి, ఎదురునిలిచి పోరాడాం. పాకిస్తాన్ సైన్యం చంకనెక్కి భద్రంగా ఉండొచ్చని ఇన్నాళ్లు ఉగ్రవాదులు భావించారు. కానీ మన బలగాలు ఇక పాక్‌లో ఉగ్రవాదానికి సురక్షిత స్థలమంటూ ఏదీ లేదని నిరూపించాయి. సూర్యోదయం వేళ మీ సుందర దర్శనం చేసుకునేందుకే నేను ఇక్కడికొచ్చా. మీరు ఈ తరానికే కాదు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాతలు. మరోసారి సాహసిస్తే నాశనం, వినాశనం అని శత్రువులకు సందేశం ఇచ్చారు. భారత్ మాతాకీ జై అన్నప్పుడల్లా భయంతో శత్రువుల గుండెలు జారిపోయాయి. పరాక్రమవంతుల అడుగులతో నేల కూడా పులకిస్తుంది. అంతటి ధైర్యవంతులను నేరుగా చూడటంతో జన్మ ధన్యమవుతుంది. ఆ భాగ్యం కోసమే నేను ఇక్కడి కొచ్చా. వీరుల నేలపై నిలబడి ఇప్పుడు నేను ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ, బీఎస్‌ఎఫ్‌లోని యోధులకు సలామ్ చేస్తున్నా. మీ వీరత్వంతో ఆపరేషన్ సిందూర్ నినాదం నేల నలుచెరుగులా ప్రతిధ్వనిస్తోంది'' అంటూ బలగాలను మోదీ పొగిడారు.

శాంతంగా ఉంటాం.. సమరమూ చేస్తాం

''ఇది నవయుగ భారతం. దేశం శాంతినే కోరుకుంటుంది. శాంతంగా ఉంటాం. శాంతిమయ మానవత్వంపై దాడి చేస్తే ఊరుకోం. యుద్ధ క్షేత్రంలో శత్రువును ఎలా అణగదొక్కాలో భారత్‌కు బాగా తెలుసు. శాంతంగా ఉంటాం. అవసరమైనప్పుడు సమరమూ చేస్తాం. ఆపరేషన్ సిందూర్ అంటే పోరాటానికి పెట్టుకున్న పేరు కాదు. భారత విధాననిర్ణయ పతాక. దృఢ సంకల్పానికి, శక్తిసామర్థ్యాలకు ప్రతీక. శాంతిమయ జీవనం సాగించాలని ప్రపంచానికి బోధించిన బుద్ధుని నేల మాత్రమే కాదు శత్రువులను చీల్చి చెండాడిన గురు గోవింద్ సింగ్ లాంటి వీరపరాక్రముల పవిత్రభూమి'' అని అన్నారు.

త్రికరణ శుద్ధితో..

''ఇప్పుడు భారత్ మూడే సూత్రాలతో ముందుకెళ్తోంది. ఒకటి.. ఉగ్రదాడి జరిగితే మనదైన శైలిలో సమయం చూసి దీటుగా బదులిస్తాం. రెండు.. అణుబాంబులకు భయపడేదే లేదు. మూడు.. ఉగ్రవాదాన్ని పెంచిపోషించే వాళ్లను, ఉగ్రవాదాన్ని జాతీయవాదంగా మార్చేసిన ప్రభుత్వాలను ఇకపై భారత్ వేర్వేరుగా చూడబోదు'' అని మోదీ స్పష్టంచేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్ అనేది దేశంలోని రెండో అతిపెద్ద వైమానిక స్థావరం. ఇక్కడ అత్యంత అధునాతన రఫేల్, మిగ్–29 యుద్ధవిమానాల స్క్వాడ్రన్ దళాలు ఉంటాయి. 1965, 1971 యుద్ధాల్లోనూ ఆదంపూర్ వైమానిక స్థావరం అత్యంత కీలకపాత్ర పోషించింది.

మానవ యుక్తి.. మెషీన్ శక్తి

''వాయుసేన ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానికస్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినాసరే మన వాయుసేన అత్యంత కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురి చూసి కొట్టింది. అమాయక పౌరులకు ఏ హానీ తలపెట్టలేదు. ఒక్క పౌరవిమానాన్నీ మీరు ధ్వంసంచేయలేదు. ఈ విషయంలో నేను నిజంగా గర్వపడుతున్నా. దాడుల్లో మీరు శత్రు స్థావరాలు, ఉగ్రశిబిరాలనే కాదు మరోసారి దుస్సాహసం చేయాలనే దుర్బుద్ధినీ దెబ్బతీశారు. గగనతల, భూతల యుద్ధ వ్యవస్థల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించారు. మానవ యుక్తిని మెషీన్ శక్తిని చక్కగా మేళవించారు. మీరు భారత్ మాతా కీ జై అన్న ప్రతిసారీ శత్రువుల వెన్నులో వణుకుపుట్టింది. మీ సారథ్యంలో దేశీయ తయారీ ఆకాశ్ మిస్సైళ్లు, అధునాతన సుదర్శన చక్ర(ఎస్‌–400) వ్యవస్థలు శత్రు దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా మీరు దేశ ఆత్మవిశ్వాసం, సమైక్యత, ప్రతిష్ఠను నూతన శిఖరాలపై నిలిపారు. అణుబూచికి ఏమాత్రం భారత బలగాలు బెదరవని నిరూపించారు. మన శక్తియుక్తుల ముందు పాకిస్తాన్ అన్ని డ్రోన్లు, యూఏవీలు, క్షిపణులన్నీ దిగదుడుపే. నమ్మశక్యంకాని రీతిలో రణతంత్రం ప్రదర్శించారు. గత దశాబ్దకాలంలో అత్యంత అధునాతన సమర సాంకేతికతలన్నింటినీ మన బలగాలు అందిపుచ్చుకున్నాయి. టెక్నాలజీ వాడకంలో, యుద్ధం వచ్చినప్పుడు ఎలా వినియోగించుకోవాలో మీకు బాగా తెలుసు. రియల్ గేమ్‌లో మీరు అదరగొట్టారు. మీరు ఆయుధాలతో మాత్రమే యుద్ధం చేయలేదు. భారత్ ఇప్పుడు డ్రోన్లు, డేటా, టెక్నాలజీ సహిత రణాల్లో రాటుదేలింది. మీరు దమ్ము చూపించి శత్రువులను దుమ్ములో కలిపేశారు'' అని మోదీ అన్నారు. మహారాణా ప్రతాప్ అశ్వమైన చేతక్ చూపిన తెగువ, సాహసం ఇప్పుడు మన ఆధునిక యుద్ధవిమానాలకు పాటవానికి సరిగ్గా సరిపోతుంది అంటూ నాటి వచనాలను మోదీ గుర్తుచేశారు. ''కదలికల్లో నైపుణ్యం కనబరిచాయి. మెరుపువేగంతో దూకుడు చూపాయి. శత్రుసైన్యం మధ్యల్లోంచే శస్త్రాలు సంధించాయి'' అని మోదీ ఆ వచనాలను వల్లెవేశారు.

ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలతో వెళ్తున్నా..

- నూతన సీజేఐ జస్టిస్ గవాయ్ పట్ల సంపూర్ణ విశ్వాసం ఉంది
- సుప్రీంకోర్టు విలువలు, ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ సూత్రాలను పరిరక్షిస్తారు: చీఫ్ జస్టిస్ ఖన్నా
- ఘనంగా వీడ్కోలు


వీడ్కోలు సమావేశంలో భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు జ్ఞాపికను బహూకరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్. చిత్రంలో కాబోయే సీజేఐ బి.ఆర్.గవాయి తదితరులు

న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థలో సుదీర్ఘకాలం పనిచేసి ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు సొంతం చేసుకున్నానని జస్టిస్ సంజీవ్ ఖన్నా సంతోషం వ్యక్తంచేశారు. జీవితాంతం ఈ జ్ఞాపకాలు తనకు తోడుగా ఉంటాయని చెప్పారు. తన సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియడంతో మంగళవారం ఆయనకు లాంఛనంగా వీడ్కోలు పలికారు. సుప్రీంకోర్టులో నిర్వహించిన సెరిమోనియల్ బెంచ్‌లో జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సంజయ్ కుమార్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ లాయర్ కపిల్ సిబల్ తదితరులు పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థకు జస్టిస్ సంజీవ్ ఖన్నా అందించిన సేవలను వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రసంగించారు. నూతన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ పట్ల తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. సుప్రీంకోర్టు విలువలు, పౌరుల ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలను ఆయన చక్కగా పరిరక్షిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. తనకు ఇన్నాళ్లూ అతిపెద్ద మద్దతుదారుడిగా నిలిచారని కొనియాడారు. జస్టిస్ గవాయ్ నాయకత్వాన్ని ఎంతగానో విశ్వసిస్తున్నానని, రాజ్యాంగ విలువల పట్ల ఆయన అంకితభావం తిరుగులేనిదని వెల్లడించారు. తాము దాదాపు ఒకేసారి న్యాయమూర్తులుగా పదోన్నతి పొందామని, కొలీజియంలో కలిసి పనిచేశామని చెప్పారు. తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ అద్భుతమైన సేవలు అందిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

ఖన్నాతో కలిసి పనిచేయడం గొప్ప గౌరవం

సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా అందించిన సేవలను జస్టిస్ బి.ఆర్.గవాయ్ కొనియాడారు. ఇది వీడ్కోలు కాదని, ఒక మార్పు మాత్రమేనని చెప్పారు. జస్టిస్ ఖన్నా వృత్తి జీవితం ఈరోజుతో ఆగిపోవడం లేదని, మరొకదానికి ఇది ఆరంభమని వివరించారు. జస్టిస్ ఖన్నా ఆలోచల్లో స్పష్టత, నైతికత, ప్రాథమిక హక్కుల పరిరక్షణ పట్ల అంకితభావం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఆయన ఇచ్చిన తీర్పులన్నీ రాజ్యాంగ విలువలతో కూడి ఉన్నాయని చెప్పారు. జస్టిస్ ఖన్నాతో ఇన్నాళ్లూ కలిసి పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. జస్టిస్ ఖన్నా తమకు స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి మాట్లాడుతూ... జస్టిస్ ఖన్నా న్యాయస్థానాల విలువ, గౌరవం ఎన్నోరెట్లు పెంచారని ప్రశంసించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సైతం జస్టిస్ ఖన్నా సేవలను గుర్తుచేసుకున్నారు. కపిల్ సిబల్ మాట్లాడుతూ... ఈ వారం దేశంలో ఇద్దరు గొప్ప వ్యక్తులు పదవీ విరమణ చేశారని చెప్పారు. క్రికెటర్ విరాట్ కోహ్లీతోపాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా రిటైర్ అవుతున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్సీబీఏ) ఆధ్వర్యంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాకు మంగళవారం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కపిల్ సిబల్ ప్రసంగించారు. రెండు దశాబ్దాలపాటు న్యాయమూర్తిగా సేవలందించిన జస్టిస్ ఖన్నా న్యాయం పట్ల తిరుగులేని అంకితభావం కనబర్చారని చెప్పారు.

పదవులపై ఆసక్తి లేదు

జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ: అధికారిక పదవులపై తనకు ఏమాత్రం ఆసక్తి లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టంచేశారు. రిటైర్‌మెంట్ తర్వాత ఇతర పదవులేవీ చేపట్టబోనని అన్నారు. న్యాయవాద రంగంలోనే కొనసాగుతానని వెల్లడించారు. సీజేఐగా ఆయన పదవీ కాలం మంగళవారం ముగిసింది. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడారు. ఇకపై ఇతర బాధ్యతలు చేపట్టబోనని తెలిపారు. తనకు ఏవైనా పదవులు వచ్చినా స్వీకరించబోనని పేర్కొన్నారు. తనకు మూడో ఇన్నింగ్స్ ఉంటుందని, న్యాయవాద రంగానికి సంబంధించిన పనిలోనే నిమగ్నమవుతానని వివరించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరికిన ఘటనపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... న్యాయవ్యవస్థ ఆలోచన ఎల్లప్పుడూ నిర్ణయాత్మకంగానే ఉండాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా బదులిచ్చారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్ 11న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు ఆరు నెలలపాటు సేవలందించారు. తదుపరి సీజేఐగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈ నెల బుధవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.

పంజాబ్‌లో విషాదం

కల్తీ మద్యం తాగి 21 మంది మృతి • 10 మంది పరిస్థితి విషమం

చండీగఢ్/అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో కల్తీ మద్యం కాటుకు 21 మంది అమాయకులు బలయ్యారు. మజీఠా పట్టణ పరిధిలో కల్తీ మద్యం తాగిన ఘటనలో మరో 10 మంది తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారు. ప్రస్తుతం వీళ్ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. కల్తీ మద్యం సేవించి ప్రజలు చనిపోతున్నారని సోమవారం రాత్రి ఐదు గ్రామాల నుంచి పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కల్తీ మద్యం సరఫరాకు కారకులైన పది మందిని అరెస్ట్‌చేశారు. మద్యం ప్రధాన సరఫరాదారు ప్రభ్‌జీత్ సింగ్‌ను అరెస్టు చేశారు. విచారణ సమయంలో ప్రభ్‌జీత్ సింగ్ కీలక సరఫరాదారు సాహబ్‌సింగ్ పేరును వెల్లడించాడు. మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు అతడిని విచారిస్తున్నారు. ఎక్సయిజ్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో రెండు కేసులు నమోదుచేసి దర్యాప్తు సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. నకిలీ మద్యం ఏరులై పారుతున్నా నిఘా పెట్టకుండా నిర్లక్ష్యం వహించారంటూ ప్రభుత్వం వెంటనే మజీఠా డెప్యూటీ ఎస్పీ అమోలక్ సింగ్, మజీఠా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అవతార్ సింగ్‌ను సస్పెండ్ చేసింది. బాధిత కుటుంబాలకు తలో రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి మాన్ సింగ్ సారథ్యంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రకటించింది. బాధిత కుటుంబంలోని చిన్నారులు చదువుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని సీఎం మాన్ అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది రోజువారీ కూలీలే ఉన్నారు.

పాక్ ఉద్యోగిపై బహిష్కరణ వేటు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఒక ఉద్యోగిపై భారతప్రభుత్వం బహిష్కరణ వేటు వేసింది. 24 గంటల్లోపు భారత్‌ను వీడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో ఆ ఉద్యోగి మునిగిపోయారని అందుకే దేశం నుంచి వెళ్లగొడుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పాకిస్తాన్ వ్యవహారాల ఉన్నతాధికారికి 'దౌత్య చర్య' సంబంధ ఉత్తర్వును మంగళవారం భారత విదేశాంగ శాఖ పంపించింది. భారత విద్రోహ కార్యకలాపాలపై పంజాబ్ పోలీసులు చేస్తున్న ఒక దర్యాప్తులో ఈ అధికారి పాత్ర వెలుగులోకి వచ్చింది.

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు లష్కరే ఉగ్రవాదులు హతం

ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కొనసాగుతున్న కాల్పులు

జమ్మూ: జమ్మూకశ్మీర్ షోపియాన్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. షోపియాన్‌లో షూకర్ కెల్లర్ ప్రాంతంలో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు మృతి చెందారు. మరో ఇద్దరు లష్కరే ఉగ్రవాదులు చిక్కుకున్నట్లు సమాచారం. షోపియాన్‌లోని షూకల్ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదుల ఉనికి ఉందన్న తిరుగుబాటు నిరోధక విభాగం రాష్ట్రీయ రైఫిల్స్ నుంచి వచ్చిన నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు మంగళవారం సెర్చ్ అండ్ డిస్ట్రాయ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఆపరేషన్ సమయంలో, ఉగ్రవాదులు భారీ కాల్పులు జరిపారు. భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఫలితంగా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని భారత సైన్యం తెలిపింది. మరణించిన ఉగ్రవాదుల నుంచి మూడు ఏకే–47 రైఫిళ్లు, ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 'కెల్లర్' పేరుతో ఈ ఆపరేషన్ కొనసాగుతోంది.

ఇద్దరు షోపియాన్ వాసులు..

ఇద్దరు ఉగ్రవాదులను షాహిద్ కుట్టాయ్, అద్నాన్ షఫీగా గుర్తించారు. ఇద్దరూ షోపియాన్ నివాసితులే. చోటిపోరా హీర్పోరా ప్రాంతంలో నివసిస్తున్న కుట్టాయ్.. ఉగ్రవాద సంస్థలో టాప్ కమాండర్‌గా ఉన్నాడు. 2023లో లష్కరేలో చేరిన కుట్టాయ్, గత ఏడాది ఏప్రిల్ 8న డానిష్ రిసార్ట్‌లో జరిగిన కాల్పుల సంఘటనలో పాల్గొన్నాడు. ఇందులో ఇద్దరు జర్మన్ పర్యాటకులు, ఒక డ్రైవర్ గాయపడ్డారు. గత ఏడాది మేలో షోపియాన్‌లోని హీర్పోరాలో బీజేపీ సర్పంచ్ హత్యలో కూడా అతనికి పాత్ర ఉంది. పహల్గాం ఉగ్రదాడి తరువాత కుట్టాయ్ నివాస గృహాన్ని అధికారులు ధ్వంసం చేశారు. 2024లో ఉగ్రవాద సంస్థలో చేరిన షఫీది వందునా మెల్హోరా ప్రాంతం. అతను లష్కరే తోయిబాలో సీ కేటగిరీలో బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. షోపియాన్‌లోని వాచిలో స్థానికేతర కార్మికుడి హత్య కేసులో నిందితుడు. మరో ఉగ్రవాదిని ఇంకా గుర్తించలేదు.

ఉగ్రవాదాన్ని ఎగదోయడం ఆపేస్తేనే..

- అప్పటిదాకా సింధూనది జలాల ఒప్పందం అమల్లో ఉండదు
- ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆపినట్లు పాక్ విశ్వాసం కల్పించాలి
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: సింధూ నది జలాల విషయంలో భారత్ తన వైఖరిని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పేసింది. పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపనంత వరకు సింధూ నది జలాల ఒప్పందాన్ని నిలిపి వేయనున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చిచెప్పారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం పూర్తిగా ఆపినట్లు పాక్ ప్రభుత్వం తమకు సంపూర్ణ విశ్వాసం కలిగించేదాకా ఈ ఒప్పందం అమల్లో ఉండదని స్పష్టంచేశారు. ఇది ఆరు దశాబ్దాల క్రితం భారత్–పాక్ మధ్య కుదిరిన స్నేహపూర్వక ఒప్పందమని వెల్లడించారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు సజావుగా ఉన్నంత వరకూ ఒప్పందం అమల్లో ఉంటుందని అందులోని ప్రవేశికలో ప్రస్తావించారని గుర్తుచేశారు. కానీ, ఒప్పందంలోని అంశాలను పాకిస్తాన్ యథేచ్ఛగా ఉల్లంఘించిందని, భారత్‌కు వ్యతిరేకంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపించిందని ఆరోపించారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత కేబినెట్ కమిటీ నిర్ణయం మేరకు సింధూ నదీ జలాల ఒప్పందాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎగదోయడం పాక్ మానుకుంటేనే ఒప్పందాన్ని మళ్లీ అమలు చేసే విషయాన్ని ప్రభుత్వం ఆలోచిస్తుందని రణధీర్ జైస్వాల్ స్పష్టంచేశారు. సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో భారత ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని అన్నారు.

పీఓకేను పాకిస్తాన్ ఖాళీ చేయాల్సిందే

జమ్మూకశ్మీర్‌లో విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు. జమ్మూకశ్మీర్ అనేది భారత్, పాక్‌ల మధ్య ద్వైపాక్షిక అంశమేనని, మూడో పక్షానికి తావులేదని తేల్చిచెప్పారు. ఏ వివాదమైనా సరే రెండు దేశాలు కలిసి చర్చించుకొని, పరిష్కరించుకోవాలని అన్నారు. చట్టవిరుద్ధంగా సొంతం చేసుకున్న పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను పాకిస్తాన్ ఖాళీ చేయాల్సిందేనని స్పష్టంచేశారు. పీఓకే అనేది భారతదేశంలో అంతర్భాగమని మరోసారి తెలిపారు. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం మానుకుంటే మీకే మంచిది అంటూ పాకిస్తాన్‌కు హితవు పలికారు. పాకిస్తాన్ ఉగ్రవా దులు కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యా ప్తంగా ఎంతోమంది అమాయకుల మృతికి కారణ మయ్యారని రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం, 14, మే, 2025







అరవిరిసిన అందం

ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంత్రం పాతబస్తీలో మెరిశారు. అక్కడంతా కలియతిరిగారు. ముచ్చటగా షాపింగ్ చేశారు. మురిపెంతో చిందులేశారు. చార్మినార్ వద్ద ఫొటోలకు ఫోజులిచ్చారు. లాడ్‌బజార్‌లో గాజులు చూసి మురిసిపోయారు. తీరొక్క ఆభరణాలను తిలకిస్తూ హొయలుపోయారు. స్థానికులకు అభివాదం చేస్తూ..చిరునవ్వులు చిందించారు. చివరగా చౌమహల్లా ప్యాలెస్‌లో అందమైన సాయంత్రాన్ని ఆహ్లాదంగా గడిపి..అక్కడే ఉల్లాసంగా డిన్నర్ చేశారు. మొత్తంగా పాతబస్తీ ప్రపంచ సుందరీమణుల సందడితో తళుకులీనింది.

– చార్మినార్







చార్మినార్ వద్ద ముద్దుగుమ్మలు



చౌమహల్లా ప్యాలెస్‌లో..

పనులు.. పైసలు!

- కొన్ని జోన్లలో వేగంగా.. కొన్ని జోన్లలో మందకొడిగా షురూ..
- జోన్‌కు రూ.25 కోట్ల వంతున కేటాయింపులు
- పాలకమండలి గడువు దగ్గర పడుతుండటంతో ముందు జాగ్రత్త

జోన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్పొరేటర్ల ఆతృత



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు దగ్గర పడుతోంది. దీంతో తమ డివిజన్లలో పనులపై కార్పొరేటర్లు దృష్టి సారించారు. మళ్లీ ప్రజల వద్దకు వెళ్లాలంటే చెప్పుకునేందుకు చేసిన పనులు లేకుంటే తిప్పలేనన్న తలంపుతో ఈ సంవత్సరం ఆరంభం నుంచి..ముఖ్యంగా పాలకమండలికి నాలుగేళ్లు పూర్తయిన ఫిబ్రవరి నుంచీ పనుల కోసం, పనులు చేసేందుకు అవసరమైన నిధుల కోసం అధికారులపై ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో దశల వారీగా పనులు చేసేందుకు ఇలంబర్తి కమిషనర్‌గా ఉన్నప్పుడు నిర్ణయం తీసుకున్నారు. తొలి దశలో జోన్‌కు రూ.25 కోట్లవంతున ఆరు జోన్లకు వెరసి రూ.125 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో దాదాపుగా అన్ని జోన్లలో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల వేగంగా జరుగుతుండగా, కొన్ని చోట్ల నెమ్మదిగా జరుగుతున్నాయి. వాటితో వివిధ పనులు చేస్తున్నారు. వాటిల్లో సీసీ రోడ్లు ఎక్కువగా ఉండగా, ఫుట్‌పాత్‌లు, క్యాచ్‌పిట్లు, రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు, పార్కులకు సంబంధించిన పనులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, ఖాళీ స్థలాల అభివృద్ధి, వీడీసీసీ రోడ్లు, నాలాల ఆధునీకరణ, బ్రిడ్జిల రెయిలింగ్‌పనులు, చెరువుల నుంచి మురుగునీటి మళ్లింపు, తదితర పనులున్నాయి.

సికింద్రాబాద్ జోన్‌లో..

- ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ జోన్‌లో తాజాగా రూ. 3.83 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. మిగతా జోన్లలోనూ పనులు, టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. కొన్ని జోన్లలో ఇప్పటికే కొన్ని పనులు పూర్తయినట్లు సమాచారం. సికింద్రాబాద్ జోన్‌లో తాజాగా టెండర్లు పిలిచిన వాటిల్లో రామ్‌నగర్‌లో సూర్యానగర్ ఓపెన్ నాలా దగ్గర ముంపు సమస్య పరిష్కారానికి వరదనీటి పైప్‌లైన్‌కు రూ. 35 లక్షలతో టెండర్లు పిలిచారు. అడిక్‌మెట్ డివిజన్‌లో వాహనాల వేగంతో ప్రమాదాలు జరుగుతుండటంతో దాదాపు 18 ప్రాంతాల్లో రబ్బర్ స్పీడ్‌బ్రేకర్లకు టెండర్లు పిలిచారు.టెండర్లు పిలిచిన పనుల్లో ఇంకా..
- రామ్‌నగర్ హనుమాన్ గుడి వద్ద రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో రూ. 55 లక్షలతో పిల్లల ఆటసామాగ్రి, భోలక్‌పూర్‌లో అంజుమన్ ఫంక్షన్‌హాల్ వెనుక రూ. 46.50 లక్షలతో సీసీరోడ్డు, కవాడిగూడ పద్మశాలి కాలనీలో రూ. 25.50 లక్షలతో సీసీరోడ్డు, భోలక్‌పూర్ సిద్దిఖ్‌నగర్‌లో రూ. 38.80 లక్షలతో సీసీ రోడ్డు, అబూబకర్ సిద్దిఖీ మజిద్ వద్ద రూ.33.70 లక్షలతో సీసీ రోడ్డు, గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో రూ. 49.50 లక్షలతో సీసీరోడ్లు పనులు, తదితరమైనవి ఉన్నాయి.

ప్రయాణికులు 100 శాతం బస్సులు 60 శాతమే



గ్రేటర్‌లో సుమారు 40 శాతం బస్సుల కొరత

- రెండేళ్లలో పెరిగిన ప్రయాణికులు...
- తగ్గుముఖం పట్టిన సిటీ బస్సులు
- డొక్కు బస్సుల స్థానంలో రీప్లేస్‌మెంట్‌తో సరి

సాక్షి, సిటీబ్యూరో:

హైదరాబాద్ మహానగరం పరిధి ట్రిపుల్ ఆర్ వరకు పెరిగింది. ఫ్యూచర్‌సిటీ ఇప్పటి నుంచే అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తోంది. రానున్న రోజుల్లో హైదరాబాద్ అతి పెద్ద గ్లోబల్‌సిటీగా అవతరించనుందని ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తోంది. కానీ ఈ విస్తరణకు తగినవిధంగా ప్రజారవాణా సదుపాయాల అభివృద్ధిపైన మాత్రం దృష్టి సారించడం లేదు. మెట్రో రెండో దశకు డీపీఆర్‌లు సిద్ధమైనప్పటికీ కేంద్రం నుంచి అనుమతులు లభించకపోవడంతో ఆ ప్రాజెక్టు ఊగిసలాడుతోంది. రోజు రోజుకు పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలు, ఔటర్‌ను దాటుకొని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరిస్తున్న కాలనీలు, జనావాసాల దృష్ట్యా రవాణా రంగానికి చెందిన నిపుణుల అంచనాల ప్రకారం హైదరాబాద్ మహానగరానికి ఇప్పటికిప్పుడు కనీసం 6 వేల బస్సులు అవసరం. కానీ పదేళ్లుగా కొత్త బస్సులు రోడ్డెక్కలేదు. కాలం చెల్లిన వాటి స్థానంలో ఎలక్ట్రికల్ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఏసీ కేటగిరీలకు చెందిన అద్దె బస్సులను ప్రవేశపెట్టడం మినహా ప్రజావసరాలకు అనుగుణంగా సిటీబస్సులు అందుబాటులోకి రాలేదు. మరోవైపు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తరువాత అన్ని బస్సులు ఇంచుమించు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. కానీ 60 శాతం బస్సులే రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. రెండేళ్లలో సుమారు 40 శాతం బస్సులు తగ్గాయి. బస్సుల కొరత క్రమంగా పెరుగుతోంది.

కొత్త సర్వీసులేవీ..

నగరంలో ఒకవైపు సొంత వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ మరోవైపు సిటీబస్సుల వినియోగం కూడా పెరిగింది. మెట్రో రైళ్లు తిరిగే కారిడార్‌లలో మినహాయించి నగరం నలువైపులా ప్రయాణికులు బస్సులపైనే ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, దినసరి కూలీలు, తదితర వర్గాలకు చెందిన ప్రయాణికులు వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించేందుకు సిటీ బస్సులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రత్యేకించి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. రెండేళ్ల క్రితం సుమారు 16 లక్షల మంది ప్రయాణం చేయగా, ఇప్పుడు ఆ సంఖ్య సుమారు 22 లక్షలకు చేరినట్లు అంచనా. కేవలం ఈ రెండేళ్ల కాలంలోనే ఇంచుమించు 6 లక్షల మంది పెరిగారు.2023 డిసెంబర్‌లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టిన తరువాత మెట్రోల్లో ప్రయాణం చేసే మహిళలు,సొంత వాహనాలను వినియోగించేవారు సైతం సిటీబస్సులవైపు మళ్లారు.మరోవైపు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.ఇదే సమయంలో బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు.నగరంలోని 28 డిపోల పరిధిలో 2800 బస్సులు మాత్రమే ఉన్నాయి.దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి.శివారు ప్రాంతాలకు, కాలనీలకు బస్సుల కొరత తీవ్రంగా ఉంది. వందలాది ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం ఒకటి,రెండు ట్రిప్పుల చొప్పున మాత్రమే తిరుగుతున్నాయి.దీంతో మిగతా సమయాల్లో ప్రయాణికులు సెవెన్‌సీటర్ ఆటోలను, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తోంది.కొత్తగా కొన్ని బస్సులను ప్రవేశపెట్టినప్పటికీ కాలం చెల్లిన వాటి స్థానంలో అందుబాటులోకి వచ్చినవే కానీ పెరుగుతున్న ప్రయాణికులు, విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం అవసరాల మేరకు ప్రవేశపెట్టినవి కాదని ఆర్టీసీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

మెట్రో నగరాలతో పోటీ ఎక్కడ?




- ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, తదితర మెట్రో నగరాల్లో సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్లతో పాటు సిటీ బస్సులను కూడా గణనీయంగా పెంచారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా తేలిగ్గా ప్రయాణం చేసే సదుపాయం ఉంది.
- దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం 8,121 బస్సులు ఉన్నాయి. వచ్చే రెండేళ్లలో మరో 2000 బస్సులను కొనుగోలుచేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.
- ముంబయిలో ప్రస్తుతం 3,228 బస్సులు అందుబాటులో ఉన్నాయి.2027 నాటికి ఈ సంఖ్యను 8000 లకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టారు.
- బెంగళూరులో 6,835 బస్సులు అందుబాటులో ఉన్నాయి. మరో 1000 బస్సులను కొత్తగా కొనుగోలు చేసే ప్రతిపాదన ఉంది.
- హైదరాబాద్‌లో 2800 బస్సులు తిరుగుతున్నాయి. ఈ ఏడాది కొత్తగా మరో 500 బస్సులను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.

వంద ప్రశ్నలతో కార్పొరేటర్లు రె‘ఢీ’!

జూన్ 4న జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశం

- అత్యధికంగా ఇంజినీరింగ్ పనులు, పారిశుధ్యంపై ఫోకస్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు దగ్గర పడుతుండటంతో వార్డుల్లో ప్రజలెదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు దృష్టి సారించారు. ఓవైపు అభివృద్ధి పనుల కోసం అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. మరోవైపు, స్థానికంగా ప్రజలెదుర్కొంటున్న రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాలు, దోమల బెడద తదితర అంశాలపై పాలకమండలి సమావేశంలో నిలదీసేందుకు సమాయత్తమవుతున్నారు. జూన్ 4వ తేదీన పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో..సభలో చర్చ కోసం తమ వార్డు సమస్యల్ని ప్రస్తావించేందుకు ఇప్పటికే దాదాపు వంద ప్రశ్నలు పంపించారు. వాటిల్లో టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం వంటి వాటికంటే ఇంజినీరింగ్‌వి ఎక్కువగా ఉన్నాయి. దాదాపు 30 ప్రశ్నలు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవే ఉన్నాయి. దాంతోపాటు టౌన్‌ప్లానింగ్, రాత్రివేళ చీకట్ల అంశాలవి ఎక్కువగా ఉన్నాయి. మిగతా వాటిల్లో ఫైనాన్స్, రెవెన్యూ, హౌసింగ్, ఆరోగ్యం, పరిపాలన, ప్రాజెక్టులు, ప్రకటనల విభాగాలకు చెందినవి ఉన్నాయి. నాలాలు, డీసిల్టింగ్, చెత్త రవాణా, నైట్‌షెల్టర్లు, అక్రమ నిర్మాణాలు, నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, జీహెచ్‌ఎంసీకి వస్తున్న ఆదాయం, తదితర అంశాలకు చెందినవి ఉన్నాయి. సర్వసభ్య సమావేశంలో అన్ని ప్రశ్నలపై చర్చించడం సాధ్యం కాదు కనుక చర్చించే అంశాలు, ప్రశ్నలను మేయర్ ఎంపిక చేయనున్నారు. అనంతరం సమావేశం అజెండాను సంబంధిత అధికారులు రూపొందించనున్నారు.

ఢీ అంటే ఢీ ?

గతంలోనూ సర్వసభ్య సమావేశాలు వాడివేడిగానే జరిగినప్పటికీ, ఈసారి మరింత తీవ్రత ఉండే అవకాశాలున్నాయని రాజకీయ పరిశీలకులంటున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి తగినంత బలం లేకపోయినా బీజేపీ పోటీ చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, సర్వసభ్య సమావేశంలోనూ కార్పొరేటర్లు తమ పార్టీ బలం చూపించుకునేందుకు ప్రయత్నిస్తారని చెబుతున్నారు. కాంగ్రెస్..బీజేపీ.. బీఆర్‌ఎస్ వేటికవిగా తాము తప్ప మిగతా రెండూ ఒకటేనని పలు సందర్భాల్లో మాదిరిగానే ఈసారీ విమర్శలు గుప్పించే అవకాశాలున్నాయి. సభలో ప్రజా సమస్యలపై తమ గళం వినిపించడం ద్వారా 'స్థానిక' ప్రజలకు తమ గురించి తెలుస్తుందని భావిస్తున్న వారూ ఉండటం తెలిసిందే.

ట్యాంకర్లకు ఫుల్ డిమాండ్!

రోజుకు పదివేల పైనే బుకింగ్స్

- 12 గంటల లోపు సరఫరా
- పక్కదారి పట్టకుండా గట్టి నిఘా

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. రోజు వారీగా ఎనిమిది వేల నుంచి పదివేల వరకు ట్యాంకర్ల బుకింగ్ జరుగుతుండటంతో 12 గంటలలోపు సరఫరా చేసేందుకు జలమండలి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, పాయింట్లను పెంచిన జలమండలి డిమాండ్‌కు తగ్గ సరఫరా చేసేందుకు సూక్ష్మ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది. వాస్తవంగా ప్రతి వేసవిలో భూగర్భజలాలు అడుగంటడం, ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం సర్వసాధారమైంది. గత ఐదేళ్లలో ట్యాంకర్ల బుకింగ్ పరిశీలిస్తే సుమారు 50 శాతం పైగా పెరిగినట్లు కనిపిస్తోంది. కొత్తగా ఏర్పాటవుతున్న బహుళ అంతస్తుల భవనాలతో విచ్చల విడిగా అత్యంత లోతుగా బోర్ల తవ్వకాలు జరిగి భూగర్భజలాలు పాతాళంలోకి చేరుకుంటున్నాయి. దీంతో వేసవి వచ్చిందంటే నీటి వినియోగం మరింత పెరిగి ట్యాంకర్లకు డిమాండ్ ఎగబాకుతోంది. అయితే ఈసారి ఎప్పటిమాదిరిగా ట్యాంకర్ల సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టడంలో కొంత సఫలీకృతమవుతున్నట్లు కనిపిస్తోంది. అత్యధిక ట్యాంకర్ల డిమాండ్ గల ప్రాంతాలు గుర్తించి వాటిపై దృష్టి సారించింది. అత్యధికంగా హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి, ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లి, మణికొండ, నిజాంపేట్ డివిజన్ల పరిధిలోని పలు సెక్షన్ల పరిధిలో అధికంగా ట్యాంకర్ల తాకిడి ఉన్నట్లు తెలుస్తోంది.

జనవరి నుంచే..

కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్‌లో జనవరి నుంచి జూన్ రెండో వారం వరకు ట్యాంకర్లకు డిమాండ్ అధికంగానే ఉంటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి ఏడాది ట్యాంకర్ల డిమాండ్ కనీసం 10 నుంచి 15 శాతం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచే తాకిడి పెరిగింది. గతేడాదితో పోల్చితే అదనంగా సుమారు 46 శాతం ఎగబాకినట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత పక్షం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా..మధ్య మధ్యలో వర్షాలు భూగర్భజలాలకు కొంత మేర జీవం పోస్తున్నాయి. అయితే తాగు నీటికి మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. గతేడాది పోల్చితే డిమాండ్ పెరిగినా...సరఫరా మాత్రంలో జాప్యం లేకుండా జలమండలి చర్యలకు ఉపక్రమించింది.

ఎంసీసీ బుకింగ్‌కు ప్రాధాన్యం

మెట్రో కస్టమర్ కేర్ (ఎంసీసీ) ద్వారా జరిగే బుకింగ్‌లకు జలమండలి ప్రాధాన్యం ఇస్తోంది. అత్యవసరం పేరిట ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద, నేరుగా వాటర్ ట్యాంకర్ ఆపరేటర్ల ద్వారా జరిగే నాన్ ఎంసీసీ బుకింగ్‌లకు రెండో ప్రాధాన్యంగా సరఫరా చేస్తోంది. ఎంసీసీ ద్వారా జరిగే బుకింగ్ ఐదు ట్యాంకర్ల ఫిల్లింగ్ తర్వాత నాన్ ఎంసీసీ ద్వారా జరిగే ఒక బుకింగ్ చొప్పున సరఫరా జరిగే విధంగా చర్యలకు ఉపక్రమించడంతో పక్కదారికి అడ్డుకట్టపడినట్లయింది. ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్ ఏర్పాటు చేసి వివిధ సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల నుంచి సమన్వయంతో ట్యాంకర్ల సరఫరా జరిగే విధంగా అమలు చేస్తోంది.

ప్రస్తుతం ఇలా..

మొత్తం ట్యాంకర్లు : 949
ఫిల్లింగ్ స్టేషన్లు : 78
ఫిల్లింగ్ పాయింట్లు : 126



మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గోపి

చాంద్రాయణగుట్ట: మహిళ హత్య కేసులో నిందితుడిని చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గోపి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..కేశవగిరి హిల్స్ ప్రాంతానికి చెందిన కేతావత్ బుజ్జి(40)కి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన జుల్ఫికర్ అలీ(43)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి తీరితీసింది. మొదట్లో జల్‌పల్లిలో నివాసం ఉండే జుల్ఫికర్ ఆ తర్వాత కేశవగిరికి మకాం మార్చాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలంటూ బుజ్జి అతడిపై ఒత్తిడి చేసింది. అయితే తనకు అప్పటికే పెళ్లై పిల్లలున్న నేపథ్యంలో అలీ పెళ్లి అంశాన్ని దాట వేస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న బుజ్జి అలీకి ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. అందుకు అతను నిరాకరించడంతో ఫోన్‌లోనే దూషించింది. దీనిని అవమానంగా భావించిన అలీ ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా 8న రాత్రి ఆమె ఇంటికి వెళ్లిన అలీ బుజ్జి గొంతు కోసి హత్య చేయడమేగాక, ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహానికి నిప్పంటించి పరారయ్యాడు. మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

అమీర్‌పేట: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పుల పాలైన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజీవ్ రాథోడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, కవాడిపల్లి గ్రామానికి చెందిన నవీన్ (34) ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఇందుకు గాను తెలిసిన వ్యక్తుల వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండటంతో గత ఫిబ్రవరిలో ఘట్‌కేసర్ మండలం, సింగారం గ్రామంలో ఉంటున్న బావమరిది ఇంటికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. నాగోల్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న అమీర్‌పేటలోని స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఈ నెల 11న అమీర్‌పేటకు వచ్చిన నవీన్ బైక్‌ను కోచింగ్ సెంటర్ పార్కింగ్ స్థలంలో పార్కు చేశానని, తాను మీకు దూరంగా వెళ్లి పోతున్నానని బావమరిదికి మెయిల్ పంపి అదృశ్యమయ్యాడు. అతడి బావమరిది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ గ్రామీణ క్రికెట్

గోస పట్టదా?

70 ఏళ్లుగా జిల్లాల క్రికెటర్లకు అన్యాయం



- హైదరాబాద్‌లో 210 పైగా క్లబ్ జట్లు
- జిల్లాల్లో కేవలం ఎనిమిదే టీమ్‌లు
- హెచ్‌సీఏలో ఆ మూడు వర్గాలదే పెత్తనం
- జిల్లాల్లో కానరాని స్టేడియాలు, మౌలిక వసతులు
- రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కొత్త బోర్డు అవసరం
- బీసీసీఐ శ్రద్ధ తీసుకోవాలని టీడీసీఏ విజ్ఞప్తి

సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) 1934లో పురుడుపోసుకున్నప్పటి నుంచి నేటి వరకు ఆ సంఘంలో నగరానికి చెందిన వారే పెత్తనం చెలాయిస్తున్నారు. తొలుత క్లబ్‌లకు ఆడే క్రికెటర్లను ప్రోత్సహించే వారిని గుర్తించి ఆయా జట్లకు హెచ్‌సీఏలో సభ్యత్వం ఇచ్చేవారు. ఆ తర్వాతి కాలంలో రాజకీయ కారణాల నేపథ్యంలో తమ అనుకూలురు, వర్గాలకు చెందిన వారి క్లబ్‌లకు సభ్యత్వాలిచ్చి తమ బలం పెంచుకోవడం మొదలుపెట్టారు. ఇలా హైదరాబాద్‌లో క్లబ్‌ల సంఖ్య 210 దాటిపోగా, జిల్లాల్లో మాత్రం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఇప్పటికీ ఎనిమిదే సంఘాలు, ఎనిమిదే జట్ల దగ్గర ఆగిపోయింది. దీంతో హైదరాబాద్‌లో ఆడే క్రికెటర్లకు మినహా ప్రతిభావంతులైన పేద గ్రామీణ క్రికెటర్లకు తమ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాలు రాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని స్టేడియాలు.. నదుపాయాలు

రూ. వందల కోట్ల నిధులు ఉన్న హెచ్‌సీఏకు ఉప్పల్, సికింద్రాబాద్ జింఖానాలో తప్ప మరెక్కడ టర్ఫ్ వికెట్లు ఉన్న సొంత స్టేడియాలు లేకపోవడం గమనార్హం. ఉప్పల్ స్టేడియాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకోగా, జింఖానా స్టేడియం కంటోన్మెంట్ బోర్డుతో వివాదాల కారణంగా న్యాయస్థానంలో ఉంది. విదేశీ దాతల సహకారంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మహబూబ్‌నగర్ క్రికెట్ స్టేడియానికి గత ఏడాదే హెచ్‌సీఏ టర్ఫ్ వికెట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. అయితే 1934 నుంచి రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకుంటున్న హెచ్‌సీఏ ఎక్కడా స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పొరుగున ఉన్న ఏపీలో విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, కడపలో ఏసీఏకు మంచి సౌకర్యాలతో సొంత క్రికెట్ మైదానాలు ఉండడం విశేషం. తెలంగాణ గ్రామీణ క్రికెటర్లు మాత్రం ఇప్పటికి మట్టి, మ్యాట్‌పైనే క్రికెట్ ఆడాల్సి వస్తోంది.

అధికార దాహమే కారణం

జిల్లాల క్రికెట్ అభివృద్ధి, క్రికెటర్ల భవిష్యత్తుపై ఎవరు ప్రశ్నించినా వారిని ఒంటరి చేసి హెచ్‌సీఏ నుంచి బహిష్కరించడం ఆనవాయితీగా వస్తోంది. టీమిండియా మాజీ క్రికెటర్లు శివ్‌లాల్ యాదవ్, అర్షద్ ఆయూబ్ మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో వారిని ప్రశ్నించే వారికి పోటీగా రైవల్ గ్రూపులను ప్రోత్సహించి, గుర్తింపు ఇచ్చి అసలైన వారిని హెచ్‌సీఏ నుంచి బయటికి గెంటేశారు. వీరిరువురితో పాటు గతంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్ష, కార్యదర్శిగా పని చేసిన మరో ఇద్దరు వ్యక్తులు హెచ్‌సీఏను తమ కనుసన్నల్లో నడిపిస్తున్నారు. వీరికి జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి, జిల్లాల క్రికెటర్ల సంక్షేమం ఏ మాత్రం పట్టడం లేదు. ఉప్పల్ స్టేడియం నిర్మాణ సమయంలో జరిగిన ఆర్థిక అక్రమాలు, అవకతవకలు బయటపడకుండా ఉండేందుకు, డబ్బులిచ్చే బడాబాబులను హెచ్‌సీఏ జట్లలో ఆడించేందుకు, క్లబ్‌లను బంగారు బాతులుగా మార్చుకున్నారు. 210 క్లబ్‌లకు ఓటు హక్కు ఉండడం, ఇందులో మెజార్టీ క్లబ్‌లు నలుగురైదుగురి చేతుల్లోనే ఉండడంతో హెచ్‌సీఏ కార్యకాలపాలన్నీ హైదరాబాద్‌కే పరిమితమవుతున్నాయి.

టోర్నమెంట్లు ఏవీ?

హైదరాబాద్ పరిధిలో జరిగే డివిజన్ లీగ్‌ల్లో మెజార్టీ జట్లు హైదరాబాద్ క్లబ్‌లవే కావడంతో జిల్లాల క్రికెటర్లకు అరుదుగా కూడా అవకాశాలు రావడం లేదు. జిల్లాల క్రికెటర్ల కోసం ప్రత్యేకంగా లీగ్‌లు, టోర్నమెంట్లను హెచ్‌సీఏ నిర్వహించడం లేదు. అవినీతి, అక్రమాలు, కొందరి పెత్తనం కారణంగా హెచ్‌సీఏతో గ్రామీణ క్రికెట్ ఎప్పటికీ అభివృద్ధి చెందదని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గుజరాత్, మహారాష్ట్రల్లో మూడేసి క్రికెట్ సంఘాలకు బీసీసీఐ గుర్తింపు ఉంది. ముంబై, మహారాష్ట్ర, బరోడా, విదర్భ, గుజరాత్, సౌరాష్ట్ర క్రికెట్ సంఘాలు ఆయా రాష్ట్రాల్లో జోన్లు వారీగా క్రికెట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అదే తరహాలో తెలంగాణ జిల్లాల కోసం కూడా కొత్త క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని పలువురు గ్రామీణ క్రికెటర్లు కోరుతున్నారు.

టీడీసీఏకు గుర్తింపు ఇవ్వాలి..



మహబూబ్‌నగర్ జిల్లా మాజీ కార్యదర్శిగా, హైదరాబాద్ జట్టు టీమ్ మేనేజర్‌గా హెచ్‌సీఏలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని బయటకు వచ్చేశా. ఒక గ్రామీణ క్రికెటర్‌గా జిల్లాల్లోని క్రికెటర్ల ఆవేదన నాకు తెలుసు. జిల్లాల క్రికెటర్లకు ఆడేందుకు కనీసం లీగ్స్‌ను కూడా హెచ్‌సీఏ నిర్వహించడం లేదు. గత ఏడాది తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘాన్ని స్థాపించి అండర్17 కేటగిరీలో ఉమ్మడి జిల్లాల టీ20 క్రికెట్ టోర్నీను విజయవంతంగా నిర్వహించాం. ఈ ఏడాది అమెరికా నుంచి ఒక అండర్17 జట్టును తీసుకొచ్చి తెలంగాణ జిల్లాలకు చెందిన క్రికెటర్లతో వన్డే టోర్నీ నిర్వహించాం. భవిష్యత్తులోనూ గ్రామీణ క్రికెటర్లను విదేశీ టూర్లకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జిల్లాల నుంచి ప్రతిభావంతులైన ఆటగాళ్లను తయారు చేయడమే టీడీసీఏ లక్ష్యం. గ్రామీణ క్రికెటర్ల కోసం మేము పడుతున్న కష్టాన్ని గుర్తించి బీసీసీఐ మాకు గుర్తింపు ఇవ్వాలి. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం. తెలంగాణ నుంచి మరో జట్టు దేశవాళీ క్రికెట్‌లో ఆడేందుకు అనుమతించడంతో పాటు జిల్లాల్లో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బీసీసీఐ చర్యలు తీసుకోవాలి.

– అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు ,శాట్ మాజీ చైర్మన్

రాంగ్ రూట్‌లో వచ్చి రుబాబు..

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ ఆగ్రహం



రాంగ్‌రూట్‌లో వెళ్తున్న బెల్లంకొండ శ్రీనివాస్

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో కారు నడపడమే కాకుండా వెనక్కి తిప్పుకుని వెళ్లాలని చెప్పిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కారు ఆపకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వెళ్లిపోయిన సంఘటన జూబ్లీహిల్స్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ జర్నలిస్టుకాలనీ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45 వైపు నుంచి వస్తున్న సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ జర్నలిస్టుకాలనీ వద్ద రాంగ్‌రూట్‌లో కాలనీలోని తన ఇంటి వైపు వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీనిని గుర్తించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ అతడి కారును ఆపి, రాంగ్‌రూట్‌లో ఎలా వెళ్తావంటూ ప్రశ్నించాడు. దీంతో కానిస్టేబుల్‌పై శ్రీనివాస్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ కారు వెనక్కి తిప్పుకుని ఆపకుండా వెళ్లిపోయాడు. కానిస్టేబుల్ నరేష్ వెనక్కి తిప్పుతున్న కారును ఆపేందుకు యత్నించగా ఆయనపై దూసుకెళ్లేందుకు యత్నించి సడెన్ బ్రేక్ వేశాడు. భయంతో సదరు కానిస్టేబుల్ పక్కకు జరిగే లోపే శ్రీనివాస్ అక్కడి నుంచి ఉడాయించాడు. ఆ సమయంలో బెల్లంకొండ సురేష్ మద్యం సేవించి ఉన్నాడా? లేదా అన్నది తేలాల్సి ఉంది. అయితే మద్యం మత్తులోనే కారు నడుపుతున్నట్లుగా ప్రాథమికంగా పోలీసులు అంచనాకు వచ్చారు. సదరు కారు టెంపరరీ రిజిస్ట్రేషన్‌తో ఉన్నదని పోలీసులు తెలిపారు. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. జూబ్లీహిల్స్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

నలుగురు నిందితుల అరెస్ట్ ● 108 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం



గోల్కొండ: వివిధ యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళవారం మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ అడిషనల్ కమిషనర్ అందే శ్రీనివాస్‌రావు కేసు వివరాలు వెల్లడించారు. చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ ముజీబ్ హుస్సేన్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో అతను నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపాడు. ఈ నేపథ్యంలో టోలిచౌకికి చెందిన మహ్మద్ నాసిర్‌ఖాన్, గుడిమల్కాపూర్‌కు చెందిన మహ్మద్ అల్‌బషీర్ రెహమాని, సెవన్ టూమ్స్ ప్రాంతానికి చెందిన జియా ఉర్ రహమాన్ సిద్దిఖీతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. ఇతర దేశాలకు వెళ్లే వారిని, ఐటీ ఉద్యోగులను టార్గెట్‌గా చేసుకుని వారికి అవసరమైన నకిలీ సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ఈ ముఠా కార్యకలాపాలపై పక్కా సమాచారం అందడంతో సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెహిదీపట్నం పోలీసులతో కలిసి ఈ నెల 12న దాడి చేశారు. ఫస్ట్ లాన్సర్‌లోని ఈద్గా గ్రౌండ్ వద్ద ఓ వ్యక్తికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా ముజీబ్ హుస్సేన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ మాటున నకిలీ సర్టిఫికెట్ల దందా నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అతను కలకతాకు చెందిన మనోజ్ విశ్వాస్, ఉత్తర్‌ప్రదేశ్ మీరట్‌కు చెందిన రవీందర్, అజయ్ అలియాస్ ముఖేష్‌ల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసేవాడు. వాటిని నాసిర్‌ఖాన్, జియా ఉర్ రహమానీ, మహ్మద్ అల్ బషీర్‌ల ద్వారా అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు వారికి నకిలీ సర్టిఫికెట్లు అందజేస్తున్న మనోజ్, అజయ్, రవీందర్‌ల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన 108 నకిలీ సర్టిఫికెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదులు, ఎస్సైలు కవీయుద్దీన్, సాయిరామ్, మధు, మెహిదీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎస్. మల్లేష్‌ను అడిషనల్ కమిషనర్ అభినందించారు.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అస్లాం అన్సారీ తన భార్య నజ్మా కాతూన్(23), పిల్లలతో కలిసి ఎనిమిది నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లి గ్రామానికి వలస వచ్చారు. ఈ నెల 11వ తేదీన ఉదయం పిల్లలతో కలిసి అస్లాం నిద్రిస్తుండగా, ఇంట్లో ఎవరికి చెప్పకుండా నజ్మా బయటికి వెళ్లి పోయింది. ఎంతకి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బిహార్‌కే చెందిన సిరాజ్ అన్సారీ అనే వ్యక్తిపై అనుమానం ఉందంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శ్రవణ్‌రావు అరెస్ట్

- ఇనుప ఖనిజం ఇప్పిస్తానంటూ మోసం
- అఖండ సంస్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో 6వ నిందితుడిగా ఉన్న మీడియా సంస్థ యజమాని శ్రవణ్ కుమార్ రావు అరెస్టయ్యాడు. ఆ కేసులో ముందస్తు బెయిల్ పొందినా... హైదరాబాద్‌లో నమోదైన చీటింగ్ కేసులో జైలుకు వెళ్లాడు. ఇనుప ఖనిజం వ్యాపారం డీల్ ఇప్పిస్తానంటూ మోసం చేశారని అఖండ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా సంస్థ ఎండీ ఎ.ఆకర్ష్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిని రిజిస్టర్ చేశారు. రూ.6.5 కోట్ల గోల్‌మాల్‌తో ముడిపడి ఉన్న ఈ కేసులో శ్రవణ్‌రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావు, వ్యాపార భాగస్వామి కేబీ వేదమూర్తి, ఎకోర్ ఇండస్ట్రీస్ హోల్‌టైమ్ డైరెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు. ఇన్రిథమ్ ఎనర్జీ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న శ్రవణ్‌రావు 2022 జూన్‌లో ఆకర్ష్‌ను సంప్రదించారు. కర్ణాటక, సాండూర్‌లోని ఎకోర్ ఇండస్ట్రీస్ బాధ్యతలను తాను స్వీకరించానని, ఐరన్ ఓర్ వ్యాపారంలో ఉన్న తమకు నిధులు సమకూరిస్తే ప్రతి టన్నుకు రూ.300 చొప్పున లాభం ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో అఖండ సంస్థ 2022 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వివిధ దఫాలుగా ఎకోర్ సంస్థ ఖాతాల్లోకి రూ.6.5 కోట్లు బదిలీ చేసింది. ఈ చెల్లింపులకు సంబంధించి ఎకోర్ సంస్థ నుంచి తమకు ఎలాంటి ఇన్వాయిస్‌లు అందలేదని ఆకర్ష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2023 నాటికి సంబంధిత వ్యక్తులకు రూ.7 కోట్ల విలువైన ఇనుప ఖనిజం సరఫరా జరగాల్సి ఉండగా... అలా కాకపోవడంతో ఆకర్ష్‌కు అనుమానం వచ్చింది. దీంతో ఆరా తీసిన ఆయన తమ సంస్థ బదిలీ చేసిన నిధులను శ్రవణ్‌రావు వేరే అవసరాలకు మళ్లించినట్లు గుర్తించారు. దీనిపై పలుమార్లు ప్రశ్నించినా శ్రవణ్‌రావు నుంచి సరైన సమాధానం రాలేదు. ఆ తర్వత కొన్ని రోజులకు శ్రవణ్‌రావు విదేశాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆకర్ష్ తన నిధులకు సంబంధించి శ్రవణ్ భార్య స్వాతితో పాటు వేదమూర్తిని పలుమార్లు సంప్రదించాడు. గత ఏడాది సెప్టెంబర్ వరకు వారు కేవలం రూ.50 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించారు. గత నెల వరకు ఎదురు చూసిన ఆకర్ష్ దీనిపై సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఫిర్యాదుతో పాటు బాధితుడు అనేక వాట్సాప్ చాటింగ్స్, ఈ-మెయిల్స్ ప్రతులకు జత చేశారు. ఈ కేసును అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అధికారి నోటీసులు జారీ చేయడంతో శ్రవణ్ రావు మంగళవారం సీసీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. అతడిని వివిధ కోణాల్లో ప్రశ్నించిన పోలీసులు సరైన వివరాలు రాబట్టలేకపోవడంతో అరెస్ట్ చేశారు. న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు. ఇందుకు అనుమతి కోరుతూ కోర్టులో పిటిషన్ వేయనున్నారు.

కేదార్‌నాథ్ యాత్ర పేరుతో వసూళ్ల దందా..

హరేకృష్ణ మూవ్‌మెంట్ మాజీ ఉద్యోగుల నిర్వాకం ● కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ గోల్డెన్ టెంపుల్‌లో పనిచేసిన ఇద్దరు మాజీ ఉద్యోగులు నకిలీ రసీదులతో భక్తుల నుంచి కేదార్‌నాథ్ యాత్ర పేరుతో డబ్బులు వసూలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ గోల్డెన్ టెంపుల్ ప్రతినిధి సూర్యనారాయణ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అవకతవకలకు పాల్పడిన మాజీ ఉద్యోగులు రాజుసింగ్, ఠాకూర్ అజయ్ సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజుసింగ్, ఠాకూర్ అజయ్‌సింగ్ అనే వ్యక్తులు గతంలో హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో పనిచేశారు. వీరి ప్రవర్తన సరిగ్గా లేకపోవడం, నిధుల దుర్వినియోగం కారణంగా వీరిని ఉద్యోగాల్లో నుంచి తొలగించారు. అయితే గత కొన్నాళ్లుగా వారు ఇక్కడ ఉన్న పరిచయాల ఆధారంగా కొందరు భక్తులకు ఫోన్ చేసి చార్‌ధామ్ యాత్ర, కేదార్‌నాథ్ యాత్రకు తీసుకువెళ్తామంటూ డబ్బులు వసూలు చేశారు. బాధిత భక్తుల్లో ఒకరు ఈ విషయాన్ని గోల్డెన్ టెంపుల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆరా తీయగా వీరు నకిలీ రశీదులతో భక్తులను మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అక్రమంగా డబ్బులు వసూలు చేసి హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ప్రతిష్టను దెబ్బతీశారని, వీరిపై చర్యలు తీసుకోవాలంటూ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు.

ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు వాత

- బాధితులకు రూ.70 వేలు పరిహారాన్ని అందజేయాలి
- 45 రోజుల్లోగా చెల్లించాలని కమిషన్ ఆదేశం

సిటీ కోర్టులు: ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తప్పుబట్టింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని స్పష్టం చేస్తూ అందుకు పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పింది. బాధితులకు రూ. 50 వేల నష్ట పరిహారంతోపాటు కోర్టు ఖర్చులకు మరో రూ. 10 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కమిషన్ అధ్యక్షురాలు లతాకుమారి, సభ్యులు పీవీటీఆర్.జవహర్‌బాబు, జె.శ్యామలతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్‌కు చెందిన ఈవని సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి మే 2022లో తమిళనాడులోని "కూనూర్" కు వెళ్లారు. అయితే సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కోయంబత్తూర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అతనికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని నిర్ధారించి 5 రోజుల పాటు వైద్యం అందించారు. డిశ్చార్జ్ తర్వాత కూడా మందులను కొనసాగించాలని వైద్యులు సూచించారు. అంతేకాకుండా రైలు ప్రయాణానికి బదులుగా విమాన ప్రయాణాన్ని సూచిస్తూ.. అందుకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కూడా జారీ చేశారు. దాని ఆధారంగా ఫిర్యాదుదారు, అతని భార్య హైదరాబాద్ వచ్చేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ నుంచి విమాన టికెట్లను కొనుగోలు చేయడంతోపాటు వీల్ చైర్‌ను కూడా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి కోయంబత్తూర్‌లోని విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి సిబ్బంది ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను ధృవీకరించిన తర్వాత, అధికారులు లగేజీ చెక్ ఇన్ పూర్తి చేసి బోర్డింగ్ పాస్‌లను కూడా జారీ చేశారు. భద్రతా తనిఖీలో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఫిర్యాదుదారుల లగేజీలకు ట్యాగ్‌లను తొలగించి తిరిగి అందజేశారు. దీంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బోర్డింగ్ పాస్‌లు ఉన్నప్పటికీ చివరి నిమిషంలో వారిని విమానం ఎక్కనివ్వలేదు దీంతో ఫిర్యాదుదారులు కోయంబత్తూరు నుంచి రోడ్డు మార్గంలో బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి మరో విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. దీనిపై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ పై విచారణ చేపట్టిన కమిషన్ ఇండిగో ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని పేర్కొంటూ.. బాధిత కుటుంబానికి మొత్తం రూ.70 వేల పరిహారాన్ని 45 రోజుల్లోగా అందజేయాలని ఆదేశించింది.

బెంగళూరులో ఘరానా దొంగ అరెస్ట్

నిందితుడిపై హైదరాబాద్‌లోనూ కేసులు

బనశంకరి: తాళాలు పగులగొట్టి ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కామేపల్లి శ్రీనివాస్ అలియాస్ కార్తీక్ (39) జేబీ నగరలో నివాసం ఉంటున్నాడు. చోరీలే వృత్తిగా ఎంచుకున్న అతను గత నెల 16న కొడిగేహళ్లి ప్రాంతంలో ఓ ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకెళ్లాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా జేబీ నగరలోని ఓ హాస్టల్‌లో తలదాచుకుంటున్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.9.20 లక్షల విలువైన 148 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. అతడిపై బీదర్, హైదరాబాద్, సైబరాబాద్‌తో పాటు 10 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కార్తీక్, మోహన్‌రుద్ర అనే పేర్లతో తిరుగుతూ చోరీలకు పాల్పడేవాడు. అతడిపై ల్యాప్‌టాప్, ఇళ్లలో చోరీలతో పాటు 88 కి పైగా కేసులు ఉన్నట్లు తెలిపారు.

సెలూన్ యజమానిపై దాడి



సెలూన్ యజమానిపై దాడి చేస్తున్న దృశ్యం

గోల్కొండ: ఏమిరా మాతోనే పెట్టుకుంటావా... అంటూ ఓ రౌడీషీటర్ సోదరులు హేర్ కట్టింగ్ సెలూన్ యజమానిపై దాడి చేయడమే గాకుండా సెలూన్‌ను ధ్వంసం చేసిన సంఘటన సోమవారం రాత్రి గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గోల్కొండకు చెందిన జాఫర్, సోహెబ్ సోమవారం రాత్రి గోల్కొండ మోతీ మహల్ వద్ద గల హెయిర్ కట్టింగ్ వీరు సెలూన్ యజమాని సయ్యద్ నిజాముద్దీన్‌తో వాగ్వాదానికి దిగారు. ఏమిరా మాతోనే పెట్టుకుంటావా మేము ఎవరో తెలియదా అంటూ నిజాముద్దీన్‌ను బయటికి లాగి చితకబాదారు. అంతటితో ఆగకుండా సెలూన్‌ను ధ్వంసం చేశారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి సోదరుడైన రౌడీషీటర్ హంజాను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు. ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

11వ అంతస్తు నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



గౌతమ్ శెట్టి మృతదేహం

గచ్చిబౌలి: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శశి పాల్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక, మంగళూర్‌కు చెందిన గౌతంశెట్టి(29) టీఎన్‌జీవోస్ కాలనీ సమీపంలోని మైహోం విహంగలోని 5వ అంతస్తులో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తండ్రికి చెందిన వ్యాపారాలను చూసుకునే గౌతమ్ కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 11 అంతస్తుకు వెళ్లిన అతను కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్లకు శిక్షణ తరగతులు షురూ..

- విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే పద్ధతులతో..
- సర్కార్ బడుల ఉపాధ్యాయులకు శిక్షణ
- రాజ్‌భవన్ హైస్కూల్‌లో ప్రారంభమైన తరగతులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు బోధనలో నాణ్యత, సాంకేతికత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వచ్చింది. ఎస్‌సీఈఆర్‌టీ, విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అసైన్‌మెంట్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్)-2021 జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ఫలితాలు తక్కువ ఉండటాన్ని గుర్తించారు. ఈ కారణాలతో వాటిని మెరుగుపరిచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫలితంగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఉపాధ్యాయులను మరింత సన్నద్ధం చేసే దిశగా పలు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసనా ఫలితాలను పెంపొందించడమే లక్ష్యంగా విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో మంగళవారం మొదటి విడతలో సాంఘిక శాస్త్రం, గణిత శాస్త్రం టీచర్లకు ఈ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు మొదటి విడత తరగతులు కొనసాగుతాయి. ఇటీవల జిల్లా రిసోర్స్ పర్సన్లకు(డీఆర్‌పీ) రాష్ట్ర స్థాయిలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇలా శిక్షణ పొందిన డీఆర్‌పీలు మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు రాజ్‌భవన్ హైస్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

బోధనలో మరింత నాణ్యత పెంచేలా ప్రణాళికలు



సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో టీచర్లకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు



శిక్షణకు హాజరైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా..

సాంకేతికత పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ స్కానర్ బోర్డులను సద్వినియోగం చేసుకోవడం, కృత్రిమ మేథ(ఏఐ)ను అందిపుచ్చుకోవడం, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఆకర్షణీయమైన బోధనాభ్యాసన ప్రక్రియలను రూపొందించుకోవడం, బడి అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, పాఠశాల వనరులను సమర్థంగా నిర్వహించడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, వినూత్న వ్యూహాలు, కొత్త బోధనా పద్ధతులను మరింత బలోపేతం చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం.

శిక్షణ ఉంటుంది ఇలా..

- రాష్ట్రస్థాయిలో ఈ నెల 5 నుంచి 9 వరకు జిల్లా రిసోర్స్ పర్సన్లకు శిక్షణ పూర్తిచేశారు.
- జిల్లాస్థాయిలో ఈ నెల 13 నుంచి 17 వరకు, 20 నుంచి 24 వరకు, 27 నుంచి 31 వరకు మూడు విడతల్లో శిక్షణ ఇస్తారు.
- ప్రతి మండలం నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానానికి ఇద్దరు చొప్పున 8 మంది ఎస్‌జీటీలు ప్రాథమిక స్థాయిలో శిక్షణ పొందుతారు.
- తెలుగు, పరిసరాల విజ్ఞానం, గణితం, ఇంగ్లిష్, స్పెషల్ ఎడ్యుకేషన్లకు ఇద్దరు చొప్పున 10 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు శిక్షణ పొందుతారు.
- స్కూల్ అసిస్టెంట్ల నుంచి తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, భౌతిక, రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాలు, వ్యాయామ, ప్రత్యేక విద్యకు నలుగురు చొప్పున శిక్షణ పొందుతారు.
- ప్రాథమిక స్థాయిలో ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఉన్నత స్థాయిలో ప్రతి మండలం నుంచి నలుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.
- ఈ నెల 20 నుంచి 24 వరకు రెండో దఫా శిక్షణ కార్యక్రమాలు మండల స్థాయిలో ఎస్‌జీటీలకు, 26 నుంచి 30 వరకు మూడో విడత శిక్షణ తరగతులు స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేశారు.
- అభ్యాసన ఫలితాలు, నూతన బోధనా పద్ధతులు, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సబ్జెక్టుల వారీగా విషయ పరిజ్ఞానం, బాషా నైపుణ్య వంటి వాటిపై ఉపాధ్యాయులు మరింత నైపుణ్యాలు పెంచుకునేలా ఈ శిక్షణ ఇస్తున్నారు.
- వీటికి తోడు నాయకత్వ లక్షణాలు, జీవిత నైపుణ్యాలు కూడా నేర్పించనున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



ఇందిరానగర్‌లో మైక్ సెట్లతో అవగాహన కల్పిస్తున్న మహిళా సమాఖ్యల ప్రతినిధులు

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు నిత్యం మానిటరింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో గల్లీ గల్లీ తిరుగుతూ శానిటేషన్ సిబ్బందితో పాటు మహిళా సమాఖ్యల ప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్, జవహర్‌కాలనీ, కమలాపురి కాలనీల్లో శానిటేషన్ సిబ్బందితో పాటు మహిళా సమాఖ్యల ప్రతినిధులు చెత్త సేకరించే వాహనదారుడితో కలిసి మైక్ సెట్ పట్టుకొని మంగళవారం అవగాహన కల్పించారు. చెత్త బండికి చెత్త ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామంటూ అవగాహన కల్పించారు.

యువకుడిపై హత్యాయత్నం

బంజారాహిల్స్: రోడ్డుకు అడ్డంగా బైక్‌లు ఎందుకు పార్కింగ్ చేశారంటూ ప్రశ్నించిన ఓ యువకుడిపై ఆరుగురు ఆగంతకులు దాడి చేసి గాయపర్చిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని ఇందిరానగర్‌లో ఉండే జొల్లు అరుణ్‌కుమార్, ఆయన బావమరిది సాయిరాం ఇద్దరూ కలిసి తెల్లవారుజామున టీ తాగడానికి కృష్ణానగర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా మూడు బైక్‌లు అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్నాయి. ఇలా ఎందుకు పార్కింగ్ చేశారంటూ అరుణ్‌కుమార్, సాయిరాం ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన ఆరుగురు ఆగంతకులు సాయిరాంను తీవ్రంగా కొట్టడమే కాకుండా కత్తితో మెడ, చేయిపై పొడిచారు. అడ్డుకునే క్రమంలో ఛాతిపై కూడా గట్టిగా పొడవడంతో సాయిరాంకు తీవ్ర గాయాలయ్యాయి. తన బావమరిదిని హత్య చేసే ఉద్దేశ్యంతోనే ఆగంతకులు బైక్‌లు అడ్డంపెట్టి గొడవకు దిగి కత్తితో పొడిచారని అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం సాయిరాంను ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దాడి చేసిన వారి కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తాచాటిన మెరీడియన్ విద్యార్థులు



స్కూల్ టాపర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూనమ్ జా

బంజారాహిల్స్: సీబీఎస్‌ఈ విడుదల చేసిన ఫలితాల్లో బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 10వ తరగతిలో 100 శాతం, 12వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పూనమ్ జా తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. కామర్స్ విభాగంలో నియతీ వర్మ 500 మార్కులకుగాను 485 మార్కులు, సైన్స్‌లో మహ్మద్ అబ్రార్ మసూద్ 470 మార్కులు, హ్యుమానిటీస్ విభాగంలో జీతీషా టక్ 467 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. దాదాపు అన్ని సబ్జెక్టులలో కూడా విద్యార్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బుట్టా రేణుక తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులకు సూచించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని వీధి నెం.1లో నూతన బీటీ రోడ్డు పనులను హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఉన్న అన్ని వీధుల్లో నూతన స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బాబు, యతిరాజ్, అశోక్, ప్రభాకర్, రాజేందర్, జ్ఞాని, శ్రీనాథ్, జాకి, ప్రియ రాజ్, సంజీవరెడ్డి, రమేష్ జస్వాల్, అనీష్, జ్యోతిరెడ్డి, బిండియా, కళ, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

హాసినికి గవర్నర్ ప్రశంస



టాపర్ విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బంజారాహిల్స్: సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన హాసిని ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో 574 మార్కులు సాధించి హైదరాబాద్ జిల్లా స్థాయిలో టాపర్‌గా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో రెండో స్థానంలో నిలిచి రాజ్‌భవన్ స్కూల్ కీర్తిప్రతిష్టలను దశదిశలా చాటింది. 574 మార్కులతో జిల్లాస్థాయిలో టాపర్‌గా నిలిచిన హాసిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా ఆమెకు జ్ఞాపికను అందజేసి చాక్లెట్ బాక్సును బహుమతిగా అందజేశారు. రాజ్‌భవన్ స్కూల్ పేరు నిలబెట్టారని ప్రశంసించారు. ఆటో డ్రైవర్ కూతురు అహర్నిశలు కష్టపడి బాగా చదివి టాప్ మార్కులతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవడం ఆయనకు ఎంతో సంతోషం కలిగించింది.

ఆక్రమణదారులకు జరిమానాలు



ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై వరుసగా మూడో రోజు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. మరోవైపు ఆక్రమణలను తొలగించారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానాలతో పాటు కేసులు కూడా తప్పవని వారు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఫుట్‌పాత్ ఆక్రమణలతో కొద్ది రోజుల నుంచి సొసైటీ వారితో పాటు కాలనీవాసులు ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఇక్కడ నిత్యం పర్యటిస్తూ ఆక్రమణలను తొలగిస్తున్నారు.

మెరిసిన జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



జగన్ ప్రసన్న 97.6 శాతం మార్కులు



అశ్రిత వల్లూరు 96.8 మార్కులు

బంజారాహిల్స్: సీబీఎస్‌ఈ 10, 12 తరగతి పరీక్షా ఫలితాల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జగన్ ప్రసన్న 97.6 శాతం మార్కులతో పాఠశాల మొదటి స్థానంలో నిలిచాడు. 97.4 శాతం మార్కులతో గూగులోతు ధృపద్ ద్వితీయ, 96.8 శాతం మార్కులతో అశ్రిత వల్లూరు, షర్లీజ్ మన్నూరిలు తృతీయ స్థానాలను సాధించారు. కంచర్ల మనస్వి ఆంగ్లంలో 100 శాతం, శ్రేయ సమల్ హిందీలో 100 శాతం మార్కులు సాధించారు. పదో తరగతిలో మొత్తం 228 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 146 మంది విద్యార్థులు 75 శాతం పైగా మార్కులు సాధించారు. 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో జియా బ్రోఫ్రా 93.6 శాతం, మోనల్ గుప్తా 91.6 శాతం, వర్కటమ్ దీక్షిత్‌రెడ్డి 91 శాతం మార్కులో పాఠశాల మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 22 మంది విద్యార్థులు 12వ తరగతి పరీక్షలు రాయగా, 11 మంది 75 శాతంపైగా మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచనవల్లి అభినందించారు.

ప్రభుత్వ స్థలంలో జీహెచ్‌ఎంసీ అనుమతులు

- ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ శాఖ నోటీసులు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11 లోని ఇంటికి నోటీసులు అంటించిన దృశ్యం

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని మిథిలానగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకుని ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేసిన వ్యవహారంపై రెవెన్యూ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. వేరే స్థలానికి చెందిన డాక్యుమెంట్లను చూపి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలకు పాల్పడ్డారంటూ స్థల యజమానులు గున్నా జైదీప్‌రెడ్డి, గున్నా సందీప్‌రెడ్డి తదితరులకు మంగళవారం సెక్షన్-7 ఆఫ్ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ కింద షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. శివరాజ్ ఠాకూర్ అనే బిల్డర్ పేరుతో జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకున్న ప్రాంతం రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 403లోని టీఎస్-నంబర్ 2, వార్డు-11, బ్లాక్-ఎస్‌లోకి వస్తుందని, టీఎస్‌ఎల్‌ఆర్ ప్రకారం ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదేనని ఇప్పటికే గుర్తించిన షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్థలంలో ఉన్న 700 గజాల విస్తీర్ణంలోని భవనంతో పాటు నాలా వైపు ఉన్న 250 గజాల స్థలం మొత్తం ప్రభుత్వానిదేనని నిర్ధారించి నోటీసులు జారీ చేశారు. టీఎస్ నంబర్ 29, బ్లాక్-ఓ, వార్డు-11లో ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించి జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి తీసుకున్నారని, అక్కడ కాకుండా ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలో ఉన్నందున వారం రోజుల్లోగా ఆక్రమణలను ఎందుకు తొలగించరాదో చెప్పాలని నోటీసులో ప్రశ్నించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

బంజారాహిల్స్: మద్యం మత్తులో అదుపు తప్పిన వేగంతో దూసుకెళ్తూ వేగాన్ని కంట్రోల్ చేయలేక ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టిన డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఎస్సార్‌నగర్‌లో నివసించే రామరాజు సోమవారం రాత్రి టాటా వింగర్ ట్యాక్సీలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లోని జీవీకేవన్ ఎదురుగా హయత్ ప్లేస్ హోటల్ వైపు నుంచి వేగంగా దూసుకెళ్తుండగా కారు అదుపు తప్పి ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారకుడైన రామరాజుకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా మద్యం మత్తులో కారు నడుపుతున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. దీంతో అతడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలంటూ ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీ వద్ద ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల క్రితం ఆ ప్రాంతంలో పర్యటించి ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని వేరే నియోజకవర్గాలకు ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే వైఖరి చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఫిలింనగర్‌లో జూనియర్ కాలేజీ లేదా ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలం ఇవ్వాలే తప్ప ఆర్టీఏ ఆఫీస్‌కు ఇస్తే ఊరుకునేది లేదని హెచ్చరించిన విషయం తెలిసిందే.. అయితే ఇదే అంశంపై ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి మాట్లాడారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వ భూములను ఉపయోగించేలా తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత జేజోల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ఏడో నిజాం కృషి ఎనలేనిది



నివాళులర్పిస్తున్న హైదర్‌అలీ తదితరులు

హిమాయత్‌నగర్: ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నగర అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని నిజాంస్ విత్ ఖానాజాదన్ అసోసియేషన్ అధ్యక్షుడు హైదర్ అలీ తెలిపారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం కింగ్ కోఠిలోని జోడి మజీద్‌లోని అలీఖాన్ సమాధి వద్ద చాదర్ సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నవాబ్ యూసుఫ్, అన్వర్ అలీ, మహ్మద్ హద్రామి, అజ్జు బహ్రాయిన్, ఖలాద్ బఫానా, బిన్సామ్లాన్, మహ్మద్ అత్తాస్, నాదర్ అలీ షా, హాఫీజ్ అజ్మల్ హుస్సేన్, మునీర్ అస్లాం అలీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ చర్మ వైద్యుల పట్ల జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ రజిత దామిషెట్టి

పంజగుట్ట: చర్మవ్యాధులను నయం చేస్తాం, జుట్టు సమస్యలకు పరిష్కారం చూపుతాం అంటూ అర్హత లేని వారు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తుండటమే కాకుండా, సోషల్ మీడియాలో సలహాలు, సూచనలు, చిట్కాలు ఇస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనెరియోలజిస్ట్, లెప్రాలజిస్ట్ యాంటీ క్వాకరీ, లీగల్, ఎథిక్స్ కమిటీ జాతీయ చైర్మన్ రజిత దామిషెట్టి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం డాక్టర్ పుట్టా శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. చర్మవ్యాధులు, జుట్టు సమస్యలు ఉండే ఆ వ్యాధిపై పూర్తిగా అవగాహన ఉండే వైద్య నిపుణులను సంప్రదించాలని, వారి అర్హత, రిజిస్ట్రేషన్ నంబర్, స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయ్యారా లేదా తెలుసుకుని వెళ్లాలని తెలిపారు. ఇటీవల చాలామంది చర్మవ్యాధుల సమస్యలకు పరిష్కారం చూపుతాం అంటూ బోర్డులు పెట్టుకుని వైద్యం చేస్తున్నారని వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సుమారు 80 వరకు నకిలీ ఆస్పత్రులను గుర్తించామని, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు, డీఎంహెచ్‌ఓ, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిపై ఫిర్యాదు చేసినందుకు సోషల్ మీడియాలో తనను ట్రోలింగ్ చేస్తున్నారని ఆమె తెలిపారు. ఆమెకు మద్దతుగా వైద్యులు నల్లబ్యాడ్జీలతో సమావేశానికి హాజరయ్యారు. డాక్టర్లు హరితరెడ్డి, జనార్దన్, ప్రీతి శుక్ల, వేణు కుమారి, విమల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాడి వలలో చార్టడ్ అకౌంటెంట్

బంజారాహిల్స్: వదిన డీపీతో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి వచ్చిన సందేశాన్ని నమ్మిన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ రూ.75 వేలు బదిలీ చేసి మోసపోయాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-5లోని శీతల్ ఎన్‌క్లేవ్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ రాయప్రోలు వెంకట రమేష్ నివాసం ఉంటున్నాడు. ఈ నెల 3వ తేదీన ఉదయం తన వదిన డీపీతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. డీపీ ఆధారంగా అమెరికాలో ఉండే తన వదినగానే భావించి ఆ వాట్సప్ మెసేజ్‌కు స్పందించాడు. యూపీఐ ద్వారా రూ.50 వేలు బదిలీ చేశాడు. మూడు గంటల తర్వాత మరో రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాల్సిందిగా అభ్యర్థన రావడంతో పంపించాడు. తన వదిన పేరిట ఎవరో ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డారని గ్రహించాడు. న్యాయం చేయాల్సిందిగా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజీఎం స్కూల్ విద్యార్థుల హవా



తనిష్క వినోద్ అన్ష్ విశ్వకర్మ

వెంగళరావునగర్: సీబీఎస్‌ఈ ఫలితాల్లో యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఇదే స్కూల్ విద్యార్థిని జి.తనిష్క వినోద్‌కు 94 శాతం మార్కులు రాగా, అన్ష విశ్వకర్మకు 91 శాతం మార్కులు వచ్చాయి. విద్యార్థులకు పాఠశాలలో మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంజీఎం ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఎం.ఎం.నాయుడు విద్యార్థులను అభినందించారు.

నగరంలో నేడు

- మాదాపూర్ హైటెక్స్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ పోటీల వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

శంషాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉగ్రవాదుల కదలికలు, అరెస్ట్ వంటి సమాచారంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు ఫేక్ అని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టు భద్రతలో భాగంగా సాధారణంగా జరిగే మాక్‌డ్రిల్ దృశ్యాలతో ఇలాంటి వీడియోలను వైరల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విమానాశ్రయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని విభాగాలు సంతృప్తికరంగా పనిచేస్తున్నాయని, ప్రయాణికులు దీనిని గమనించాలని కోరారు.

'ఆల్ ది బెస్ట్' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మోతీనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లో విశేషమైన సేవలు అందించినవారికి, ప్రతిభ చూపిన వారికి తెలంగాణ రత్న, తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించనున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాలు, మారుమూల పల్లెలు, పట్టణాల్లోని మట్టిలో మాణిక్యాల్లాగా దాగి ఉన్న కవులు, రచయితలు, సంగీత, నృత్య, రంగస్థల కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, క్రీడ, యోగ గురువులు, కార్మికులు, క్రీడాకారులను గుర్తించి జూన్ ఒకటో తేదీన పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికిగానుపై ఆయా రంగాలవారు తమ సేవలను, ప్రతిభను తెలియజేస్తూ సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతోపాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జత చేసి ఈ నెల 25 తేదీ లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి, డోర్ నెం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు తిరుమలగిరి, సికింద్రాబాద్ -15కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

'ప్రజావాణి'లో 287 దరఖాస్తులు



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

లక్డీకాపూల్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 287 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 94, విద్యుత్ 22, రెవెన్యూ 61, మున్సిపల్ 18, ప్రవాసి ప్రజావాణికి 02, ఇందిరమ్మ ఇండ్ల కోసం 50 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 40 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

బిల్డింగ్ బైలాస్‌పై మళ్లీ మెలిక!

- అభ్యంతరాలు వ్యక్తం చేసిన రక్షణ శాఖ పీడీ
- మార్పులపై కసరత్తు చేస్తున్న బోర్డు అధికారులు
- 90 ఏళ్ల బైలాస్ ఆధారంగానే నిర్మాణాలు
- 2003 నుంచీ మార్పుల కోసం ప్రయత్నాలు
- రక్షణ శాఖ కొర్రీలతో ఆలస్యమవుతున్న వైనం



సమావేశమైన కంటోన్మెంట్ బోర్డు సభ్యులు (ఫైల్)

కంటోన్మెంట్: రక్షణ శాఖ కొర్రీ.. కంటోన్మెంట్‌వాసుల వర్రీ.. 90 ఏళ్ల నాటి బైలాస్.. మార్పులు, చేర్పులు లేక స్థానికులకు బిగ్‌లాస్.. అభ్యంతరాలు చెబుతుండటంతో నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి.. ఇదీ కంటోన్మెంట్‌లో బిల్డింగ్ బైలాస్ వ్యవహారం.. సగటు కంటోన్మెంట్‌వాసుల చిరకాల కోరిక అయిన 'నూతన బిల్డింగ్ బైలాస్'వ్యవహారం అంతులేని కథలా సాగుతోంది. 90 ఏళ్ల నాటి బైలాస్ ఆధారంగానే నేటికీ భవన నిర్మాణాలు కొనసాగించాల్సి రావడంతో నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీకి భిన్నంగా ఇక్కడ ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బైలాస్‌లో మార్పులు చేయాలంటూ ఏళ్ల తరబడి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు. 2008, 2010, 2013, 2017లో రూపొందించిన బిల్డింగ్ బైలాస్‌ను రక్షణ శాఖ పెండింగ్‌లో పెట్టింది. తాజాగా రక్షణ మంత్రిత్వ శాఖ నుంచే ప్రతిపాదనలు రావడంతో కంటోన్మెంట్ వాసుల్లో ఆశలు చిగురించాయి. గత నెలలో జరిగిన బోర్డు సమావేశంలో డ్రాఫ్ట్ బిల్డింగ్ బైలాస్‌కు ఆమోదం లభించింది. అయితే దానికి ఉన్నతాధికారులు కూడా ఓకే చెప్పాల్సి ఉంది. తాజాగా పుణేలోని రక్షణ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టరేట్ పలు అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో బిల్డింగ్ బైలాస్ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది.

బ్రిటీష్ చట్టమే..

బ్రిటీష్ హయాంలో కంటోన్మెంట్‌లో ఆర్మీ అవసరాలకే అధిక ప్రాధాన్యమిస్తూ, సామాన్యుల నివాసాలపై పెద్ద ఎత్తున ఆంక్షలు విధించారు. 1935లో రూపొందించిన బిల్డింగ్ బైలాస్‌కు లోబడే నేటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కాలక్రమేణా కంటోన్మెంట్‌లలో జనాభా పెరుగుతున్నప్పటికీ, నిబంధనల్లో మాత్రం పెద్దగా మార్పులు చేయలేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నిర్ణీత ప్లాటులో ఒకటి కంటే ఎక్కువ నివాసాలు నిర్మించుకునే అవకాశం లేదు. అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం అసలే కుదరదు. 133 గజాలకు లోబడి ఉండే ప్లాట్‌లలో నిర్మాణ అనుమతులు ఇవ్వరు. ఇలాంటి పలు ఆంక్షల కారణంగా, పలువురు అక్రమ నిర్మాణాలు చేపడతూ వచ్చారు. ప్రస్తుతం కంటోన్మెంట్‌లో 90 శాతానికి పైగా నిర్మాణాలు నిబంధనలు ఉల్లంఘించి నిర్మించినవే అంటే అతిశయోక్తి లేదు. ప్రస్తుత నిబంధనలను బట్టి ఆయా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించే వెసులుబాటు కూడా లేదు. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ నిబంధనల్లో మార్పులను సూచిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు పలు మార్పులు రక్షణ శాఖకు విన్నపాలు పంపారు. 2008 నుంచి నాలుగుసార్లు వేర్వేరుగా బిల్డింగ్ బైలాస్ రూపొందించి పంపినప్పటికీ, కేంద్రం నుంచి సానుకూలం నిర్ణయం రాలేదు.

రక్షణ శాఖే కోరినప్పటికీ...

కంటోన్మెంట్ బిల్డింగ్ బైలాస్‌లో మార్పులు చేస్తూ ప్రతిపాదనలు పంపాలని కేంద్ర రక్షణ శాఖ గతేడాది లేఖలు పంపింది. దీంతో జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్, జేఎన్‌టీయూ, హెచ్‌ఎండీఏ, సీఎస్‌ఐటీలకు చెందిన 10 మంది ఉన్నతాధికారులతో ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూపొందించిన 'సికింద్రాబాద్ కంటోన్మెంట్ బిల్డింగ్ బైలాస్ -2024'ను గత నెలలో నిర్వహించిన బోర్డు సమావేశంలో ఆమోదించారు. అయితే ఈ బైలాస్‌పై రక్షణ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ (పీడీ) పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో తాజాగా బోర్డు ఉన్నతాధికారులు పీడీని కలిసి వివరణ ఇచ్చారు. అయినప్పటికీ పీడీ సంతృప్తి చెందక పోవడంతో ఆయన సూచించిన మార్పులు, చేర్పులు ప్రక్రియపై మళ్లీ కసరత్తు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నూతన బిల్డింగ్ బైలాస్ వివిధ దశలు దాటి రక్షణ శాఖ ఆమోదం పొందేందుకు కనీసం ఏడాది పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రజాధనం వృథాకు 'జమిలి' అడ్డుకట్ట: ఈటల



వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

లింగోజిగూడ: వన్ నేషన్ వన్ ఎలక్షన్ ద్వారా ప్రజాధనం వృథాను తగ్గిస్తుందని, అభివృద్ధి పనులు సజావుగా జరిగే విధంగా చూస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం రాత్రి కర్మన్‌ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై రంగారెడ్డి జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన సామర్థ్యం మెరుగుపడుతుందని అన్నారు. తరచూ ఎన్నికలు జరగడం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని, పరిపాలనలో అంతరాయాలు కలిగిస్తాయని, అందుకే జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఇలాంటి సమస్యలు ఉండవని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, రంగా నరసింహ గుప్తా, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, క్లాం రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి పుష్కరాల సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు నగరంలోని జేబీఎస్, ఉప్పల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తాయి. కనీసం 40 మంది ఉంటే నేరుగా ప్రయాణికుల ఇంటి వద్ద నుంచే బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బస్సుల బుకింగ్, ఇతర వివరాల కోసం ప్రయాణికులు ఫోన్ : 967667 1533, 99592 26154 నెంబర్‌లకు సంప్రదించవచ్చు.

ఐఐసీటీ సీనియర్ సైంటిస్టుకు ఐఎన్ఎస్ఏ అవార్డు



డాక్టర్ సూర్యప్రకాష్ సింగ్

లాలాపేట: సీఎస్ఐఆర్-ఐఐసీటీకి చెందిన సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ సూర్యప్రకాష్ సింగ్‌ను ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ(ఐఎన్ఎస్ఏ) అవార్డు వరించింది. భారతదేశంలో అత్యుత్తమ యువ శాస్త్రవేత్తల కృషిని గుర్తిస్తూ అకాడమీ ఈ అవార్డులను ప్రతి ఏటా అందజేస్తోంది. ప్రధానంగా హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసీటీ నుంచి ఈ గౌరవాన్ని అందుకున్న మొదటి పరిశోధకుడిగా డాక్టర్ సూర్య ప్రకాష్ సింగ్ నిలిచారు. పునరుత్పాదక శక్తిలో సవాళ్లను పరిష్కరించడానికి ఆయన పరిశోధనలు దోహదపడతాయి. ఈయన తయారు చేసిన 245కుపైగా పరిశోధనాపత్రాలు అగ్రశ్రేణి జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధన రచనలకుగాను 2024లో సీఆర్ఎస్ఐ కాంస్య పతకం, 2012లో నాసి యంగ్ సైంటిస్టు ప్లాటినం జూబ్లీ అవార్డు, ఆవరా యంగ్ సైంటిస్టు అవార్డు వంటి పలు అవార్డులు, ప్రసంశలు అందుకున్నారు.

15లోగా 'యువ వికాసం' దరఖాస్తుల పరిశీలన



సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకం కింద నమోదైన దరఖాస్తులను ఈ నెల 15 లోగా పూర్తిస్థాయిలో పరిశీలించి సంబంధిత బ్యాంకులకు పంపాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత మండల కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్ల అధికారులు, ఎల్‌డీఎం, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని సంబంధిత పత్రాలను నేటికీ సమర్పించని లబ్ధిదారులు తమ వార్డు ఆఫీసుల్లో సత్వరమే అందజేయాలని సూచించారు. ఇప్పటి వరకు 1,28,763 దరఖాస్తులు రాగా, ఇందులో 1,11,536 దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. సుమారు 40,994 దరఖాస్తుల వివరాలను సంబంధిత బ్యాంకుల పరిశీలన నిమిత్తం పంపినట్లు చెప్పారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

తెలుగు రాష్ట్రాల సీఎంలను డిమాండ్ చేసిన ఆర్.కృష్ణయ్య



హిమాయత్‌నగర్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఎంలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టుల భర్తీలో రెండు ప్రభుత్వాలు అలసత్వాన్ని వీడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ-1998లో మిగిలిపోయిన అభ్యర్థులకు ఎంటీఎస్ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరిగేవిధంగా 1,482 మంది రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. గ్రూప్-1 సర్వీస్ కింద గత 10 ఏళ్లుగా, గ్రూప్-2 సర్వీస్ కింద 6 ఏళ్లుగా నోటిఫికేషన్ వేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో 98 డీఎస్సీ మిగిలిపోయిన అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఏపీ ఓబీసీ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, సంజీవ్, భైరవకోన శ్రీనివాస్, బాబయ్య, రమేశ్, లలిత, చిన్ని కృష్ణ, రాజశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతినేలా సీఎం వ్యాఖ్యలు



తెలంగాణ ఎంప్లాయీస్, పెన్షనర్స్ కో ఆర్డినేషన్ కమిటీ

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రజలకు, ఉద్యోగులకు మధ్య వైషమ్యాలు తెచ్చేలా, ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉన్నాయని తెలంగాణ ఎంప్లాయీస్, పెన్షనర్స్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక విషయాలపై బహిరంగంగా కాకుండా సంఘం నాయకులను గదిలోకి పిలిచి చర్చిస్తే బాగుండేదని పేర్కొన్నారు. 'నన్ను కోసుకుతిన్నా ఒక్క రూపాయి కూడా పుట్టదు'అని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, ఇలా ఆర్థిక విషయాలు బయటకు చెబితే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చిన ఆదాయం మొత్తం ఉద్యోగులే తింటున్నారన్నట్లుగా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. ఏ సంక్షేమ పథకం ఆపి వేతనాలు పెంచాలంటున్న ముఖ్యమంత్రి ఏ పథకం ఆపి మూసీ ప్రాజెక్టు కడతామని, అందాల పోటీలు నిర్వహిస్తున్నామని, స్మార్ట్ సిటీలు కడతామని అంటున్నారో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీలు దేవీప్రసాద్, సుధాకర్‌రెడ్డి, మాజీ టీజీపీఎస్సీ సభ్యులు విఠల్, నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీ ఆల్-మేవా జిల్లా ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఆల్ మేవా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహీద్ షాహ్ ఖాద్రి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ అజ్మతుల్ల(హైదరాబాద్), ముజీబ్ పటేల్ (కరీంనగర్), ముహమ్మద్ అబ్దుల్ రషీద్ (మహబూబ్‌నగర్), అసిం బిన్ అబ్దుల్లా(మెదక్), వహీద్ షాహ్ (రంగారెడ్డి), ముహమ్మద్ జహంగీర్(నల్లగొండ), సయ్యద్ అజమ్ హుస్సేన్ (నిజామాబాద్), ముహమ్మద్ ముసవిర్ల (ఆదిలాబాద్)లను నియామించినట్లు పేర్కొన్నారు.

ప్రతీ వాహనదారు మొక్కను పెంచాలి: పొన్నం

- నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు కృషి
- బజాజ్ గోగో ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేసిన మంత్రి ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రతీ వాహన యజమాని మొక్కలు పెంచాలని, కొత్త వాహనం కొనుగోలు సమయంలో సదరు డీలర్/ కంపెనీ నుంచి ప్రతీ వాహనదారుకూ తప్పనిసరిగా ఒక మొక్కను అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రముఖ మోటారు వాహనాల సంస్థ బజాజ్ ఆటోకి చెందిన బజాజ్ గోగో త్రి చక్ర వాహనాలను ఆయన మంగళవారం విడుదల చేశారు. సోమాజిగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మన నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు దీనిలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు మినహాయింపు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, పెట్రోల్, డీజిల్ వాహనాలను 'ఇవి'లుగా మార్చే రెట్రో ఫిటింగ్‌ను, వాహనాల మార్పిడిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బజాజ్ ఆటో లిమిటెడ్‌కు చెందిన సమర్దీప్ సుబంధ్ మాట్లాడుతూ తమ ఎలక్ట్రిక్ వాహనాల ప్రత్యేకతలను వివరించారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి: హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ 'నన్ను కోసినా ఒక రూపాయి కూడా మీకు వేతనం పెంచలేని పరిస్థితి వచ్చింది'అని చెప్పటం వారి నిస్సహాయత స్థితిని వ్యక్తం చేస్తుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ప్రజలకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా ఉన్న ఆయనపైనే ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి అన్ని రాజకీయపార్టీలు అలవికాని హామీలు ఇస్తున్నాయని విమర్శించారు. ఫార్మాసిటీ, ఇథనాల్ కంపెనీలు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, అత్యంత కాలుష్యకర పరిశ్రమలను తెలంగాణలో ప్రోత్సహించవద్దని, 2017 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకూడదని, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాల మధ్యలో భూసేకరణ చేయాలనుకోవడం సరైనది కాదని, వికారాబాద్ జిల్లా దామగుండం అడవిని నావి రాడర్ స్టేషన్ కోసం ఇవ్వడం సరైనదికాదని సమావేశంలో తీర్మానించారు.కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు, పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో-కన్వీనర్లు కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, రవిచంద్ర, మైస శ్రీనివాస్, డాక్టర్ వనమాల, మీరా సంఘమిత్ర, పి.శంకర్, సరస్వతి కవుల, బండారు లక్ష్మయ్య, విజయకుమార్, ఉషాసీతాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'ఫీవర్'లో పిల్లల వార్డు మూసేయలేదు

– ఫీవర్ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి



నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలోని పిల్లల వార్డును మూసి వేశారంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ ఎ.జయలక్ష్మి తెలిపారు. 'ఆసుపత్రి ఇన్ పేషెంట్స్ బిల్డింగ్‌లోని రెండో అంతస్తులో పిల్లల వార్డు ఉంది. ప్రస్తుతం ఇన్ పేషెంట్ల సంఖ్య చాలా తక్కువ, పైగా ఎండా కాలం కావడంతో అక్కడ వేడి ఎక్కువగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఆ వార్డును తాత్కాలికంగా మూడో అంతస్తులోకి మార్చాం. అన్ని వార్డుల్లో కలిసి ఇన్ పేషంట్లు 50 వరకు ఉన్నారు. ఎండల తీవ్రత తగ్గి, సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య పెరిగితే ఎప్పటి లాగే నాలుగో వార్డు(చిల్డ్రన్స్ వార్డు) అందుబాటులో ఉంటుంది'అని పేర్కొన్నారు. పిల్లల వైద్యురాలు గీత వృత్తిపరమైన పరీక్షలు ఉన్న కారణంగా కొన్నిరోజులు సెలవుల్లో ఉన్నారు. త్వరలోనే వస్తారు. అయినప్పటికీ ప్రస్తుతం వార్డులో ఉన్న పిల్లలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూసుకుంటున్నాం. ఎవరికైనా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే నిలోఫర్ ఆసుపత్రికి పంపిస్తున్నాం'అని వివరించారు.

అటానమస్ హోదా పొందిన అవంతి ఇన్‌స్టిట్యూట్



2025-26 నుంచి 2035-36 విద్యా సంవత్సరం వరకు న్యాక్ ఏ గ్రేడ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అబ్దుల్లాపూర్‌మెట్, గుంతపల్లి కేంద్రంగా కొనసాగుతున్న అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ 2025-26 నుంచి 2035-36 విద్యా సంవత్సరం వరకు ఎన్ఏఏసీ(న్యాక్) ఏ గ్రేడ్, అటానమస్ హోదాతో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా అవంతి గ్రూప్ చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంస్థ యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, సిబ్బంది కృషిని అభినందించారు. స్వయంప్రతిపత్తి హోదా పొందడం ద్వారా విద్యారంగంతోపాటు నియామకాల్లో అభివృద్ధి ఉంటుందని, ఇది విద్యార్థుల భవిష్యత్‌కు ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు.

పీవీఆర్ థియేటర్‌లో మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలి




పీవీఆర్ వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

పంజగుట్ట: పీవీఆర్ సినిమా థియేటర్‌లో పని చేసే మహిళా కార్మికులపై వేధింపులు వెంటనే ఆపాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పంజగుట్ట కూడలిలోనిలోని పీవీఆర్ ఐనాక్స్ థియేటర్ ముందు తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు నిరసనకు అనుమతి లేదంటూ వారిని అదుపులోకి తీసుకుని ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మారన్న, సెక్రటరీ పి.పుల్లారావు మాట్లాడుతూ వాష్ రూమ్‌కు వెళ్లాలన్నా ముగ్గురు ఇన్‌చార్జీల అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఉందని, వారి సమస్యలు హెచ్‌ఆర్ దృష్టికి తీసుకువెళ్లాలంటే సమయం ఇవ్వడంలేదని పేర్కొన్నారు. వేధింపులకు గురిచేసిన వారిని ఉద్యోగంలోనే ఉంచుకుని, బాధితులనే ఉద్యోగం నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వేధింపులకు పాల్పడుతున్న ఉద్యోగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్, రామస్వామి, సుధాకర్, రాజు, భరత్, చలం తదితరులు ఉన్నారు.

ప్రజావాణిని ఆశ్రయించిన దుబాయి బాధితుడి తల్లిదండ్రులు

జగిత్యాల జిల్లావాసి సమస్య పరిష్కారానికి చిన్నారెడ్డి చొరవ



'ప్రవాసీ ప్రజావాణి' లో వినతి పత్రం సమర్పించారు.

లక్డీకాపూల్: దుబాయిలో బ్యాంకు ఖాతా కేసులో జైలు పాలైన జగిత్యాల జిల్లావాసి సీఎం ప్రజావాణి ఆశ్రయం కోరారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశంలోని దుబాయికి పెగడపెల్లి మండలం ఎల్లాపూర్‌కు చెందిన మల్లారపు మధుకర్ బతుకుదెరువు కోసం వెళ్లాడు. అక్కడ అతని బ్యాంకు ఖాతాను ఇతరులు దుర్వినియోగం చేశారు. దీంతో అజ్మాన్‌లోని కోర్టు అతడి ప్రయాణంపై నిషేధం విధించింది. దిక్కుతోచని మధుకర్ తల్లిదండ్రులు మల్లవ్వ, అంజయ్య మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' లో వినతి పత్రం సమర్పించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచన మేరకు ప్రజావాణికి వచ్చిన వాళ్లకు ఎన్నారై అడ్వయిజరీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకరించారు. సీఎంఓ ద్వారా ప్రత్యేక శ్రద్ధతో సమస్య పరిష్కారానికి పరిష్కరిస్తామని ప్రజావాణి ఇన్‌చార్జి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి మధుకర్ తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశంలో జైలు పాలైన మధుకర్‌కు దౌత్య సహాయంతోపాటు న్యాయవాదిని సమకూర్చి ఉచిత న్యాయ సహాయం అందించి స్వదేశానికి తిరిగి తెప్పించాలని మధుకర్ తల్లిదండ్రులు అభ్యర్థించారు. ఢిల్లీలోని భారత విదేశాంగ శాఖ, దుబాయిలోని భారత రాయబార కార్యాలయం సమన్వయంతో తన కుమారుడిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి సీఎంఓ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 14, మే, 2025

నగరంలో అందాల సందడి మొదలైంది. ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో గత వారం రోజులుగా నగరంలో అంతర్జాతీయ స్థాయి నిపుణులు, ఫ్యాషన్ ఔత్సాహికులతో పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే పలు దేశాలకు చెందిన ప్రపంచ సుందరులు భాగ్యనగరంలోని, చుట్టుపక్కల ప్రాంతాలను చుట్టేస్తున్నారు. మరోవైపు అందాల కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు ఆయా దేశాల ప్రతినిధులు, కంటెస్టెంట్లు ఇప్పటికే రిహార్సిల్స్ ప్రారంభించారు. విజయం దిశగా అడుగులు వేసేందుకు తమ తమ డిజైనర్లు, ఇతర ఫ్యాషన్ నిపుణులతో బిజీబిజీగా గడుపుతున్నారు. కాగా ఇదే క్రమంలో నగరానికి చెందిన డిజైనర్లు మేము సైతం అంటున్నారు. పోటీల్లో మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా గెలుపు కోసం ఫ్యాషన్ నిపుణులు శ్రమిస్తున్నారు. ఇందులో నగరానికి చెందిన వారు ఉండడం విశేషం. - సాక్షి, సిటీబ్యూరో



వస్త్రం.. అందానికి అస్త్రం..

మిస్ వరల్డ్ టైటిల్ పోరులో నందిని గుప్తాకు తోడుగా



- 'మిస్ ఇండియా'ను తీర్చిదిద్దుతున్న సౌందర్య శిల్పులు
- ప్రారంభోత్సవ దుస్తుల ద్వారా ఆకట్టుకున్న నగర డిజైనర్
- ఆభరణాలను అందించింది కూడా మన నగరమే
- తమ వంతు పాత్ర పోషిస్తున్న మేకప్, హెయిర్‌స్టైలిస్ట్స్



మిస్ వరల్డ్ వేదికపై భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ నందిని గుప్తా ధరించిన ప్రారంభోత్సవ దుస్తులు ఆహూతులను అమితంగా ఆకట్టుకున్నాయి. వీటిని డిజైన్ చేసింది నగరానికి చెందిన ప్రముఖ డిజైనర్ గౌరంగ్ షా కావడం గమనార్హం. ఈ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తా, ఉత్సవ వేదికపై మన జాతీయ వస్త్రధారణను, అదే విధంగా ఒక అపూర్వ వారసత్వాన్ని, కళను, శిల్పాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. భారత జానపద వస్త్ర సంపదకు చిహ్నంలా రూపుదిద్దుకున్న ఈ వైవిధ్యభరిత డిజైన్లలో ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన జాందాని చేనేతల అందం ప్రస్ఫుటమవుతుంది. దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతోపాటు బాంగ్డీ మోర్ మోటీఫ్ నాట్యం చేస్తూ మెరిసే నాలుగు నెమళ్లు. ఈ మోటీఫ్ కేవలం అలంకారమే కాదు, భారతదేశ హస్తకళా సంపదకు చిహ్నమని చాటి చెప్పాయి.



ఆభరణ 'భాగ్యమూ' మనదే..

ఈ దుస్తుల వైభవాన్ని మరింతగా పెంచింది నగరానికి చెందిన కిషన్ దాస్ జ్యువెలరీ బ్రాండ్. 1870 నుంచి ఆభరణాల రంగంలో ఉన్న ఈ సంస్థ అందిస్తున్న ఆభరణాలు ప్రత్యేక సందర్భాల్లో నందిని గుప్తాకి అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. చాంద్ సూరజ్ హారం, పెద్ద పావురాల ఆకృతులతో రూపొందించిన మరో హారం, బర్మా రూబీలు, బస్రా ముత్యాలు, అన్‌కట్ డైమండ్లతో మినుకు రాజవంశాల వైభవాన్ని ప్రతిబింబించే ఆభరణాలను ఆమె ధరిస్తున్నారు.

అపు'రూపం'.. కేశ సౌందర్యం..

మిస్ ఇండియా నందిని గుప్తా తన ప్రత్యేకమైన డ్రెస్‌లు, మేకప్, హెయిర్‌స్టైల్స్‌తో ఆకట్టుకోవడం వెనుక ఫెమినా మిస్ ఇండియా సంస్థ ఆమె కోసం ఎంపిక చేసిన నిపుణుల కృషి కనిపిస్తుంది. ఆమె మేకప్ డిజైన్ కోచ్‌గా ఆయేషా సేత్‌ను ఫెమినా నియమించినట్లు తెలుస్తోంది. నందినికి ఆమె ప్రత్యేక శిక్షణను అందించి, ఆమె అందానికి వన్నెలు అద్దుతున్నారు. ఈ శిక్షణ, నందినికి వివిధ సందర్భాలకు అనుగుణంగా మేకప్ శైలిని అభ్యసించేందుకు సహాయపడుతోంది. అదే విధంగా నందిని గుప్తా హెయిర్‌స్టైలింగ్ బాధ్యతను సుమితా ధిల్లాన్ పర్యవేక్షిస్తున్నట్టు చెబుతున్నారు. నందిని ధరిస్తున్న ప్రతి డ్రెస్‌కు అనుగుణంగా ఆమె హెయిర్‌స్టైల్‌ను మార్పు చేర్పులు చేస్తూ ఆకట్టుకునేలా రూపొందిస్తూ తన వంతుగా ఆమెని మెరిపిస్తున్నారు.. పోటీల ప్రారంభోత్సవంలో నేషనల్ కాస్ట్యూమ్‌గా గౌరంగ్ షా డిజైన్ చేసిన జామ్‌దాని లెహంగాను నందిని ధరించగా, ఆమెకు వస్త్రధారణ, స్టైల్స్‌లో సేవలు అందిస్తున్న ఇతర డిజైనర్లలో అమృత్‌రాజ్ బోరా, సామంత్ చౌహాన్, నికితా మహిసాల్కర్‌లు ఉన్నారని సమాచారం.





దీర్ఘకాల కృషి ఫలితం..

మిస్ వరల్డ్ పోటీలో దుస్తుల కోసం నందిని బృందం నన్ను సంప్రదించినప్పుడు, నాలో వెంటనే ఈ ఆర్ట్ పీస్ కళ్లలో మెదిలింది. కాలాతీత భారతీయ హస్తకళను ప్రతిబింబిస్తూ ఇది అంతర్జాతీయ వేదికకు సరిగ్గా సరిపోతుందని భావించాను. ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర నుంచి 8 మంది పేరొందిన కళాకారులు అంకితభావంతో కూడిన బృందం ఈ కళాత్మక డిజైన్లకు జీవం పోయడానికి సహకరించింది. నెలల తరబడి కృషి ఫలితంగా ఈ కళాత్మక మాస్టర్ పీస్ ఆవిర్భవించింది.
- గౌరంగ్ షా, నగర డిజైనర్



వికసించిన మే పుష్పం

లాలాపేట : తార్నాక డివిజన్ లాలాపేటలో సాంసన్ నివాసంలో మే ఫ్లవర్స్ వికసించాయి. దీంతో చుట్టుపక్కల వారికి ఈ మే పుష్పం కనువిందు చేస్తోంది. ఈ సందర్భంగా సాంసన్ మాట్లాడుతూ మే మాసంలో ఒక్కసారి మాత్రమే ఈ పువ్వులు పూస్తాయని, అందుకే వీటిని మే ఫ్లవర్స్‌గా పేర్కొంటున్నారని అన్నారు. ఐదేళ్ల క్రితం ఈ మొక్కలను బెంగళూరు నుంచి తీసుకొన్నట్లు ఆయన వివరించారు. ప్రతి సంవత్సరం మే నెలలో పూయడం దీని ప్రత్యేకత. మంగళవారం రోజు మూడు మొక్కలకు మూడు పువ్వులు పూసి కనకాంబరం పూల రంగులో ఇంటి ఆవరణలో ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క. వీటిని బ్లడ్ లిల్లీ, బాల్ లిల్లీ, ఫైర్ బాల్ లిల్లీ అని కూడా పిలుస్తారు.



ముగిసిన హైసియా టోర్నీ

- హైసియా ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్ ఓవరాల్ చాంపియన్ ఇన్ఫోసిస్
- 15 క్రీడల్లో 2 వేల మందికి పైగా ఉద్యోగుల పోటీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో నిర్వహించిన నగరంలోని అతిపెద్ద ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్ 2024–25లో ఇన్ఫోసిస్ లిమిటెడ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో టీసీఎస్ రన్నరప్‌గా నిలవగా, సింక్రోనీ మూడో స్థానం సాధించింది. గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో భారత బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులు అందజేశారు. ఇన్ఫోసిస్ గచ్చిబౌలి వీపీ, డీసీ హెడ్ రఘు బొడ్డుపల్లి, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నందెల్ల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ.. క్రీడలు యువత, ఫిట్‌నెస్ ఉన్నవారికే పరిమితం కాకూడదని, అన్ని వయసుల వారూ పాల్గొనే సంబరంగా మారాలని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ఈ టోర్నమెంట్‌ను మరింత విస్తృతం చేసి, అందరినీ కలుపుకునేలా నిర్వహించాలని హైసియాను కోరారు. 2024 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 60 హైసియా సభ్య కంపెనీల నుంచి 2 వేల మందికి పైగా ఉద్యోగులు 15 క్రీడల్లో పోటీపడ్డారు. ఇన్ఫోసిస్ ఎస్‌టీపీ, ఎస్ఈజెడ్ క్యాంపస్‌లలో జరిగిన ఈ ఈవెంట్‌లో 270కి పైగా జట్లు పాల్గొని నగరంలోనే అతి పెద్ద క్రీడా వేడుకగా నిలిచింది. క్రికెట్‌లో అత్యధికంగా 42 జట్లు పోటీ పడ్డాయి. పురుషుల క్రికెట్‌లో రియల్‌పేజ్ విజేతగా నిలవగా, ఇన్ఫోసిస్ రన్నరప్, టీసీఎస్ తృతీయ స్థానాలు సాధించాయి.

బ్యూటీ విత్ ఫన్..

- ఆకట్టుకునేలా బుట్టబొమ్మ పాటకు స్టెప్పులు
- రీల్స్, ఫన్ యాక్టివిటీస్‌తో సందడి చేసిన తారలు
- విశ్రాంతి సమయాల్లోనూ వినోదం









సాక్షి, సిటీబ్యూరో: మిస్ వరల్డ్ –2025 పోటీల నేపథ్యంలో హైదరాబాద్ నగరం అందాల మగువల శోభను అలంకరించుకుంది. హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ వేదికగా వసతి పొందుతున్న ఈ సుందరాంగులు ఏ మాత్రం సమయం దొరికినా ఫన్ యాక్టివిటీస్‌తో సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వివిధ దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు తెలుగు సినీ ప్రేక్షకుల విశేష ఆదరణ పొందిన 'బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా.. నన్ను చుట్టూకుంటివే' అనే పాటకు స్టెప్పులేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆ పాటకు అనుగుణంగా మిస్ డెన్మార్క్, మిస్ చెక్ రిపబ్లిక్, మిస్ జెర్మనీ సుందరాంగులు ఒరిజినల్ స్టెప్పులేశారు. మరి కొందరు తారలు సోషల్ మీడియా యాప్స్ కోసం సెల్ఫీ మోడ్‌లో రీల్స్ చేస్తూ సందడి చేశారు. మిస్ వరల్డ్ పోటీలతో పాటు వినోదం కోసం చేస్తున్న ఈ రీల్స్, ఫొటో షూట్‌లను ఎప్పటికప్పుడు వారి ఇన్‌స్టా, ఎక్స్ ఇతర సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే మిస్ ఇండియా నందినీ గుప్తా అందమైన అధునాతన–సంప్రదాయ సమ్మిళిత దుస్తుల్లో హోటల్‌లోని స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో చేసిన క్యాట్ వాక్‌ను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనికి అభిమానుల నుంచి మంచి స్పందన లభించింది. అంతేకాకుండా బ్రెజిల్, బోత్స్వానా, ఘనా, ఎల్ సెల్వడోర్ వంటి దేశాలకు చెందిన మిస్ వరల్డ్ తారలు ఒకరినొకరు తమ మొబైల్స్‌లో ఫొటోలు తీస్తూ సందడి చేశారు.







రీ షెడ్యూల్..!

- వేసవి విహారాలపై యుద్ధ ప్రభావం
- రూటు మారుస్తున్న పలువురు ఔత్సాహికులు
- ట్రావెల్ ఏజన్సీలకు భారీగా నష్టాలు
- 50 శాతానికి పైగా పర్యటనలు రద్దు

నగర వాసుల విహారయాత్రలు వాయిదా

వేసవి సెలువుల్లో కుటుంబ సభ్యులతో సరదాగా పొగమంచు అందాలు, చల్లని వాతావరణాన్ని ఆస్వాదించాలని అనుకున్న నగర పర్యాటకులు అంతర్మథనంలో పడ్డారు. పహల్గాం ఉగ్రదాడి యావత్ దేశాన్ని కదిలించింది. తరువాత పరిణామాలు ఉద్రిక్తంగా మారాయి. దీంతో ఉత్తర భారత దేశంలోని పలు పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలంటే ఎలా ఉంటుందో అనే ఆందోళన నగరవాసుల్లో కనిపిస్తోంది. దీంతో చాలా మంది తమ పర్యటనలను రీ షెడ్యూల్ చేసుకుంటున్నారు. ఎక్కువ మంది పర్యాటకులు పర్యటనలను రద్దు చేసుకోడానికే మొగ్గుచూపుతున్నారని ట్రావెల్ ఏజన్సీలు స్పష్టం చేస్తున్నాయి. కొందరు మాత్రం వేరే ప్రాంతాలకు ప్లాన్ చేసుకుంటున్నారు. తాజాగా రెండు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించడం, పలువురు సెలబ్రిటీలు సైతం ఉగ్రదాడి జరిగిన ప్రాంతంలో పర్యటించడంతో పరిస్థితులు సద్దుమణిగాయనే అభిప్రాయానికి వస్తున్నారు. దీంతో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా వెళ్లి రావడానికి మరికొందరు మొగ్గుచూపుతున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో

భాగ్యనగరం నుంచి ఈ వేసవిలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన కశ్మీర్, రాజస్థాన్, చార్‌ధామ్, రిషీకేశ్, జమ్మూ, శ్రీనగర్, సిమ్లా, డల్ హౌసీ, కాత్రా వైష్ణోదేవి ఆలయం, శ్రీనగర్, గుల్మార్గ్, లేహ్, ముస్సోరీ తదితర ప్రాంతాలకు సుమారు పదివేల మందికిపైగా ముందస్తు బుకింగ్ చేసుకున్నట్లు పర్యాటక ఏజన్సీల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ చివరి వారంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో సుమారు 50 శాతం మంది తమ టూర్ ప్లాన్స్ రద్దుచేసుకుందామనే ఆలోచనకు వచ్చారు. ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉంటాయో అనే ఆందోళన నెలకొనడంతో ఎక్కువ మంది తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. మరోవైపు రైలు, విమాన సర్వీసులు రద్దు చేయడం, రవాణా సదుపాయాలు సైతం నిలిచిపోయాయి. ఫలితంగా అనేక మంది తమ గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి. దీంతో పర్యాటకులు సైతం తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ప్రస్తుతం పరిస్థితులు కొంత వరకూ శాంతించడంతో తిరిగి ప్రయాణాలు ప్రారంభమవుతున్నాయి.

పర్యటన వాయిదా వేసుకున్నాం..



కుటుంబంతో కలసి నాలుగు రోజుల టూర్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. మొన్నటి వరకూ పరిస్థితులు అంత అనుకూలంగా లేవు. దేశ సైనికుల పోరాటం ఫలించింది. తాజాగా పర్యటనకు కొంత మెరుగైన వాతావరణం కనిపిస్తోంది. ట్రావెల్ ప్రతినిధులతోనూ సంప్రదించాం. సానుకూలంగానే స్పందించారు. వెళ్లవచ్చని భావిస్తున్నాం.
- ప్రసాద్, ఉద్యోగి, హైదరాబాద్

ట్రావెల్ సంస్థలకు నష్టాలు..



ఉత్తర భారతంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ముందస్తుగా ప్లాన్ చేసుకున్న యాత్రికులకు ఉగ్రదాడి అనంతరం పర్యటనలను వాయిదా వేసుకోవడం, రద్దు చేసుకోడానికి మొగ్గుచూపుతున్నారు. మా సంస్థలోనే వెయ్యికి పైగా బుకింగ్స్ ఉండేవి. విమానాల రద్దుతో పర్యాటకులు తమ టూర్ ప్లాన్‌ను మార్చుకున్నారు. దీంతో ట్రావెల్ ఏజెన్సీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. గత 25 ఏళ్లుగా వేలాది మంది పర్యాటకులను పంపిస్తున్నా ఎన్నడూ ఈ స్థాయి ఒడిదుడుకులు చూడలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్తరభారత దేశం అంటే యాత్రికులు అంత సుముఖంగా లేరు. రెండు రోజుల క్రితం ప్రధాని ప్రజలకు భరోసా కల్పించడంతో పరిస్థితులు కొద్దివరకూ మెరుగుపడతాయని ఆశిస్తున్నాం. పూర్వ వైభవం రావడానికి కొంత సమయం పడుతుందని భావిస్తున్నాం.
- ఆర్‌వి రమణ, ఆర్‌వీ ట్రావెల్స్ ఛైర్మన్, హైదరాబాద్

విమానం రద్దయ్యింది..



శ్రీనగర్, కశ్మీర్ యాత్రకు ప్లాన్ చేసుకున్నాం. ఉగ్రదాడి, యుద్ధ వాతావరణం నేపథ్యంలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. మా పర్యటన ప్లాన్ రద్దు చేసుకున్నాం. ప్రస్తుతం శాంతియుత వాతావరణం కనిపిస్తోంది. నెలాఖరులోగా వెళ్లి రావడానికి ప్లాన్ చేసుకుంటున్నాం. భూతల స్వర్గమైన కశ్మీర్ ప్రాంతంలో ఉగ్ర దాడులు జరగడం బాధాకరం. పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. - సుమిత్ర దేవి, హైదరాబాద్



బాలాజీ గోవిందప్ప అరెస్ట్ సంగతి తేలుస్తాం

మీరేం చేస్తున్నారో స్పష్టంగా కనిపిస్తోంది..

ఈ వ్యవహారాన్ని మరింత మురికిగా మార్చొద్దు

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి 'సుప్రీం' ఘాటు వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: మద్యం కేసులో వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప అరెస్ట్ సంగతి తేలుస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో ఉండగానే ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు స్పందించింది. గోవిందప్ప అరెస్ట్ నేపథ్యంలో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకమవుతుందంటూ వాదన వినిపించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో మీరేం చేస్తున్నారో స్పష్టంగా కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ బాలాజీ గోవిందప్ప అరెస్ట్ అయ్యారని, అందువల్ల ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకమవుతుందని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని మరింత మురికిగా మార్చవద్దంటూ హితవు పలికింది. కాగా అగర్వాల్ వాదనను బాలాజీ గోవిందప్ప తరఫు న్యాయవాది సిద్ధార్థ దవే తీవ్రంగా వ్యతిరేకించారు. తమ వ్యాజ్యం నిరర్థకం కాదన్నారు. గోవిందప్ప అరెస్ట్ అక్రమమని నిరూపిస్తామన్నారు. గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని తెలిసి కూడా అరెస్ట్ చేశారన్నారు. దర్యాప్తు సంస్థ తీరును ఈ కోర్టు పరిగణలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ బాలాజీ గోవిందప్ప అరెస్ట్ సంగతి కూడా తదుపరి విచారణ సమయంలో తేలుస్తామని ప్రకటించింది. అయితే మీరు (సుప్రీంకోర్టు) ఇలాంటి అభిప్రాయం వ్యక్తం చేస్తే కింది కోర్టులో బాలాజీ గోవిందప్ప.. ఏసీబీ రిమాండ్ రిపోర్ట్‌ను వ్యతిరేకిస్తారని సిద్ధార్థ అగర్వాల్ పేర్కొన్నారు. అరెస్ట్ సంగతి తేలుస్తామని సుప్రీంకోర్టు చెప్పింది కాబట్టి రిమాండ్‌కు ఇవ్వవద్దని అడుగుతారన్నారు. అగర్వాల్ వాదనపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని మీరు మురికిగా మార్చవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించింది.



ఇద్దరికీ ఊరట..

ఇదే సమయంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. తదుపరి విచారణ వరకు వీరిద్దరిని అరెస్టు చేయరాదని ఏసీబీని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని వారిద్దరినీ ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఏసీబీకి నోటీసులు జారీ చేసింది. అదే రోజు గోవిందప్ప అరెస్ట్‌తో సహా అన్నీ అంశాలపై సమగ్ర విచారణ జరుపుతామని ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ మద్యం విధానంపై అక్రమ కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలతో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఏసీబీకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరుకి సైతం నిరాకరించింది. ఈ నేపథ్యంలో వారు ముగ్గురూ అత్యవసరంగా సుప్రీంకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

సమావేశాల్లో పాల్గొంటే నిందితుడిని చేసేస్తారా...?

ధనుంజయరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్, కృష్ణమోహన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపించారు. హైకోర్టు కనీస స్థాయిలో కూడా తమ వాదనలు వినలేదని వికాస్ సింగ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. తమకు హైకోర్టు అవకాశం ఇచ్చి ఉంటే పిటిషనర్లపై ఏసీబీ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని నిరూపించేవారిమన్నారు. కార్యదర్శి హోదాలో సమావేశాల్లో పాల్గొన్నంత మాత్రాన నిందితునిగా చేర్చడం సరికాదన్నారు. రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విషయంలో ఇదే సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన తీర్పునిచ్చిందని తెలిపారు. కార్యదర్శి హోదాలో సమావేశాల్లో పాల్గొన్నంత మాత్రాన నేరాన్ని ఆపాదించడానికి వీల్లేదని ఆ తీర్పులో పేర్కొన్నారని వికాస్ సింగ్ నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రముఖ మద్యం తయారీ కంపెనీలను పక్కకు నెట్టేసి ఎవరికీ తెలియని కంపెనీల నుంచి మద్యం కొనుగోలు చేశారన్నారు.

బాలాజీ గోవిందప్ప అక్రమ అరెస్టు

కర్ణాటకలో అదుపులోకి తీసుకున్న సిట్ అధికారులు

ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తరలింపు

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసులో వికాట్ గ్రూప్ భారత దేశ వ్యవహారాల డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న బాలాజీ గోవిందప్పను ఏపీ సిట్ అధికారులు కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా యలందూర్‌లో అక్రమంగా అరెస్టు చేశారు. ప్రకృతి వైద్యం చేయించుకుంటున్న గోవిందప్పను అదుపులోకి తీసుకుని అక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడ తీసుకొస్తున్నారు. బుధవారం ఉదయం విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారిస్తారని తెలుస్తోంది. అనంతరం బాలాజీ గోవిందప్పను న్యాయస్థానంలో హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి.

సోదాల పేరుతో వేధింపులు

- హైదరాబాద్‌లో ఏపీ సిట్ బృందాల హల్‌చల్
- అబద్ధపు వాంగ్మూలాలే లక్ష్యంగా బరితెగింపు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసు దర్యాప్తు పేరిట హైదరాబాద్‌లోని వికాట్ గ్రూప్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి నివాసాల్లో సోదాల పేరిట ఏపీ సిట్ అధికారులు హల్‌చల్ సృష్టించి వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. సిట్ బృందాలు హైదరాబాద్‌లో బాలాజీ గోవిందప్ప నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను హడలెత్తించారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తెలకు తెలియని అంశాలపై ప్రశ్నలు సంధించి వేధించారు. ఇంట్లో పత్రాల తనిఖీ పేరిట మంగళవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు హల్‌చల్ చేశారు. కృష్ణమోహన్‌రెడ్డి నివాసంలోనూ సిట్ అధికారులు సోదాల పేరిట వేధింపులకు పాల్పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి దాటేవరకు సోదాలు చేస్తూనే ఉన్నారు. మరో ప్రాంతంలో ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి కుమారుడు రోహిత్ రెడ్డిని పిలిపించి మరీ ఆయనకు సంబంధం లేని అంశాలపై ప్రశ్నించారు. ఆయన తరఫు న్యాయవాదులు వచ్చి చట్ట నిబంధనలను ప్రస్తావిస్తున్నా సరే సిట్ అధికారులు వేధిస్తుండడం గమనార్హం. ఇక రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి నివాసంలోనూ సోదాల పేరిట సిట్ అధికారులు అదే రీతిలో బెదిరింపులకు పాల్పడ్డారు. ఆయన కుటుంబ సభ్యుల, స్నేహితుల కాల్ డేటా వివరాలను కూడా చూపిస్తూ ప్రశ్నిస్తుండం విభ్రాంతి కలిగించింది. సోదాల పేరుతో బాలాజీ గోవిందప్ప, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను వేధించడం... తద్వారా వారి ముగ్గురి నుంచి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేయడమే సిట్ ఏకైక లక్ష్యమన్నది స్పష్టమవుతోంది. కుటుంబాలను దర్యాప్తు పేరిట వేధించడం ద్వారా మానసిక ఒత్తిడికి గురి చేసి అక్రమ కేసుకు అనుకూలంగా తప్పుడు సాక్ష్యాలు సృష్టించాలన్నది అసలు పన్నాగం.

3 నెలల్లో చెన్నూర్ దసలి పట్టు వస్త్రాలు

- దారం, వస్త్ర తయారీలో శిక్షణకు 30 మంది రైతుల ఎంపిక
- యంత్రాల కోసం రూ.20.54 లక్షలు మంజూరు

చెన్నూర్: దసలి పట్టుకాయ దిగుబడిలో మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంటున్న మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టు పరిశ్రమ మరో అడుగు ముందుకేసింది. రైతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పట్టు దారం, వస్త్ర తయారీకి సన్నద్ధం అవుతోంది. వస్త్ర తయారీకి అవసరమైన యంత్రాల కోసం ప్రభుత్వం రూ.20.54 లక్షలు మంజూరు చేసింది. దారం, వస్త్రాల తయారీపై శిక్షణకు 30 మంది రైతులను ఎంపిక చేశారు. నెల రోజులపాటు నిపుణులతో చెన్నూర్ పట్టు పరిశ్రమలో శిక్షణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో మూడు నెలల్లో చెన్నూర్ కేంద్రంగా పట్టు వస్త్రాల ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.



కోటపల్లి మండలంలోని లింగన్నపేటలో దసలి పంట



పట్టు వస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రెండు నెలల శ్రమతో రూ.1.5 లక్షల సంపాదన

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే గిరిజన, ఎస్సీ, బీసీ నిరుపేద రైతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దసలి పట్టు కాయ సాగును ప్రోత్సహిస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో భూమి లేని రైతులను గుర్తించి దసలి కాయ పండించే విధానంపై శిక్షణ ఇచ్చింది. గత మూడు దశాబ్దాలుగా ఇక్కడ సుమారు వెయ్యి మంది రైతులు 7,500 ఎకరాల్లో దసలి పట్టు కాయలు పండిస్తున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గొల్లతరివిడి, కౌటాల, బెజ్జూర్, మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మన్నెగూడెం, కోటపల్లి మండలం కొత్తపల్లి, రాజారాం, లింగన్నపేట, నాగంపేట, ఎదుల్లబంధం, వేమనపల్లి మండలం ముల్కల్లపేట, చెన్నూర్ మండలం కిష్టంపేట, లింగంపల్లి గ్రామాల్లో దసలికాయను పండిస్తూ ఉపాధి పొందుతున్నారు. రెండు నెలల శ్రమతో ఒక్కో రైతు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు.

మూడు నెలల్లో వస్త్ర తయారీ ప్రారంభం



గత ఏడాది దసలి పట్టు రైతుల కిసాన్ మేళాలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి కాగా ఇటీవల మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. భవనంలో దారం తీసే యంత్రాలను అమర్చి రీలింగ్ చేసి వస్త్రం ఉత్పత్తి చేస్తాం. త్వరలో రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభించి మూడు నెలల్లో వస్త్రం తయారు చేస్తాం.

–పార్వతి రాథోడ్, ఏడీ, సెరికల్చర్

రైతులపై హరీశ్‌రావుది కపటప్రేమ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆయన పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేయడమే ధ్యేయంగా హరీశ్‌రావు మాట్లాడుతున్నట్టు అర్థమవుతోందని అభిప్రాయపడ్డారు. మంగళవారం సీఎల్పీ ప్రాంగణంలో శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ సమయానికి కేవలం 19 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, దీనికి హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు. కొనుగోలు కేంద్రాలు లేక, సమయానికి పంట కొనుగోలు చేయక బీఆర్ఎస్ హయాంలో అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలున్నాయని గుర్తుచేశారు. కాళేశ్వరం నీళ్లు లేకపోయినా ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, రైతులంతా సంతోషంగా ఉన్నారని, దీన్ని ఓర్వలేక హరీశ్‌రావు.. ప్రభుత్వం, సీఎంపై విషం కక్కుతున్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. అనవసరమైన మాటలు మానుకుని అసలు బీఆర్ఎస్‌లో ఆయన సీటు ఉందో చిరిగిపోయిందో చూసుకోవాలని హరీశ్‌రావుకు హితవు పలికారు.



కాంగ్రెస్ సర్కార్‌పై వరుస పోరాటాలు

- వరంగల్ సభతో ఆ పార్టీ అంతానికి ఆరంభం మొదలైంది
- రైతుల ఆత్మహత్యలు, సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో విస్తృత కార్యక్రమాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అంతమొందించే శక్తి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ప్రజలను మోసం చేస్తూ ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కిందని, ఆ పార్టీ ద్రోహాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో మంగళవారం రాత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సభతో కాంగ్రెస్ అంతానికి ఆరంభం షురూ అయిందన్నారు. ఇప్పుడైనా, ఎప్పుడైనా రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు బీఆర్ఎస్సేనని, సభ తర్వాత ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ ఓ పాజిటివ్ ఎనర్జీ వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసే ఉత్సాహం ఈ సభ ద్వారా కలిగిందని కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఒక్క సంవత్సర కాలంలోనే ప్రజల్లో ఇంత వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాన్ని తాను ఇప్పటి వరకు చూడలేదని చెప్పారు. అనుభవలేమి, మోసం, అత్యాశ, అందినకాడికి దోచుకోవడం అనే లక్షణాలు పుష్కలంగా ఉన్న రేవంత్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి రెండు దశాబ్దాలు వెనక్కి పోయిందన్నారు. ప్రజల్లో ఉన్న కాంగ్రెస్ వ్యతిరేకతకు అనుగుణంగా ఎక్కడికక్కడ పార్టీ కార్యక్రమాలను రూపొందించుకోవాలని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విస్తృత పోరాటాలు చేస్తుందన్నారు. రైతు భరోసా చెల్లింపులు సక్రమంగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో చూపిస్తున్న నిర్లక్ష్యం, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పార్టీ కార్యాచరణ ఉండబోతుందని తెలిపారు. ఇటీవల వెలుగుచూసిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సమగ్ర వ్యూహంతో ప్రజా ఉద్యమాలను ప్రారంభిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న కేటీఆర్

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద బహిరంగసభ

రాష్ట్ర చరిత్రలోనే అత్యంత భారీసభగా ఎల్కతుర్తి రజతోత్సవ సభ నిలిచిపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతీ కార్యకర్త, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పకడ్బందీ ప్రణాళిక, క్రమశిక్షణ, ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న అంతులేని అభిమానానికి ఎల్కతుర్తి సభనే నిదర్శనమన్నారు. ఈ బహిరంగ సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల దిశ మారిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు మాట్లాడారు. పార్టీ 25 సంవత్సరాల సంబురాన్ని వరంగల్ గడ్డపై నిర్వహించే అవకాశం తమకు ఇచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అన్ని విషయాల్లో తమకు దిశానిర్దేశం చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సభ నిర్వహణలో భాగమైన నేతలతో కలిసి కేటీఆర్ భోజనం చేశారు.

కరుణ చూపింది కాంగ్రెస్.. కట్టేసి కొట్టింది బీఆర్ఎస్

- గిరిజనుల పక్షపాతి మా ప్రభుత్వం: భట్టి విక్రమార్క
- రాజీవ్ యువ వికాసం పథకానికి 'సిబిల్' వర్తించదని వెల్లడి



విద్యుత్ ఉపకేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మురళీనాయక్, జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ సీఎండీ తదితరులు

సాక్షి, మహబూబాబాద్: గిరిజనులపై కరుణ చూపి వారికి అటవీ హక్కు పత్రాలను ఇచ్చి వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీ అని, అదే గిరిజన మహిళలను చెట్టుకు కట్టేసి కొట్టింది బీఆర్ఎస్ పార్టీ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లక్ష్మీనర్సింహాపురం, గంధంపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరా సౌర గిరి జల వికాస పథకాన్ని ఈ నెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని చెంచుల కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. దీనికోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఉద్యానవన శాఖ ద్వారా గిరిజనులకు అధిక ఆదాయ వనరులు సమకూర్చేందుకు నూతన పథకానికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు.

సిబిల్ స్కోర్‌పై తప్పుడు ప్రచారం

టేకులపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువతకు వరమని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో మంగళవారం పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌వైవీ పథకం లబ్ధిదారుల ఎంపిక ఈనెల 25 వరకు పూర్తి చేసి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి రుణాలు అందిస్తామని తెలిపారు. సిబిల్ స్కోర్ ఉంటేనే రాజీవ్ యువ వికాసం రుణం వస్తుందంటూ అవగాహన లేని కొందరు వ్యక్తులు, సంస్థలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని యువతకు సూచించారు. గతంలో పలుమార్లు రుణాలు తీసుకొని తిరిగి చెల్లించని వారు మినహా మిగిలిన దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ వర్తించదని స్పష్టం చేశారు.

మహేశ్‌గౌడ్ ఢిల్లీకి..

- పార్టీ కమిటీల ప్రతిపాదనలపై తుదిదఫా చర్చలు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీల ప్రతిపాదనలపై తుదిదఫా చర్చలు జరిపేందుకు అధిష్టానం ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. ఆయనతోపాటు అధిష్టానంతో కలిసి చర్చించేందుకు.. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. వీరిద్దరూ బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి పార్టీ కమిటీల ప్రతిపాదనలపై చర్చించనున్నారు. చర్చల అనంతరం.. రెండు మూడు రోజుల్లో పార్టీ కమిటీలను ఏఐసీసీ అధికారికంగా ప్రకటించనుంది.

ఈటలకు జవాబు చెప్పలేకే ఎదురుదాడి

- సీఎంపై బీజేపీ ఎమ్మెల్యేల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో పేదల ఇళ్లను కూలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ లేవనెత్తిన ప్రశ్నలు, ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం.. సీఎం అసమర్థతకు నిదర్శనమని బీజేపీ ఎమ్మెల్యేలు విమర్శించారు. పేదల జోలికి వెళ్లొద్దన్న సూచనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా కూల్చివేయడం.. తుగ్లక్ పాలనకు నిదర్శనమని బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పవార్, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబులు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలతో ఎదురుదాడి చేయించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కేబినెట్ నుంచి ఈటలను బర్తరఫ్ చేసినపుడు.. బీసీ నేతకు అన్యాయం, అవమానకరమని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు పీసీసీ అధ్యక్షునికి గుర్తులేవా? అని ప్రశ్నించారు. జగ్గారెడ్డి వ్యాఖ్యలు చిల్లర రాజకీయాలకు అద్దంపడుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యేలు ఎద్దేవా చేశారు.

ఆగస్టు 12న వామనరావు దంపతుల హత్యకేసు విచారణ

- అఫిడవిట్ దాఖలుకు సమయం కోరిన ప్రభుత్వ న్యాయవాది
- చివరి అవకాశమని చెబుతూ వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: న్యాయవాద దంపతులు గట్టు వామనరావు–నాగమణిల హత్యకేసు విచారణ సుప్రీంకోర్టులో మరోసారి వాయిదా పడింది. అఫిడవిట్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరటంతో ఆగస్టులో విచారణ చేపడతామని జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా మంథనిలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలంటూ.. ఆయన తండ్రి గట్టు కిషన్‌రావు అదే ఏడాది సెప్టెంబర్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 4న విచారణ చేపట్టిన కోర్టు.. కేసుకు సంబంధించి వీడియోలు సహా అన్ని పత్రాలు మూడు వారాల్లో తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ రికార్డులను పరిశీలించిన తర్వాత సీబీఐ విచారణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే, గత శుక్రవారమే ట్రయల్ కోర్టు వీడియోను రిలీజ్ చేసింది కాబట్టి దానిని పరిశీలించి పూర్తిస్థాయి అఫిడవిట్ చేయలేకపోయామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది మంగళవారం కోర్టుకు తెలిపారు. ఆ వీడియోను పరిశీలించి అఫిడవిట్ దాఖలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో 'ఇదే చివరి అవకాశం. ఇకపై ఈ వాయిదాలు ఉండవు. వచ్చే విచారణలో తుది తీర్పు వెలువరిస్తాం' అని జస్టిస్ సుందరేష్ స్పష్టం చేశారు. విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేశారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులు చనిపోతున్నా పట్టించుకోరా?

- ధాన్యపు రాశుల వద్ద రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే
- యాసంగి సీజన్‌లో 40 లక్షల టన్నుల ధాన్యం కూడా కొనలేదు
- మా పార్టీలో నాయకత్వ సమస్య లేదు



సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దుల్లో సైనికుల తరహాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటను అమ్ముకునేందుకు యుద్ధం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అందాల పోటీలపై సమీక్షలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు తీర్చేందుకు సమయం దొరకడం లేదని విమర్శించారు. ధాన్యపు రాశులను గాలికి వదిలి.. సీఎం రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్నా.. సీఎం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పరిమితమవుతూ సచివాలయం ముఖం కూడా చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల మరణాలకు సీఎందే బాధ్యత

కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల రోజుల తరబడి ఎండలో వేచి చూడటంతో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యపు రాశుల సాక్షిగా కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ప్రభుత్వ హత్యలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరుగుతున్న ఈ మరణాలకు సీఎం రేవంత్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. 'వానకాలంలో రైతుబంధు సాయం ఎగవేసిన ప్రభుత్వం.. యాసంగిలో మూడు ఎకరాలకు మించిన రైతులకు ఇవ్వనే లేదు. రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం అందడం లేదు. పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి ఎవరూ అప్పు ఇవ్వడం లేదు. ప్రతిపక్షం మీద బురద చల్లే తొందరలో సీఎం తాను తీసుకున్న గోతిలో తానే పడిపోయారు. ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదు' అని ఎద్దేవా చేశారు. తాము రైతుల సమస్యల గురించి మాట్లాడితే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అందజేసిన వివరాల ప్రకారమే రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.4 వేల కోట్లు చెల్లించాలని, సన్న వడ్లకు చెల్లించాల్సిన బోనస్ రూ.767 కోట్లలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మంత్రి ఒప్పుకున్నారని తెలిపారు. చనిపోయిన రైతులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతులకు రూ.4 వేల కోట్ల బకాయి

ప్రస్తుత యాసంగి సీజన్‌లో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనలేదని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు 48 గంటల్లో వడ్ల కొనుగోలు డబ్బులు ఇస్తామని చెప్పినా.. నేటికీ రూ.4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. సన్న ధాన్యానికి రూ.512 కోట్ల బోనస్ కూడా విడుదల చేయలేదని చెప్పారు. రైతుల పక్షాన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు నాయకత్వం ఇచ్చినా ఓకే

బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వ సమస్య లేదని హరీశ్‌రావు తెలిపారు. 'నేను పార్టీ పెడుతున్నట్లు, మరో పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు ప్రచారాన్ని గతంలోనే ఖండించా. మా పార్టీ నాయకులు దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఈ అంశంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మా పార్టీలో నాయకత్వ పంచాయితీ లేదు. కేసీఆర్ మా పార్టీ అధ్యక్షుడు. ఆయన ఆదేశాలను పాటించే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను నేను. కేటీఆర్‌కు నాయకత్వం అప్పగిస్తే స్వాగతిస్తా. కేసీఆర్ నిర్ణయాన్ని నేను జవదాటను' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

నిత్యం అబద్ధాలేనా?

- హరీశ్‌రావూ.. ధాన్యం కొనుగోళ్లపై ఇవిగో నిజాలు
- ఎక్స్ వేదికగా డేటా విడుదల చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై నిత్యం అబద్ధాలు ప్రచారం చేయటమే పనిగా పెట్టుకున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై హరీశ్‌రావు విమర్శలను మంగళవారం ఎక్స్ వేదికగా తిప్పికొట్టారు. ఇవిగో నిజాలు అంటూ అధికారిక గణాంకాలతో గత మూడేళ్లుగా ధాన్యం కొనుగోళ్ల డేటాను విడుదల చేశారు. ధాన్యం సేకరణలో గత మూడేళ్లుగా మే 12వ తేదీ వరకు గణాంకాలు తీసుకుంటే తమ ప్రభుత్వమే పెద్ద ఎత్తున కొనుగోలు చేసిందని తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ నెల 12 నాటికి 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించగా, గత రబీ సీజన్ (2023–24)లో ఇదే కాలంలో 29.88 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు చెప్పారు. ఇది గతంతో పోలిస్తే 44 శాతం అధికమని వివరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 2022–23లో సేకరించిన 19.62 ఎల్ఎంటీలతో పోలిస్తే 120 శాతం అధికమని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రతి విషయంలోనూ అబద్ధాలే..

'హరీశ్‌రావూ... ఈ ధాన్యం సేకరణ గణాంకాలను చూసైనా ప్రతి విషయంలోనూ అబద్ధాలు చెప్పడం మానుకోండి' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. తాము ఇస్తున్న కనీస మద్దతు ధర, సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, సకాలంలో కొనుగోళ్లు వంటి చర్యలు రైతులకు ఊరటనిచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో గత వానకాలం సీజన్‌లో 66.7 లక్షల ఎకరాల్లో 153.5 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగి సీజన్‌లో 55 లక్షల ఎకరాల్లో 127 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని వెల్లడించారు. మొత్తంగా ఒక వ్యవసాయ సంవత్సరంలో 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో రాష్ట్రం దేశ చరిత్రలోనే అరుదైన ఘనత సాధించిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలినప్పటికీ ఈ అసాధారణ ఫలితం సాధ్యమైందని అన్నారు.

మిస్ వరల్డ్ 2025



ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ నందిని గుప్తా రాజస్థాన్‌లోని ఓ పల్లెటూరిలో రైతు కుటుంబంలో జన్మించింది. 'అందరికీ నమస్కారం.. నేను మీ నందిని..' అంటూ తెలుగులో చిరునవ్వుతో పలకరించిన ఈ బ్యూటీ మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేంతగా తనను తాను ఎలా నిర్మించుకుందో వివరించింది. 'ఎక్కడ నుంచి వచ్చాం అన్నది ముఖ్యం కాదు, ఎక్కడికి వెళ్లాం.. అన్నదే ముఖ్యం' అన్న ఆత్మవిశ్వాసంతోపాటు భవిష్యత్తు ప్రణాళికలనూ మన ముందుంచింది మిస్ వరల్డ్– 2025 కాంటెస్ట్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తా.

రైతు కూతురి కలల సేద్యం



'ఫెమినా మిస్ ఇండియా వరల్డ్' నందిని గుప్తా

''అమ్మానాన్నలకు నేను, చెల్లి సంతానం. స్కూల్‌లో చదివేటప్పుడే ఐశ్వర్య రాయ్ మిస్ వరల్డ్ అయినప్పుడు ఆమెను చాలా మంది అభినందించడం, కెమెరా ఫ్లాష్ లైట్లలో వెలిగిపోతుండటం టీవీలో చూసి... 'ఆమె ఎవరు?' అని అమ్మను అడిగాను. 'ఆమె మిస్ వరల్డ్, నటి' అని చెప్పింది అమ్మ. నా మనసులో ఆనాటి సంఘటన బలంగా ముద్రించుకుపోయింది. అప్పటినుంచి అందంగా ఉండటానికి ప్రయత్నాలు మొదలుపెట్టాను. మంచి డ్రెస్సులు వేసుకునేదాన్ని, మేకప్ చేసుకునేదాన్ని, హెయిర్‌స్టైల్స్ మార్చేదాన్ని. అందాల పోటీలో పాల్గొనడానికి ఏమేం చేయాలో తెలుసుకుంటూ ఉండేదాన్ని. ఓ రైతు కూతురు కలలు కనే ధైర్యం చేయవచ్చా! అనే ఆలోచన లేకుండా నా ప్రయాణాన్ని కొనసాగించాను. నా ఆసక్తులు గమనించిన అమ్మానాన్నలు ఆ తర్వాత మా కుటుంబాన్ని ముంబయ్‌కి షిఫ్ట్ చేశారు. ఆ విధంగా ఆవాలు పండే పొలాల మధ్య పెరిగిన నేను ముంబయ్ ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగుపెట్టాను.

మాట్లాడాలంటే బెరుకు

పోటీలలో పాల్గొనే కొత్తలో వేదికలపైన నా గురించి నేను చెప్పుకోవడానికి, మైక్ ముందు మాట్లాడటానికి సిగ్గుపడేదాన్ని. ఏదో తెలియని బెరుకు ఉండేది. ఇలా అయితే రాణించలేను అనుకున్నాను. నా శక్తి ఏంటో ప్రపంచానికి తెలియజేయాలని ప్రయత్నించాను. నన్ను నేను కొత్తగా నిర్మించుకోవడంలో ఎలా ఉన్నాను, ఎలా ఉండాలనుకుంటున్నాను అనే విషయాల పట్ల చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. నా డ్రెస్, మేకప్, నా మాట, చూపు అన్నీ సమర్థంగా ఉన్నప్పుడు దేనికీ వెనకంజ వేయనక్కర్లేదు అని తెలుసుకున్నాను. ఆ ఆత్మవిశ్వాసమే ఈ రోజు ఇలా మీ ముందుకు తీసుకువచ్చింది.

మార్పునకు శ్రీకారం

అందాల పోటీలవైపు వెళ్లేటప్పుడు మొదట్లో తటపటాయించినప్పటికీ మిస్ రాజస్థాన్ టైటిల్ గెలిచాక నా ఇష్టానికి మద్దతు ఇచ్చారు మా నాన్న. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో గెలిచాక అయితే ఆయన చాలా ఉద్వేగానికి గురయ్యారు. ఆ క్షణాలు ఎప్పటికీ మరవలేను. చదువంటే నాన్నకు చాలా ఇష్టం. నాన్న కోరిక మేరకు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాను. నేను పుట్టి పెరిగిన ప్రాంతంలో అమ్మాయిలు తల మీదుగా ముసుగు ధరించాలి, వారికి పెద్దగా చదువు అక్కర్లేదు, త్వరగా పెళ్లి చేయాలనే ఆలోచన అక్కడి తల్లిదండ్రుల్లో ఉండేది. ఇప్పుడు అక్కడా బ్యూటీ కాంటెస్ట్‌లకు ట్రైనింగ్ ఇచ్చే అకాడమీలు పెరిగాయి. తల్లిదండ్రులు కూడా తమ కూతుళ్లను బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనడానికి ప్రోత్సహిస్తున్నారు. ఇది నాకెంతో సంతోషాన్ని ఇస్తోంది.

దివ్యాంగుల సాధికారత కోసం..

దివ్యాంగులను సమాజంలో ఒక భాగం చేయడం కోసం పనిచేయడమే నా లక్ష్యం. మా మేనమామ పుట్టుకతోనే దివ్యాంగుడు. సరిగా మాట్లాడలేరు. కానీ, ఎప్పుడూ మానసిక స్థైర్యంతో ఉంటారు. చిన్నప్పటి నుంచి అతని కళ్ల నుంచి ప్రపంచాన్ని చూశాను. కనిపించని బాధ ఏదో మోస్తున్నట్టుగా అతనిలో నాకు కనిపించేది. అలాంటి వాళ్లు పడుతున్న బాధలు స్వయంగా చూశాను. వికలాంగుల గాథలు చాలా బాధనిపించేవి. మిస్ ఇండియా వరల్డ్ టైటిల్ గెలిచాక 'ఏక్తా ప్రాజెక్టు'లో భాగంగా అనేక మంది దివ్యాంగులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నా. వారి కలల సాకారానికి కృషి చేయాలనుకున్నాను.

భవిష్యత్తు ప్రణాళికలు

ఇప్పటికే మోడల్‌గా ప్రకటనలలో యాక్ట్ చేస్తున్నాను. తెలుగు సినిమాలు, డ్యాన్స్‌లు అంటే చాలా ఇష్టం. మహేష్‌బాబు నటించిన సినిమాలో 'కుర్చీ మడతపెట్టి ..' 'సాంగ్ మరీ మరీ ఇష్టం. ఆ పాట విన్నప్పుడల్లా డ్యాన్స్ చేస్తుంటా. నటిగా నన్ను నేను నిరూపించుకోవాలని ఉంది'' అంటూ వివరించింది ఈ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

రాజస్థాన్‌లోని కోటాకు దగ్గర్లో ఉన్న చిన్న పల్లెటూరులో రైతు కుటుంబంలో పుట్టి పెరిగింది నందిని గుప్తా. స్థానిక హస్తకళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కోటా డోరియా వస్త్రాల ప్రాచుర్యానికి కృషి చేస్తోంది. ఫ్యాషన్‌లోనూ తన మూలాలను చూపించేలా దుస్తుల ఎంపికలో ప్రత్యేక శైలిని పాటిస్తోంది. యోగా, డ్యాన్స్, హెల్తీ డైట్‌ను పాటించడమే తన బ్యూటీ సీక్రెట్ అని తెలిపింది.



బ్యూటిప్

వంద గ్రాముల గులాబీ రెక్కలు. అందుబాటులో ఉన్న సుగంధ పుష్పాల రెక్కలను కొన్నింటిని తీసుకుని నీటిలో మరిగించి అరగంట తర్వాత వడపోయాలి. డ్రైస్కిన్ వాళ్లు ఈ నీటిని కలుపుకుని స్నానం చేస్తుంటే చర్మం మృదువుగా మారుతుంది.



ఇప్పుడు అందాల పోటీలు చాలా మారాయి. రంగు, రూపు, ఆకృతి లాంటివాటికి అంత ప్రాధాన్యం ఉండట్లేదు. బాహ్య సౌందర్యం కన్నా అంతఃసౌందర్యాన్నే ఆరాధిస్తున్నారు. అందుకే అందాల పోటీల్లో ఇన్‌క్లూజివిటీ పెరిగింది. మేని ఛాయ, ఆకృతి ఎలా ఉంటే అలా యాక్సెప్ట్ చేస్తున్నారు. ఇది మంచి పరిణామం అని చెబుతున్న మిస్ సోమాలియా జైనబ్ బాలీవుడ్ సినిమాలు చాలా చూస్తారట. షారూఖ్ ఖాన్, కరీనా కపూర్ తన ఫేవరెట్ యాక్టర్స్ అని చెబుతున్నారు. ఆమె ఇంకా ఎన్నో విషయాలను 'సాక్షి ఫ్యామిలీ'తో పంచుకున్నారు.

అందం కాదు బంధం

'మిస్ సోమాలియా' జైనబ్

నేను ఎఫ్‌జీఎమ్ (ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్) సర్వైవర్‌ని. సోమాలియాలో ఉన్న కామన్ హార్మ్‌ఫుల్ ప్రాక్టీస్ ఇది. మా దేశంలోని దాదాపు 98 శాతం మహిళలు దీన్ని అనుభవించినవారే! ఇప్పుడున్న ఆడపిల్లల్లో 30 శాతం మంది ఈ ఆచారం బారిన పడే వయసుకు చేరుకున్నారు. అంటే ఏడేళ్లకు ఎఫ్‌జీఎమ్ చేస్తారు. ఎఫ్‌జీఎమ్ అంటే మహిళల సెక్సువల్ ఆర్గాన్‌ని కత్తిరించడం. యవ్వనంలో ఆమెకు లైంగికేచ్ఛ లేకుండా చేయడం. లైంగికేచ్ఛ లేకపోతే ఏ మగవాడి ఆకర్షణకు లోనుకారనే ఒక ప్రమాదకర, మూఢ విశ్వాస మన్నమాట. ఇది ఒక్క సోమాలియాలోనే కాదు ఆఫ్రికాలోని చాలా దేశాల్లో ఇప్పటికీ ప్రాక్టీస్‌లో ఉంది. ఈ అనాచారం వల్ల మా దేశంలో చాలామంది అమ్మాయిలు ప్రాణాలు కోల్పోయారు. ఇంకెంతో మంది అధికరక్తస్రావంతో దాదాపు చావు అంచులదాకా వెళ్లారు. నేను కూడా దీన్నుంచి కోలుకుని.. ఈ కథను షేర్ చేయడానికి చాలా కాలమే పట్టింది. నా కథ విని.. ఇలాంటి దుర్మార్గమైన ఆచారాన్ని రూపుమాపడానికి తగిన స్పందన, సహాయం అందుతుందని ఒకే ఒక ఆశతో నా ఈ కథను నాకు దొరికిన వేదిక మీదల్లా పంచుకోవడం మొదలుపెట్టాను. ఈ బ్యూటీ పాజెంట్‌లో కూడా నా తోటి కంటెస్టెంట్స్‌కి చెప్పాను. ఆఫ్రికా దేశాల్లో ఇలాంటి దురాచారం ఒకటుందని ఈ కంటెస్టెంట్స్‌లో చాలా మందికి తెలియదు. నా కథ విని చలించిపోయారు. ఫిమో ఇనిషియేటెడ్ ఫౌండేషన్‌ను స్టార్ట్ చేసి, ఆ దురాచారానికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని తెలిసి.. మోరల్ సపోర్ట్ ఇవ్వడానికి ముందుకొచ్చారు. నాలో భరోసా నింపారు. బ్యూటీ పాజెంట్ అంటే కేవలం స్కిన్ షో మాత్రమే అనుకునేవారు ఈ విషయం విని తమ అభిప్రాయాన్ని మార్చుకుంటారని ఆశిస్తున్నాను. ఈ కంటెస్టెంట్స్‌లో ఒక్కొక్కరిది ఒక్కో స్ట్రగుల్. అందరం అన్నీ షేర్ చేసుకుంటున్నాం. దానివల్ల వ్యక్తిగత సమస్యలు, పోరాటాలు చిన్నవిగా తోస్తున్నాయి. ఎదుర్కోవడానికి బోలెడంత అండ దొరికిన ఫీలింగ్ కలుగుతోంది. సిస్టర్‌హుడ్ డెవలప్ అవుతోంది. ఒకరికొకరు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సరికొత్త ప్రయత్నాలకు ప్రేరణనిస్తున్నారు. పాజెంట్ తర్వాత కూడా ఈ బాండింగ్ కంటిన్యూ అవుతుందని ఆశిస్తున్నాను.

కొత్తగా అనిపించడం లేదు..

ఇండియా, ఆఫ్రికా సంస్కృతి, ఆహారపు అలవాట్లకు వస్తే.. ఇక్కడ నాకేమీ కొత్తగా అనిపించట్లేదు. నేను ప్యూర్ వెజిటేరియన్‌ని. సో ఇక్కడి భోజనాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నాను. తెలంగాణ నా సొంతింటిని మరిపిస్తోంది. ఈ పాజెంట్, కంటిస్టెంట్స్‌తో బాండింగ్, కొత్త భాషలు, కొత్త కల్చర్స్ తెలుసుకోవడం.. ఇవన్నీ నిజంగా వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియెన్స్. తిరుగు ప్రయాణంలో ఆ ఎక్స్‌పీరియెన్సెస్‌ని, ఇక్కడ సంపాదించుకున్న జ్ఞానాన్ని తీసుకెళ్దామనుకుంటున్నాను.

– సరస్వతి రమ

మండేలా స్ఫూర్తి

నాకు ఏడేళ్లున్నప్పుడు జెనిటల్ మ్యుటిలేషన్ జరిగింది. అదొక పెయిన్‌ఫుల్ ట్రామా. దానినుంచి కోలుకోవడానికి చాలా టైమ్ పట్టింది. నాలా ఇంకే అమ్మాయికీ జరగొద్దని అప్పుడే నిర్ణయించుకున్నాను. నా తొమ్మిదేళ్ల వయసులో మా కుటుంబం యూకేకి మైగ్రేట్ అయింది రెఫ్యూజీగా. అక్కడే ఏవియేషన్ అండ్ ఎయిర్‌క్రాఫ్ట్ మేనేజ్‌మెంట్ చేశాను. ప్రయాణాలన్నా.. ఏరోప్లేన్స్ అన్నా చాలా ఇష్టం. అందుకే అందులోనే చదువు పూర్తి చేశాను. ఒక్క ఎఫ్‌జీఎమ్ కోసమే కాదు.. ఇలాంటి ఇంకెన్నో దురాచారాలు, హింస మీద అమ్మాయిలు, మహిళలకు చైతన్యం కలిగించే ఎన్నో ఫౌండేషన్స్‌తో కలిసి పనిచేస్తున్నాను. అమ్మాయిల చదువు కోసం కృషి చేసే స్వచ్ఛంద సంస్థలతోనూ అసోసియేట్ అయి ఉన్నాను. మహిళలందరినీ ఏకం చేసి వారి మధ్య సిస్టర్‌హుడ్‌ను పెంచడానికీ ప్రయత్నిస్తున్నాను. నా మాతృదేశానికి వెళ్లిపోయి.. యుగాలుగా నాటుకుని ఉన్న ఈ అనాచారాన్ని రూపుమాపడమే నా లక్ష్యం. ఇదొక్క సోమాలియాకే పరిమితమైన సమస్య కాదు. ఆఫ్రికాలోని చాలా దేశాల్లో ఉంది. మార్పు కోసం అన్ని దేశాల్లోనూ వర్క్ చేస్తాను. అయితే ఇది నేనిప్పుడు మీతో చెబుతున్నంత ఈజీ కాదని తెలుసు. మా ట్రెడిషన్ గురించి ప్రపంచానికి చెబుతున్నానని, ధిక్కరిస్తున్నానని బెదిరింపులు, హెచ్చరికలు వస్తున్నాయి. వెనకడుగు వేసేది లేదు. ఈ విషయంలో నాకు నెల్సన్ మండేలా స్ఫూర్తి.

– 'మిస్ సోమాలియా' జైనబ్



పిల్లలూ... పనులు పలు రకములు. వాటిలో నీళ్లతో చేసే పనులు వేరు. కారు కడగడం.. మొక్కలకు నీళ్లు పోయడం.. మాప్ పెట్టడం... చేస్తే సరదాగా ఉంటుంది. అవి రావు అనడానికి లేదు. నేర్చుకోవాలంతే. పెద్దయ్యాక ఉపయోగపడతాయి. ఈ సమ్మర్‌లో నీళ్ల పనులు నేర్చుకోండి. అందరూ మెచ్చుకుంటారు.



నీళ్లతో చేసే పనులు నేర్చుకుందామా?

బకెట్... మగ్... అండ్ వాటర్. ఛలో.... నాన్న కారు కడుగుదాం ఫస్ట్. కింద పార్కింగ్‌లో ఉంటుంది. బకెట్‌లో వాటర్ తీసుకొచ్చి, క్లాత్ ముంచి, కారును తుడుస్తూ ఉంటే దానిమీద దుమ్ము పోయి తళతళ మెరుస్తుంది. ఫోమ్, షాంపూ... ఇవన్నీ నాన్న అప్లై చేస్తే వాటర్ పైప్ తీసుకొని ఫోర్స్‌గా వాష్ చేయడం... జల్లు మన మీద పడుతుంటే పకపకా నవ్వడం... సమ్మర్‌లో ఏం చేశావ్ అని టీచర్ అడిగితే కార్ వాష్ చేశానని చెప్తే 'వెరీగుడ్' అంటారు తెలుసా?



మీ బట్టలు ఉతికారా?

మీకు మీ బట్టలు ఉతుక్కోవడం వచ్చా? బట్టలు ఉతుక్కోవడం రాకపోతే లైఫ్‌లో ఇబ్బంది పడతారు. మీకు 12 ఏళ్లు దాటాయంటే మీ బట్టలు మీరు ఉతుక్కునే వయసు వచ్చినట్టే. అమ్మను అడిగితే వాషింగ్ మెషీన్ ఎలా యూజ్ చేయాలో చూపిస్తుంది. దాని సహాయంతో వాష్ చేసి, బట్టలు పిండి, ఆరవేయాలి. బట్టలు ఉతకడం ఎంత ముఖ్యమో ఆరవేయడం అంతే ముఖ్యం. గాలికి ఎగిరిపోకుండా, తీగ మీద నుంచి కింద పడిపోకుండా ఆరవేయాలి. వాటికి క్లిప్పులు పెట్టడం రావాలి. ఆరాక తీసుకొచ్చి మడత పెట్టి కప్‌బోర్డ్‌లో పెట్టుకోవాలి. బట్టలు ఉతికి, ఆరేసి, మడిచి పెట్టుకోవడం వస్తే మీరు సెల్ఫ్ డిపెండెంట్ అయినట్టే. చదువుకోవడానికి హాస్టల్‌లో ఉండాల్సి వచ్చినా ఇబ్బంది పడరు. కాబట్టి బట్టలు ఉతకడం ఈ సమ్మర్‌లో నేర్చుకోండి.

ఇల్లు తుడిచారా?

ఇంటి ఫ్లోర్‌ను మాప్ పెట్టడం నేర్చుకుంటే మీ అంత గుడ్ బాయ్స్, గుడ్ గర్ల్స్ ఉండరు. బకెట్‌లో నీళ్లు తెచ్చి, మాప్ స్టిక్ దానిలో ముంచి, నీళ్లు పిండి, నేల మీద రుద్దుతూ మాప్ చేయాలి. అమ్మ, పని మనిషి అలా మాప్ చేయడం మీరు చాలాసార్లు చూశారు. ఈ సమ్మర్‌లో అది మీ వంతు. ఇంకా ముఖ్యమైన విషయం వాష్‌రూమ్‌లను కడగడం. ఇంట్లో వాష్‌రూమ్‌ను అందరూ వాడతారు. కాని వాటిని కడిగేది మాత్రం అమ్మే. ఈసారి మీరు నాన్నతో కలిసి వాష్‌రూమ్‌లను బాగా కడగండి. క్లీన్‌గా ఉన్న వాష్‌రూమ్‌లను చూస్తే హ్యాపీగా అనిపిస్తుంది. సమ్మర్‌లో వారం వారం వాష్‌రూమ్‌ను కడిగి అమ్మచేత శభాష్ అనిపించుకోండి.

అంట్లు కడగడం

అబ్బ... ఈ పని ఎవరికీ నచ్చదు. నచ్చదని భోజనం చేయడం మానేస్తామా? భోజనం చేస్తే భోజనం కోసం వంట వండితే అంట్లు పడతాయి. భోజనానికి ఎంత వాల్యూ ఇస్తామో అంట్లకు కూడా అంతే వాల్యూ ఇవ్వాలి. అంట్లు కడగడం అబ్బాయిల పని కాదని కొందరు అంటారు. ఏం కాదు. అందరూ చేయాలి. డిష్ వాషర్‌తో అంట్లు తోమి ట్యాప్ కింద పెట్టి అవి క్లీన్ అవుతుంటే చూడటం బాగుంటుంది. అంట్లు కడగడంలో సాయం చేస్తే అమ్మకు చాలా సాయం చేసినట్టే.

చెట్లకు నీళ్లు పోయడం

ఇది కూడా సరదా పని. ఈ సమ్మర్‌లో రోజూ మొక్కలకు నీళ్లు పోయడం మీ డ్యూటీగా చేసుకోండి. పైప్‌తో పోస్తారో బకెట్‌తో పోస్తారో మీ ఇష్టం. అలాగే తడిబట్టతో కప్‌బోర్డులన్నీ తుడిస్తే చాలా బాగుంటుంది.

మురికి మంచిది కాదు. మురికి వదల్చని బద్ధకం మంచిది కాదు. నీటిని వాడి బద్ధకాన్ని శుభ్రం చేసుకోండి. పదండి.

లీగల్

మీపై కేసు ఉన్నా... విదేశాలకు వెళ్లచ్చు

గృహహింస చేశానంటూ ఈమధ్య నాపై సెక్షన్ 85 బి.ఎన్.ఎస్ కింద కేసు నమోదు అయింది. పోలీసులు నన్ను పిలిచి సెక్షన్ 35 బీ. ఎన్.ఎస్.ఎస్ నోటీసు ఇచ్చారు. ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళవలసి వస్తుంది. నేను మా ఆఫీస్‌లో వీసా ప్రాసెస్ చేసి ఉంది. అయితే పెండింగ్ కేసు ఉంటే.. ఎయిర్ పోర్టులోనే నన్ను ఆపేస్తారు అని కొందరు చెప్పున్నారు. నిజమేనా? ఒకవేళ అలా చేస్తే పరిష్కారం ఏమిటి?

– విజయ్ కుమార్, వరంగల్

క్రిమినల్ కేసులు ఉన్నంత మాత్రాన విదేశాలకు వెళ్లకూడదు అని ఎక్కడా లేదు. అలా అనుకుంటే చాలామంది విదేశాలలో పనిచేసే వారిపై 498– ఎ(సెక్షన్ 85 బి. ఎన్.ఎస్) కేసులు సాధారణం అయిపోయాయి. వారందరూ వెళ్లగలిగేవారు కాదు, వెళ్లే ఉండగలిగే వారు కాదు. ప్రత్యేకించి మిమ్మల్ని ఏదైనా కేసులో కోర్టు ఆదేశిస్తే మాత్రమే దేశం వదిలి వెళ్లకూడదు. మీకు సరైన పాస్‌పోర్ట్ – వీసా ఉండి, ఎటువంటి కోర్టు ఆదేశాలు లేకుంటే నిరభ్యంతరంగా విదేశాలకు వెళ్లవచ్చు. అయితే కోర్టు వాయిదా ఉన్నప్పుడు మాత్రం తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ హాజరు కాలేని పక్షంలో అందుకు తగిన వెసులుబాట్ల కోసం మీ లాయరు గారితో మాట్లాడి తెలుసుకోండి.

మా సొంత ఊరు నిర్మల్. ఉద్యోగరీత్యా నేను కెనడాలో ఉన్నాను. నాపై ఒక కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది అని, లుక్ ఔట్ సర్క్యులర్ ఉందని పోలీసు వారు మా ఇంటికి వచ్చారు. 2016 లో జరిగిన ఒక లావాదేవీలో నాపై చీటింగ్ కేసు పెట్టినట్టు తెలిసింది. ఇప్పుడు భారత దేశానికి వస్తే నన్ను విమానాశ్రయంలోనే అరెస్టు చేస్తారని అంటున్నారు. బెయిల్ కూడా దొరకదు అంటున్నారు. నిజమేనా?

– రవిచంద్ర, కెనడా

మీరు విన్నది నిజమే! మీమీద లుక్ అవుట్ సర్క్యులర్ ఉండి ఉంటే మీరు భారతదేశంలో అడుగు పెట్టిన మరుక్షణమే మిమ్మల్ని అరెస్టు చేస్తారు. చీటింగ్ కేసు అన్నారు గనుక సూరిటీ తీసుకుని బెయిల్ ఇస్తారు. మీకు వీలు ఉంటే, తెలంగాణ హైకోర్టులో లుకౌట్ సర్క్యులర్‌పై రిట్ పిటిషన్ వేసి, కోర్టు ద్వారా ముందస్తు రక్షణ పొంది అప్పుడు రావటం మంచిది. మీ తరఫు న్యాయం ఉంటే భయం అవసరం లేదు. ముందు మీరు మీపై ఉన్న కేసు ఏంటి, కేసు ఏ స్టేజిలో ఉంది అనే విషయం తెలుసుకోండి. హై కోర్టులో లేదా సదరు కేసు నమోదైన కోర్టులో ఉపశమనం కోసం పిటిషన్లు వేయండి.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



మెగన్ మెర్కెల్

మెయిల్ & మెమరీస్

పిల్లల అందమైన బాల్యాన్ని అక్షరాలుగా చెప్పగలిగిన తల్లులు కొందరు డైరీల్లో దాచి ఉంటారు. మరికొందరు ఫొటోల రూపంలో నిక్షిప్తం చేసి ఉంటారు. అది కూడా గతకాలపు ఆలోచనే. ఇదేదీ కాదు, పెద్దయిన తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు బాల్యంలో ప్రతి రోజునీ వెనక్కి చూసుకోవాలంటే ఏం చేయాలి?

ఆలోచన ఓ మెట్టు పైన!

ప్రతిరోజూ ఒక ఫొటో తీసిపెట్టుకుంటే సరిపోతుందా? ఏరోజుకారోజు పిల్లలు ఏం చేశారో డైరీలో రాసి ఉంచితే బావుంటుందా? ప్రతి బిడ్డకు– తల్లికీ ఇవన్నీ మధురానుభూతులే. కానీ పని వత్తిడిలో పడి ఏదీ చేయకనే రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతాయి. పిల్లలు పెద్దయిపోతారు. ఇక ఇలా అప్పుడొకటి అప్పుడొకటి గుర్తు వచ్చినప్పుడు, ఆ సమయంలో తాను చెప్పింది వినడానికి పిల్లలకు సమయం ఉన్నప్పుడు మాత్రమే చెప్పుకోవాల్సి వస్తుంది. మెగన్ మెర్కెల్ మాత్రం నెక్స్ లెవెల్‌లో ఆలోచించింది. 'పిల్లల పెంపకంలో తాను మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. పిల్లలు కూడా తమ బాల్యాన్ని ఆస్వాదించాలి. తమ బాల్యాన్ని ఆస్వాదించడం అంటే వర్తమానంలో కాదు భవిష్యత్తులో ఆస్వాదించాలి. పెద్దయిన తర్వాత తమ బాల్యాన్ని చూసుకుని మురిసిపోవాలి'... అనుకుంది.

మెర్కెల్ మెయిల్ చేసింది!

తన పిల్లలు ఐదేళ్ల ఆర్చీ, మూడేళ్ల లిలిబెత్ ల కోసం చెరొక ఈమెయిల్ ఐడీ క్రియేట్ చేసింది. వాళ్లకు రోజూ ఈ మెయిల్ చేస్తుంది మెర్కెల్. ఇంత చిన్న పిల్లలు ఈమెయిల్ చూస్తారా? చూసినా ఏమి తెలుసుకుంటారు? అనే సందేహం వచ్చే మాట నిజమే. మెర్కెల్ ఏం చెబుతోందంటే... ''నా పిల్లలు పెద్దయిన తర్వాత, వాళ్లకు పదహారు, పద్దెనిమిదేళ్లు వచ్చిన తర్వాత వాళ్ల ఈ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తాను. అందులో వాళ్ల బాల్యం ఉంటుంది. తల్లిగా వారికి నేనిచ్చే అద్భుతమైన బహుమతి'' అంటోందామె. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ రోజు వాళ్లు ఏం చేశారో, వచ్చీరాని మాటలతో ఎంత హాస్యాన్ని సృష్టించారో రాస్తోంది మెర్కెల్. అలాగే రోజుకొక ఫొటో కూడా. పిల్లలను రోజూ ఫొటో తీస్తోంది. ఆ రోజు వాళ్లు చేసిన అల్లరిలో ఆమెకు ముచ్చటగా అనిపించిన ఒక ఫొటోను కూడా మెయిల్ చేస్తోంది. ఇలా తన పిల్లలకు వారి బాల్యాన్ని బహుమతిగా ఇస్తోంది మెగన్ మెర్కెల్.

> నా పిల్లలు పెద్దయిన తర్వాత, వాళ్లకు పదహారు, పద్దెనిమిదేళ్లు వచ్చిన తర్వాత వాళ్ల ఈ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తాను. అందులో వాళ్ల బాల్యం ఉంటుంది. తల్లిగా వారికి నేనిచ్చే అద్భుతమైన బహుమతి.
>
> – మెగన్ మెర్కెల్

పేరెంటింగ్ పాఠం

మెగన్ మెర్కెల్ తన పిల్లలకు చేస్తున్న ఈ మెయిల్స్ వారికి భవిష్యత్తులో గొప్ప అనుభూతినిస్తాయి. వారికి గుర్తింపును తెస్తాయని ప్రశంసించారు యూఎస్‌లోని కాన్షియస్ కో పేరెంటింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ డోర్సీ పోర్టర్. ఇది భావోద్వేగాలకు మాత్రమే పరిమితమైన విషయం కాదు, చాలా వ్యవస్థీకృతమైన పేరెంటింగ్ రూల్ అన్నారాయన. మెగన్ బాటలో మరీ అంత నిడివి ప్లాన్ లేకపోయినప్పటికీ ఆమె సూచిస్తున్న 'పిల్లల ఏడాది పొడవునా తీసిన ఫొటోల నుంచి మంచి ఫొటోలను ఎంపిక చేసి ప్రతి పుట్టిన రోజుకొక ఆల్బమ్ చేసి ఇవ్వవచ్చు' అనే ఐడియా కూడా అందంగా ఉంది. ఇంతకీ మెగన్ మెర్కెల్ ఎవరో గుర్తు పట్టారా? ఒకప్పటి నటి, యూఎస్‌లో ఎంటర్‌ప్రెన్యూర్, మీడియా పర్సన్. ఆమె తనకు తాను సాధించుకున్న గుర్తింపులేఇవన్నీ. ప్రపంచానికి ఆమె వెంటనే గుర్తురావాలంటే ప్రిన్స్ హ్యారీని వివాహం చేసుకుని బ్రిటిష్ రాజకుటుంబంలో కోడలిగా అడుగుపెట్టిన మహిళ అని చెప్పాలి. అలాగే ఆమె తన వ్యక్తిత్వాన్ని ఫణంగా పెట్టలేక భర్తతోపాటు రాజకుటుంబం నుంచి బయటకు వచ్చి యూఎస్‌లో జీవిస్తున్న సాధికార మహిళ.



తెలంగాణ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్‌కు స్వర్ణం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2025లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్ స్వర్ణ పతకంతో మెరిసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల నిష్కా ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ ఆల్ అరౌండ్ విభాగంలో విజేతగా నిలిచింది. నిష్కా 44.333 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని పొందింది. అనుష్క పాటిల్ (మహారాష్ట్ర: 42.067 పాయింట్లు) రజతం, సారా రవూల్ (మహారాష్ట్ర: 41.233 పాయింట్లు) కాంస్యం సాధించారు.

భారత్‌ను సెమీస్‌కు చేర్చిన రోహెన్ సింగ్



దక్షిణాసియా అండర్–19 పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4–0 గోల్స్ తేడాతో నేపాల్ జట్టును ఓడించి గ్రూప్ 'టాపర్'గా నిలిచి సెమీఫైనల్‌కు అర్హత పొందింది. భారత్ తరఫున చాపామాయుమ్ రోహెన్ సింగ్ (28వ, 76వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... ఒమంగ్ డోడుమ్ (29వ నిమిషంలో), డానీ మీటీ (84వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఈనెల 16న జరిగే సెమీఫైనల్లో మాల్దీవులు జట్టుతో భారత్ తలపడుతుంది.

ఎవరు ఆడతారు... ఆగిపోతారు?



- ఐపీఎల్‌లో విదేశీ ఆటగాళ్లు తిరిగి రావడంపై ఉత్కంఠ
- బోర్డులపై ఒత్తిడి పెంచుతున్న బీసీసీఐ
- ఎక్కువ మంది జట్లతో చేరే అవకాశం

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కొత్త షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఇప్పుడు లీగ్‌లో జరగాల్సిన తర్వాతి మ్యాచ్‌లపై అందరి దృష్టి నిలిచింది. ఆరు నగరాలు బెంగళూరు, ముంబై, లక్నో, అహ్మదాబాద్, ఢిల్లీ, జైపూర్‌లలో మిగిలిన 13 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు సిద్ధమైన గవర్నింగ్ కౌన్సిల్... 'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌ల వేదికలను ఇంకా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు మ్యాచ్‌ల వేదికలకంటే ఆయా జట్లకు ఎవరెవరు ఆటగాళ్లు అందుబాటులో ఉంటారనే విషయంపైనే ఉత్కంఠ నెలకొంది. ఐపీఎల్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు మే 9న ప్రకటించడంతోనే దాదాపు అందరు విదేశీ క్రికెటర్లతో పాటు సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్నవారు కూడా తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు మే 17 నుంచి ఐపీఎల్ మళ్లీ మొదలవుతున్నట్లుగా బీసీసీఐ సోమవారమే ప్రకటించింది. దాంతో ఫ్రాంచైజీలు తమ జట్లలోని కీలక ఆటగాళ్లను రప్పించే ప్రయత్నాలు మొదలు పెట్టాయి.


ఆటగాళ్ల ఇష్టానికి...

యుద్ధం కారణంగా టోర్నీ వాయిదా పడకుండా ఉంటే మే 25న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఐపీఎల్ ముగియాల్సి ఉంది. ఇప్పుడు కొత్త షెడ్యూల్ ప్రకారం జూన్ 3 వరకు టోర్నీ పొడిగించాల్సి వచ్చింది. అయితే విదేశీ ఆటగాళ్లందరూ మే 25 ప్రకారమే సిద్ధమై లీగ్ కోసం తమ ప్రణాళికలకు రూపొందించుకున్నారు. ఆ తేదీ తర్వాత ఆయా జాతీయ జట్ల సిరీస్‌లు, ఇతర ఒప్పందాల ప్రకారం వారు ఐపీఎల్‌లో కొనసాగే అవకాశం లేదు. ఐపీఎల్ తేదీల ప్రకారమే తాము ఎన్‌ఓసీలు జారీ చేశామని, దీనిపై మళ్లీ చర్చించిన తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. న్యూజిలాండ్ బోర్డు కూడా దాదాపు ఇదే తరహాలో స్పందించింది. మరో వైపు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) ఆటగాళ్ల ఇష్టానికి వదిలేసింది. వారి వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రధానంగా రెండు సిరీస్‌ల కారణంగా ఐపీఎల్‌లో విదేశీ ఆటగాళ్లు ఆడే విషయంలో ఇబ్బంది ఎదురు కావచ్చు. ఇంగ్లండ్, వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్‌లో పాల్గొనే ఆటగాళ్లలో చాలా మంది ఐపీఎల్‌లో భాగంగా ఉన్నారు. ఐపీఎల్ కొత్త తేదీల్లోనే ఈ సిరీస్ ఉంది. మరో వైపు జూన్ 11 నుంచి ప్రతిష్టాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఉంది. ఇందులో ఆడే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా క్రికెటర్లలో చాలా మంది కోసం ఐపీఎల్ టీమ్‌లు ఎదురు చూస్తున్నాయి. మే 31న ఎట్టి పరిస్థితుల్లోనూ టెస్టు టీమ్ ఒక చోటకు చేరాలని దక్షిణాఫ్రికా బోర్డు స్పష్టంగా ఆదేశించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఎంపిక చేసిన దక్షిణాఫ్రికా జట్టులోంచి రబడ, ఎన్‌గిడి, స్టబ్స్, మార్క్‌రమ్, రికెల్టన్, బాష్, యాన్సెన్, ముల్డర్ ప్రస్తుతం ఐపీఎల్ జట్లలో ఉన్నారు.

అహ్మదాబాద్‌లోనే ఫైనల్!

'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌ల వేదికల విషయంలో బీసీసీఐ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. పాత షెడ్యూల్ ప్రకారం రెండు మ్యాచ్‌లు హైదరాబాద్, మరో రెండు కోల్‌కతాలో జరగాల్సి ఉంది. అయితే ఈ రెండు నగరాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సాంకేతిక ఏర్పాట్ల సమస్యను దృష్టిలో ఉంచుకొని 'ప్లే ఆఫ్స్'ను ఇక్కడి నుంచి తరలించాలని బోర్డు యోచిస్తోంది. మ్యాచ్‌ల ప్రసారానికి సంబంధించిన ఎక్విప్‌మెంట్‌ను సిద్ధం చేయడంతో పాటు ఇతర ఏర్పాట్లు కూడా కొత్త వేదికలో కష్టమని భావిస్తోంది. పైగా 'ప్లే ఆఫ్స్' తేదీల్లో హైదరాబాద్, కోల్‌కతా నగరాల్లో వర్ష సూచన ఉంది. అందుకే మిగిలిన లీగ్ మ్యాచ్‌ల కోసం ఇప్పటికే ఎంపిక చేసిన ఆరు వేదికల నుంచి ఏవైనా రెండింటిలో 'ప్లే ఆఫ్స్' జరపాలనేది ఆలోచన. ఇదే కారణంగా చెన్నై, హైదరాబాద్ తమ హోం గ్రౌండ్‌లో ఆడాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లను కూడా ఫ్రాంచైజీలకు చెప్పి అక్కడి నుంచి తరలించారు. టోర్నీ నుంచి ఇప్పటికే నిష్క్రమించిన ఈ రెండు జట్ల చివరి మ్యాచ్‌లకు ఢిల్లీ వేదికవుతోంది. బీసీసీఐ యోచన ప్రకారం క్వాలిఫయర్–1, ఎలిమినేటర్‌లను ముంబైలో నిర్వహించి... క్వాలిఫయర్–2, ఫైనల్ మ్యాచ్‌లను అహ్మదాబాద్‌లో నిర్వహించవచ్చు.

వివిధ జట్లలో విదేశీ ఆటగాళ్ల ప్రస్తుత పరిస్థితి



హెడ్, కమిన్స్

- బట్లర్, కొయెట్జీ బుధవారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో తిరిగి చేరడం ఖాయమైంది.
- 'కెప్టెన్‌గా కమిన్స్‌పై బాధ్యత ఉంది. ఫ్రాంచైజీ అతను రావాలని కోరుకుంటోంది' అని కమిన్స్ మేనేజర్ వెల్లడించాడు. కమిన్స్, ట్రవిస్ హెడ్ సన్‌రైజర్స్ టీమ్‌తో త్వరలోనే కలుస్తారు.
- ఐపీఎల్ వాయిదా పడిన తర్వాత భారత్‌ను వీడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేయర్లు నరైన్, రసెల్, పావెల్, మెంటార్ బ్రేవో దుబాయ్‌లోనే ఆగిపోయారు. వారు బుధవారం రాత్రి వెనక్కి వస్తారు. దుబాయ్‌నుంచే గుర్బాజ్ కూడా రానుండగా, మాల్దీవుల్లో ఉన్న నోర్జే కూడా జట్టుతో చేరతాడు. మొయిన్ అలీ, స్పెన్సర్ జాన్సన్ రాకపై స్పష్టత లేదు.
- పంజాబ్ ఆటగాళ్లు బార్ట్‌లెట్, అజ్మతుల్లా, మిచెల్ ఒవెన్ తాము వస్తున్నామని సమాచారం అందించారు. అయితే హెడ్ కోచ్ పాంటింగ్, అసిస్టెంట్ కోచ్‌లు హాడిన్, హోప్స్ మాత్రం తాము తిరిగి రావడం లేదనే తేల్చేశారు.
- 'ప్లే ఆఫ్స్' అవకాశాలు లేకపోవడంతో కోచ్ ఫ్లెమింగ్ ఇష్టప్రకారమే తమ ఆటగాళ్లను వెనక్కి పిలవాలని చెన్నై నిర్ణయించింది. నూర్ ప్రస్తుతం చెన్నైలోనే ఉండగా, పతిరణ కూడా జట్టుతో చేరతాడు. రచిన్, కాన్వేల విషయంలో స్పష్టత లేదు.
- ముంబై ఆటగాడు ముజీబ్, లక్నో అసిస్టెంట్ కోచ్ క్లూసెనర్, ఢిల్లీ ఆటగాడు చమీరా తమ జట్లతో కలిశారు.
- బెంగళూరు తమ విదేశీ ఆటగాళ్లందరితో ప్రస్తుతం చర్చిస్తోంది. అయితే ప్రధాన పేసర్ హాజల్‌వుడ్ భుజం గాయం కారణంగా తిరిగొచ్చే అవకాశాలు తక్కువ.

'వారిద్దరు వన్డే వరల్డ్ కప్ ఆడకపోవచ్చు'

కోహ్లి, రోహిత్‌ల భవిష్యత్తుపై గావస్కర్ వ్యాఖ్య





న్యూఢిల్లీ: భారత క్రికెట్‌కు సంబంధించిన ఇద్దరు స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వారం రోజుల వ్యవధిలో టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. ఇకపై వన్డేల్లో మాత్రమే కొనసాగుతామని వీరు వెల్లడించారు. రెగ్యులర్‌గా వన్డేలు ఆడుతూ 2027లో జరిగే వన్డే వరల్డ్ కప్ వరకు కొనసాగే ఆలోచనతో రోహిత్, కోహ్లి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి కోరిక తీరడం కష్టమని, అది కూడా సాధ్యం కాకపోవచ్చని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. తన దృష్టిలో వారు వరల్డ్‌కప్ వరకు కొనసాగలేరని ఆయన అన్నారు. 'నా అభిప్రాయం ప్రకారం రోహిత్, కోహ్లి వన్డే వరల్డ్ కప్ ఆడలేరు. నిజాయితీగా చెప్పాలంటే అప్పటి వరకు వారు కొనసాగడం కష్టం. ఈ ఫార్మాట్‌లో వారిద్దరూ అద్భుతంగా ఆడినవారే. అయితే 2027 వరల్డ్ కప్ వరకు కూడా ఇలాగే ఆడగలరా. సెలక్టర్లకు కూడా ఇది పెద్ద సమస్య కావచ్చు. చాలా అసాధారణ ఫామ్‌తో ఆడుతూ సెంచరీల మీద సెంచరీలు కొడితే చెప్పలేం గానీ లేదంటే అంత సులువు కాదు' అని గావస్కర్ వ్యాఖ్యానించారు. మరోవైపు టెస్టు కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రాను ఎంపిక చేస్తే బాగుంటుందని, తన ఆలోచన ప్రకారం అతను సరైన రీతిలో జట్టును నడిపించగలడని సన్నీ పేర్కొన్నారు.

బృందావనంలో కోహ్లి దంపతులు...

టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మరుసటి రోజు తన భార్య అనుష్క శర్మతో కలిసి విరాట్ కోహ్లి మధురలోని బృందావనానికి వచ్చాడు. ఇక్కడి ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ గోవింద్ శరణ్‌జీ మహరాజ్‌ను కలిసి వీరిద్దరు ఆశీర్వాదం తీసుకున్నారు. కొద్దిసేపు ఆశ్రమంలో గడిపిన వీరిద్దరు ప్రేమానంద్ జీ ప్రవచనాలను భక్తి పారవశ్యంతో విన్నారు. కోహ్లి ఈ ఆశ్రమాన్ని సందర్శించడం గత రెండేళ్లలో ఇది మూడోసారి కావడం విశేషం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

రామ్‌చరణ్‌పై డాక్యుమెంటరీ?



'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రామ్‌చరణ్. ఈ చిత్రం తర్వాత ఆయనకి వచ్చిన క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఆ క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని రామ్‌చరణ్ జీవితంపై ఓ డాక్యుమెంటరీ ఫిల్మ్ రూపొందించేందుకు నెట్‌ఫ్లిక్స్ సంస్థ సన్నాహాలు చేస్తోందట. ఈ సంస్థ ఆరు నెలలుగా రామ్‌చరణ్ డాక్యుమెంటరీ పైన వర్క్ చేస్తోందని టాక్. ఈ హీరో కెరీర్, ఫ్యాన్స్‌తో ఉన్న అనుబంధం, అంతర్జాతీయ స్థాయిలో లభిస్తున్న గౌరవం, సాధించిన అవార్డులు... వంటి వాటన్నింటినీ ఈ డాక్యుమెంటరీలో పొందుపర్చనున్నారట మేకర్స్. త్వరలోనే ఈ డాక్యుమెంటరీకి సంబంధించి అధికారిక ప్రకటన వస్తుందనే వార్త ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. కాగా నెట్‌ఫ్లిక్స్ సంస్థ డైరెక్టర్ రాజమౌళి, హీరోయిన్ నయనతారలపై డాక్యుమెంటరీ ఫిల్మ్స్ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇక రామ్‌చరణ్ తాజా సినిమా విషయానికొస్తే.. బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

కింగ్ 100 నాటౌట్!



నాగార్జున

కొన్ని రోజులుగా తన వందో సినిమా కోసం నాగార్జున కథలు వింటున్నారు. ఈ క్రమంలో నాగార్జున వందో సినిమాకు ఈయనే డైరెక్టర్ అంటూ పలువురి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ ఇంకా ఎవరూ ఖరారు కాలేదు. అయితే తమిళ దర్శకుడు ఆర్.ఎ. కార్తీక్ చెప్పిన కథ నాగార్జునకు నచ్చిందని సమాచారం. దీంతో కథకు మరింత మెరుగులు దిద్దే పనిలో ఉన్నారట కార్తీక్. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ అతి త్వరలో పూర్తి స్థాయిలో మొదలవుతాయని, 'కింగ్ 100 నాటౌట్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. అన్నీ కుదిరితే త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తారని టాక్. ఇక నాగార్జునను అభిమానులు 'కింగ్' అని పిలుచుకుంటారనే సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన నూరవ చిత్రానికి 'కింగ్ 100 నాటౌట్' అనే టైటిల్ పెట్టాలనుకుంటున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్ తాజా చిత్రం 'కూలీ', ధనుష్ 'కుబేర' సినిమాల్లో నాగార్జున లీడ్ రోల్స్ చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలోని 'కుబేర' జూన్ 20న, లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోని 'కూలీ' సినిమా ఆగస్టు 14న రిలీజ్ కానున్నాయి.

రామ.. రామ... రామ...



చిరంజీవి

'రామ... రామ..' అంటూ యూట్యూబ్ వీక్షకులను చిరంజీవి అలరిస్తున్నారు. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'విశ్వంభర'లోని 'జై శ్రీరామ్... జై శ్రీరామ్... రామ... రామ... రామ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను ఏప్రిల్‌లో విడుదల చేశారు మేకర్స్. ఈ పాట యూట్యూబ్ మ్యూజిక్‌లో 25+ మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి, శ్రోతలను బాగా ఆకట్టుకుందని చిత్ర బృందం పేర్కొంది. ''జై శ్రీ రామ్' అనే నినాదాన్ని ప్రతిధ్వనించే ఈ సాంగ్ మ్యూజిక్ సెన్సేషన్‌గా మారి, చార్ట్ బస్టర్‌గా నిలిచింది. చిరంజీవిగారి డ్యాన్స్ గ్రేస్, ఆస్కార్ విన్నర్ కీరవాణిగారి మ్యూజిక్, రామజోగయ్యశాస్త్రిగారి లిరిక్స్, భారీ సెట్... ఇలా ఈ పాట అన్ని విధాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. మున్ముందు ఈ పాట మరింత పెద్ద హిట్ అవుతుందని ఊహిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

తండ్రి–కొడుకు వాయిస్ ఓవర్



అజయ్ దేవగన్, యుగ్ దేవగన్

బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్, ఆయన తనయుడు యుగ్ దేవగన్ తొలిసారి హాలీవుడ్ మూవీ 'కరాటే కిడ్: లెజెండ్స్' హిందీ వెర్షన్ కోసం డబ్బింగ్ చెప్పారు. జాకీ చాన్, రాల్ఫ్ మచియో, బెన్ వాంగ్, జాషువా జాక్సన్, సాడీ స్టాన్లీ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కరాటే కిడ్: లెజెండ్స్'. జోనాథన్ ఎంట్విస్టిల్ దర్శకత్వంలో కరెన్ రోసెన్‌ఫెల్ట్ నిర్మించిన ఈ హాలీవుడ్ చిత్రం ఈ నెల 30న ఇండియాలో ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా కంపెనీ భారత్‌లో రిలీజ్ చేస్తోంది. కాగా ఈ చిత్రంలో జాకీ చాన్ పోషించిన మిస్టర్ హాన్ పాత్రకు అజయ్ దేవగన్ వాయిస్ ఓవర్ చెప్పగా, బెన్ వాంగ్ పోషించిన లీ ఫాంగ్ పాత్రకు యుగ్ దేవగన్ డబ్బింగ్ చెప్పారు. ఓ అంతర్జాతీయ సినిమాకి డబ్బింగ్ చెప్పడం అజయ్‌కి ఇదే తొలిసారి కాగా, యుగ్ డబ్బింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందిన 'కరాటే కిడ్: లెజెండ్స్' న్యూయార్క్ నేపథ్యంలో సాగుతుంది. యువతకు స్ఫూర్తినిచ్చేలా ఈ చిత్ర కథాంశం ఉంటుంది. అజయ్–యుగ్ కలయిక ఇండియన్ డబ్బింగ్ వెర్షన్‌కి మరింత బలాన్నిస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

ఫ్యామిలీ కామెడీ



సిద్ధార్థ్, చైత్ర

జూలైలో తన 3 బీహెచ్‌కేను థియేటర్స్‌లో చూపిస్తానంటున్నారు హీరో సిద్ధార్థ్. శ్రీ గణేశ్ దర్శకత్వంలో సిద్ధార్థ్ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ '3 బీహెచ్‌కే'. ఈ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రంలో దేవయాని, శరత్‌కుమార్, చైత్ర ఇతర కీలక పాత్రల్లో నటించారు. అరుణ్ విశ్వ ఈ సినిమాను నిర్మించారు. '3 బీహెచ్‌కే'ను జూలై 4న విడుదల చేయనున్నట్లు మేకర్స్ మంగళవారం ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు. ''చక్కని బ్యూటిఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

సరికొత్త పాయింట్‌తో...



సత్యరాజ్

సత్యరాజ్, 'సత్యం' రాజేశ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్. సింహా, సాంచి రాయ్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో వానర సెల్యూలాయిడ్‌పై విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించారు. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్ బేస్డ్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరికొత్త పాయింట్‌తో మైథలాజికల్ టచ్‌తో రూపొందించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇటీవల ఫైనల్ కాపీ చూసుకున్నాక చిత్రం బాగా వచ్చిందనే నమ్మకం పెరిగింది. ఈ చిత్రంలో ఉదయ భాను నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేశారు. త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమేరా: కుశేందర్ రమేశ్ రెడ్డి, సంగీతం: ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్.

ధైర్యమే కాదు... అంతులేని త్యాగం కూడా...



ఆలియా భట్

కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఇండియన్ ఆర్మీ.. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే ఆ తర్వాత ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడం తెలిసిందే. కాగా పాక్ కుట్రలను దీటుగా ఎదుర్కొన్న ఇండియన్ ఆర్మీపై ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించారు. తాజాగా హీరోయిన్ ఆలియా భట్ కూడా ఇండియన్ ఆర్మీపై, సైనికుల మాతృమూర్తులపై ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ భావోద్వేగమైన పోస్ట్ పెట్టారు. ''గత కొన్ని రాత్రులు భిన్నంగా అనిపించాయి. ఒక దేశం ఊపిరి బిగబట్టినప్పుడు గాలిలో ఒక విధమైన నిశ్శబ్దం ఉంటుంది. కొద్ది రోజులుగా మనం ఆ నిశ్శబ్దాన్ని అనుభవించాం. మనం ఇళ్లలో హాయిగా నిద్రపోతున్నామంటే బోర్డర్‌లో ఉన్న సైనికులు చీకటిలో నిలబడి, తమ ప్రాణాలను అడ్డుగా పెట్టి మన నిద్రను కాపాడుతున్నారు. ఆదివారం మనమంతా మదర్స్ డేను సంతోషంగా చేసుకున్నాం. ఆ సమయంలో దేశ రక్షణ కోసం హీరోలను పెంచిన తల్లుల గురించి ఆలోచించకుండా ఉండలేకపోయా. వారిది కేవలం ధైర్యం మాత్రమే కాదు... అంతులేని త్యాగం కూడా. ఈ ప్రతి యూనిఫామ్ వెనుక నిద్రపోని ఒక తల్లి కూడా ఉంటుంది. తన బిడ్డకు ఏ రాత్రీ జోల పాటలా ఉండదని ఆ తల్లికి తెలుసు. ప్రాణాలు కోల్పోయిన సైనికులను తలచుకుని మనం దుఃఖిస్తున్నాము. అనిశ్చితి... ఒత్తిడితో కూడిన ఆ నిశ్శబ్దం ఏ క్షణమైనా బద్దలు కావొచ్చు. కానీ... ప్రతి రాత్రి ఉద్రిక్తతలు లేని ప్రశాంతతను కోరుకుంటున్నాం. ప్రార్థనలు చేస్తూ, కన్నీళ్లు దిగమింగుకుంటున్న ప్రతి తల్లిదండ్రులకు ప్రేమను పంపుతున్నాం... ఎందుకంటే మీ బలం ఈ దేశాన్ని మీరు ఊహించినదానికంటే ఎక్కువగా కదిలిస్తుంది. మన రక్షకుల కోసం, భారతదేశం కోసం కలిసి నిలబడదాం.. 'జైహింద్'' అంటూ పోస్ట్ చేశారు ఆలియా భట్.

త్వరలో వైభవం



రుత్విక్, ఇక్రా ఇద్రిసి

రుత్విక్, ఇక్రా ఇద్రిసి హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం 'వైభవం'. ఈ ఫీల్ గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమాకు సాత్విక్ దర్శకత్వం వహించగా, నూతన నిర్మాణ సంస్థ రమాదేవి ప్రొడక్షన్స్ నిర్మించింది. ఈ సినిమాను ఈ నెల 23న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''మంచి సినిమాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారన్న విషయం మరోసారి మా సినిమాతో నిరూపితమవుతుందన్న నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ తెలిపింది.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,282	346
81,148	24,578

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,034	△	325
డోజోన్స్	42,208	▽	202
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,603	▽	2
డాక్స్	23,639	△	72
షాంఘై	3,375	△	6
నికాయ్	38,183	△	536

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధనలక్ష్మి	83.54	87.22
£	బ్రిటన్ పౌండ్	ధనలక్ష్మి	111.24	115.17
€	యూరో	ధనలక్ష్మి	92.67	97.15
¥	జపాన్ యెన్ (100)	ధనలక్ష్మి	46.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధనలక్ష్మి	52.16	56.98
S$	సింగపూర్ డాలర్	ధనలక్ష్మి	63.04	67.51
SAR	సౌదీ రియాల్	ధనలక్ష్మి	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	ధనలక్ష్మి	22.35	24.13
¥	చైనా యువాన్	ధనలక్ష్మి	10.98	12.80

ఎయిర్‌టెల్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 11,022 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 11,022 కోట్లను తాకింది. వన్‌టైమ్ పన్ను లబ్ధి, టారిఫ్‌ల పెంపు ప్రధానంగా ప్రభావం చూపాయి. కొన్ని పన్నుసంబంధిత అంశాలలో రూ. 5,913 కోట్లు అందుకుంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 2,072 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 27% ఎగసి రూ. 47,876 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 37,599 కోట్ల టర్నోవర్ సాధించింది. దేశీ(స్టాండెలోన్) ఆదాయం 29% జంప్ చేసి రూ. 36,735 కోట్లయ్యింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 17% మెరుగుపడి రూ. 245ను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 209గా నమోదైంది. 66 లక్షల మంది స్మార్ట్‌ఫోన్ యూజర్లు జత కలసినట్లు కంపెనీ వైస్‌చైర్మన్, ఎండీ గోపాల్ విఠల్ పేర్కొన్నారు. దేశీ యూజర్ల సంఖ్య 42.4 కోట్లకు చేరింది. 15 దేశాలలో విస్తరించిన కార్యకలాపాల ద్వారా 59 కోట్ల మంది యూజర్లున్నారు. డేటా కస్టమర్ల సంఖ్య 77%కి చేరింది. సగటున నెలకు మొబైల్ డేటా వినియోగం 21% ఎగసి 25.1 జీబీని తాకింది.

పూర్తి ఏడాదికి సైతం

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎయిర్‌టెల్ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 33,556 కోట్లకు చేరింది. 2023–24లో కేవలం రూ. 7,467 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతంపైగా పుంజుకుని రూ. 1,72,985 కోట్లను తాకింది. 2023–24లో రూ. 1,49,982 కోట్ల టర్నోవర్ మాత్రమే నమోదైంది. నికర రుణ భారం రూ. 1.94 లక్షల కోట్ల నుంచి రూ. 2.03 లక్షల కోట్లకు పెరిగింది. క్యూ4లో పెట్టుబడి వ్యయాలు రూ. 12,553 కోట్ల నుంచి రూ. 14,401 కోట్లకు ఎగశాయి. అదనంగా 3,300 టవర్లను ఏర్పాటు చేసింది. పూర్తి ఏడాదికి పెట్టుబడి వ్యయాలు రూ. 33,242 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం నష్టంతో రూ. 1,821 వద్ద ముగిసింది.

ధరలు దిగొచ్చాయ్..!

- ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- ఏప్రిల్‌లో 3.16 శాతానికి డౌన్
- తగ్గిన కూరగాయలు, పండ్ల ధరలు




న్యూఢిల్లీ: మరో విడత కీలక పాలసీ రేట్ల కోత అంచనాలకు ఊతమిస్తూ ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ట స్థాయికి దిగి వచ్చింది. కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల ధరలు తగ్గడంతో 3.16 శాతానికి పరిమితమైంది. చివరిసారిగా 2019 జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.15 శాతంగా నమోదైంది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన డేటా ప్రకారం వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఈ ఏడాది మార్చిలో 3.34 శాతంగా, 2024 ఏప్రిల్‌లో 4.83 శాతంగాను ఉంది. ఇక తాజా మార్చి డేటాతో పోలిస్తే ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 91 బేసిస్ పాయింట్లు తగ్గి 2.69 శాతం నుంచి 1.78 శాతానికి దిగి వచ్చింది. 2021 అక్టోబర్ తర్వాత మళ్లీ ఈ స్థాయికి తగ్గడం ఇదే తొలిసారి. 2024 ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 8.7 శాతంగా నమోదైంది. 'కూరగాయలు, పప్పు ధాన్యాలు, పండ్లు, మాంసం..చేపలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు మొదలైన వాటి ధరలు తగ్గడంతో 2025 ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం, ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గాయి' అని ఎన్‌ఎస్‌వో వెల్లడించింది. డేటా ప్రకారం ద్రవ్యోల్బణం తెలంగాణలో అత్యల్పంగా 1.26 శాతంగా, కేరళలో అత్యధికంగా 5.94 శాతంగా ఉంది.

రేట్ల కోత అంచనాలు..

ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో జూన్‌లో నిర్వహించే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక పాలసీ రేట్లను మరో పావు శాతం తగ్గించే అవకాశం ఉందని ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ తెలిపారు. ఈ సంవత్సరం మొత్తం మీద అదనంగా 75 బేసిస్ పాయింట్లు (ముప్పావు శాతం) తగ్గించవచ్చని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణాన్ని (రెండు శాతం అటూ ఇటుగా) నాలుగు శాతానికి పరిమితం చేయడం లక్ష్యంగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటుందన్న సంగతి తెలిసిందే. దానికి తగ్గట్లుగానే ధరలు దిగి వస్తుండటంతో ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో రెండు విడతలుగా పాలసీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) తగ్గించింది.

టాటా మోటార్స్ లాభం తగ్గింది

- క్యూ4లో రూ. 8,556 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆటో రంగ టాటా గ్రూప్ దిగ్గజం టాటా మోటార్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 51 శాతం క్షీణించి రూ. 8,556 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 17,528 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 6 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,19,033 కోట్ల నుంచి రూ. 1,19,503 కోట్లకు స్వల్పంగా బలపడింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 28,149 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. 2023–24లో రూ. 31,807 కోట్ల లాభం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,34,016 కోట్ల నుంచి రూ. 4,39,695 కోట్లకు ఎగసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఆటోమోటివ్ బిజినెస్ ప్రస్తుతం రుణ రహితంగా మారినట్లు కంపెనీ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. కంపెనీ విడదీతకు వాటాదారులు ఆమోదముద్ర వేసినట్లు వెల్లడించారు.

జేఎల్‌ఆర్ ఓకే: క్యూ4లో లగ్జరీ కార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్‌ఆర్) ఆదాయం 2 శాతం నీరసించి 7.7 బిలియన్ పౌండ్లను తాకినట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. పూర్తి ఏడాదికి దాదాపు యథాతథంగా 29 బిలియన్ పౌండ్ల టర్నోవర్ సాధించినట్లు తెలియజేసింది. యూఎస్, యూకే మధ్య తాజాగా కుదిరిన వాణిజ్య డీల్ జేఎల్‌ఆర్‌కు సానుకూలమని పేర్కొంది. ఐదేళ్ల కాలంలో 18 బిలియన్ పౌండ్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు తెలియజేసింది. కాగా.. క్యూ4లో టాటా మోటార్స్ స్టాండెలోన్ నికర లాభం 35 శాతం క్షీణించి రూ. 1,382 కోట్లకు పరిమితంకాగా.. మొత్తం ఆదాయం రూ. 20,260 కోట్ల నుంచి రూ. 19,999 కోట్లకు స్వల్పంగా నీరసించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2% క్షీణించి రూ. 708 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 1,282 పాయింట్లు డౌన్

- ప్రైవేటు బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ
- నిఫ్టీ నష్టం 346 పాయింట్లు



ముంబై: ఐటీ, ఆటో, ప్రైవేటు బ్యాంకులు షేర్లలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో మంగళవారం స్టాక్ సూచీలు ఒకటిన్నర శాతం క్షీణించాయి. సెన్సెక్స్ 1,282 పాయింట్లు క్షీణించి 81,148 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346 పాయింట్లు పతనమై 24,578 వద్ద నిలిచింది. అమెరికా చైనాల మధ్య ట్రేడ్ డీల్ కుదరడంతో విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి చైనా మార్కెట్‌కు తరలిపోవచ్చనే అనుమానాలు తలెత్తాయి. ఉక్కు, అల్యూమినియంపై సుంకాల విషయంలో అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించాలనే ప్రతిపాదనతో భారత్ ప్రపంచ వాణిజ్య మండలిని ఆశ్రయించడంతో ట్రేడ్ వార్ ఆందోళనలు తెరపైకి వచ్చాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పుంజుకోవడం, యూఎస్ బాండ్లపై రాబడులు పెరగడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా పరిమిత శ్రేణిలో బలహీనంగా ట్రేడయ్యాయి. ద్వితీయార్ధం నుంచి అమ్మకాల తీవ్రత పెరగడంతో నష్టాలు మరింత పెరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,386 పాయింట్లు క్షీణించి 81,044 వద్ద, నిఫ్టీ 378 పాయింట్లు పతనమై 24,547 వద్ద కనిష్టాలు తాకాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–2%), ఇన్ఫోసిస్(–3.50%), రిలయన్స్ (–1.50%), టీసీఎస్(–3%), భారతీ ఎయిర్‌టెల్(3%), ఐసీఐసీఐ బ్యాంకు (–1%) నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. సెన్సెక్స్ పతనంలో ఈ షేర్ల వాటాయే 845 పాయింట్లు కావడం గమనార్హం.
- రంగాల వారీగా సూచీల్లో ఐటీ 2.50%, టెక్ 2.40%, యుటిలిటీ 1.35%, విద్యుత్, మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ ఒకశాతం చొప్పున నష్టపోయాయి. స్మాల్‌క్యాప్ సూచీ 1%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17శాతం పెరిగాయి. మరోవైపు ఫార్మా, ఇండస్ట్రియల్, క్యాపిటల్ గూడ్స్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- రక్షణ రంగ షేర్లకు మూడోరోజూ డిమాండ్ నెలకొంది. భారత్ డైనమిక్స్ 11%, యాక్సిస్కేడ్స్ 5%, డేటా ప్యాటర్న్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ 4%, మిశ్ర ధాతు నిగమ్ 3.50% రాణించాయి. పారాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్, డీసీఎక్స్ సిస్టమ్స్ 3% లాభపడ్డాయి. ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 9%, ఏరియల్ ఇన్నోవేషన్స్ 5% పెరిగాయి.
- సెబీ మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఎండీ పదవికి అన్మోల్ సింగ్, హోల్‌టైమ్ డైరెక్టరు పదవికి పునీత్ సింగ్ జగ్గీ రాజీనామాతో జెన్సోల్ ఇంజనీరింగ్ షేరు 5% క్షీణించి రూ.52 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. తదుపరి అనూహ్య రికవరీతో 5% లాభపడి 57.28 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి, అక్కడే ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

హీరో మోటో లాభం జూమ్	రత్నాభరణాల ఎగుమతులు వెలవెల

పేటీఎమ్‌లో వాటా విక్రయం

- 4% వాటా అమ్మిన యాంట్ గ్రూప్
- బ్లాక్‌డీల్స్ విలువ రూ. 2,104 కోట్లు



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ చైనా దిగ్గజం యాంట్ గ్రూప్ తాజాగా దేశీ డిజిటల్ పేమెంట్స్ కంపెనీ వన్97 కమ్యూనికేషన్స్‌లో 4 శాతం వాటా విక్రయించింది. పేటీఎమ్ బ్రాండ్ కంపెనీలో వాటాను షేరుకి రూ. 823–826 ధరల శ్రేణిలో దాదాపు రూ. 2,104 కోట్లకు అమ్మివేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 2.55 కోట్లకుపైగా షేర్లను విక్రయించింది. బీఎస్‌ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం గోల్డ్‌మన్ శాక్స్(సింగపూర్) 37.35 లక్షల షేర్లు(0.59% వాటా) కొనుగోలు చేసింది. షేరుకి రూ. 823 సగటు ధరలో ఇందుకు రూ. 307.4 కోట్లు వెచ్చించింది. ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. ఈ లావాదేవీల తదుపరి పేటీఎమ్‌లో యాంట్ గ్రూప్ వాటా 9.85% నుంచి 5.85%కి తగ్గింది.

బల్క్ డీల్స్ నేపథ్యంలో పేటీఎమ్ షేరు బీఎస్‌ఈలో 1.1 శాతం నష్టంతో రూ. 857 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 864–823 మధ్య కదలాడింది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– రీజనింగ్

జాబ్ పాయింట్

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో 400 ఆఫీసర్ పోస్టులు

ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 400 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా తమిళనాడు, ఒడిసా, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌ల్లో ఖాళీలను భర్తీ చేయనుంది. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకునే రాష్ట్రానికి సంబంధించిన అధికారిక భాషపై పట్టుండటం తప్పనిసరి.

» **పోస్టుల వివరాలు:** లోకల్ బ్యాంక్ ఆఫీసర్.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి 20–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్థానిక భాష పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 31.05.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iob.in

హెచ్‌పీసీఎల్‌లో 103 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్).. సంస్థకు చెందిన రిఫైనరీస్ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 103.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(మెకానికల్–11 పోస్టులు, ఎలక్ట్రికల్–17 పోస్టులు, ఇన్‌స్ట్రుమెంటేషన్–6 పోస్టులు, కెమికల్–41 పోస్టులు, ఫైర్ అండ్ సేఫ్టీ– 28 పోస్టులు).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా, సైన్స్ విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు చివరి తేదీ నాటికి గరిష్ట వయోపరిమితి 25 ఏళ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **పే స్కేల్:** నెలకు వేతన శ్రేణి రూ.30,000–రూ.1,20,00 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్/టాస్క్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 21.05.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.hindustanpetroleum.com

ఎన్‌ఆర్‌ఎస్‌సీలో 31 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్‌ఆర్‌ఎస్‌సీ)..వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **విభాగాలు:** ఫారెస్ట్రీ అండ్ ఎకాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, అర్బన్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్.
» **అర్హతలు:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఆర్క్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** 30.05.2025 నాటికి 18–30ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 30.05.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nrsc.gov.in/Career_Apply?language_content_entity=en

నేషనల్ హైవేస్ అథారిటీలో 60 ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ).. 60 డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 60
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్ టెక్నికల్.
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్–2025 స్కోర్ ఉండాలి.
» **వయసు:** గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, గేట్ స్కోర్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 09.06.2025
» **వెబ్‌సైట్:** https://nhai.gov.in/#/

సీఐఎస్‌ఎఫ్‌లో 30 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్).. స్పోర్ట్స్ కోటా(హాకీ)లో హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల సంఖ్య:** 30.
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ).
» **అర్హత:** గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు హాకీలో రాష్ట్ర/జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:**30.05.2025
» **వెబ్‌సైట్:** www.cisf.gov.in/cisfeng/recruitment

ప్రిలిమ్స్.. తేలిగ్గా తీసుకోవద్దు!

దేశవ్యాప్తంగా లక్షల మంది హాజరయ్యే ప్రతిష్టాత్మక పరీక్ష.. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష. యూపీఎస్సీ.. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ వంటి 23 ప్రతిష్టాత్మక సర్వీసులకు ప్రతి ఏటా అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమ్స్ అత్యంత కీలకమైన గేట్వే! ఇందులో అర్హత సాధిస్తేనే తదుపరి దశలైన మెయిన్స్, ఇంటర్వ్యూకు అవకాశం లభిస్తుంది. కాబట్టి ప్రిలిమ్స్‌ను ఏమాత్రం తేలిగ్గా తీసుకోకుండా.. స్మార్ట్ స్టడీతోపాటు వేగం, కచ్చితత్వం పెంచుకునేందుకు నిరంతర సాధన కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెల(మే) 25న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో.. ఎగ్జామ్ డే టిప్స్..


సివిల్స్ 2025

» మే 25న దేశవ్యాప్తంగా సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష
» 5 లక్షల మందికిపైగా హాజరయ్యే అవకాశం
» స్మార్ట్ స్టడీతోపాటు రివిజన్ కీలకమంటున్న నిపుణులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మొత్తం 979 పోస్టుల భర్తీకి ఈ ఏడాది జనవరిలో సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 25న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి మంగళవారం (మే 13న) హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

400 మార్కులకు ప్రిలిమ్స్

ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. ఇలా మూడు దశలుగా జరిగే సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 400 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ స్టడీస్ పేపర్ 1, జనరల్ స్టడీస్ పేపర్ 2.. 200 మార్కులకు చొప్పున ఉంటాయి. జనరల్ స్టడీస్ పేపర్–2 అర్హత పరీక్ష మాత్రమే. అయితే ఇందులో అర్హత సాధించేందుకు కనీసం 33 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. ప్రతి పేపర్‌కు పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్న పత్రాలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి.

జీఎస్ పేపర్ 1 కీలకం

జనరల్ స్టడీస్ పేపర్ 2లో కనీస అర్హత మార్కులు(33 శాతం), అదేవిధంగా జనరల్ స్టడీస్ పేపర్ 1లో మొత్తం క్వాలిఫైయింగ్ మార్కులను పరిగణనలోకి తీసుకొని.. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులను యూపీఎస్సీ ప్రకటిస్తుంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించేందుకు జనరల్ స్టడీస్ పేపర్ 1లో సాధించే స్కోర్ అత్యంత కీలకంగా నిలుస్తుంది. కాబట్టి పేపర్1లో సాధ్యమైనంత ఎక్కువ స్కోర్ చేసేలా కృషి చేయాలి.

రివిజన్ నిర్ణయాత్మకం

మరో పది రోజుల్లో పరీక్ష జరుగనుంది. కాబట్టి ఇప్పటి నుంచి పరీక్ష రోజు వరకూ.. పూర్తిగా రివిజన్‌పై ఫోకస్ చేయాలి. ఎంతోకాలంగా చదువుతూ సిద్ధం చేసుకున్న షార్ట్ నోట్స్‌ను రివిజన్ కోసం ఉపయోగించుకోవాలి. ఈ సంక్షిప్త నోట్స్ ద్వారా సాధ్యమైనన్ని ఎక్కువసార్లు క్విక్ రివిజన్ పూర్తి చేసుకోవాలి. ముఖ్యంగా ఎకానమీలో గణాంకాలను, చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలను, తేదీలను; పాలిటీలో ప్రధానమైన ఆర్టికల్స్‌ను, చట్టాలను; కరెంట్ అఫైర్స్‌లో ముఖ్యమైన సంఘటనలను, జాగ్రఫీలో కీలక ప్రదేశాలను, జనరల్ సైన్స్‌లో విటమిన్స్, వ్యాధులు–వ్యాక్సిన్‌లు వంటి వాటిని మనసులో ప్రింట్ చేసుకోవాలి. ఇందుకోసం మెమొరీ టెక్నిక్స్‌ను వినియోగించుకోవచ్చు.

వేగం, కచ్చితత్వం

సివిల్స్ ప్రిలిమ్స్‌లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. కాబట్టి మైనస్ మార్కుల బారిన పడకుండా ఉండాలంటే.. అభ్యర్థులు వేగం, కచ్చితత్వం సొంతమయ్యేలా కృషి చేయాలి. ఇందుకోసం గత ప్రశ్న పత్రాలతోపాటు ఇప్పటి నుంచి ప్రతి రోజు ఒక మోడల్ పేపర్ సాధించే ప్రయత్నం చేయాలి. తద్వారా నిర్ణీత రెండున్నర గంటల సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించగలుగుతున్నారో తెలుస్తుంది. మోడల్ టెస్టుల విశ్లేషణతో చేస్తున్న పొరపాట్లు తెలుస్తాయి. టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది. అంతేకాకుండా ఎలిమినేషన్ టెక్నిక్స్ వ్యూహాలకు పదును పెట్టుకోవచ్చు.

ఒత్తిడిని అధిగమించేలా

ఎంత చదివినా పరీక్ష అనగానే ఒత్తిడి సహజం. కాని ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం సొంతమవుతుందని గుర్తించాలి. అందుకోసం పరీక్షకు రెండు రోజుల ముందు నుంచే పరిమితంగా చదువుతూ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి. తప్పనిసరిగా 8గంటలు నిద్రపోయేలా ప్లాన్ చేసుకోవాలి. సరిపడ నీటిని తాగుతూ, తేలికైన ఆహారాన్ని తీసుకుంటూ.. మెదడు చురుగ్గా ఉండేలా చూసుకోవాలి. దీంతోపాటు పరీక్ష సమీపిస్తున్న కొద్దీ స్మార్ట్ స్టడీపై ఫోకస్ చేయాలి. అంటే పరీక్ష కోణంలో అత్యంత ముఖ్యమైన అంశాలను వేగంగా రివైజ్ చేయాలి. అదేవిధంగా వ్యూహాత్మక ఆలోచన విధానం మెరుగుపరచుకోవాలి. ఇది పరీక్ష హాల్లో సరైన సమాధానాలు గుర్తించడంలో దోహదపడుతుంది.

పరీక్ష హాల్లో ఇలా

- పరీక్ష రోజున నిర్ణీత సమయానికి కనీసం గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి. ప్రశ్న పత్రం తీసుకున్నాక ఆందోళన చెందకుండా ప్రశాంతంగా అన్ని ప్రశ్నలను ఒకసారి పరిశీలించాలి. ఆ క్రమంలో తేలికైన ప్రశ్నలను గుర్తించి.. వాటికి సమాధానాలను తక్షణమే ఓఎంఆర్ షీట్‌లో బబుల్ చేయాలి. జీఎస్ పేపర్ 1లో తొలి రౌండ్‌లో కచ్చితంగా సమాధానం తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. తదుపరి రౌండ్‌లో ఎలిమినేషన్ టెక్నిక్స్, ఆ తర్వాత దశలో స్మార్ట్ గెస్సింగ్ ద్వారా సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేయాలి.
- జీఎస్ పేపర్ 2లో కనీసం అర్హత మార్కులు సాధించేలా.. ప్రాధాన్య క్రమంలో తేలికైన ప్రశ్నలను గుర్తించి, వాటికి సమాధానాలు ఇవ్వాలి. ఈ పేపర్‌లో స్కోర్ కోసం రఫ్‌వర్క్ స్పేస్‌ను పొదుపుగా వాడుకుంటూ..లాజికల్‌గా ఆలోచిస్తూ.. షార్ట్ కట్స్ ద్వారా వేగంగా సమాధానాలు సాధించాలి.

సివిల్స్ ప్రిలిమ్స్ 2025.. ముఖ్యమైన టాపిక్స్

చంద్రయాన్, స్పేస్‌డెక్స్ మిషన్, సీడ్ బ్యాంక్, హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్, లిగో ఇండియా ప్రాజెక్ట్, వక్ఫ్ అమెండమెంట్ బిల్, జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్, గ్రోక్3, ఇజ్రాయెల్–గాజాస్ట్రిప్, స్ట్రెయిట్ ఆఫ్ హార్మోజ్, కాంగో, ఉక్రెయిన్–రష్యా, జీ 20, క్వాడ్, బిమ్‌స్టెక్, నాటో, సింధూ జలాల ఒప్పందం, సిమ్లా ఒప్పందం, తొలి గ్లోబల్ బుద్ధిస్ట్ సమిట్, పీవీటీజీలు, జీఎస్టీ, మణిపూర్ హింస, ఆర్టికల్ 370, పీఎల్ఐ స్కీమ్, పుష్కరాలు, పనామా, సూయజ్, గ్రీన్ ల్యాండ్, ఎస్‌సీవో, సూడాన్, ఫారిన్ ట్రేడ్ పాలసీ, ఇండో పాక్ సంబంధాలు, అమెరికా–చైనా మధ్య టారిఫ్ వార్, ఆఫ్రికాలో అంతర్యుద్ధాలు, యెమెన్–హూతీలు, మధ్యధరా సముద్రం, ఏఐ టెక్నాలజీ.



దడ పుట్టించే ‘డ్రోణా’స్త్రం

యుద్ధ రీతిని సమూలంగా మార్చిన డ్రోన్లు

- సైనిక సంపదలో కీలకంగా ఈ ఆధునిక వ్యవస్థ
- ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్
- డ్రోన్స్ తయారీలో దిగ్గజ కంపెనీలు నిమగ్నం
- మేము సైతం అంటున్న హైదరాబాద్ సంస్థలు

సాక్షి స్పెషల్ డెస్క్, సాక్షి, హైదరాబాద్: రాజుల కాలంలో కత్తులు, బల్లేలతో సైనికులు రణక్షేత్రంలో పోరాడారు. తరవాత.. యుద్ధ భూమిలో తుపాకులు, బాంబుల మోత మోగింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక మానవ రహిత విమానాలు, క్షిపణులతో విరుచుకుపడుతున్నారు. ఇప్పుడు.. ఏకంగా వేల మైళ్ల దూరం నుంచే శత్రుదేశంపై దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తున్నారు. ఇజ్రాయెల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్.. తాజాగా భారత్–పాక్... యుద్ధం ఏదైనా.. డ్రోన్స్ (మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీ)) ఇప్పుడు సైనిక సంపదలో అత్యంత కీలకంగా మారాయి.

పెళ్లిళ్ల వంటి వేడుకల్లో ఫొటోలూ, వీడియోలూ తీసే డ్రోన్స్ మాత్రమే చాలా మందికి సుపరిచితం. కానీ, డ్రోన్స్ అంటే అంతకుమించి. డ్రోన్లు అధునాతన ఆయుధాలు. ఎవ్వరూ ప్రాణాలను పణంగా పెట్టకుండానే కచ్చితమైన దాడులు చేయడం, వేగంగా మోహరించే సామర్థ్యం వీటి సొంతం. క్షిపణులతో పోలిస్తే వీటి అభివృద్ధికి అయ్యే వ్యయమూ తక్కువే.

మన దేశంలో డ్రోన్ల వాడకం..

1999లో కార్గిల్ యుద్ధంలో మన సైన్యం తొలిసారి యూఏవీలను వినియోగించింది. ఆ తర్వాత ఇండియా అధికారికంగా వీటి కొనుగోలు మొదలుపెట్టింది. ప్రస్తుతం మన సైన్యం వద్ద ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసుకున్న సెర్చర్ ఎంకే–2 టాక్టికల్ డ్రోన్స్, హెరాన్‌మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (ఎంఏఎల్ఈ), హార్పీ యాంటీ రాడార్ డ్రోన్లు ఉన్నాయి. హార్పీ అనేది ఆత్మాహుతి డ్రోన్(లాహోర్ వైమానిక రక్షణ వ్యవస్థను కూల్చివేసే క్రమంలో దీన్ని వినియోగించారు). వీటితో పాటు హరోప్ లాయిటరింగ్ అటాక్ డ్రోన్స్ కూడా ఉన్నాయి. రాడార్ సైట్లు, వాహనాలే లక్ష్యంగా మందుగుండుతో ఢీకొట్టి సర్వనాశనం చేయడం దీని స్పెషాలిటీ. దీంతో పాటు అధిక మన్నిక, పేలోడ్ సామర్థ్యం కలిగిన ఇజ్రాయిల్ ఎంఏఎల్ఈ డ్రోన్ ‘హెరాన్‌టీపీ/మార్క్ 2’కూడా మన దగ్గర ఉంది.

మొదటి ప్రపంచ యుద్ధంలో..

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, అమెరికా రెండూ తొలిసారిగా యూఏవీతో ప్రయోగాలు చేశాయి. 1950–60లలో శత్రు భూభాగంపై గూఢచర్యం చేయడానికి యూఎస్ చిన్న రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు ఉపయోగించింది. వియత్నాం యుద్ధంలో నిఘా యూఏవీలు తొలిసారిగా మోహరించారు. 2000వ సంవత్సరంలో అమెరికా హెల్‌ఫైర్ క్షిపణులతో కూడిన ప్రిడేటర్ డ్రోన్‌ను రూపొందించింది. ఇక్కడి నుంచే సైనిక ఆయుధ భాండాగారంలో పెనుమార్పులు వచ్చాయి.

550 కంపెనీలు

డ్రోన్స్ తయారీలో దేశంలో 550 కంపెనీలు ఉన్నాయి. ఇందులో 100కుపైగా సంస్థలు ప్రత్యేకంగా రక్షణ రంగం కోసం పనిచేస్తున్నాయి. పలు కంపెనీలు విదేశీ సంస్థలతో చేతులు కలిపాయి.

డ్రోన్ల ఖర్చు ఎంత తక్కువ అంటే..

ఫైటర్ జెట్ (రఫాలే)
ఖర్చు రూ.**600-800** కోట్లు
హై ఎండ్ డ్రోన్: రూ.**30-100** కోట్లు

ఇంటెలిజెంట్ డ్రోన్స్



స్వదేశీ పరిజ్ఞానంతో యూఏవీల అభివృద్ధి, ఇంటెలిజెంట్ యూఏవీ సొల్యూషన్ల రూపకల్పనలో నిమగ్నమయ్యాం. సైనిక, హై– ఎండ్ కమర్షియల్ యూఏవీలను మనమే తయారుచేస్తున్నాం. స్మార్ట్ డ్రోన్ టెక్నాలజీలో పరిశోధన, అభివృద్ధి, ఇంటెలిజెంట్ నావిగేషన్, మల్టిపుల్ డ్రోన్ కో–ఆర్డినేషన్‌పై దృష్టి సారించాం.

– డి.విద్యాసాగర్, ఎండీ, ట్రిన్నోవేట్ సినర్జీ టెక్నాలజీస్, హైదరాబాద్

మన సామర్థ్యం తెలిసింది



దాయాదిపై యుద్ధంతో మన టదేశ సైన్యం, సాంకేతిక సామర్థ్యం ప్రపంచ దేశాలకు తెలిసొచ్చింది. ఇది మరింత అధునాతన, ఆటోమేటెడ్ సైనిక కార్యకలాపాల వైపు దృష్టి పెట్టేలా చేస్తుంది. మానవరహిత వైమానిక వ్యవస్థలు నియంత్రణ రేఖ వెంబడి పరిస్థితులపై అవగాహన పెంచాయి.

– సామల రాహుల్ రెడ్డి, ఆపరేషన్ మేనేజర్, తెలంగాణ ఏవియేషన్‌అకాడమీ

మగ తేనెటీగను ఇంగ్లీషులో డ్రోన్ అంటారు. శ్రామిక తేనెటీగలకన్నా ఇవి పెద్దగానే ఉంటాయి. కానీ తేనెనూ సంపాదించలేవు. తమను తామూ పోషించుకోలేవు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఇవి చేసే పని ఏమీ ఉండదు. కానీ, ఆడ తేనెటీగ కోసం వెతుకుతూ ఎగిరి, దాన్ని కలిశాక పడిపోతుంది. డ్రోన్ మాత్రం అలాకాదు.. చూసి రమ్మంటే కాల్చి వస్తుంది.

హైదరాబాద్ నుంచి..

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో ఇప్పటికే నిలిచింది. డిఫెన్స్ డ్రోన్‌విభాగంలోనూ ఇదే బాటలో పయనిస్తోంది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్.. భారత రక్షణ శాఖ కోసం ఏఎల్ఎస్–250 యూఏవీలను ఉత్పత్తి చేస్తోంది. అదానీ–ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా.. హెర్మీస్ 900 యూఏవీలను తయారు చేస్తోంది. రక్షణ రంగానికి కావాల్సిన కీలక యంత్ర, పరికరాల తయారీలో ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన హైదరాబాద్ సంస్థ ఎస్ఈసీ ఇండస్ట్రీస్‌కు చెందిన ట్రిన్నోవేట్ సినర్జీ టెక్నాలజీస్ చిన్న యూఏవీలు, హైబ్రిడ్ డ్రోన్స్ సరఫరా చేస్తోంది. ఆయుధాలను మోసే యూఏవీలను ఇండియన్ ఆర్మీకి అందిస్తోంది. జెన్ టెక్నాలజీస్ చిన్న యూఏవీలను భారత రక్షణ విభాగాలకు సరఫరా చేస్తోంది. ఎస్ఈసీ డీఆర్‌వీపీ ఎస్ఇన్నోవెన్షన్స్.. మిలిటరీ టెస్టింగ్ కోసం టార్గెట్ డ్రోన్లను; శిక్షణ, మదింపు కోసం శత్రు డ్రోన్లను అనుకరించే యూఏవీలను ఆఫర్ చేస్తోంది. మారుత్ డ్రోన్స్ రక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. టీ–హబ్, టీ–వర్క్స్ కేంద్రంగా కొన్ని స్టార్టప్స్ ఈ సెగ్మెంట్లోకి రానున్నాయి. భారత్ ఎలక్ట్రికల్స్ – హిందూస్తాన్ ఏరోనాటిక్స్ తయారీ భాగస్వాములుగా డీఆర్‌డీఓ రుస్తోమ్ – 2 డ్రోన్స్ అభివృద్ధి చేసింది. దక్ష యూఏవీ, ఐడియా ఫోర్జ్ వంటివి కూడా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి.





2030 నాటికి రూ.34,860 కోట్లకు..

డ్రోన్స్, యూఏవీల తయారీలో 75% వరకు విడి భాగాలు దేశీయంగా ఉత్పత్తి అయినవే. కొన్ని నెలల్లో ఇది 100 శాతానికి చేరడం ఖాయమని పరిశ్రమ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. డిఫెన్స్ డ్రోన్‌కంపెనీలు పరిశోధన, అభివృద్ధి, తయారీకి ఇప్పటికే రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాయి. పరిశ్రమకు రూ.1,000 కోట్ల ప్రోత్సాహకాలను ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. భారత సైనిక డ్రోన్ మార్కెట్ 2024లో రూ.13,040 కోట్లు. 2030 నాటికి ఇది రూ.34,860 కోట్లకు చేరుతుందని గ్రాండ్ వ్యూ రిసర్చ్ అంచనా.



ప్రకృతి పరిరక్షణకు మధ్యే‘మార్గం’..

జంగిల్స్ కరువై.. అంతటా కాంక్రీట్ జంగిల్స్ రాజ్యమేలుతున్న తరుణమిదీ.. ఈ ఫొటో చూడండి.. ప్రకృతిని నష్టం కలుగకుండా ఇలా మధ్యే ‘మార్గం’ చూపారు. ఇండోనేసియాలోని పశ్చిమ సుమత్రాలోని ఈ ఫ్లైఓవర్ ఓ ఇంజనీరింగ్ అద్భుతం. మానవ ఆవిష్కరణ.. ప్రకృతి సోయగం ఇక్కడ సహజీవనం చేస్తాయి. ఈ ఫ్లైఓవర్ మీద నుంచి వెళ్తున్నప్పుడు ఇక్కడి పచ్చదనం మిమ్మల్ని కట్టిపడేస్తుంది. మహమ్మద్ సైరిఫ్ అనే ఫొటోగ్రాఫర్ తీసిన ఈ చిత్రం ఈ ఏడాది ‘కాంక్రీట్ ఇన్ లైఫ్’ ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతగా నిలిచింది. గ్లోబల్ సిమెంట్ అండ్ కాంక్రీట్ అసోసియేషన్ ఏటా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తోంది.

మదిని దోచే మహిళా మార్ట్



ఖమ్మం జిల్లాలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించేందుకు మహిళా మార్ట్ సిద్ధమవుతోంది. ప్రైవేట్ వ్యాపార సంస్థలకు దీటుగా ఖమ్మం సీక్వెల్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న ఈ మార్ట్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ఇప్పటికే లోపల ర్యాక్స్, ఇతర సామగ్రి సిద్ధం కాగా, మార్ట్ బయట గోడపై గీసిన మహిళ బొమ్మ ఆకట్టుకుంటోంది. స్వశక్తితో స్వతంత్రంగా, ఆర్థికంగా ఎదుగుతున్న మహిళలను ప్రతిబింబిస్తున్న ఈ చిత్రాన్ని.. రహదారి వెంట వెళ్తున్న వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఖమ్మం మయూరి సెంటర్

మీ విమానాలను ల్యాండ్ చేయగలరా?

పాక్‌కు అసదుద్దీన్ చురకలు



సాక్షి, హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై విరుచుకుపడుతున్న ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తాజాగా మరోసారి పాక్ ప్రధాని, సైనిక చీఫ్‌లను ఉద్దేశించి మంగళవారం ‘ఎక్స్’వేదికగా చురకలంటించారు. ‘చైనా నుంచి అద్దెకు తెచ్చుకున్న విమానాన్ని పాక్ ప్రధానమంత్రి షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్‌లు తమ రహీమ్ యార్ ఖాన్ వాయుస్థావరంలో ల్యాండ్ చేయగలరా?’ అని ప్రశ్నించారు. ఆ ఎయిర్‌బేస్ ఇటీవల భారత్ చేసిన దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలోనే పాక్‌ను ఎద్దేవా చేస్తూ ఆయన ఈ ట్వీట్ చేశారు.

చెంచుల కోసం 10 వేల ఇళ్లు

- ఐటీడీఏ పరిధిలోని ఎస్టీ నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇళ్లు
- గవర్నర్, సీఎం ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: సొంత ఇల్లు లేకుండా ఉన్న ఆదిమ గిరిజన తెగలోని చెంచులకు సాచ్యురేషన్ పద్ధతిలో ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 4 ఐటీడీఏ పరిధిలో వీటిని మంజూరు చేయనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మొత్తం 10 వేల ఇళ్లను చెంచుల కోసం నిర్మిస్తామని చెప్పారు, రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మన్ననూరు, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో సాచ్యురేషన్ పద్ధతిలో దాదాపు పదివేల చెంచు కుటుంబాలను గుర్తించినట్లు, వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లపై మంగళవారం సచివాలయంలో అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించారని, అలాగే ముఖ్యమంత్రి కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని అధికారులకు గుర్తు చేశారు. వారు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, అయితే ఐటీడీఏ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని, ప్రతి నియోజకవర్గంలో 20% ఇళ్లను బఫర్ కింద పెట్టుకుంటారన్నారు.

పట్టణ ప్రాంతాల్లో...

పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అదే ప్రాంతంలో ఉండడానికి ఇష్టపడుతున్నారని, హైదరాబాద్‌కు దూరంగా ఇళ్లు ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని మంత్రి పేర్కొన్నారు. అందుకే పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్ధతిలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో కుటుంబాలు కుదేలు

- ‘సాక్షి’లో వచ్చిన కథనాన్ని పోస్టు చేసిన సజ్జనార్



తిమ్మాపూర్ (మానకొండూర్): ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లు, మోసాలపై ఎప్పటికప్పుడు ప్రజలను సోషల్ మీడియా వేదికగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్‌డ్రైవ్, హిట్ అండ్ రన్‌కు సంబంధించిన వీడియోలను కూడా ఆయన తరచూ తన సోషల్ మీడియా అకౌంట్స్‌లో షేర్ చేస్తారు. తాజాగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో జరిగిన ఘటనపై ‘సాక్షి’లో ‘నువ్వు లేని లోకంలో నేనుండలేను కొడుకా’ శీర్షికన ప్రచురితమైన కథనాన్ని ఆయన పోస్టు చేశారు. ‘అత్యంత బాధాకరం. తన కొడుకు ఆన్‌లైన్ బెట్టింగ్ భూతానికి బానిసై చనిపోతే.. మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ కుటుంబాలను ఎంతలా కబలిస్తోందో తెలియజేసే ఘటన ఇది’ అని ఆయన క్యాప్షన్ రాసుకొచ్చారు.

అమెరికాలో ఎన్‌ఆర్‌ఐలే మా టార్గెట్

- అందమైన యువతుల ఫొటోలతో వల వేయాలి
- ఆ తర్వాత సెక్స్ చాట్‌తో ఆకర్షించి క్రిప్టోలో పెట్టుబడులు పెట్టించి మోసగించాలి
- స్థానికుల సాయంతో అక్కడి నుంచి పారిపోయి భారత్‌కు వచ్చా
- టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేసిన గోల్డెన్ ట్రయాంగిల్ సైబర్ ముఠా బాధితుడు రహ్మత్‌ఖాన్

సాక్షి, హైదరాబాద్ : ‘అమెరికాలో స్థిరపడిన భారతీయులనే మేం టార్గెట్ చేయాలి. ముందుగా గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల నుంచి అందమైన యువతుల ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకొని.. ఆ ఫొటోలు ప్రొఫైల్‌గా పెట్టుకొని ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలు తెరవాలి. వాటి ద్వారా అమెరికాలోని భారతీయులను టార్గెట్ చేసుకొని ఫ్రెండ్ రిక్వెస్టులు పంపాలి. ఆ తర్వాత వారితో ఆన్‌లైన్‌లో అమ్మాయిల్లా పరిచయం పెంచుకోవాలి. తర్వాత వారితో సెక్స్ అంశాలపై చాటింగ్ చేస్తూ ముగ్గులోకి దింపాలి. నమ్మకం కుదిరిన తర్వాత వారితో క్రిప్టోకరెన్సీలో పెట్టుబడి పెడితే చాలా లాభాలు వస్తాయని, చైనా సైబర్ ముఠాలు తయారు చేసిన ఫేక్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెట్టించాలి. తర్వాత ట్యాక్స్‌లు, ఇతర పేర్లతో అందినకాడికి దోచుకోవాలి. ఇలా చేయడానికి మాకు 15 రోజులు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఉంటుంది’అని లావోస్‌లో సైబర్ ముఠాల చేతిలో చిక్కిన బాధితుడు నగరంలోని సైదాబాద్ మాదన్నపేటకు చెందిన రహ్మత్‌ఖాన్ టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు వివరించారు. తన పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న కశ్మీర్‌కు చెందిన ట్రావెల్ ఏజెంట్ ఆషిఖీబాబా, లావోస్‌లో టెలికాలర్ ఉద్యోగం పేరిట మోసగించి గతేడాది డిసెంబర్ 23న బ్యాంకాక్ పంపినట్టు తెలిపారు. తనను మోసగించిన ఆషిఖీబాబాపై టీజీసీఎస్‌బీలో ఫిర్యాదు చేశారు. మంగళవారం కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

నేను టార్గెట్ చేరుకోలేదని జీతం ఇవ్వలేదు

రహ్మత్‌ఖాన్ ఆ ముఠా తనను ఎలా హింసించారన్నది ఫిర్యాదులో వివరంగా పేర్కొన్నాడు. ‘నేను ఇండియా నుంచి బ్యాంకాక్ వెళ్లిన తర్వాత ఎయిర్‌పోర్ట్‌లో బెల్ అనే ఇథోపియన్ నన్ను రిసీవ్ చేసుకున్నాడు. పదకొండు గంటలపాటు బస్సు ప్రయాణం తర్వాత మేం లావోస్ చేరుకున్నాం. అక్కడ నుంచి గోల్డెన్ ట్రయాంగిల్‌కి వెళ్లాం. అక్కడ చైనావారు నడుపుతున్న ఒక సైబర్ కంపెనీలో ఉద్యోగం పేరిట కాంట్రాక్ట్ మీద సంతకాలు తీసుకున్నారు. తర్వాత నా పాస్‌పోర్టు, ఫోన్ తీసుకున్నారు. నాకు సైబర్‌మోసాలపై 15 రోజులు ట్రైనింగ్ ఇచ్చారు. తర్వాత అందమైన యువతుల ఫొటోలు సేకరించే పని అప్పగించారు. తర్వాత ఎన్‌ఆర్‌ఐలను మోసగించాలని చెప్పారు. వారు చెప్పిన టార్గెట్ రీచ్ కాలేదని నన్ను చిత్రహింసలు పెట్టడంతోపాటు నాకు మూడు నెలలపాటు వేతనం కూడా ఇవ్వలేదు. ఎలాగోలా నేను అక్కడి నుంచి స్థానికుల సాయంతో తప్పించుకొని లావోస్ ఎంబసీకి, అటు నుంచి ఇండియన్ ఎంబసీకి చేరుకున్నా. ఎంబసీ అధికారులు నాకు ఎమర్జెన్సీ పాస్‌పోర్టు ఇచ్చి ఇండియాకు పంపారు. నన్ను మోసగించి సైబర్ ముఠాలకు అప్పగించిన ఏజెంట్ ఆషిఖీబాబాపై చర్యలు తీసుకోండి’అని బాధితుడు కోరారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం । 14-5-2025

అంజన్న సన్నిధిలో ఆధ్యాత్మిక పరిమళాలు

నిత్య అభిషేకాలు..

సామూహిక పూజలు

శతాబ్దాలుగా కొనసాగుతున్న నిత్య హారతులు

ఆలయ పరిసరాల్లో ఆంజనేయస్వామి నామస్మరణ


కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం

మల్యాల: భక్తుల కొంగు బంగారం కొండగట్టు అంజన్న క్షేత్రం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోంది. నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తుండటంతో నిత్య కల్యాణం.. పచ్చ తోరణంలా ఆలయ పరిసరాలు ఆంజనేయ స్మరణతో మార్మోగుతున్నాయి. ప్రతి మంగళవారం, శనివారాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలతో విరాజిల్లుతోంది. హైందవ సంప్రదాయాన్ని అనుసరించి ప్రతి పండగ స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు పండుగలో పాలుపంచుకుంటూ తరిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణలోని నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. వివిధ రకాల ఔషధ మూలికలతో కూడిన ఏపుగా పెరిగిన చెట్లు, నల్లని బండరాళ్లు, వర్షాకాలంలో నల్లని బండరాళ్ల మధ్య నుంచి పారే జలపాతాలు, ప్రకృతి ఒడిలో సేదతీరుతూ, భక్తులు పరవశించిపోతున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన ప్రతి మంగళవారం, శనివారాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఏటా చిన్న హనుమాన్ జయంతి, పెద్ద హనుమాన్ జయంతులతో సుమారు నాలుగు నెలలపాటు లక్షలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది నిర్వహించిన చిన్న జయంతికి సుమారు రెండున్నర లక్షలకుపైగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు భక్తులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

ఆగని నిత్య హారతులు..

గ్రహపీడితులు, దీర్ఘకాలిక, మానసిక వ్యాధిగ్రస్తులు, సంతానం లేని మహిళలు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో 11 రోజులు, 21 రోజులు నిద్రిస్తే సమస్యలు దూరం అవుతాయని భక్తులు స్వామివారి సన్నిధిలో నిద్రిస్తుంటారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు స్వామివారి భజనలు చేసి, హారతులు ఇస్తుంటారు. శతాబ్దాలుగా నిత్య హారతులు కొనసాగుతున్నాయి. కరోనా సమయంలో కూడా నిత్య హారతులు కొనసాగాయి.


ఆలయంలో నిత్య అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

నిత్య సామూహిక అభిషేకాలు.. సత్యనారాయణ వ్రతం

ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యం సామూహిక ఆంజనేయస్వామి అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళవారం, శనివారాల్లో దంపతులు ఆంజనేయస్వామి చిన్న విగ్రహానికి సామూహికంగా స్వామివారి ప్రతిమకు అభిషేకం నిర్వహిస్తారు.

కొబ్బరి ముడుపులు ప్రత్యేకం..

సహజంగా హనుమాన్ దీక్షాపరులు స్వామివారికి, భక్తులు తమ కోరికలు నెరవేరడం కోసం ముడుపులు కడుతుంటారు. తమ మానవ ప్రయత్నంతో పాటు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరి ముడుపులు కడితే తమ కోరిక నెరవేరుతుందని భక్తులు విశ్వసిస్తుంటారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ప్రత్యేకంగా ఎన్నికల వేళల్లో రాజకీయ నాయకులు స్వామివారిని దర్శించుకొని, ముడుపులు కట్టడం ఆనవాయితీగా మారింది.

ఓం శ్రీ ఆంజనేయాయ నమః

కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయేలా ఆలయ అధికారులు మైకులు ఏర్పాటు చేశారు. కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఆంజనేయస్వామి నామస్తోత్రం ఓం శ్రీ ఆంజనేయాయ నమః ఆలయానికి వచ్చే భక్తుల్లో ఆధ్యాత్మిక పరిమళాలు పెంపొందిస్తోంది. ప్రధాన ద్వారం మొదలుకొని, ఘాట్ రోడ్డు వెంట స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగిపోతోంది.


నిత్య హారతుల్లో భజనలు చేస్తున్న భక్తులు

కొండగట్టులో దర్శనీయ స్థలాలు..

ఆంజనేయస్వామి ఆలయానికి పశ్చిమాన బేతాళ స్వామి ఆలయంతోపాటు సీతారామ ఆలయాన్ని సందర్శించి, భక్తులు పూజలు చేస్తుంటారు. బేతాళస్వామిని క్షేత్రపాలకుడిగా పూజిస్తారు. స్వామివారి ఆలయ పొలిమేరల్లో బొజ్జ పోతన్న ఆలయం కలదు. భక్తులు తైలాభిషేకం, ఫలపుష్పాభిషేకం నిర్వహిస్తుంటారు.

రామావతార సమయంలో సీతామాత తన కష్టాలు తలచి, విలపించగా, రాలిన కన్నీరు గుంటలుగా మారి, సీతమ్మ గుంటలుగా ప్రసిద్ధి చెందినట్లుగా భక్తులు విశ్వసిస్తారు.

సంతానం లేని దంపతులు స్వామివారిని పూజిస్తే జన్మించిన బిడ్డకు కొండల రాయుడిగా నామకరణం చేయగా, ఆలయానికి ఈశాన్యంలో పెద్ద పెద్ద బండరాళ్లను కోటమాదిరిగా ఏర్పాటు చేశారు. కొండల్ రాయుడి గుర్రలు డెక్కల ముద్రలు, బండరాళ్లపై చిన్న జలాశయం ఆనవాళ్లు దర్శనమిస్తాయి.

నూతనంగా నిర్మించిన కోనేరు సమీపంలో పెద్ద పెద్ద బండరాళ్లతో ఏర్పాటు చేసిన గుహలో మునులు తపస్సు చేసుకునేవారని ప్రసిద్ధి. భక్తులు ఒక్కరు మాత్రమే వెళ్లగలిగేంత దారి నుంచి గుహలోకి వెళ్లి, గుహలో వెలుగుతున్న దీపాన్ని భక్తులు దర్శిస్తుంటారు.

భక్తుల కొంగు బంగారం ఆంజనేయస్వామి



కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయి. ప్రకృతి ఒడిలోని కొండగట్టులో వివిధ రకాల ఔషధ మూలికల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలి, ఆలయంలో నిర్వహించే నిత్య హారతులు, అభిషేకాలు చేస్తూ ఆధ్యాత్మికతతో స్వామివారి సన్నిధిలో నిద్రించిన వారి కోరిన కోర్కెలు తీర్చే ఆంజనేయస్వామి భక్తుల పాలిట కొంగుబంగారం.

– తిరుకోవెల కపీందర్, కొండగట్టు ఆలయ స్థానాచార్యులు

నామినేటెడ్ పదవుల్లో మహిళా కాంగ్రెస్‌కు అన్యాయం


మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చినా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి కాంగ్రెస్ మహిళా నేతల్లో ఉందని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలాసార్లు జాబితాలను అటు ఏఐసీసీకి, ఇటు టీపీసీసీకి ఇచ్చినా ఫలితం లేదని, ఇప్పటివరకు ఒక్క పోస్టు కూడా ఇవ్వలేదని ఆమె వ్యాఖ్యానించారు. అయినా మహిళా నేతల కష్టానికి ఫలితం దక్కేలా విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నానని చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా సునీతారావు మాట్లాడుతూ, 20 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని సేవలందిస్తున్న మహిళా నేతలకు న్యాయం జరిగేలా చూడాలని పార్టీని కోరుతున్నట్టు చెప్పారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా మహిళా కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని, రాహుల్‌గాంధీ సూచనల మేరకు పార్టీ పటిష్టానికి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పలు జిల్లాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.



మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ప్రపంచ సుందరీమణులు నగరంలోని వివిధ చారిత్రక ప్రాంతాలను సందర్శిస్తూ మంగళవారం రాత్రి చౌమహల్లా ప్యాలెస్‌లో డిన్నర్ చేశారు. ఈ సందర్భంగా ప్యాలెస్ ఎదుట గ్రూప్ ఫోటో దిగారు.



గురుకుల సరుకులకు జిల్లాస్థాయి టెండర్లే!

- రాష్ట్రస్థాయి టెండర్ల ప్రతిపాదనలపై వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం
- మే నెలాఖరులో జిల్లాల్లో టెండర్లు పూర్తి చేయాలని డీపీసీలకు ఆదేశం
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కేటగిరీల వారీ సరుకులకు టెండర్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో వివిధ రకాల సరుకుల పంపిణీకి రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలవాలన్న ప్రతిపాదన నుంచి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ)ల ద్వారానే జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కేటగిరీలవారీగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఖరారు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు గురుకుల సొసైటీలు ఆదేశాలు జారీచేశాయి. గురుకుల విద్యా సంస్థల్లో భోజన సరుకులతోపాటు దుప్పట్లు, రగ్గులు తదితర వస్తువుల సరఫరా కోసం ఏటా టెండర్ పద్ధతిలో కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తున్నారు. ఈ ఎంపిక ప్రక్రియంతా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనసాగేది. అయితే, రాష్ట్రస్థాయిలో టెండర్లు ఖరారు చేస్తే నాణ్యతతో పాటు అవసరమైన స్టాకును ఏకకాలంలో నిల్వ చేసే వీలుంటుందనే ఆలోచనతో రాష్ట్రస్థాయి టెండర్ల కోసం ఎస్సీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు తయారు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత శాఖల కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సెంట్రలైజ్డ్ టెండర్లకు మొగ్గు చూపారు. అయితే, గురుకుల సొసైటీల అధికారులు సెంట్రలైజ్డ్ టెండర్ లాభనష్టాలను వివరించటంతో దీనిని ప్రస్తుతానికి వాయిదా వేస్తూ పాత పద్ధతిలోనే ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి టెండర్లను జిల్లా స్థాయిలోనే ఖరారు చేయాలని నిర్ణయించి కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర స్థాయిలో సెంట్రలైజ్డ్ టెండర్ విధానంతో ఇబ్బందులు వస్తాయని గురుకుల సొసైటీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్రస్థాయిలో ఒకే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తే సరుకుల నిల్వలు పెరగటంతోపాటు, ఒకే చోటి నుంచి రాష్ట్రమంతా సరఫరా చేసేందుకు ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. జిల్లా స్థాయిలో అయితే సరుకులు వేగంగా సరఫరా చేయడంతో భారీ నిల్వలకు అవకాశం ఉండదని తెలిపారు.

నాణ్యతపై దృష్టి..

సరుకుల పంపిణీ విషయంలో విజిలెన్స్ పర్యవేక్షణను మరింత పెంచాలని, నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి తదుపరి చర్యలకు ఆదేశించింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సరుకుల నాణ్యత తనిఖీలపై కమిటీలు ఏర్పాటు చేయాలని గురుకుల సొసైటీలు సూచించాయి. ఈ పరిశీలనల రికార్డు కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాయి. ఈ నెల మూడో వారం నాటికి టెండర్ నోటిఫికేషన్లు జారీ చేసి.. నెలాఖరు నాటికి టెండర్లు ఖరారు చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. ఒకటిరెండు రోజుల్లో టెండర్లకు సంబంధించిన కార్యాచరణ ఖరారు కానుంది.

అందాల నారీమణులతో 'శారీ'గమలు

చేనేతకు మరింత ప్రాచుర్యం

పోచంపల్లికి రానున్న ప్రపంచ అందగత్తెలు

మోడళ్లతో నూతన డిజైన్ల ప్రదర్శన

చేనేత ఉత్పత్తుల పరిశీలనకు స్టాళ్లు

సాక్షి, యాదాద్రి: చేనేత వస్త్రాలను ప్రపంచ స్థాయికి పరిచయం చేయడమే ప్రథమ లక్ష్యంగా.. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందగత్తెల ముందు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలకు వచ్చే అందగత్తెలు ఈ నెల 15న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి రానున్నారు. పోచంపల్లిలోని రూరల్ టూరిజం రిసార్టుకు ప్రపంచ సుందరీమణులు 25 మంది రానున్నారు. వీరి రాక సందర్భంగా ఇక్కడి ఇక్కత్ చీరల ప్రాధాన్యాన్ని వారికి తెలియజేస్తారు. ఇందువల్ల స్థానిక చేనేత కళాకారులకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఇప్పటికే యునెస్కో గుర్తింపు పొందిన పోచంపల్లిని ప్రపంచ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే ప్రయత్నమిది. ఈ సందర్భంగా యాదగిరి గుట్టకు కూడా సుందరీమణులు రానున్నారు. కొండపైన స్వామి వారి దర్శనం అనంతరం.. కొండ కింద ఫొటో సెషన్ ఉంటుంది.

చేనేత కళాకారులతో మాటామంతీ

మిస్ వరల్డ్ పోటీదారులు స్థానికంగా చేనేత కళాకారులతో ముచ్చటిస్తారు. చీరల తయారీకి వాడే దారం పుట్టుక నుంచి.. వస్త్రం తయారీ వరకు.. పలు అంచెల్లో వస్త్రాల తయారీని ఎలా రూపొందిస్తారో వారు అడిగి తెలుసుకుంటారు.

యాంఫీ థియేటర్‌లో ప్రదర్శన

పోచంపల్లిలోని టూరిజం సెంటర్ యాంఫీ థియేటర్‌లో విభిన్నమైన చేనేత వస్త్రాల ప్రదర్శన ఉంటుంది. చేనేత ఇక్కత్, డబుల్ ఇక్కత్, తేలియా రుమాల్.. ఇలా పలు రకాల వస్త్రాల ప్రదర్శన ద్వారా సంప్రదాయ, ఆధునికత కలిసిన నూతన ఫ్యాషన్ వస్త్రాలను ప్రదర్శిస్తారు. దీనిద్వారా సంప్రదాయం, ఆధునికత కలిసి నూతన ఫ్యాషన్ అనే మాటకు చిరునామా కాబోతున్నాయి. ఇందువల్ల దేశ విదేశాల యువతలో చేనేతకు గౌరవం లభిస్తుంది. ప్రముఖులు ఇప్పటికే పోచంపల్లి వస్త్రాలను ధరించడం ఫ్యాషన్‌గా మారింది.

స్టాళ్లలో ప్రదర్శనలు

పూర్తిగా గ్రామీణ వాతావరణం కల్పించేందుకు టూరిజం పార్క్‌ను సిద్ధం చేశారు. సిద్దిపేట గొల్లభామ చీరలు, నారాయణపేట, గద్వాల చీరలు, పోచంపల్లి, పుట్టపాక, సిరిపురాలలో తయారయ్యే వస్త్రాలను ప్రదర్శిస్తారు. వీటిని స్థానిక మహిళలు ధరిస్తారు. సంప్రదాయంగా వచ్చిన వస్త్రాలను ఆధునిక ఫ్యాషన్ డిజైనర్‌లతో కొత్త రకంగా వస్త్రాలను రూపొందించి అందగత్తెల ముందు ప్రదర్శిస్తారు. ఇక్కత్ డిజైన్లతో తయారవుతున్న తేలియా రుమాల్, సిల్క్, కాటన్, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, రజయ్ (క్విల్ట్స్), స్టోల్స్, స్కార్ఫ్స్, దుప్పట్టా, డోర్, టేబుల్ కర్టన్స్, పిల్లో కవర్స్ తదితర వెరైటీలను ప్రదర్శించనున్నారు.




అందగత్తెల రాక సందర్భంగా ముస్తాబైన టూరిజం సెంటర్‌లోని యాంఫీ థియేటర్


పోచంపల్లి టూరిజం పార్కు






తేలియా రుమాల్ డిజైన్లు


డబుల్ ఇక్కత్ డిజైన్ చీర

గోడ నీడన సేదతీరుదాం



ఎండ చురుక్కుమనిపిస్తోంది. దప్పిక తీర్చుకుందామన్నా గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి. ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చిన ఈ వానరాలు హైదరాబాద్ – బెంగళూరు జాతీయరహదారిపై కర్నూలు సమీపంలో ఎండ వేడిని తట్టుకోలేక ఇలా గోడ నీడన సేదదీరుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సంధ్యాసిందూరం



ఆకాశమ్మ నుదిటిన సిందూరం అద్ది సమరం ముగిసింది ఇక సెలవంటూ సూరీడు విశ్రాంతికి ఉపక్రమిస్తున్నట్టు ఉంది.. కదూ ఈ చిత్రం.. మంగళవారం సాయంత్రం అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం కొండ, అనంతసాగరం చెరువు వద్ద సూర్యాస్తమయం కనువిందు చేసింది. ప్రకృతి ప్రేమికులను పరవశింపజేసింది.

మేత కోసం వలసబాట



ఎండలు భగభగ మండిపోతుండటంతో పచ్చిక ఎక్కడికక్కడ మలమలా మాడిపోతోంది. దీంతో జీవాలు మేత దొరక్క విలవిల్లాడిపోతున్నాయి. కాపర్లు మందల్ని తోలుకొని మేత కోసం వెతుకుతూ దూరతీరాలకు పయనమవుతున్నారు. గుంటూరు జిల్లా వల్లభాపురం సమీపంలో మేతకోసం బయల్దేరిన గొర్రెల మంద. – సాక్షి ఫొటోగ్రాఫర్ గుంటూరు



వర్చువల్ రియాల్టీ ఎరీనా

విశాఖలో మాయా లోకం

మధురవాడలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు

- రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హేబిటేట్ సెంటర్
- 2.82 ఎకరాల్లో వర్చువల్ రియాల్టీ ఎరీనా, త్రీ స్టార్ హోటల్
- పీపీపీ విధానంలో చేపట్టేందుకు కసరత్తు
- ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ: ఊహకందని అద్భుత ప్రపంచం కళ్ల ముందు సాక్షాత్కరించనుంది. కనివినీ ఎరుగని మాయాలోకం అందరినీ మంత్రముగ్ధులను చేయనుంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేనటువంటి మిథ్యా ప్రపంచం విశాఖ వాసులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇందుకోసం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. మధురవాడ ప్రాంతంలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వర్చువల్ వరల్డ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ ఎరీనా అండ్ త్రీ స్టార్ హోటల్'తో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్(పీపీపీ) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానించింది.

ఆధునిక వాతావరణంలో సంపన్న వర్గాల అభిరుచులకు తగ్గట్టుగా 'ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్'ను నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. ఐటీ సంస్థలకు సమీపంలో ఎండాడ లా కాలేజీ నుంచి రుషికొండ రోడ్డులో 8.82 ఎకరాల స్థలాన్ని గుర్తించారు.

రూ.470 కోట్లతో హేబిటేట్ సెంటర్

పీపీపీ విధానంలో రూ.470 కోట్లతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఐటీ స్పేస్, బిజినెస్ సెంటర్, రిటైల్ స్పేస్, ఆడిటోరియం, సెమినార్ హాల్, పార్టీ ఈవెంట్స్ లాన్‌లతో పాటు ట్రేడ్ ఫెయిర్లు, ఆర్ట్, కల్చర్ షో, ఎగ్జిబిషన్లకు అనువుగా సౌకర్యాలు కల్పించనున్నారు. అలాగే క్లబ్ హౌస్, అంతర్జాతీయ రుచులతో వంటలు అందించే రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తారు. అలాగే ఇండోర్ యాంఫీథియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డైన్ రెస్టారెంట్లు ఉండనున్నాయి. 60 రూములు కలిగిన హోటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, సూపర్ మార్కెట్, మెడికల్, స్పోర్ట్స్ సెంటర్లు కూడా రానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్‌ఎఫ్‌పీలు ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న సంస్థల అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు. వీలైనంత వేగంగా ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలని అధికారులు భావిస్తున్నారు.



హేబిటేట్ సెంటర్

విశాఖ వాసులకే కాకుండా ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా విశాఖలో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని అందించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

2.82 ఎకరాల్లో వర్చువల్ ఎరీనా

ఇప్పటి వరకు పార్కులు, మ్యూజియాలు, కన్వెన్షన్ సెంటర్లపైనే దృష్టి పెట్టినవారు.. ఇప్పుడు భవిష్యత్తు తరాలకు ఆసక్తికరమైన, ఆకట్టుకునేలా వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఎండాడ లా కాలేజ్ మార్గంలో 2.82 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. గేమింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికత అంశాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని పొందేలా 360 డిగ్రీల థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, చారిత్రక యుగాల అనుభవంలోకి తీసుకెళ్లేలా వర్చువల్ టైమ్ ట్రావెల్, వీఆర్ గేమింగ్ జోన్, 350 చదరపు మీటర్ల భారీ అక్వేరియం, 20 మల్టీక్యూజిన్ రెస్టారెంట్ అవుట్‌లెట్లు, 10 శాతం కమర్షియల్ అవుట్‌లెట్లతో పాటు 100 రూమ్‌లు, 1000 మంది పట్టేలా ఫంక్షన్ హాల్‌తో త్రీ స్టార్ హోటల్‌ను నిర్మించనున్నారు.



360 డిగ్రీల థియేటర్

ఆర్థిక, పర్యాటకానికి అనుగుణంగా..

పర్యాటకాభివృద్ధి కోసమే కాకుండా ఆర్థిక పరిపుష్టికి అనుగుణంగా రెండు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నాం. ఐటీ సంస్థలకు సమీపంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో వర్చువల్ రియాలిటీ ఎరీనాతో పాటు అర్బన్ హేబిటేట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఇందుకోసం ఆర్‌ఎఫ్‌పీలు ఆహ్వానించాం. ఇవి ఏర్పాటైతే ప్రపంచ పర్యాటకులకు మంచి అనుభూతిని పంచడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణకు వేదికలుగా నిలుస్తాయి.



–కె.ఎస్.విశ్వనాథన్, మెట్రోపాలిటన్ కమిషనర్

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల

సాక్షి, అమరావతి: ఈ నెల 2, 4 తేదీల్లో తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.36 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. తిరుపతి జిల్లాలో కె.రమణ (59), అల్లం భాస్కర్ (54),ఎం.కార్తీక్ (10), రెడ్డి మునయ్య (44), నెల్లూరు జిల్లాలో తాటిబోయిన చిన్నయ్య (49), ప్రకాశం జిల్లాలో నూకసాని శిరీష (20), కొండేపి నాగమల్లేశ్వరరావు (40), బాపట్ల జిల్లాలో మాతంగి సుపరీదీప్ (23), గద్దం బ్రహ్మయ్య (45) మృతి చెందగా వారి కుటుంబాలకు రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుండి పరిహారం కేటాయించినట్లు తెలిపింది. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఈ మొత్తాన్ని మృతుల బంధువులకు అందించాలని ఆదేశించింది.

జీవో నంబర్-3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తేవాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: జీవో నంబర్-3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తెచ్చి గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్డినెన్స్ తెచ్చే వరకు ఏజెన్సీలో డీఎస్సీ రిక్రూట్‌మెంట్లు వాయిదా వేయాలని కోరారు. సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో మూడు ఆప్షన్‌లను పరిశీలించినట్లుగా వార్తలు వచ్చాయని, ఇందులో 100శాతం రిజర్వేషన్లు కల్పించడం మినహా మరో ఆప్షన్ లేదని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

నెలాఖరులోగా కాలువల మరమ్మతులు పూర్తి చేయండి

సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ.. మరమ్మతు పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయం నుంచి సీఈ, ఎస్ఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాలువల నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.344 కోట్లు మంజూరు చేశామన్నారు. గుర్రపుడెక్క, పూడికతీత వంటి అత్యవసర పనుల అంచనా వ్యయం రూ.పది లక్షలు దాటితే.. వాటికి ఏడు రోజుల గడువుతో షార్ట్ టెండర్లు పిలవాలని ఆదేశించారు.

తీరంలో కొత్త మొలక!

సముద్రపు నాచు సాగుకు శ్రీకారం

- మామిడికుదురు మండలంలో తొలి అడుగు
- చైనా, జపాన్‌లో పెరుగుతున్న డిమాండ్
- ఆహార ఉత్పత్తిగా గుర్తింపు... బిస్కెట్‌లు, పాస్తా, న్యూడిల్స్ తయారు
- నాచుతో పంట పొలాలు.. తోటలకు సేంద్రియ ఎరువు
- పశుగ్రాసాలు.. చేపల మేతలలో సైతం వినియోగం
- విజయవంతమైతే జిల్లాకు పర్యావరణంగా మేలు
- ఆక్వాతో ధ్వంసమవుతున్న తీరం
- ఆక్వాకు ప్రత్యామ్నాయం కానున్న నాచు ఉత్పత్తి

సాక్షి, అమలాపురం: సముద్ర నాచు (సీ వీడ్) సాగు మరోసారి తెరపైకి వచ్చింది. గతంలోనూ ఈ సాగు ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో పెద్దగా వెలుగులోకి రాలేదు. ఇటీవల కాలంలో గుజరాత్ సముద్ర నాచు తయారీ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ఈ సాగు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం సాగుతోంది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా ఈ సాగుకు అనుకూలమైన ప్రాంతంగా గుర్తించడంతో శాస్త్రవేత్తలు, మత్స్యశాఖ అధికారులు ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే మామిడికుదురు మండలంలో ఒక ఔత్సాహిక రైతు సాగు ప్రారంభించారు. తీరంలో ఈ సాగు విజయవంతం అయితే ఆక్వాకు ప్రత్యామ్నాయ సాగుగా మారడంతోపాటు ఆక్వా వల్ల పర్యావరణానికి కలుగుతున్న హాని తగ్గుతుంది. సముద్రపు నాచు సాగుకు గతంలో ఒకసారి మంచి గుర్తింపు వచ్చింది. అయినా పాత పద్ధతిలో సాగు చేయడం వల్ల అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదు. ఈ సాగు విజయవంతం అయితే తీర ప్రాంతాల్లో మత్స్యకారులకు, మహిళలకు, ఆక్వా రైతులకు స్థిరమైన ఆదాయం ఇచ్చేలా మారనుంది. మరీ ముఖ్యంగా కష్టాల వనామీ వంటి పంటలకు ప్రత్యామ్నాయం కానుంది. జిల్లాలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం భైరవపాలెం వరకు సుమారు 90 కిలోమీటర్ల తీరం ఉంది. ఏడు మండలాల్లో తీర ప్రాంతం ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ జిల్లా కన్నా కోనసీమలోనే ఆక్వాసాగు అధికం. సముద్ర నాచు సాగు చేపట్టేందుకు అనువైన స్థలం, వాతావరణం ఇక్కడ ఉంది. మామిడికుదురు మండలం గొల్లపల్లి, కరవాకల మధ్య ఈ సాగును ఒకరు మొదలు పెట్టారు.



సముద్ర నాచు సాగు

అతి విలువైనది

సముద్ర నాచు చాలా విలువైనది. జపాన్, చైనాలో దీనిని ఆహారంగా తీసుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దీనికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నాచు పోషకాల నిధిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మందులు, ఎరువులు, పశువుల దాణాగా ఉపయోగిస్తున్నారు. బిస్కెట్లు, పాస్తా, నూడుల్స్ కూడా తయారు చేస్తున్నారు.

నాచు రకాలు

సముద్ర నాచులో గ్రేసిలేరియా, కప్పాఫైకస్, ఉల్వా, సర్గాస్సమ్ అనే రకాలు ముఖ్యమైనవి. ఇవి ఆకుపచ్చ, ఎరుపు, మట్టి రంగుల్లో ఉంటాయి. వీటిలో కప్పాఫైకస్ అల్వారెజీ రకం ఒకటి. దీని ద్వారా కేరాజీనన్ అనే పదార్థాన్ని సేకరిస్తారు. ఇది ఆహార పదార్థాలు, ఔషధాలు, సౌందర్య సాధనాలలో వాడతారు. అలాగే గ్రేసిలేరియా ఎడ్యులిస్ రకం నుంచి అగర్ అనే పదార్థాన్ని సేకరిస్తారు. ఇది మైక్రో బయాలజీ, ఆహార పరిశ్రమ, ఔషధాల తయారీలో విస్తతంగా ఉపయోగిస్తారు. ఈ రెండు జాతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం కానున్నాయి. జిల్లాలో ఈ ప్రాజెక్టులకు గ్రీన్ క్లైమేట్ ఫండ్, నాబార్డ్ నిధులు అందిస్తాయని జిల్లా యంత్రాంగం చెబుతోంది.

కోనసీమ అనుకూలం

సముద్రపు నాచు సాగు పైలట్ ప్రాజెక్టును కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. తొలుత మలికిపురం మండలం తూర్పుపాలెంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తరువాత జిల్లాలో అనువైన స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో జిల్లా యంత్రాంగం ఉంది. దీనిలో భాగంగా ఇటీవల సముద్రపు నాచు సాగులో నిపుణులు, సీఎస్ఐఆర్, సీఎస్ఎంసీఆర్ఐ, మండపం, తమిళనాడు శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో బృందం కోనసీమలోని పలు మండలాల్లోని తీర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించింది. జిల్లాలో కాట్రేనికోన మండలంలోని కొత్తపాలెం, పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, గచ్చకాయల పోర, ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.కొత్తపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప, మామిడికుదురు మండలం గోగన్నమఠం, కరవాక, గొల్లపాలెం, మలికిపురం మండలం తూర్పుపాలెం, సఖినేటిపల్లి మండలంలోని చింతల మోరి, కేశవదాసుపాలెం, అంతర్వేది, గొంది, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు, రెబ్బనపల్లి తదితర గ్రామాలలో సముద్రపు నాచు సాగుకు అనువైన ప్రదేశాలను నిపుణుల బృందం పరిశీలించింది.

వనామీకి ప్రత్యామ్నాయం

సముద్ర నాచు సాగు విజయవంతం అయితే వనామీ సాగుకు ప్రత్యామ్నాయంగా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సముద్ర నాచు నిలకడైన ఆదాయమని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. సముద్ర నాచు సాగుకు నాలుగు అడుగుల నీరు అవసరం. పంట దిగుబడి వచ్చేందుకు 45 నుంచి 60 రోజులు పట్టనుంది. ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తే ఏడాదికి నాలుగైదు పంటలు పండించే అవకాశముంది. ప్రస్తుత మార్కెట్‌లో కేజీ రూ.25 వరకు ధర ఉండగా, ఎకరాకు రూ.40 వేలకు తక్కువ కాకుండా ఆదాయం వస్తుందని అంచనా.



అనువైన తీరాన్ని గుర్తించేందుకు నిపుణుల బృందం అధ్యయనం

పైలట్ ప్రాజెక్టుగా..




సముద్ర నాచు సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసిన తర్వాత డీఆర్‌డీఏ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతాలలో పైలట్ ప్రాజెక్టుల్లో సాగు ప్రారంభిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, సంప్రదాయ మత్స్యకారులు, యువకులలో ఔత్సాహికులను గుర్తించి వారికి సముద్రపు నాచు సాగులో శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా సాగు విజయవంతం చేస్తాం. – ఆర్.మహేష్‌కుమార్, కలెక్టర్

ఉపగ్రహాల నిఘా వ్యవస్థ బలోపేతం దిశగా ఇస్రో

ఈనెల 18న పీఎస్‌ఎల్‌వీ సీ61 ద్వారా కక్ష్యలోకి ఈఓఎస్ ఉపగ్రహం

సూళ్లూరుపేట: ఉపగ్రహాల నిఘా వ్యవస్థ బలోపేతం, వాటి విస్తరణ వేగవంతం చేసేదిశగా ఈనెల 18న ఉదయం 6.59 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ61 రాకెట్ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈఓఎస్ రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహాన్ని సూర్య-సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈఓఎస్-09 (రీశాట్-1బీ) రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం బరువు 1710 కిలోలు. జాతీయ భద్రతను బలోపేతం చేయడం, కీలక మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో దోహదపడుతుందని ఇటీవల ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ తెలిపారు. ఈఓఎస్-09తో ఇస్రో పౌర,వ్యూహాత్మక ప్రయోజనాల కోసం అంతరిక్ష ఆస్తులను ఉపయోగించడంలో దాని సాంకేతిక నైపుణ్యం, నిబద్ధతను ప్రదర్శిస్తుంది.



ద్వారా ప్రయోగించనున్న ఈఓఎస్-9 (రీశాట్-1బీ) రాడార్ ఇమేజింగ్ శాటిలైట్

రాబోయే ఐదేళ్లలో 52 ప్రైవేటు ఉపగ్రహాలకు..

భవిష్యత్తులో భారత్ ప్రపంచంలోనే బలీయమైన శక్తిగా అవతరించేందుకు అంతరిక్షంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆదనంగా మరిన్ని ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలను రచిస్తోంది. ఇందులో భాగంగా రాబోయే అయిదేళ్లలో ప్రైవేటు రంగం నుంచి బలమైన భాగస్వామ్యంతో 52 ఉపగ్రహాల సమూహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టే దిశగా ఇస్రో అడుగులు వేస్తుంది.

జల్‌జీవన్ మిషన్ తాగునీటి పథకాలకు 13.538 టీఎంసీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ నేతృత్వంలో జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పథకం కింద చేపట్టిన తాగునీటి పథకాలకు ఎనిమిది రిజర్వాయర్లలో 13.538 టీఎంసీలను వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఎన్‌సీ గతనెల 14న పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఆ మేరకు నీటిని వాడుకోవడానికి అనుమతి ఇస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రిజర్వాయర్	టీఎంసీలు
ఏలేరు	2.003
ధవళేశ్వరం	4.062
ప్రకాశం	4.489
వెలిగల్లు	0.327
చిత్రావతి	1.475
వెలిగోడు	0.3
అవుకు	0.299
పులికనుమ	0.583

ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ క్షమాపణలు చెప్పాలి

సాక్షి, అమరావతి: తాను చెప్పడం వల్లే భారత్-పాక్ యుద్ధం ఆగిందంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై భారతీయులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కారదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి దీనిపై సమగ్రంగా చర్చించాలని కోరారు. యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు వింటుంటే భారతీయులు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వ్యాపార లావాదేవీల కోసం ట్రంప్ చెబితే యుద్ధాన్ని ఆపేశారా? ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని ఎందుకు ఖండించడం లేదు? ఇది దేశ ప్రతిష్టను మంటగలపడం కాదా? అని ప్రశ్నించారు.

ఆదర్శ ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేయాలి

సాక్షి, అమరావతి: సమాజంలో నిరక్షరాస్యతను త్వరితగతిన నిర్మూలించాలంటే ప్రభుత్వ వసతి గృహాల స్థానంలో ఆదర్శ ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై మంత్రి నారా లోకేశ్‌కు పలువురు బీసీ నేతలతో కలిసి మంగళవారం ఆయన వినతిపత్రమిచ్చారు. గతంలో ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుని ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికయ్యారని, ఇప్పుడు ప్రభుత్వ హాస్టళ్లు అందుకు అనుకూలమైన పరిస్థితుల్లో లేవని పేర్కొన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా హాస్టళ్లను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీను, రాష్ట్ర కోశాధికారి కన్నా మాస్టారు తదితరులున్నారు.



సాగుబడి

కృత్తిక కార్తె: మే 11 నుంచి

జన్యు సవరణ జగత్తు!

కొత్త టెక్నాలజీ

జన్యు సవరణ...
మన దేశ వ్యవసాయ రంగంలో ఇటీవల సంచలనం సృష్టిస్తున్న అధునాతన సాంకేతికత 'జీన్ ఎడిటింగ్ - జి.ఇ.'. జన్యు సవరణ అనేది శాస్త్రవేత్తలు మొక్కలు, జంతువులు, బ్యాక్టీరియాతో సహా సకల జీవుల లక్షణాలను మెరుగుపరచడానికి అనుమతించే సరికొత్త బ్రీడింగ్ పద్ధతుల్లో ఒకటి.

జన్యు సవరణ కోసం ఉపయోగించే సాంకేతికతలు కత్తెర లాగా పనిచేస్తాయి. డి.ఎన్.ఎ. అంటే డీఆక్సీరైబో కేంద్రక ఆమ్లం. ముఖ్యంగా క్రోమోజోముల్లో ఉంటుంది. మైటోకాండ్రియాలలో చాలా కొద్దిగా కనిపిస్తుంది. జీవులన్నింటిలో డి.ఎన్.ఎ. ముఖ్యమైన జన్యు పదార్థంగా వ్యవహరిస్తుంది. జీవుల్లో అనువంశికానికి డి.ఎన్.ఎ. మూలాధారం. ఒక నిర్దిష్ట ప్రదేశంలో డి.ఎన్.ఎ.ను కత్తిరించడం, కత్తిరించిన లేదా తెలిసిన డి.ఎన్.ఎ. శ్రేణులను తొలగించడం, జోడించడం లేదా భర్తీ చేయడం వంటివి చేస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. పంటల డిఎన్ఎలోని జన్యువుక్రమంలో ఆశించిన అవసరం మేరకు అందుకు సంబంధించిన జన్యువును కత్తిరించటం ద్వారా ఆశించిన ఫలితాలను రాబట్టుకోవటమే జన్యు సవరణ ప్రక్రియ లక్ష్యం.

జీన్ ఎడిటింగ్ సింథటిక్ బయాలజీలో ఒక భాగం. ఇది జీవశాస్త్రం, ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ సూత్రాలను కలిపి కొత్త జీవ వ్యవస్థలను సృష్టించడానికి, ఉన్న వాటిని సవరించడానికి ఉపయోగపడుతుంది. సింథటిక్ బయాలజీ అనేది సాపేక్షంగా కొత్త రంగం. ఈ సంకేతికతకు ఉన్న విస్తారమైన సామర్థ్యం కారణంగా ఇటీవలి సంవత్సరాలలో గణనీయమైన రీతిలో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొక్కలు, బ్యాక్టీరియా వంటి జీవుల జన్యువుల్లో మార్పులు చేయడం ద్వారా నిర్దిష్ట విధులను నిర్వర్తించగల కొత్త జీవ వ్యవస్థలను సృష్టించవచ్చు. జీనోమ్ ఇంజనీరింగ్‌ను వ్యవసాయం, వైద్యం, బయోటెక్నాలజీ సహా వివిధ రంగాల్లో ఉపయోగించవచ్చు. వ్యవసాయాన్ని మరింత సుస్థిరమైన, సమర్థవంతమైన, పర్యావరణ హితమైన రంగంగా మార్చుకోవచ్చు. ఈ సాంకేతికత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తేగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

సింథటిక్ బయాలజీ పద్ధతుల్లో జన్యు సవరణ ఒకటి

సింథటిక్ బయాలజీలో ఉపయోగించే పద్ధతులు అనేకం ఉన్నాయి. డిఎన్ఎ సంశ్లేషణ – అసెంబ్లీ, జీనోమ్ ఎడిటింగ్, ప్రోటీన్ ఇంజనీరింగ్, జీవక్రియ ఇంజనీరింగ్, సిస్టమ్స్ బయాలజీ వంటివి అందులో ముఖ్యమైనవి. జన్యు సవరణలో క్రిస్పర్ – కాస్9 వంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ఇది నిర్దిష్ట డిఎన్ఎ శ్రేణులను కత్తిరించడానికి, సవరించడానికి డిఎన్ఎ గైడెడ్ న్యూక్లియస్‌లను ఉపయోగిస్తుంది. తెగుళ్లు, పర్యావరణ ఒత్తిడి, పంట దిగుబడితో సంబంధం ఉన్న జన్యువుల సవరణల ద్వారా వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో జీనోమ్ ఎడిటింగ్ విప్లవాత్మక మార్పులను తేగలిగిన స్థితిలో ఉంది.

వరి జన్యు సవరణలో మనమే ఫస్ట్

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రెజిల్ తదితర దేశాల్లో ఇంతకు ముందు నుంచే అనేక పంటల్లో జన్యుసవరణ సాంకేతికత ద్వారా సరికొత్త వంగడాల రూపకల్పన జరిగింది. అయితే, ప్రపంచంలోనే తొలి జన్యు సవరణ వరి వంగడాలను రూపొందించిన ఘనత భారత్‌కు దక్కింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ అభివృద్ధి చేసిన డిఆర్ఆర్ ధన్ 100 (కమల), ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఐఎఆర్ఐ) అభివృద్ధి చేసిన పూసా రైస్ డిఎస్‌టి1 రకాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే అధికారికంగా విడుదల చేసింది. ఇవి 20–30% అధిక దిగుబడినివ్వటం, 20% తక్కువ నీటిని వినియోగించటం, 20 రోజులు ముందుగానే పంట కోతకు రావటం వంటి ప్రయోజనాలను చేకూర్చుతాయని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ప్రకటించింది. మన దేశంలో మొట్టమొదటి జన్యు సవరణ వరి రకాలను అభివృద్ధి చేయటంతో జన్యు సవరణ సాంకేతికత మరోసారి చర్చలోకి వచ్చింది.

సింథటిక్ బయాలజీ రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. రసాయన ఎరువులను అధికంగా వాడటం ముఖ్యమైన సవాళ్లలో ఒకటి. ఇది పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. నేలలోని సేంద్రియ పదార్థాన్ని విచ్ఛిన్నం చేయగల సూక్ష్మజీవులను ఇంజనీరింగ్ చేయడం, మొక్కలకు పోషకాలను మరింత అందుబాటులోకి తేవటం, రసాయన ఎరువుల అవసరాన్ని తగ్గించడం ద్వారా జన్యు సవరణ వంటి సింథటిక్ బయాలజీ సాంకేతికత ఈ సమస్యను పరిష్కరించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. తెగుళ్ళు, వ్యాధులు, కరువు లేదా విపరీతమైన ఉష్ణోగ్రతలు వంటి పర్యావరణ ఒత్తిళ్లకు ఎక్కువ నిరోధకత కలిగిన పంటలకు జన్యు సాంకేతికతతో రూపుకల్పన చేస్తున్నారు. ఇవి పంట దిగుబడిని మెరుగుపరుస్తాయి. పురుగుమందులు, ఇతర రసాయనాల వాడకాన్ని తగ్గిస్తాయి.

వ్యవసాయంలో సింథటిక్ బయాలజీ మరొక ఉత్తేజకరమైన ప్రయోజనం ఏమిటంటే.. సాంప్రదాయ జంతు ఆధారిత ఉత్పత్తులకు మొక్కల ఆధారిత ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయడం. మాంసం, పాల ఉత్పత్తులు, ఇతర జంతు ఆధారిత ఉత్పత్తుల రుచిని, ఆకృతిని అనుకరించే ప్రోటీన్లను ఉత్పత్తి చేయడానికి పరిశోధకులు మొక్కల జన్యు క్రమంలో సవరణలు/ చేర్పులు/ మార్పులు చేస్తున్నారు. వ్యవసాయంలో సింథటిక్ బయాలజీ పరిధి అపారమైనది.

అయితే, దీనికి సవాళ్లు కూడా ఉన్నాయి. వ్యవసాయంలో సింథటిక్ బయాలజీ వల్ల జన్యు భద్రత, అనాలోచిత విపరిణామాల గురించి కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న ఇతర సాంకేతికతల వలె సింథటిక్ బయాలజీకి సంబంధించి సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఉపయోగాన్ని నిర్ధారించుకోవడానికి పూర్తిగా అధ్యయనం చేయాలి. జాగ్రత్తగా నియంత్రించాలి.

జన్యు సవరణ ప్రయోజనాలు

- ఖచ్చితమైన నియంత్రణతో జీవ వ్యవస్థలను రూపొందించే, నిర్మించే సామర్థ్యం కలిగి ఉండటం జన్యు సవరణ వంటి సింథటిక్ బయాలజీ సాంకేతికతల ప్రాథమిక ప్రయోజనాల్లో ఒకటి.
- వ్యవసాయం, వైద్య చికిత్సలు, పర్యావరణ కాలుష్య నివారణ, పారిశ్రామిక అప్లికేషన్లకు ఈ సాంకేతికత కొత్త మార్గాలను తెరుస్తుంది.
- ఉదాహరణకు, నిర్దిష్ట వ్యాధులను లక్ష్యంగా చేసుకోగల ప్రత్యేక ఔషధాలను రూపొందించడానికి లేదా పర్యావరణంలోని కాలుష్య కారకాలను విచ్ఛిన్నం చేయగల సూక్ష్మజీవులను రూపొందించడానికి సింథటిక్ బయాలజీని ఉపయోగించవచ్చు.
- ఆహార భద్రత, ఇంధనం, వాతావరణ మార్పు వంటి విశ్వవ్యాప్త సవాళ్లకు స్థిరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి కూడా సింథటిక్ బయాలజీని ఉపయోగించవచ్చు.
- ఉదాహరణకు, సింథటిక్ బయాలజీ వాతావరణ మార్పులను దీటుగా తట్టుకునే పంటలను అభివృద్ధి చేయవచ్చు. పురుగు మందులు, కలుపు మందుల వాడకాన్ని తగ్గించడానికి, పంటల దిగుబడిని పెంపొందించడానికి సహాయపడుతుంది.



జన్యు సవరణ ప్రతికూలతలు

- జన్యు సవరణ వంటి సింథటిక్ బయాలజీ సాంకేతికత వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దానికి వుండే సమస్యలు దానికి ఉన్నాయి. జీవుల జన్యువుల్లో మార్పులు చేయటంలో భద్రత, నైతిక చిక్కులు ఇమిడి ఉన్నాయి.
- ఈ సాంకేతికతను బాధ్యతాయుతంగా, సురక్షితంగా ఉపయోగించుకోవాలి. అందుకు జాగ్రత్తగా నియంత్రణ, పర్యవేక్షణ అవసరం.
- అధిక ధర, సంక్లిష్టత దీనికి ఉన్న పెద్ద ప్రతికూలత. ప్రత్యేకమైన పరికరాలు, సుశిక్షితులైన సిబ్బంది అవసరం. ఇందుకు భారీ పెట్టుబడి అవసరం, దీని వలన చిన్న తరహా ప్రాజెక్టులను చేపట్టటం కష్టంగా మారుతుంది.
- ఊహించని పరిణామాలు సంభవించే ప్రమాదం ఉంది. జన్యు మార్పులకు లోనైన జీవులు సహజ వాతావరణంతో అనూహ్య విధాలుగా ప్రతిస్పందించే అవకాశం ఉంది.

జన్యు సవరణ పంటల ప్రపంచం!

జన్యు సవరణకు సంబంధించిన ఆధునిక బ్రీడింగ్ ఆవిష్కరణ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా ఏయే దేశాల్లో ఎటువంటి నియంత్రణ చట్టాలు, నియమనిబంధనలు అమల్లో ఉన్నదీ ఈ ఇన్ఫోగ్రాఫిక్ తెలియజెప్తోంది.

ఈ దేశాలు జన్యు సవరణ వంగడాలను సాధారణ కొత్త వంగడాలుగానే పరిగణిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో చట్టాల్లో వచ్చిన మార్పుల వల్ల ఇది సాధ్యమైంది.



సైట్ డైరెక్టెడ్ న్యూక్లియాసెస్1 (ఎస్‌డిఎన్1) పద్ధతిలో రూపొందించిన జన్యు సవరణ వంగడాలను సాధారణ కొత్త వంగడాల మాదిరిగానే పరిగణించాలనే అంశంపై విధాన రూపకల్పన దిశగా చెప్పుకోదగిన స్థాయిలో చర్చలు కొనసాగుతున్న దేశాలు.

పాత చట్టాల ప్రకారం న్యాయస్థానాలు వ్యాఖ్యానాలకు అనుగుణంగా ఎస్‌డిఎన్1 పద్ధతిలో రూపొందించిన జన్యు సవరణ వంగడాలను జన్యు మార్పిడి జీవులు(జిఎంఓల)గానే పరిగణిస్తున్న దేశాలు.

ఉత్తర అమెరికా

● జన్యుసవరణ వంటి సరికొత్త బ్రీడింగ్ ఆవిష్కరణలను సాధారణ వంగడాలుగా పరిగణిస్తూ పటిష్ట చట్టాలు చేసిన తొలి వరుస దేశాల్లో అమెరికా, కెనడా ముందు భాగాన ఉన్నాయి. ● జన్యు సవరణ చేసిన అధిక ఓలిక్ సోయాబీన్స్ నుంచి తీసిన నూనెను 'కాలినో' పేరిట విక్రయిస్తున్నారు ● ఇది అమెరికాలో 2019 నుంచి వాణిజ్యపరంగా సాగవుతున్న తొలి జన్యు సవరణ పంట.

లాటిన్ అమెరికా

● జన్యు సవరణ వంటి న్యూ బ్రీడింగ్ ఇన్నోవేషన్స్‌ను అనుమతిస్తూ 8 లాటిన్ అమెరికా దేశాలు చట్టాలు చేశాయి: బ్రెజిల్, చిలి, కొలంబో, ఈక్వడార్, గ్వాటెమల, హోండురస్, పరాగ్వే, అర్జెంటీనా ● అర్జెంటీనా 2015లోనే తొలి చట్టం చేసింది. కోసిన తర్వాత రంగు మారకుండా ఉండేలా జన్యు సవరణ చేసిన బంగాళదుంపను క్రిస్పర్ ద్వారా 2018లో అర్జెంటీనా రూపొందించింది.

యూరప్

● జన్యు సవరణ వంటి న్యూ జినోమిక్ టెక్నిక్స్‌ను జన్యుమార్పిడి వంగడాలుగా కాకుండా సాధారణ కొత్త వంగడాలుగానే భావించాలని యూరోపియన్ యూనియన్ 2023 జూలైలో ప్రతిపాదించింది ● యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రెసిషన్ బ్రీడింగ్ బిల్లును 2022 మేలో ప్రవేశపెట్టారు. 2023 మార్చిలో రాజు ఆమోదం పొందింది. ఈ చట్టం సైన్స్ బేస్‌డ్ నియంత్రణ వ్యవస్థను నెలకొల్పటం ద్వారా పరిశోధనలకు దోహదం చేస్తోంది.

ఆఫ్రికా

జన్యు సవరణ వంటి న్యూ బ్రీడింగ్ ఇన్నోవేషన్స్‌ను అనుమతిస్తూ 4 ఆఫ్రికా దేశాలు మార్గదర్శకాలు విడుదల చేశాయి: నైజీరియా (ఫిబ్రవరి 2022), కెన్యా (మార్చి 2022), మలావి (ఆగస్టు 2022), ఘన (అక్టోబర్ 2023).

ఆసియా పసిఫిక్

● జన్యు సవరణ వంగడాలు/ఉత్పత్తులను అనుమతిస్తూ ఆస్ట్రేలియా, జపాన్, ఫిలిప్పీన్స్, భారత్ చట్టాలు చేశాయి. ● జపాన్‌లో జన్యు సవరణ చేసిన 'హై గబ' టొమాటోను 2021 నుంచి విక్రయిస్తున్నారు ● బ్రౌన్‌గా మారకుండా ఉండేలా జన్యు సవరణ చేసిన అరటి రకాన్ని నాన్-జిఎంఓ ఉత్పత్తిగా పరిగణిస్తూ ఫిలిప్పీన్స్‌లో 2023లో చట్టం చేసింది ● భారత ప్రభుత్వం జన్యు సవరణను జనుమార్పిడి నియంత్రణ జాబితా నుంచి 2023లో మినహాయించింది. తొలి రెండు జన్యుసవరణ అధిక దిగుబడి వరి వంగడాలను 2025 మేలో విడుదల చేసింది.

సౌజన్యం:
www.isaaa.org

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ జోరు!

వీటి పట్ల ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తి
- ఏడాదిలో 3.5 లక్షల కొత్త ఇన్వెస్టర్లు చేరిక
- రూ.2.26 లక్షల కోట్లకు పెట్టుబడులు



న్యూఢిల్లీ: అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా గడిచిన ఏడాది కాలంలో ఈ విభాగంలో కొత్తగా 3.5 లక్షల మంది ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టారు. దీంతో 2025 ఏప్రిల్ నాటికి హైబ్రిడ్ ఫండ్స్ పరిధిలోని మొత్తం ఇన్వెస్టర్ ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 58 లక్షలకు చేరాయి. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ సైతం 12 శాతం పెరిగి రూ.2.26 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 ఏప్రిల్ నాటికి ఈ మొత్తం రూ.2.02 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. అగ్రెస్సివ్ హైబిడ్ ఫండ్స్ అన్నవి ఈక్విటీలతోపాటు డెట్ సాధనాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈక్విటీలకు 65–80 శాతం మధ్య.. మిగిలిన మేర డెట్‌కు కేటాయింపులు చేస్తుంటాయి. తద్వారా పెట్టుబడుల వృద్ధితోపాటు, స్థిరత్వానికి ఇవి ప్రాధాన్యం ఇస్తుంటాయి. ఈక్విటీ పెట్టుబడుల అస్థిరతలను కొంత తగ్గించుకోవాలని చూసే వారికి ఇవి అనుకూలం. గతేడాది కాలంలో ఈక్విటీల్లో ఆటుపోట్లు పెరిగిపోయిన తరుణంలో అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు ఇన్వెస్టర్ల ప్రాధాన్యం పెరిగినట్టు తెలుస్తోంది. గత ఏడాది కాలంలో అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ 9 శాతం రాబడులను ఇవ్వగా.. రెండేళ్ల కాలంలో వార్షిక రాబడి 20 శాతం, మూడేళ్లలో 15 శాతం, ఐదేళ్లలో సగటున 21 శాతం చొప్పున ఉన్నట్టు డేటా తెలియజేస్తోంది. మోస్తరు రిస్క్ తీసుకునే వారికి ఇవి అనుకూలమని ట్రేడ్‌జినీ సీవోవో త్రివేష్ సూచించారు.

భవిష్యత్‌కు అనుకూలం..

రానున్న కాలానికి పెట్టుబడుల కోసం యాక్టివ్ నిర్వహణలోని అగ్రెస్సివ్ మ్యూచువల్ ఫండ్స్ అనుకూలమని నిపుణులు సూచిస్తున్నారు. మార్కెట్ మొత్తంగా కాకుండా.. రంగాల వారీ, స్టాక్స్ వారీ కదలికలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో.. చురుకైన విధానంతో నడిచే అగ్రెస్సివ్ ఫండ్స్ మెరుగైన అవకాశాలను సొంతం చేసుకోగలవన్న అభిప్రాయాన్ని జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో సంతోష్ జోసెఫ్ వ్యక్తం చేశారు. సెబీ ఎఫ్అండ్‌వో నిబంధనలను కఠినతరం చేయడంతో కొందరు ఇన్వెస్టర్లు పన్ను ఆదా, బ్యాలన్స్‌డ్ ఫండ్స్ వైపు మొగ్గు చూపిస్తున్నట్టు చెప్పారు. ఈ విభాగంలో పదుల సంఖ్యలో పథకాలున్నాయి. ఐదేళ్ల కాలంలో వార్షిక రాబడి 18.5–24 శాతం మధ్య ఉంది. ఈ తరహా ఫండ్స్‌లో పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ను నిపుణులు సూచిస్తున్నారు.

భారత్ పట్ల ఇన్వెస్టర్లలో అధిక విశ్వాసం

- ఆర్థిక వ్యవస్థ, ప్రధాని విధానాలపై దృఢ నమ్మకం
- కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ, ప్రధాని మోదీ విధానాలు, దేశ నైపుణ్యాల పట్ల విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పటి మాదిరే అత్యంత విశ్వాసం చూపిస్తున్నారంటూ కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ వ్యాఖ్యానించారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్‌పై ఎదురైన ప్రశ్నకు మంత్రి ఇలా స్పందించారు. జపనీస్ సెమీకండక్టర్ కంపెనీ రెనిసాస్ ఏర్పాటు చేసిన నూతన డిజైన్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు.



భారత్‌కు వేగంగా రావాలని ప్రతి ఒక్క ఇన్వెస్టర్ కోరుకుంటున్నట్టు మంత్రి వైష్ణవ్ చెప్పారు. నోయిడాలోని రెనిసాస్ కొత్త డిజైన్ సెంటర్ ఎంతో అత్యాధునికమైన 3 నానోమీటర్ చిప్స్‌కు మొదటిసారి దేశీయంగా డిజైన్ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందించిన మైక్రో కంట్రోలర్ ఆధారిత హార్డ్‌వేర్ కిట్‌ను ఎన్నో సెమీకండక్టర్ ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేయొచ్చన్నారు. 270 విద్యా సంస్థలకు సైతం దీన్ని అందించనున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు ఇందులోని సాఫ్ట్‌వేర్‌ను అధ్యయనం చేసి, హార్డ్‌వేర్ ద్వారా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణకు కృషి చేయొచ్చని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-5-2025	
విశాఖ	505–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	335.9	4.06
JIOFIN	267.7	1.83
HEROMOTOCO	4,055.50	1.77
DRREDDY	1,208.00	1.04
SUNPHARMA	1,702.20	0.95

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,567.90	-3.63
ETERNAL	231.5	-3.34
POWERGRID	299.2	-3.19
HCLTECH	1,619.90	-3.02
TCS	3,518.00	-2.83

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,551
ఎన్ఎస్ఈ	1,14,943
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,12,129
ఎఫ్ఐఐ	- 477
డీఐఐ	- 4,274

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.70	$ 61.95
బ్రెంట్	66.51	$ 64.96

రత్నాభరణాల ఎగుమతులు వెలవెల

ఏప్రిల్‌లో 5 శాతం డౌన్
- రూ.17,314 కోట్లుగా నమోదు



ముంబై: రత్నాభరణాల ఎగుమతులు (జెమ్స్, జ్యుయలరీ) ఏప్రిల్ నెలలో కొంత నీరసించాయి. గతేడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 4.62 శాతం తక్కువగా 2,037 మిలియన్ డాలర్లుగా (రూ.17,314 కోట్లు) నమోదయ్యాయి. 2024 ఏప్రిల్‌లో జెమ్స్, జ్యుయలరీ ఎగుమతులు 2,136 మిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ఈ వివరాలను రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) విడుదల చేసింది. కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు క్రితం ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూసినప్పుడు 6% తక్కువగా 1,109 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో వీటి ఎగుమతులు 1,181 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం ఆభరణాల ఎగుమతులు సైతం 5.41 శాతం తగ్గాయి. 684 మిలియన్ డాలర్ల విలువైన ఆభరణాల ఎగుమతులు జరిగాయి.

క్రితం ఏడాది ఇదే నెలలో బంగారం ఆభరణాల ఎగుమతులు 724 మిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. పాలిష్ పట్టిన ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ఎగుమతులు 110.74 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.వెండి ఆభరణాల ఎగుమతులు 12% క్షీణతతో 38.3 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కలర్డ్ జెమ్‌స్టోన్ ఎగుమతులు మాత్రం 12శాతం 27.76 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో వీటి ఎగుమతులు 24.8 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

హార్డ్‌వేర్ ఇంజినీరింగ్‌పై మహిళల ఆసక్తి..

- 26 శాతం పెరిగిన జాబ్ అప్లికేషన్స్
- వర్క్‌ఇండియా నివేదిక



ముంబై: అన్ని రంగాల్లో పురుషుల ఆధిపత్యానికి చెక్ చెబుతూ మహిళలు పురోగమిస్తున్నారు. తాజాగా హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ పరిశ్రమలోనూ ఈ ధోరణి కనిపిస్తోంది. గతేడాది ఈ రంగంలో ఉద్యోగాలకు మహిళల నుంచి దరఖాస్తులు 26 శాతం పెరిగినట్లు జాబ్ పోర్టల్ వర్క్‌ఇండియా ఒక నివేదికలో తెలిపింది. హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగాలకు సంబంధించి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు 19 శాతమే పెరిగినట్లు పేర్కొంది. ఇక పార్ట్‌టైమ్ ఉద్యోగాల కోసం మహిళల నుంచి దరఖాస్తులు పెరిగినట్లు వివరించింది. తృతీయ శ్రేణి పట్టణాల నుంచి కూడా అప్లికేషన్లు వస్తున్నప్పటికీ, ప్రథమ శ్రేణి మార్కెట్లలోనే ఎక్కువగా ఉద్యోగాలు ఉంటున్నట్లు వర్క్‌ఇండియా తెలిపింది. పురుషులకు మాత్రమే పరిమితమైన రంగాల్లోకి మహిళలు ప్రవేశించే కొద్దీ భవిష్యత్తులో ఇంజినీరింగ్‌ను పునర్నిర్వచించే మార్పులు చోటు చేసుకుంటున్నాయని వర్క్‌ఇండియా సీఈవో నీలేష్ దుంగార్వాల్ తెలిపారు. పోర్టల్‌లో మొత్తం మీద టెక్ ఉద్యోగాల పోస్టింగ్స్ 11 శాతం పెరగ్గా, హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ లిస్టింగ్స్ మాత్రం 26 శాతం ఎగిసినట్లు వివరించారు.

రీ సస్టైనబిలిటీ నుంచి ఐఎస్ఎస్ ప్లాట్‌ఫాం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్యావరణహిత సర్వీసులను అందించే రీ సస్టైనబిలిటీ తాజాగా ఇంటిగ్రేటెడ్ సస్టైనబిలిటీ సొల్యూషన్స్ (ఐఎస్ఎస్) ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. కార్యకలాపాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల్లో పర్యావరణ అనుకూల విధానాలను అమలు చేయడంలో వ్యాపార సంస్థలకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. 11 దేశాల్లో 99 పైగా సైట్లలో సేవలందిస్తున్న అనుభవంతో ఐఎస్ఎస్‌ను తీర్చిదిద్దినట్లు కంపెనీ ఎండీ మసూద్ మాలిక్ తెలిపారు. రసాయనాలు, ఫార్మా, మెటల్స్, మైనింగ్, తయారీ తదితర రంగ సంస్థల అవసరాలకు అనుగుణంగా దీన్ని మల్చుకోవచ్చని వివరించారు. తటస్థ ఉద్గారాల స్థాయిని సాధించడం, పర్యావరణం.. సమాజం.. గవర్నెన్స్‌పై సానుకూల ప్రభావాలు చూపేలా కార్యకలాపాలు సాగించాలన్న లక్ష్యాల సాధనకు ఇది సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

కేఫిన్‌టెక్‌లో జనరల్ అట్లాంటిక్ 10 % వాటాల విక్రయం

విలువ రూ. 1,790 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కేఫిన్ టెక్నాలజీస్‌లో 10 శాతం వాటాను ప్రమోటర్ సంస్థ అయిన జనరల్ అట్లాంటిక్ విక్రయించింది. దీని విలువ రూ. 1,790 కోట్లు. ఓపెన్ మార్కెట్‌లో రూ. 1,040.31 - 1,041.56 ధర శ్రేణిలో జనరల్ అట్లాంటిక్ సింగపూర్ ఫండ్ 1.72 కోట్ల షేర్లను (10 శాతం వాటా) రెండు విడతలుగా విక్రయించింది. దీనితో కేఫిన్ టెక్నాలజీస్‌లో జనరల్ అట్లాంటిక్ వాటా 31.98 శాతం నుంచి 21.98 శాతానికి తగ్గింది. డేటా ప్రకారం సొసైటీ జనరల్, కోటక్ మహీంద్రా మ్యుచువల్ ఫండ్, కాప్థాల్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్ మొత్తం 63.23 లక్షల షేర్లను (3.68 శాతం వాటా) రూ. 657 కోట్లకు కొనుగోలు చేశాయి. గతేడాది మేలో కూడా జనరల్ అట్లాంటిక్ 5.8 శాతం వాటాను రూ. 712 కోట్లకు విక్రయించింది. 2022 డిసెంబర్‌లో లిస్టయిన కేఫిన్ టెక్నాలజీస్, ఐపీవో ద్వారా రూ. 1,500 కోట్లు సమీకరించింది.

మంగళవారం బీఎస్ఈలో కేఫిన్ టెక్నాలజీస్ షేరు ధర సుమారు 6 శాతం క్షీణించి రూ. 1,052.90 వద్ద క్లోజయ్యింది.

మహావీర్ స్కోడా షోరూంల్లో 'స్కోడా కోడియాక్'

హైదరాబాద్: స్కోడా ఆటో డీలర్‌షిప్ 'మహావీర్ స్కోడా' తెలుగు రాష్ట్రాల్లోని తమ షోరూంల్లో ఆల్‌న్యూ స్కోడా కోడియాక్ ఎస్‌యూవీల డెలివరీలను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.89 లక్షలు. 2.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో ఈ ఎస్‌యూవీ 14.86 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది. పనోరమా సన్‌రూఫ్, 9 ఎయిర్ బ్యాగులు, 1,976 లీటర్ల లగేజీ స్పేస్ కలిగి ఉంది. ఐదేళ్ల వారంటీ/1.25 లక్షల కి.మీ.., పదేళ్ల రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ఏడాది స్కోడా సూపర్‌కేర్ ప్యాకేజీ సౌకర్యాలున్నాయి. మహావీర్ స్కోడా షోరూంల్లో టెస్ట్‌డ్రైవ్‌తో బుకింగ్ సదుపాయం ఉంది.



బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎల్ఐసీ వాటా పెంపు



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియాలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ గత నాలుగేళ్లలో తన వాటాను సుమారు 2.03 శాతం పెంచుకుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ ఇచ్చిన సమాచారం ప్రకారం 2021 సెప్టెంబర్ 2న ఎల్ఐసీకి 6.35 శాతం వాటా ఉండేది. తాజాగా మే 9 నాటికి ఇది 8.38 శాతానికి పెరిగింది. బీఎస్ఈలో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేరు సుమారు 2 శాతం పెరిగి రూ. 112.55 వద్ద క్లోజయ్యింది.

హీరో మోటో లాభం జూమ్

- క్యూ4లో రూ. 1,169 కోట్లు
- షేరుకి రూ. 65 డివిడెండ్



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ. 1,169 కోట్లను తాకింది. వ్యయ నియంత్రణ, విభిన్న ప్రొడక్టులు, మెరుగుపడిన మార్జిన్లు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 943 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు రూ. 2 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 65 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 9,794 కోట్ల నుంచి రూ. 10,244 కోట్లకు బలపడింది. అయితే మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల మొత్తం విక్రయాలు 13.92 లక్షల నుంచి 13.81 లక్షల యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి.

వాహన అమ్మకాలు అప్

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హీరో మోటో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 4,376 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 3,742 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 38,643 కోట్ల నుంచి రూ. 41,967 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 5 శాతం అధికంగా 58.99 లక్షల వాహనాలు విక్రయించింది. 2023–24లో 56.21 లక్షల వాహన అమ్మకాలు నమోదయ్యాయి. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు హీరో మోటో ఈడీ, తాత్కాలిక సీఈవో విక్రమ్ ఎస్ కస్బేకర్ పేర్కొన్నారు. వరుసగా 24వ ఏడాదిలోనూ మార్కెట్ లీడర్‌గా కంపెనీ కొనసాగినట్లు తెలియజేశారు. కీలకమైన 125 సీసీ విభాగంలో కన్సాలిడేషన్ జరుగుతున్నదని, భవిష్యత్‌లో ఈవీల విడుదల ద్వారా వృద్ధి కొనసాగనున్నట్లు వివరించారు.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 4,063 వద్ద ముగిసింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

గెయిల్ లాభం రూ.2,049 కోట్లు

- సహజవాయువు పంపిణీలో తగ్గిన మార్జిన్లు
- షేరుకు రూ.1 చొప్పున తుది డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ గెయిల్ (ఇండియా) మార్చి త్రైమాసికానికి రూ.2,049 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,177 కోట్లతో పోల్చి చూస్తే 6 శాతం క్షీణించింది. పెట్రోకెమికల్ వ్యాపారంలో నష్టాలకుతోడు ప్రధాన వ్యాపారమైన గ్యాస్ మార్కెటింగ్‌లో మార్జిన్లు తక్కువగా ఉండడం ప్రభావం చూపించింది. సహజవాయువు ప్రసారంలో గెయిల్‌కు 70 శాతం మార్కెట్ వాటా ఉండగా, ఈ విభాగంలో ఆదాయం 29 శాతం తగ్గిపోయింది. సహజవాయువు పరిమాణం 125.93 ఎంఎంఎస్‌సీఎండీ నుంచి 120.83 ఎంఎంఎస్‌సీఎండీకి తగ్గింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన అంతక్రితం త్రైమాసికంలో లాభం రూ.3,867 కోట్లుగా ఉండడం గమనార్హం. కన్సాలిడేటెడ్ ఆదాయం మార్చి త్రైమాసికంలో 11 శాతం వృద్ధితో రూ.36,551 కోట్లకు చేరింది. వాటాదారుల వద్దనున్న ప్రతీ షేరుకు రూ.1 చొప్పున తుది డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మంజూరు చేసిన రూ.6.5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం తగ్గి రూ. 184 వద్ద ముగిసింది.

హ్యాపీయెస్ట్ మైండ్స్ లాభం వీక్

- క్యూ4లో రూ. 34 కోట్లు
- షేరుకి రూ. 3.5 డివిడెండ్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల మధ్యస్థాయి కంపెనీ హ్యాపీయెస్ట్ మైండ్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 53 శాతం క్షీణించి రూ. 34 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 72 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం 31 శాతం జంప్‌చేసి రూ. 545 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 417 కోట్ల టర్నోవర్ సాధించింది. కొత్తగా 14 మంది క్లయింట్లను సాధించడంతో కస్టమర్ల సంఖ్య 281ను తాకింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 26 శాతం నీరసించి రూ. 185 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 248 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 27 శాతం ఎగసి రూ. 2,061 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3 శాతం నష్టంతో రూ. 593 వద్ద ముగిసింది.

యూపీఎల్‌కు లాభాల పంట

- మార్చి క్వార్టర్‌కు రూ.1,079 కోట్లు



న్యూఢిల్లీ: ఆగ్రో కెమికల్స్, ఇండస్ట్రియల్ కెమికల్స్ తయారీలోని యూపీఎల్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. రూ.1,079 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని సంస్థ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.80 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.14,078 కోట్ల నుంచి 10.6 శాతం పెరిగి రూ.15,573 కోట్లకు చేరుకుంది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ.43,098 కోట్ల నుంచి రూ.46,637 కోట్లకు వృద్ధి చెందింది. ప్రతీ షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డ్ నిర్ణయించింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.676 వద్ద ముగిసింది.

పెరిగిన సువెన్ లైఫ్ సైన్సెస్ నష్టం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆదాయం తగ్గడం, వ్యయాలు పెరగడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో సువెన్ లైఫ్ సైన్సెస్ నష్టం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన పెరిగి రూ. 43.95 కోట్లకు చేరింది. అంత క్రితం క్యూ4లో నష్టం రూ. 27 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. 2.39 కోట్ల నుంచి రూ. 1.47 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు రూ. 34.21 కోట్ల నుంచి రూ. 46.63 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో నికర నష్టం రూ. 105.08 కోట్ల నుంచి రూ. 160.75 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 11.69 కోట్ల నుంచి రూ. 6.66 కోట్లకు తగ్గింది. ప్రమోటర్ గ్రూప్, ప్రమోటర్ యేతర సంస్థలు, వ్యక్తులకు 6.40 కోట్ల వరకు కన్వర్టబుల్ వారంట్లను ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన జారీ చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఒక్కో వారంటు ఇష్యూ ధర రూ. 134గా, మొత్తం పరిమాణం రూ. 857 కోట్లుగా ఉంటుందని వివరించింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు దాదాపు 12 శాతం ఎగిసి రూ. 170.80 వద్ద ముగిసింది.

మెప్పించని సీమెన్స్ లిమిటెడ్

- 37 శాతం తగ్గిన నికర లాభం



న్యూఢిల్లీ: సీమెన్స్ లిమిటెడ్ మార్చి త్రైమాసికంలో పనితీరు పరంగా మెప్పించలేకపోయింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 37 శాతం తగ్గిపోయి రూ.408 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.649 కోట్లుగా ఉంది. స్థిర వ్యయాలు, డిజిటల్ ఇండస్ట్రీస్ వ్యాపారంలో అధిక మెటీరియల్ ధరలు లాభాలు తగ్గడానికి కారణంగా కంపెనీ పేర్కొంది. మార్చి త్రైమాసికంలో డీమెర్జర్ తాలూకు రూ.63 కోట్ల వ్యయాలను కూడా ఎదుర్కోవాల్సి వచ్చినట్టు తెలిపింది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.4,152 కోట్ల నుంచి రూ.4,259 కోట్లకు పెరిగింది.

బీఎస్ఈలో షేరు ఒక శాతం పెరిగి రూ.2,917 వద్ద ముగిసింది.

తాజ్ జీవీకే లాభం 11 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో తాజ్‌జీవీకే లాభం సుమారు 11 శాతం పెరిగి రూ. 29 కోట్లకు చేరింది. అంతక్రితం జనవరి–మార్చి త్రైమాసికంలో కంపెనీ రూ. 26 కోట్ల లాభం నమోదు చేసింది. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 117 కోట్ల నుంచి రూ. 131 కోట్లకు, వ్యయాలు రూ. 82 కోట్ల నుంచి రూ. 96 కోట్లకు చేరాయి. రూ. 2 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 2 చొప్పున కంపెనీ డివిడెండ్ ప్రకటించింది.

మంగళవారం బీఎస్ఈలో తాజ్‌జీవీకే స్వల్ప లాభంతో రూ. 408 వద్ద క్లోజయ్యింది.

సిప్లా లాభం జూమ్

- క్యూ4లో రూ. 1,222 కోట్లు
- షేరుకి రూ. 16 డివిడెండ్



న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం సిప్లా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 30 శాతం జంప్‌చేసి రూ. 1,222 కోట్లను తాకింది. భారత్‌తోపాటు యూఎస్, ఆఫ్రికాలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 939 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 16 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కంపెనీ 90 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రకటించిన రూ. 3 ప్రత్యేక డివిడెండ్ దీనిలో కలసి ఉంది. కాగా.. మొత్తం ఆదాయం 10 శాతం వృద్ధితో రూ. 6,730 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో సిప్లా షేరు బీఎస్ఈలో 0.5 శాతం లాభంతో రూ. 1,519 వద్ద ముగిసింది.



ప్రియాంక పరాజయం

అల్ అయిన్ (యూఏఈ): ఆసియా వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి, మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక మూడో ఓటమిని చవిచూసింది. మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో ప్రియాంక 44 ఎత్తుల్లో మెలికా మొహమ్మదీ (ఇరాన్) చేతిలో పరాజయం పాలైంది. ఈ టోర్నీలో ప్రియాంక మూడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయింది. ఏడో రౌండ్ తర్వాత భారత్‌కే చెందిన శ్రీజా శేషాద్రి ఆరు పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. వంతిక అగర్వాల్‌తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను శ్రీజ 47 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.

పీఎస్ఎల్ కూడా 17 నుంచే

లాహోర్: ఈ సీజన్‌లో ఐపీఎల్‌కు పోటీగా పీఎస్ఎల్‌ను కూడా ఇదే సమయంలో నిర్వహిస్తుండగా, ఇరు దేశాల్ లీగ్‌లను ఉద్రిక్త పరిస్థితులతో వాయిదా పడ్డాయి. ఇప్పుడు పునఃప్రారంభం కూడా ఒకే తేదీన అవుతోంది. మిగతా ఐపీఎల్ 17 నుంచి అని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించిన మరుసటి రోజే పోటీగా పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కూడా మే 17 నుంచి పీఎస్ఎల్ ఆర్భాటానికి పోయింది. కానీ ఇక్కడ అసలు సవాల్ విదేశీ ప్లేయర్ల నుంచి ఎదురవుతోంది. భారత ఆర్మీ దాడులతో బెంబేలెత్తిన పలువురు విదేశీ ఆటగాళ్లు ఇక పాక్‌కు వచ్చే సమస్యే లేదని తెలిసింది. ఈ నేపథ్యంలో వారు వెనక్కి వచ్చే అవకాశమైతే లేదు. 25న జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ పీఎస్ఎల్ ముగుస్తుంది. అయితే పలువురు స్టార్ క్రికెటర్లు తిరిగి రానే రామని తేల్చేయడంతో వారి స్థానాల్ని వెంటనే భర్తీ చేసుకొని ఆయా ఫ్రాంచైజీలన్నీ పునఃప్రారంభానికి సిద్ధంగా ఉండాలని పీసీబీ సూచించింది.

నంబర్‌వన్ దిశగా స్మృతి మంధాన



- రెండో స్థానానికి ఎగబాకిన స్టార్ బ్యాటర్
- ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: భారత వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంక్ దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆమె మూడు నుంచి రెండో స్థానానికి ఎగబాకింది. ఆదివారం శ్రీలంకలో ముగిసిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో స్మృతి వీరోచిత సెంచరీతో భారత మహిళల జట్టు విజేతగా నిలిచింది. వరుస మ్యాచ్‌ల్లో ఫిఫ్టీ, సెంచరీద్వారా మొత్తం 264 పరుగులు సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది. 2019లో స్మృతి తొలిసారిగా టాప్ ర్యాంక్‌ను అధిరోహించింది. ఇప్పుడు ఈ ఫామ్ కొనసాగిస్తే నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరడం ఏమంత కష్టం కాదు. దక్షిణాఫ్రికా టాప్ ర్యాంక్ ప్లేయర్ లారా వోల్వార్ట్ (753) రేటింగ్ పాయింట్ల కంటే కేవలం 11 పాయింట్ల దూరంలోనే స్మృతి మంధాన (742) ఉంది. శ్రీలంక సారథి చమరి అటపట్టు ఏడో ర్యాంక్‌కు ఎగబాకడం ద్వారా టాప్–10లోకి వచ్చింది. జెమీమా రోడ్రిగ్స్ ఐదు స్థానాల్ని మెరుగుపర్చుకొని 15వ ర్యాంక్‌కు చేరింది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 15 వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన స్పిన్నర్ స్నేహ్ రాణా నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని 34వ స్థానంలో నిలిచింది. దీప్తి శర్మ ఆరు నుంచి ఐదో ర్యాంక్‌కు చేరుకోగా... ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎకిల్‌స్టోన్ అగ్రస్థానంలో ఉంది.

గ్రీన్, ఎన్‌గిడి పునరాగమనం

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల ప్రకటన
- జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ మైదానంలో టైటిల్ పోరు



గ్రీన్

మెల్‌బోర్న్/జొహన్నెస్‌బర్గ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి ఆస్ట్రేలియా జట్టు... తొలిసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌గా అవతరించేందుకు దక్షిణాఫ్రికా జట్టు సమాయత్తమవుతున్నాయి. ఈ రెండు జట్ల మధ్య జూన్ 11 నుంచి 14 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. ఈ మెగా పోరులో పాల్గొనే రెండు జట్లను మంగళవారం ప్రకటించారు. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో ఆస్ట్రేలియా... తెంబా బవుమా నాయకత్వంలో దక్షిణాఫ్రికా బరిలోకి దిగనున్నాయి. రెండు జట్లలో ఆశ్చర్యకర మార్పులేవీ లేవు. వెన్ను నొప్పి కారణంగా ఏడాది కాలంగా ఆటకు దూరమైన ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ ఆస్ట్రేలియా జట్టులోకి తిరిగి వచ్చాడు. 28 టెస్టులు ఆడిన గ్రీన్ 1377 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఆరు అర్ధ సెంచరీలు ఉన్నాయి. బంతితో కూడా రాణించిన గ్రీన్ 35 వికెట్లు పడగొట్టాడు. వ్యక్తిగత కారణాలతో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో పాల్గొనలేకపోయిన హాజల్‌వుడ్, కెప్టెన్ కమిన్స్ కూడా ఈ ప్రతిష్టాత్మక పోరుకు అందుబాటులోకి వచ్చారు. భారత్‌తో జరిగిన సిరీస్‌లో దూకుడైన ఆటతో ఆకట్టుకున్న స్యామ్ కొన్‌స్టాస్ కూడా జట్టులో చోటు నిలబెట్టుకున్నాడు. 2023 డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్‌పై గెలిచి ఆస్ట్రేలియా తొలిసారి టైటిల్ సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ముగిశాక ఇదే బృందం వెస్టిండీస్ పర్యటనకు బయలుదేరుతుంది. జూన్ 25 నుంచి జూలై 27 వరకు జరిగే ఈ పర్యటనలో వెస్టిండీస్ జట్టుతో ఆస్ట్రేలియా మూడు టెస్టులు, ఐదు టి20 మ్యాచ్‌లు ఆడుతుంది.

మరోవైపు తొలి ప్రయత్నంలోనే డబ్ల్యూటీసీ విజేతగా నిలవాలని ఆశిస్తున్న దక్షిణాఫ్రికా ఫైనల్ కోసం ఆరుగురు పేస్ బౌలర్లు, ఇద్దరు స్పిన్నర్లను ఎంపిక చేసింది. గజ్జల్లో గాయం కారణంగా గత ఎనిమిది నెలలుగా ఆటకు దూరంగా ఉన్న పేస్ బౌలర్ లుంగి ఎన్‌గిడి... రిక్రియేషనల్ డ్రగ్స్ తీసుకొని నెలరోజులపాటు నిషేధానికి గురైన మరో ఫాస్ట్ బౌలర్ కగిసో రబడ కూడా దక్షిణాఫ్రికా జట్టులో చోటు సంపాదించారు. 29 ఏళ్ల ఎన్‌గిడి 19 టెస్టులు ఆడి 55 వికెట్లు పడగొట్టాడు.



ఎన్‌గిడి

ఆస్ట్రేలియా జట్టు: ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, హాజల్‌వుడ్, ట్రావిస్ హెడ్, ఇన్‌గ్లిస్, ఉస్మాన్ ఖ్వాజా, సామ్ కొన్‌స్టాస్, కునెమన్, లబుషేన్, నాథన్ లయన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, వెబ్‌స్టర్. బ్రెండన్ డగెట్ (ట్రావెలింగ్ రిజర్వ్).

దక్షిణాఫ్రికా జట్టు: తెంబా బవుమా (కెప్టెన్), బెడింగ్‌హామ్, కార్బిన్ బోష్, టోనీ డి జార్జి, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, వియాన్ ముల్డర్, సెనురన్ ముత్తుస్వామి, లుంగి ఎన్‌గిడి, డేన్ ప్యాటర్సన్, కగిసో రబడ, రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరీన్.

మార్క్‌రమ్, రికెల్టన్, టోనీ డి జార్జి, స్టబ్స్, బెడింగ్‌హామ్ సమష్టిగా రాణిస్తే బవుమా బృందం సంచలన ఫలితం సాధించే అవకాశముంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో 101 టెస్టులు ఆడిన దక్షిణాఫ్రికా 26 టెస్టుల్లో గెలిచి, 54 టెస్టుల్లో ఓడిపోయింది. మరో 21 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి. డబ్ల్యూటీసీ టెస్టులో ఫలితం రాకపోతే రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

కోచ్ ముర్రేతో జొకోవిచ్ తెగదెంపులు



జొకోవిచ్ ఆండీ ముర్రే

లండన్: ఒక దిగ్గజ ప్లేయర్‌తో మరో **మాజీ** వరల్డ్ నంబర్‌వన్ కోచింగ్ అనుబ**ంధం ఆరు** నెలలకే ముగిసింది. సెర్బియా స్టార్ **నొవాక్ జొకో**విచ్ తన కోచ్, బ్రిటన్ మాజీ **ప్లేయర్ ఆండీ** ముర్రేతో తెగదెంపులు చేసుకు**న్నాడు. ఇకపై** వీరిద్దరు కలిసి పని చేయరని ముర్రే **మేనేజర్ ప్రక**టించాడు. గత ఏడాది ముర్రే ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత తనకు కోచింగ్ సహకారం కావాలంటూ జొకోవిచ్ స్వయంగా ముర్రేను సంప్రదించాడు. దాంతో వీరిద్దరు ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు జత కట్టారు. అయితే ఇది ఎక్కువ కాలం సాగలేదు. తన స్థాయికి తగ్గ ఆటతీరును కనబర్చలేక వరుసగా ఓడుతున్న జొకోవిచ్ ఈ సీజన్‌లో ఇంకా ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. నిజానికి రాబోయే క్లే కోర్టు సీజన్ ముగిసే వరకు కూడా తనకు ముర్రే కోచ్‌గా వ్యవహరిస్తాడని గతంలోనే జొకోవిచ్ చెప్పినా... చివరకు దానికి చాలా ముందే ఇద్దరూ విడిపోయారు. 'గత ఆరు నెలలుగా నాకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు. కోర్టులో కఠోర శ్రమతో పాటు కోర్టు బయట కూడా రోజులు బాగా గడిచాయి' అని జొకోవిచ్ సోషల్ మీడియాలో ముర్రే గురించి పోస్ట్ చేయగా...తనకు కోచ్‌గా అవకాశం ఇచ్చిన జొకోవిచ్‌కు ముర్రే కూడా థ్యాంక్స్ చెప్పాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన 37 ఏళ్ల జొకోవిచ్ మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధిస్తే **టెన్నిస్ చరిత్ర**లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ **సింగిల్స్ టైటిల్స్** గెలిచిన ప్లేయర్‌గా ఆల్ **టైమ్ రికార్డు నెల**కొల్పుతాడు. మహిళల **విభాగంలో ఆస్ట్రేలియా** క్రీడాకారిణి మార్గరెట్ **కోర్ట్ 24 గ్రాండ్‌స్లామ్ సిం**గిల్స్ టైటిల్స్ సాధించింది. ప్రస్తుతం మార్గరెట్ కోర్ట్, జొకోవిచ్ పేరిట సంయుక్తంగా ఈ రికార్డు ఉంది. కెరీర్‌లో 99 సింగిల్స్ టైటిల్స్ సాధించిన జొకోవిచ్ 100వ టైటిల్ కోసం నిరీక్షిస్తున్నాడు. తదుపరి ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే జెనీవా ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో జొకోవిచ్ బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలో జొకోవిచ్ గెలిస్తే జిమ్మీ కానర్స్ (109; అమెరికా), రోజర్ ఫెడరర్ (103; స్విట్జర్లాండ్) తర్వాత 100 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన మూడో క్రీడాకారిడిగా గుర్తింపు పొందుతాడు.

బోపన్న జోడీ ఓటమి

రోమ్: భారత పురుషుల టెన్నిస్ డబుల్స్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ రోహన్ బోపన్నకు ఈ ఏడాది మరోసారి నిరాశ ఎదురైంది. రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో 45 ఏళ్ల బోపన్న పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. మంగళవారం జరిగిన డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న (భారత్)–ఆడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ 3–6, 3–6తో జో సాలిస్‌బరీ–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జంట చేతిలో ఓడిపోయింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–చెక్ జోడీ ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయిన బోపన్న–పావ్లాసెక్ ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు వచ్చిన మూడు అవకాశాలను వృథా చేసుకున్నారు. బోపన్న–పావ్లాసెక్ జోడీకి 30,540 యూరోల (రూ. 29 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది పది టోర్నీలు ఆడిన బోపన్న ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు.



బ్రూక్ సారథ్యంలో...

వెస్టిండీస్‌తో వన్డే, టి20 సిరీస్ బరిలో ఇంగ్లండ్ • **మే 29 నుంచి జూన్ 10 వరకు సిరీస్**




లండన్: ఈ నెలాఖరులో వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే వన్డే, టి20 సిరీస్‌లలో పాల్గొనే ఇంగ్లండ్ జట్లను ప్రకటించారు. హ్యారీ బ్రూక్ సారథ్యంలో తొలిసారి ఇంగ్లండ్ జట్టు ఈ సిరీస్‌లో పోటీ పడనుంది. తొలి మూడు వన్డేలు వరుసగా మే 29న, జూన్ 1న, జూన్ 3న ఎడ్జ్‌బాస్టన్, కార్డిఫ్, ఓవల్‌లలో జరుగుతాయి. అనంతరం జూన్ 6న, జూన్ 8న, జూన్ 10న వరుసగా మూడు టి20లను చెస్టర్ లీ స్ట్రీట్, బ్రిస్టల్, సౌతాంప్టన్‌లలో నిర్వహిస్తారు. హాంప్‌షైర్ కౌంటీ జట్టుకు ఆడుతున్న ఆల్‌రౌండర్ లియామ్ డాసన్ మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ టి20 జట్టులోకి వచ్చాడు. నాటింగ్‌హామ్‌షైర్ ఎడంచేతి వాటం పేస్ బౌలర్ ల్యూక్ వుడ్ రెండేళ్ల తర్వాత టి20 జట్టులోకి ఎంపికయ్యాడు. స్పిన్నర్ టామ్ హార్ట్‌లే రెండేళ్ల తర్వాత వన్డే జట్టులోకి పునరాగమనం చేశాడు.

ఇంగ్లండ్ వన్డే జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, విల్ జాక్స్, జో రూట్, బెన్ డకెట్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్, టామ్ హార్ట్‌లే, సాకిబ్ మహమూద్, మాథ్యూ పాట్స్, జేమీ ఒవర్టన్, ఆదిల్ రషీద్, జేమీ స్మిత్.

ఇంగ్లండ్ టి20 జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జేకబ్ బెథెల్, టామ్ బాంటన్, జోస్ బట్లర్, బ్రైడన్ కార్స్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, సాకిబ్ మహమూద్, మాథ్యూ పాట్స్, జేమీ ఒవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, ల్యూక్ వుడ్.

వావ్రింకాకు 'వైల్డ్ కార్డు'



పారిస్: మూడు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్ల విజేత స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్), వెటరన్ స్టార్ రిచర్డ్ గాస్కే (ఫ్రాన్స్)లకు ఫ్రెంచ్ ఓపెన్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీలు ఇచ్చారు. పురుషుల సింగిల్స్‌లో వీరిద్దరితో పాటు మరో ఆరుగురికి, మహిళల సింగిల్స్‌లో ఎనిమిది మందికి వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. గత మార్చిలో 40వ పడిలోకి ప్రవేశించిన వావ్రింకా ముందుగా 2014లో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గాడు. 2015లో ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. 2016లో యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌నూ చేజిక్కించుకున్నాడు. చాన్నాళ్ల నుంచి అతను వైఫల్యాలు వెన్నంటే గాయాలతో సతమతమవుతున్నాడు. దీంతో సింగిల్స్‌లో ఏకంగా 132వ ర్యాంక్‌కు దిగజారాడు. స్థానిక స్టార్ గాస్కే 38 ఏళ్ల వయసులో చివరిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. అయితే మేజర్ టోర్నీల్లో ఒక్క టైటిల్ గెలవలేకపోయాడు.

వైల్డ్‌కార్డ్ ఎంట్రీ జాబితా

మహిళల సింగిల్స్: డెస్టానీ (ఆస్ట్రేలియా), బొయిసన్ (ఫ్రాన్స్), ఇల్సా (ఫ్రాన్స్), జిన్‌జిన్ (ఫ్రాన్స్), ఇవా జోవిక్ (అమెరికా), క్లో పాకెట్ (ఫ్రాన్స్), డైన్ పారీ (ఫ్రాన్స్), టియాన్‌త్సో (ఫ్రాన్స్). **పురుషుల సింగిల్స్:** వావ్రింకా, గాస్కే, అట్మన్ (ఫ్రాన్స్), కాజాక్స్ (ఫ్రాన్స్), పియెరీ (ఫ్రాన్స్), ఎమిలియో (అమెరికా), వాలెంటిన్ రాయర్ (ఫ్రాన్స్), ట్రిస్టన్ స్కూల్‌కేట్ (ఆస్ట్రేలియా).

శ్రీకాంత్‌కు చుక్కెదురు

క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో తరుణ్ మన్నేపల్లి చేతిలో ఓటమి

బ్యాంకాక్: ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత అగ్రశ్రేణి షట్లర్ కిడాంబి శ్రీకాంత్ నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాంత్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన తరుణ్ మన్నేపల్లి 21–16, 21–19తో శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు. అంతకుముందు క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 23 ఏళ్ల తరుణ్ 17–21, 21–19, 21–17తో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ)పై, 32 ఏళ్ల శ్రీకాంత్ 21–15, 21–17తో శంకర్‌పై గెలుపొందారు. భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టి, ఐరా శర్మ కూడా మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయారు. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌ల్లో ఆయుశ్ శెట్టి 14–21, 20–22తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో, ఐరా 12–21, 18–21తో థమన్‌వోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో మోహిత్–లక్షిత (భారత్) జోడీ 8–21, 10–21తో ఎన్జీ సాజ్ యావు–చాన్ యిన్ చాక్ (హాంకాంగ్) ద్వయం చేతిలో ఓడింది.



శ్రీకాంత్



టెక్సాస్‌లోని అన్సన్‌లో బ్లూబానెట్ డిటెన్షన్ సెంటర్‌లో 'స్వదేశాలకు వెళ్లాలని కోరుకుంటున్నాం. మాకు సాయం చేయండి. మేము ఉగ్రవాదులం కాదు' అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న అక్రమ వలసదారులు



బ్యాంకాక్‌లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'క్యాస్' ప్రతిమ ముందు థాయ్ వాసుల సందడి

పొల్లాచి లైంగిక వేధింపుల కేసులో 9 మందికి జీవిత ఖైదు

ఆరు సంవత్సరాల విచారణ అనంతరం తీర్పు

చెన్నై: తమిళనాడులోని పొల్లాచి లైంగిక వేధింపుల కేసులో 9 మందికి జీవిత ఖైదు విధించారు. 2019లో తొమ్మిది మంది పురుషులు అనేక మంది మహిళలపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్ చేసిన ఘటన అప్పట్లో సంచలనం అయ్యింది. ఆరు సంవత్సరాల పాటు విచారణ అనంతరం తొమ్మిది మంది నిందితులను దోషులుగా నిర్ధారణ చేస్తూ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.నందిని దేవి తీర్పునిచ్చారు. అనంతరం .. తొమ్మిది మంది.. శబరిరాజన్ అలియాస్ రిష్వంత్(32), తిరునావుకరసు(34), టి.వసంత కుమార్(30), ఎం.సతీష్(33), ఆర్.మణి అలియా స్ మణివన్నన్, పి.బాబు(33), హరోన్ పాపాల్(32), అరుళనంతం(39), అరుణ్ కుమార్(33)లకు జీవిత ఖైదు విధించారు. దేశాన్ని కుదిపేసిన ఈ సంచలనాత్మక కేసులో 2019లో అరెస్టయినప్పటి నుంచి వారు సేలం సెంట్రల్ జైలులో ఉన్నారు. ఈ ఉద యం, వారిని భారీ పోలీసు భద్రత మధ్య కోయంబత్తూరులోని కోర్టుకు తీసుకువచ్చారు. నగరం అంతటా నిఘాను తీవ్రతరం చేశారు. కోర్టు కాంప్లెక్స్, ఇతర కీలక ప్రదేశాలలో భారీ కాపలా ఏర్పాటు చేశారు. 200కి పైగా పత్రాలు, దాడులకు సంబంధించిన ఫోరెన్సిక్-ధ్రువీకరించిన వీడియోలతో సహా 400 ఎలక్ట్రానిక్ ఆధారాలను విచారణ సమయంలో సమర్పించారు. ''బాధితుల సాక్ష్యా ల డిజిటల్ రుజువులు కీలకమైనవి. సాక్షులు ఎవరూ ప్రతికూలంగా మారలేదు''అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఈ శిక్షలను మహిళా సంఘాలు స్వాగతించాయి. తొమ్మిది మంది లైంగికంగా వేధించి, దాన్ని వీడియోల్లో బంధించి ఆ తరువాత బ్లాక్‌మెయిల్ చేయగా.. ఓ విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 2019లో పొల్లాచి కేసు వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత అనేక మంది మహిళలు బయటికి వచ్చారు. మహిళలను ఆన్‌లైన్ ద్వారా స్నేహం పెంచుకుని, ఆ తరువాత ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లడం, లైంగిక దాడి చేసి దాన్ని చిత్రీకరించడం చేశారు. ఆ తరువాత ఆ వీడియోలు బయటపెడతామని డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. 2016 నుంచి 2018 మధ్య కాలంలో 200 మందికి పైగా మహిళలను బ్లాక్‌మెయిల్ చేశారు. తొమ్మిది మందిపై అత్యాచారం, సామూహిక అత్యాచారం, ఒకే బాధితురాలిపై పదే పదే అత్యాచారం, నేరపూరిత కుట్ర, లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్ వంటి అభియోగాలు మోపారు. ఈ కేసును మొదట పొల్లాచి పోలీసులు దర్యాప్తు చేశారు. కానీ నిష్పాక్షిక దర్యాప్తు కోసం డిమాండ్లు పెరగడంతో తమిళనాడు క్రైమ్ బ్రాంచ్-క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీబీ-సీఐడీ)కి, ఆ తరువాత సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేశారు.



భారత సాయుధ బలగాలకు సంఘీభావంగా మంగళవారం ఢిల్లీలో కర్తవ్యపథ్ నుంచి నేషనల్ వార్ మెమోరియల్‌కు ప్రజల ర్యాలీ

బంగ్లా మాజీ అధ్యక్షుడు హమీద్ పరార్

థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో థాయ్‌లాండ్‌కు చేరిక

- హమీద్‌పై ఇప్పటికే హత్య కేసు నమోదు
- ఆయన పరారీపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ హమీద్(81) ఎవరికీ చెప్పాపెట్టకుండా రహస్యంగా దేశం విడిచి వెళ్లిపోయారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో ఢాకా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో గుర్తు తెలియని ప్రాంతానికి చేరుకున్నారు. ఇంటి నుంచి చక్రాల కుర్చీలో వెళ్లే సమయంలో ఆయన ఒంటిపై లుంగీ మాత్రమే ఉండడం గమనార్హం. మాజీ అధ్యక్షుడు ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. గత ఏడాది షేక్ హసీనాకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలను బలవంతంగా అణచివేసిన కేసులో మొహమ్మద్ అబ్దుల్ హమీద్‌పై దర్యాప్తు జరుగుతోంది. ఆయనపై హత్య కేసు సైతం నమోదైంది. ఈ నేపథ్యంలో దేశం విడిచి వెళ్లిపోవడం ప్రాధాన్యం సంచలనాత్మకంగా మారింది. మొహమ్మద్ అబ్దుల్ హమీద్ వ్యవహారం పట్ల బంగ్లాదేశ్‌లోని మధ్యంతర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన పారిపోకుండా అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల మండిపడింది. కొందరు అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేసింది. మరికొందరికి బదిలీ వేటు వేసింది. మొహమ్మద్ అబ్దుల్ హమీద్ పరారీపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ సలహాదారు సి.ఆర్.అబ్రార్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేశారు. హమీద్ 2013 నుంచి 2023 మధ్యలో రెండుసార్లు బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2024లో షేక్ హసీనాతోపాటు ఆమె అనుచరులపై నమోదైన హత్య కేసులో ఆయన సహ నిందితుడిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరి 14న కిశోర్‌గంజ్ సదర్ పోలీసు స్టేషన్‌లో ఆయనపై హత్య కేసు నమోదైంది.

వైద్యం కోసమేనా?

కేవలం వైద్యం కోసమే హమీద్ థాయ్‌లాండ్ వెళ్లారని కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయనతోపాటు సోదరుడు, బావమరిది కూడా వెళ్లినట్లు తెలిపారు. అయితే, దర్యాప్తు నుంచి తప్పించుకోవడానికే దేశం నుంచి హమీద్ పరారైనట్లు రాజకీయ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీలో హమీద్ చురుగ్గా వ్యవహరించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అవామీ లీగ్ విద్యార్థి విభాగమైన ఛాత్రా లీగ్ ద్వారా రాజకీయ జీవితం ప్రారంభించారు. ఛాత్రా లీగ్‌ను గత ఏడాది అక్టోబర్‌లో మధ్యంతర ప్రభుత్వం నిషేధించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన ఇంటిని ఇస్లామిక్ రాడికల్స్ కూల్చివేశారు.

కాల్పుల విరమణకు పాక్ కట్టుబడి ఉండాలి

జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా డిమాండ్

శ్రీనగర్: కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్తాన్ కచ్చితంగా కట్టుబడి ఉండాలని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. సరిహద్దుల్లోని ప్రజలు కేవలం శాంతిని కోరుకుంటున్నారని చెప్పారు. ఉద్రిక్తతలు వారికి ఎంతమాత్రం ఇష్టంలేదన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం సంపూర్ణంగా అమలైతే తాము సంతోషిస్తామన్నారు. కొన్ని టీవీ చానళ్ల యాంకర్లకు, నోయిడాలో, బాంబేలో సుఖంగా ఉన్న కొందరికి పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఇష్టం లేదని మండిపడ్డారు. ఒమర్ అబ్దుల్లా మంగళవారం కుప్వారా జిల్లాలోని తాంగ్‌ధర్‌లో మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు పాక్ దాడులకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, బాధితులకు పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. క్షిపణి దాడులు జరిగినప్పుడు రక్షణ కల్పించడానికి ప్రజల కోసం ప్రత్యేకంగా బంకర్లు నిర్మించాల్సి ఉందని, ఇందుకోసం త్వరలో ఒక విధానం రూపొందిస్తామని తెలిపారు.

పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి: ఆప్

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటిస్తూ పార్లమెంట్‌లో ఒక తీర్మానం ఆమోదించాలన్నారు. ముష్కర మూకలకు, వారికి యజమానులకు పాకిస్తాన్ ఆశ్రయం ఇస్తోందని ఆరోపించారు. ఇటీవల ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ సైనికాధికారులు స్వయంగా హాజరయ్యారని చెప్పారు. అందుకే పాక్‌ను ఉగ్రవాద దేశంగా నిర్ధారిస్తూ పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించాలని సంజయ్ సింగ్ స్పష్టంచేశారు. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడాన్ని ఆయన తప్పుపట్టారు. అమెరికా డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తే లొంగిపోతారా? అని కేంద్రాన్ని నిలదీశారు.

పుతిన్‌తో చర్చలకు సిద్ధం: జెలెన్‌స్కీ

కీవ్: రష్యా అధినేత పుతిన్‌తో ముఖాముఖి చర్చలకు సిద్ధంగా ఉన్నానని, ఆయనను కలిసేందుకు ఎదురు చూస్తున్నానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం చెప్పారు. తుర్కియేలోని అంకారా నగరంలో ఈ వారమే పుతిన్‌తో భేటీ కావాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ భేటీ జరగాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. గురువారం తాను అంకారా సిటీకి వెళ్తున్నానని వెల్లడించారు. తుర్కియే అధ్యక్షుడు తయూప్ ఎర్డోగాన్‌తో సమావేశం కాబోతున్నానని, తామిద్దరం కలిసి పుతిన్ రాకకోసం ఎదురు చూస్తామని వ్యాఖ్యానించారు. ఒకవేళ అంకారా కాకుండా ఇస్తాంబుల్‌లో సమావేశం జరగాలని పుతిన్ కోరుకుంటే అది తమకు సమ్మతమేనని వివరించారు. తాము కూడా ఇస్తాంబుల్ వెళ్తామన్నారు. పుతిన్ తనతో చర్చలకు ముందుకు రాకుండా కొత్త నాటకాలు ఆడితే.. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించాలన్న ఉద్దేశం ఆయనకు లేనట్లు తేలిపోతుందని స్పష్టంచేశారు. యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తే రష్యాపై మరిన్ని కఠిన ఆంక్షలు విధించాలని యూరోపియన్, అమెరికా ప్రభుత్వాలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడాది దండిగానే వరి ఉత్పత్తి

సాక్షి, న్యూఢిల్లీ: ముందస్తుగానే వస్తున్న రుతుపవనాలు, మంచి వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో 2025-26 వ్యవసాయ ఏడాదిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 4 శాతం అధికంగా ఉంటుందని తెలిపింది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 34.1 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉండగా, ఈ ఏడాది అది 35.46 కోట్ల టన్నుల ఉత్పత్తి ఉంటుందని వెల్లడించింది. ఈ మొత్తంలో వరి ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని వివరించింది. 2023-24 ఏడాదిలో 40.73 హెక్టార్లలో వరి సాగు జరిగి 11.32 కోట్ల టన్నుల ఉత్పత్తి జరగ్గా, అది 2024-25 ఏడాదిలో 43.42లక్షల హెక్టార్లకు పెరిగి ఉత్పత్తి సైతం 12.06 కోట్ల టన్నులకు పెరిగిందని తెలిపింది. ఈ ఏడాది వరి సాగు కనీసంగా 45 లక్షల హెక్టార్లకు చేరే అవకాశం ఉందని, ఉత్పత్తి సైతం ఇంతకుముందెన్నడూ లేని విధంగా 14.7 కోట్ల టన్నుల ఉత్పత్తి ఉంటుందని లెక్కలు కట్టింది. కనీసంగా – గత ఏడాది కన్నా 2 కోట్ల టన్నులు ఎక్కువగా ఉత్పత్తి ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఖరీఫ్‌లో మే 2 నాటికే వరి సాగు 16.88 లక్షల హెక్టార్లకు చేరుకుందని పేర్కొంది. రబీ సీజన్‌లో మాత్రమే పండించే గోధుమల ఉత్పత్తి గత 11.5 కోట్ల టన్నులుగా అంచనా వేయగా, ఈ ఏడాదికి ఉత్పత్తి లక్ష్యాన్ని 11.74 కోట్ల టన్నులుగా నిర్ణయించింది. ఇక కంది ఉత్పత్తి 35.11 లక్షల టన్నులు, పప్పు ధాన్యాల ఉత్పత్తి 115.35 లక్షల టన్నులుగా అంచనా వేసింది.

బద్దలైన బేస్‌లు

పాక్ ఎయిర్‌బేస్‌లకు భారీగా నష్టం

తాజా ప్రైవేట్ శాటిలైట్ ఫోటోలే సాక్ష్యం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ కొనసాగింపులో భాగంగా పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత్ జరిపిన క్షిపణి, డ్రోన్ దాడుల్లో కీలక మౌలిక సదుపాయాలు తుడిచిపెట్టుకుపోయాయని స్పష్టమైంది. తాజాగా విడుదలైన శాటిలైట్ ఉపగ్రహాల స్పష్టమైన ఫొటోలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. మే 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు భారత్ చేసిన దాడుల్లో పాకిస్తాన్ వ్యాప్తంగా 11 మిలటరీ ఎయిర్‌బేస్‌లు ధ్వంసమయ్యాయి. వైమానిక స్థావరాల్లోని విమాన రన్‌వేలు, విమానాలను నిలిపి ఉంచే హ్యాంగర్లు ధ్వంసమైనట్లు ఈ శాటిలైట్ ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఒక ప్రైవేట్ వాణిజ్య ఉపగ్రహ సంస్థ ఈ హై-రెజల్యూషన్ ఫొటోలను తీసింది. ఏమాత్రం అటూఇటూగా కాకుండా, గురిచూసి సరిగ్గా వాయుసేన స్థావరాల మీదనే బాంబులు పడేసినట్లు ఫొటోల్లో కనిపిస్తోంది. భారత్‌పై మరింతగా దాడులకు తెగిస్తే ఆకాస్త స్థావరాలనూ పూర్తిగా నేలమట్టం చేస్తారనే భయంతోనే మూడ్రోజులకే పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చిందనే వాదనకు పూర్తి బలం చేకూర్చేలా ఫొటోలు ఉన్నాయి. మాక్సార్ అనే శాటిలైట్ సంస్థ తీసిన ఈ ఫొటోలు ఇప్పుడు జాతీయమీడియాలో మంగళవారం ప్రత్యక్షమయ్యాయి. సింధ్‌లోని సిక్కూర్, రావల్పిండిలోని నూర్ ఖాన్, దక్షిణ పంజాబ్ ప్రావిన్స్‌లోని రహీం యార్ ఖాన్, సర్గోధాలోని ముషాఫ్, ఉత్తర సింధ్‌లోని జకోబాబాద్, ఉత్తర థటా జిల్లాలోని భోలారీ ఎయిర్‌బేస్‌లు ధ్వంసమైన తీరు ఫొటోలో వివరంగా తెలుస్తోంది. దాడి తర్వాత కీలక మిలటరీ బేస్‌లలో రన్‌వేలపై భారీ గొయ్యి, కార్యనిర్వాహక భవనాలు, నిల్వ కేంద్రాల పైకప్పులకు పెద్ద రంధ్రాలు పడటం, భవంతుల గోడలు కూలి శిథిలాలు, శకలాలు సమీప ప్రాంతాల్లో చెల్లాచెదురుగా పడిన వివరాలు ఫొటోల్లో తెలుస్తున్నాయి. పస్రూర్, సియాల్‌కోట్‌లోని రాడార్ కేంద్రాలు క్షిపణుల దెబ్బకు పేలిపోయాయి. సుక్కూర్ ఎయిర్‌బేస్‌లో రెండు విమాన షెల్టర్‌లు కూలిపోయాయి. చక్లాలాలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లో భారీ సైనిక, సరకు రవాణా వాహనాలు రెండు బాగా దెబ్బతిన్నాయి. రహీం యార్ ఖాన్ ఎయిర్‌బేస్‌లో ఒక్కటే రన్‌వే ఉంది. దానిపై బాంబులేయడంతో 19 అడుగుల విస్తీర్ణంలో భారీ గొయ్యి ఏర్పడింది. 43 అడుగుల పరిధిలో రన్‌వే పాక్షికంగా ధ్వంసమైంది. ముషాఫ్ ఎయిర్‌బేస్ రన్‌వేపై రెండు పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. ఒకటి 10, మరోటి 15 అడుగుల విస్తీర్ణంలో ఏర్పడ్డాయి. దీంతో ఇక్కడి విమానాల రాకపోకలు ఆగిపోయాయి. సమీప రవాణా వాహనాలూ దెబ్బతిన్నాయి. జకోబాబాద్‌లోని షాబాజ్ ఎయిర్‌బేస్‌తోపాటు భోలారీ ఎయిర్‌బేస్‌లో చెరో విమాన హ్యాంగర్‌కు భారీ నష్టం జరిగింది. హ్యాంగర్‌లో నిలిపిఉంచిన విమానాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.



దాడి తర్వాత.. ధ్వంసమైన దృశ్యం



దాడి తర్వాత.. ధ్వంసమైన దృశ్యం

సీబీఎస్‌ఈ 10, 12వ తరగతి ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) పది, 12వ తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం వెల్లడయ్యాయి. గతంతో పోలిస్తే ఈసారి 90శాతంకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్న విద్యార్థుల సంఖ్య తగ్గిందని సీబీఎస్‌ఈ పరీక్షల విభాగ కంట్రోలర్ సంయమ్ భరద్వాజ్ వెల్లడించారు. 10, 12వ తరగతి పరీక్షల్లో గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం ఈసారి పెరిగింది. గత ఏడాది 12వ తరగతి పరీక్ష ఉత్తీర్ణత శాతం 87.98 కాగా ఈసారి కాస్తంత మెరుగై 88.39 శాతానికి పెరిగింది. గత ఏడాది 10వ తరగతి పరీక్ష ఉత్తీర్ణత శాతం 93.60 కాగా ఈసారి కాస్తంత మెరుగై 93.66 శాతానికి ఎగసింది. 10వ తరగతిలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు 2.37 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. 12వ తరగతిలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు 5.94 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. 12వ తరగతి పరీక్ష రాసిన ట్రాన్స్‌జెండర్లలో గతంలో సగం మంది పాస్ అయితే ఈసారి అందరూ పాస్‌కావడం గమనార్హం . పదో తరగతిలో లింగమార్పిడి అభ్యర్థులు గత ఏడాది 91.30 మంది ఉత్తీర్ణులైతే ఈసారి 95 శాతం మంది పాస్ అయ్యారు. ప్రజ్ఞాసంబంధ ప్రశ్నలు ఈసారి ఎక్కువగా రావడంతో విద్యార్థులు ఎక్కువ మార్కులను సాధించగలిగారని సీబీఎస్‌ఈ అధికారులు చెప్పారు. 12వ తరగతిలో 1,11,544 మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. మరో 24,867 మంది విద్యార్థులు 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 10వ తరగతిలో 45,516 మంది విద్యార్థులు 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు.

8 నగరాలకు విమానాలు రద్దు

న్యూఢిల్లీ: గగనతల ఆంక్షలు, భద్రతా సమస్యలతో ఇండిగో, ఎయిరిండియా దేశంలోని పలు నగరాలకు తమ కార్యకలాపాలను మంగళవారం నిలిపేశాయి. ఎనిమిది నగరాలకు విమానాలు రద్దు చేసినట్టు ఇండిగో, ఎయిరిండియా ప్రకటించాయి. శ్రీనగర్, జమ్మూ, అమృత్‌సర్, లేహ్, చండీగఢ్, రాజ్‌కోట్‌లకు అన్ని విమానాలను ఇండిగో ఈ రోజు రద్దు చేసింది. 'తాజా పరిణామాల దృష్ట్యా, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, జమ్మూ, లేహ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, చండీగఢ్, రాజ్‌కోట్‌లకు అన్ని విమానాలు మే 13, మంగళవారం రద్దు చేశాం. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం' అని ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. అసౌకర్యానికి చింతిస్తున్నామని, తదుపరి మార్పుల గురించి వెంటనే తెలియజేస్తామని పేర్కొంది. సాంబా, అఖ్నూర్, జైసల్మేర్, కథువాలో డ్రోన్లు కనిపించిన తర్వాత ఎయిర్‌లైన్స్ ఈ చర్యలు తీసుకుంది.

పాక్ కాల్పుల్లో గాయపడిన పంజాబ్ మహిళ మృతి

జలంధర్: పాకిస్తాన్ డ్రోన్ దాడిలో తీవ్రంగా గాయాలపాలైన పంజాబ్ మహిళ మంగళవారం మరణించింది. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని ఖై ఫెమే గ్రామానికి చెందిన 50 ఏళ్ల సుఖ్వీందర్ కౌర్ మంగళవారం తెల్లవారుజామున మరణించింది. మే 9 రాత్రి డ్రోన్ వారి ఇంటిపై పడటంతో సుఖ్వీందర్, ఆమె భర్త లఖ్వీందర్ సింగ్, కుమారుడు జస్వంత్ సింగ్ తీవ్ర కాలిన గాయాలకు గురయ్యారు. వారిని వెంటనే ఫిరోజ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాలిన గాయాల స్థాయి తీవ్రంగా ఉండటంతో.. సుఖ్వీందర్, లఖ్వీందర్‌లను ఫిరోజ్‌పూర్ నుంచి లుధియానాలోని దయానంద్ మెడికల్ కాలేజ్, ఆసుపత్రికి తరలించారు. వారి కుమారుడు జస్వంత్‌సింగ్ ఫిరోజ్‌పూర్‌లోనే చికిత్స పొందుతున్నాడు.

మీరట్‌లో ఆర్మీ డ్రోన్ గల్లంతు

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఓ ఆర్మీ డ్రోన్ గల్లంతయ్యింది. సాధారణ సైనిక శిక్షణ సమయంలో ఆర్మీ డ్రోన్ అదృశ్యమైందని పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం సిటీ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ సంఘటన జరిగింది, సైనిక శిక్షణా వ్యాయామంలో భాగంగా డ్రోన్‌ను ఎగురవేశారు. విమాన ప్రయాణంలో, డ్రోన్ కంట్రోల్ మానిటర్‌తో కనెక్టివిటీని కోల్పోయి దారితప్పింది. రోహ్తా రోడ్ ప్రాంతంలో ఎగిరిన డ్రోన్ రైల్వే లైన్ దాటి వేరే దిశలో వెళ్లింది. దాని తరువాత మళ్లీ కనెక్టివిటీలోకి రాలేదు. ఎంత వెదికినా డ్రోన్ జాడ కనిపించలేదు. బలమైన గాలుల కారణంగా డ్రోన్ సిగ్నల్ కోల్పోయి కనిపించకుండా పోయిందని భావిస్తున్నారు. ఈ మేరకు రైల్వే, రోడ్ పోలీస్ స్టేషన్‌లో కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్‌కు చెందిన టెక్నీషియన్ హవిల్దార్ మేజర్ దీపక్ రాయ్ ఫిర్యాదు చేశారు. అయితే సాధారణ శిక్షణ కోసం వినియోగిస్తున్న ఈ డ్రోన్‌లో కెమెరా, జీపీఎస్ లేదు.

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి

న్యూయార్క్: అమెరికాలోని పెన్సిల్వేనియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృత్యువాత పడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం వారు ప్రయాణిస్తున్న కారు తొలుత ఓ చెట్టును, తర్వాత వంతెనను ఢీకొట్టిందని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. క్లీవ్‌లాండ్ స్టేట్ యూనివర్సిటీలో చదువుకుంటున్న మానవ్ పటేల్(20), సౌరవ్ ప్రభాకర్(23) మరణించారని వెల్లడించారు. ఈ ఘటనలో మరో విద్యార్థి గాయపడ్డాడని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. ప్రమాదం గురించి బాధిత కుటుంబాలకు సమాచారం చేరవేశామని, మృతదేహాలను స్వదేశానికి తరలించే విషయంలో తగిన సాయం అందిస్తామని వివరించారు. ప్రమాద సమయంలో సౌరవ్ ప్రభాకర్ వాహనం నడుపుతున్నట్లు పెన్సిల్వేనియా స్టేట్ పోలీసులు తెలియజేశారు.

ఇండోనేషియాలో ఆయుధాల పేలుడు... 13 మంది మృతి

జకార్తా: ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రావిన్స్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. కాలం చెల్లిన ఆయుధాలను నిర్వీర్యం చేస్తుండగా, భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో 13 మంది మరణించినట్లు సైనికాధికారులు తెలిపారు. మృతుల్లో నలుగురు జవాన్లు ఉన్నట్లు చెప్పారు. ఉపయోగించని, కాలం చెల్లిన ఆయుధాలను ఇండోనేషియన్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేస్తుంటారు. గరూత్ జిల్లాలోని సాగర గ్రామంలో ఈ ప్రక్రియ చేపడుతుండగా హఠాత్తుగా పేలుడు జరిగింది. వరుసగా రెండు పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. 9 మంది సాధారణ పౌరులు, నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు. మరికొందరు గాయపడగా, చికిత్స కోసం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.



శ్రీనగర్‌లో వారం రోజుల తరువాత బడికి వెళుతున్న చిన్నారులు. సరిహద్దుయేతర ప్రాంతాల్లో కశ్మీర్‌లో మంగళవారం స్కూళ్లు తెరుచుకున్నాయి.



భారత్- పాక్ ఉద్రిక్తతలు సడలటంతో మంగళవారం శ్రీనగర్‌లో ఉత్సాహంగా పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు



అఖ్నూర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద స్వస్థలానికి తిరిగి వస్తున్న గ్రామస్తులు

ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య వయసు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 21

విస్తృత పరిధి, అభ్యుదయ వ్యాఖ్యానాలు

మేనకా గాంధీ కేసు, ఇంద్రజిత్, వెల్లూరు సిటిజన్స్ వెల్ఫేర్ కేసు, ప్రేమశంకర్ శుక్లా కేసు, నరేంద్ర కుమార్ కేసు, మోహిని జైన్ కేసు, ఆటోశంకర్ కేసు, శ్రీమతి ఖుష్బు కేసు మొదలైన వాటిల్లో సుప్రీంకోర్టు జీవించే స్వేచ్ఛపై విస్తృత అర్థాన్ని చెప్పింది. ఈ తీర్పుల సారాంశం ప్రకారం ప్రకరణ 21లో కింద పేర్కొన్న హక్కులు కూడా అంతర్భాగమే.

- గౌరవప్రదంగా జీవించే హక్కు
- కాలుష్య రహిత వాతావరణ హక్కు
- రహస్యాలను, ఆరోగ్యాన్ని కాపాడుకునే హక్కు
- ఉచిత న్యాయ సలహా హక్కు
- విదేశాల పర్యటన హక్కు
- లాకప్ మరణాల వ్యతిరేక హక్కు
- సమాచార హక్కు • సహజీవన హక్కు
- ఏకాంతంగా జీవించే హక్కు
- సత్వర విచారణ పొందే హక్కు
- మరణ శిక్ష అమలును ఆలస్యం చేయడంపై అడిగే హక్కు
- ఆహార హక్కు • నిద్ర హక్కు

ఆత్మహత్యా ప్రయత్నం- జీవించే హక్కు- తాజా వివాదం

ప్రకరణ 21 జీవించే హక్కును కల్పించింది. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్యాయత్నం శిక్షార్హమైన నేరం. ఈ సెక్షన్ అమానుషమైందని, దాన్ని ఇండియన్ పీనల్ కోడ్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ సెక్షన్‌ను తొలగిస్తున్నట్లు ఇటీవలే కేంద్రం ప్రకటించింది.

'ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం అసహజమైన కోరిక. కాబట్టి ఆ కోరికకు కారణమైన పరిస్థితులను పరిశీలించాలి. అలాంటి వ్యక్తులకు సరైన కౌన్సెలింగ్ నిర్వహించాలి. పోలీసు కేసులతో వేధించరాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

కారుణ్య మరణం (Euthanasia): 2011లో పింకీ విరానీ అనే జర్నలిస్టు అరుణా షాన్‌బాగ్ తరఫున సుప్రీంకోర్టులో కేసు వేసింది. వృత్తి రీత్యా నర్సు అయిన అరుణ షాన్‌బాగ్ బొంబాయి ఎడ్వర్డ్ ఆసుపత్రిలో లైంగిక దాడికి గురైంది. ఆమె సుమారు 37 సంవత్సరాలు కోమాలోనే ఉంది. ఆమె పరిస్థితి దృష్ట్యా కారుణ్య మరణానికి అనుమతివ్వాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. న్యాయస్థానం కారుణ్య మరణాన్ని నిరాకరించింది. ప్రత్యేక పరిస్థితుల్లోనే పాసివ్ కారుణ్య మరణాన్ని అనుమతిస్తామని పేర్కొంది.

విద్యాహక్కు (ప్రకరణ 21-ఎ) (Right to education): విద్యాహక్కును 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్-21ఎలో చేర్చారు. 6 – 14 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్నారు.

వాస్తవానికి 2002కు ముందు ఆదేశ సూత్రాల్లోని ఆర్టికల్ 45లో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను పొందుపరిచారు. కానీ 86వ రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఆర్టికల్ 21-ఎకి బదలాయించి ప్రాథమిక హక్కుగా గుర్తించారు. ప్రస్తుతం నిబంధన 45లో ఉచిత ప్రాథమిక విద్యను (ఆరేళ్ల లోపు వారికి) అందించాలనే కొత్త అంశాన్ని చేర్చారు.2009లో విద్యా హక్కు చట్టాన్ని చేశారు. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

మేనకా గాంధీ V/S యూనియన్ ఆఫ్ ఇండియా (1978 డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా)

1978లో మేనకా గాంధీ కేసులో సుప్రీంకోర్టు వ్యక్తి స్వేచ్ఛకు నూతన అర్థాన్నిచ్చింది. మేనకా గాంధీ వివాదం విదేశీ సంచారానికి సంబంధించింది. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఆమె పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడిచింది. ఈ కేసులో అమెరికా రాజ్యాంగంలోని 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా'ను సుప్రీంకోర్టు అనువర్తింపజేసింది. 'ప్రభుత్వం ఏదో ఒక పద్ధతిని నిర్ణయించి స్వేచ్ఛలను పరిమితం చేయలేదు. నిర్ణయించిన పద్ధతి న్యాయబద్ధంగా, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా, వెరసి సమంజసంగా ఉండాలి. ప్రభుత్వం చేసిన పని సక్రమమైనా, ఆ పని చేయడానికి ఎంచుకున్న ప్రక్రియ సక్రమంగా లేకపోతే ఆ చర్యలు చెల్లుబాటు కావు.' దీన్నే డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా అంటారు.

విద్యా హక్కు చట్టం ముఖ్యాంశాలు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి నివాస ప్రదేశానికి ఒక కి.మీ. పరిధిలో పాఠశాల ఉండాలి.
- ప్రైవేట్ పాఠశాలల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో 25 శాతం సీట్లను బలహీన వర్గాలకు కేటాయించాలి.
- ఉపాధ్యాయ,విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలి.
- ఈ చట్టం అమలుకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65:35 నిష్పత్తిలో భరిస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కోటాలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు.

విద్యాహక్కు - సుప్రీంకోర్టు తీర్పులు

1992లో మోహిని జైన్ v/s కర్ణాటక, ఉన్నికృష్ణన్ v/s ఆంధ్రప్రదేశ్ కేసుల్లో జీవించే హక్కు, వ్యక్తి గౌరవాన్ని పొందే హక్కుల్లో విద్యాహక్కు అంతర్భాగం. దాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా బాలలకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తమిళనాడు ప్రభుత్వం v/s శ్యామ్ సుందర్ కేసు(2011) లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ప్రాథమిక విధి: ఇదే సవరణ ద్వారా నిబంధన 51-ఎలో ప్రతి తల్లిదండ్రులు, సంరక్షకులు 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న తమ పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలనే విధిని నూతన ప్రాథమిక విధిగా పేర్కొన్నారు.

ప్రకరణ-22

అక్రమ నిగ్రహణ (Arrest), నిర్బంధం (Detention) నుంచి రక్షణ

అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆర్టికల్ 22 రక్షణ కల్పిస్తుంది. ఈ ప్రకరణ ప్రకారం చట్టబద్ధంగా అరెస్ట్ చేయడానికి కొన్ని ప్రాతిపదికలు పాటించాలి. అవి..

ప్రకరణ 22 (1):

ఎ) ప్రతి అరెస్టుకు కారణం ఉండాలి లేదా కారణాన్ని తెలియజేయాలి. న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వాలి. బి) నిందితుణ్ని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి.

24 గంటలను లెక్కించేటప్పుడు ప్రయాణ సమయాన్ని మినహాయిస్తారు. సెలవు దినాలను మినహాయించరు. అరెస్టయిన వ్యక్తిని సమీప మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి. పై రక్షణలకు కొన్ని మినహాయింపులున్నాయి. ప్రకరణ 22(3) ప్రకారం శత్రు దేశ పౌరులకు, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారికి ఈ రక్షణలు వర్తించవు.

ప్రకరణ 22(4) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారిని మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. కానీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద ఏర్పాటైన ఎడ్వైజరీ బోర్డు సూచన మేరకు మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ బోర్డులో హైకోర్టు న్యాయమూర్తులు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యే అర్హతలున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

ప్రకరణ 22(5) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టయిన వారికి తమను ఎందుకు అరెస్టు చేశారో వీలైనంత త్వరగా తెలపాలి. తద్వారా బాధితులకు పిటీషన్ వేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రకరణ 22(6) ప్రకారం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రివెంటివ్ అరెస్టుకు కారణాలను వెల్లడించకుండా ఉండే అధికారం ప్రభుత్వానికి ఉంది.

ప్రకరణ 22(7) ప్రకారం పైన పేర్కొన్న క్లాజులతో సంబంధం లేకుండా మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధించే విధంగా పార్లమెంట్ శాసనాలు రూపొందించవచ్చు.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, వివరణ: సాధారణంగా నిర్బంధాలు రెండు రకాలు:

1. శిక్షించే చట్టాలు 2. నివారక చట్టాలు.

శిక్షించే చట్టాల్లో ముద్దాయి నేరం రుజువయ్యాక కోర్టు విధించిన శిక్షను అమలు చేయడానికి నిర్బంధిస్తారు. నివారక నిర్బంధంలో విచారణ లేకుండా నేరం చేస్తారేమో అనే అనుమానంతో నిందితుణ్ని లేదా అనుమానితుణ్ని ముందుగానే నిర్బంధిస్తారు. దేశ రక్షణ, శాంతి భద్రతల దృష్ట్యా ఇలా చేస్తారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.కె.గోపాలన్ v/s స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950): ఒక వ్యక్తిని అరెస్టు చేస్తున్నప్పుడు అతడికి కారణాలను తెలపడం సంబంధిత పోలీస్ అధికారి బాధ్యత. అలాగే అరెస్టయిన వ్యక్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం ఇవ్వాలి. దీన్ని లాటిన్ పరిభాషలో 'ఆడీ ఆల్టిరమ్ పార్టెమ్' అంటారు. అంటే హియర్ ది అదర్ సౌండ్ టూ అని అర్థం. అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తికి తన నిర్దోషిత్వాన్ని వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని దీని అర్థం.

అబ్దుల్ సమర్థ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (1962)

అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప కోర్టులో హాజరు పరచకపోతే 24 గంటల తర్వాత ఆ వ్యక్తికి విడుదలయ్యే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

జోగిందర్ కుమార్ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్

ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు/స్నేహితుడికి/సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలి.

ప్రకరణలు 23, 24

పీడన నిరోధ హక్కులు

మానవులతో వ్యాపారం, బలవంతపు వెట్టిచాకిరీని ప్రకరణ 23(1) నిషేధిస్తుంది. వ్యక్తుల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా ఏ పని చేయించరాదు. పై చర్యలకు పాల్పడితే పార్లమెంటు చట్టాల ప్రకారం శిక్షార్హులు అవుతారు.

నిబంధన 23లో బేగార్ అనే పదాన్ని ప్రయోగించారు. బేగార్ అంటే వెట్టిచాకిరీ. ఉత్తర భారతదేశంలో హాలీ అంటే.. ఎలాంటి పారితోషకం లేకుండా వ్యక్తులతో పని చేయించుకోవడం. దీన్ని 1976లో వెట్టిచాకిరీ చట్టం ద్వారా నిషేధించారు.

ఈ నిబంధన స్వయంగా అమల్లోకి రాదు. అందుకే 1956లో పార్లమెంటు అశ్లీల, అసభ్య వ్యాపార నిరోధక చట్టాన్ని రూపొందించింది.

ప్రకరణ 23(2) ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులపై నిర్బంధ సేవలను విధించవచ్చు. దీన్ని దోపిడీగా పరిగణించరు.

ప్రకరణ-24

బాల కార్మిక వ్యవస్థ రద్దు

ఈ ఆర్టికల్ ప్రకారం 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ప్రమాదకర, ఇతర పనుల్లో వినియోగించరాదు. ఒకవేళ వినియోగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నిబంధన కూడా స్వయంగా అమల్లోకి రాదు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు తదనుగుణంగా చట్టాలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎం.సి.మెహతా v/s తమిళనాడు(1997) కేసులో 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ఏ రకమైన ప్రమాదకర పరిశ్రమల్లో లేదా ఇతర పనుల్లో వినియోగించరాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బంధువా ముక్తిమోర్చా v/s యూనియన్ ఆఫ్ ఇండియా, 1997 కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెలువరించింది. బాలల సంరక్షణకు ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, బాలకార్మికులను పనిలో వినియోగించే యజమానిపై రూ. 20,000 వరకు జరిమానా విధించాలని పేర్కొంది.

ప్రకరణలు 25-28

మత స్వాతంత్ర్యపు హక్కులు

ప్రకరణ 25(1) ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధానుసారం ఏ మతాన్నైనా అవలంబించి, ఆచరించి, ప్రచారం చేసే స్వేచ్ఛ ఉంది.

ప్రకరణ 25(2) ప్రకారం మత స్వేచ్ఛ ప్రజాశాంతికి, నైతికతకు, ప్రజారోగ్యానికి భంగం కలిగించరాదు. అలాంటి సమయాల్లో ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు. మత విషయాలను నియంత్రించవచ్చు. హిందూ మతంలో కొన్ని సామాజిక సంస్కరణలు చేపట్టవచ్చు.

ప్రకరణ-25లో రెండు వివరణలు ఉన్నాయి. అవి

- సిక్కులు తలపాగా, కత్తి ధరించడం వారి సంప్రదాయంలో భాగం.
- ప్రకరణ-25(2)(బి)లో హిందువులు అనే పదం ఉంది. ఇక్కడ హిందువులంటే సిక్కులు, జైనులు, బౌద్ధులు కూడా.

ప్రకరణ-26

మత సంస్థలు - మతపరమైన వ్యవహార నిర్వహణలో స్వేచ్ఛ

ప్రజా శాంతికి, నైతికతకు, ఆరోగ్యానికి భంగం కలిగించకుండా వ్యక్తులు మత సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించుకోవచ్చు.

- మత సంస్థలను, ధర్మాదాయ సంస్థలను స్థాపించవచ్చు.
- సంస్థలను నిర్వహించుకోవచ్చు.
- స్థిర, చరాస్తులను సంపాదించుకోవచ్చు.
- అమల్లో ఉన్న చట్టాలకు లోబడి వాటిని నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ-27

మతవ్యాప్తి లేదా మత పోషణ కోసం పన్నులు వసూలు చేయరాదు

మత ప్రాతిపదికన ప్రజలపై పన్నులు విధించరాదు, వసూలు చేయరాదు. ఈ నిబంధన పన్నులు వసూలు చేయడాన్ని మాత్రమే నిషేధిస్తుంది. అయితే మత ప్రాతిపదికన ప్రత్యేక సేవలు అందించినందుకు ప్రజల నుంచి ప్రభుత్వం రుసుం వసూలు చేయవచ్చు. **ఉదా:** దేవాలయంలో ప్రత్యేక దర్శనాల కోసం, సేవల కోసం రుసుం వసూలు చేయడం రాజ్యాంగబద్ధమే.

ఒక రక్తం చుక్కలోని రక్త కణాల సంఖ్య?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

రక్త ప్రసరణ వ్యవస్థ

రక్త ప్రసరణ వ్యవస్థ మొదట అనిలెడా వర్గానికి చెందిన వానపాము, జలగలో ఏర్పడింది. రక్తప్రసరణ వ్యవస్థ పితామహుడు విలియం హార్వే.

రక్తం

రక్తం ఒక కొల్లాయిడల్ పదార్థం. రక్తం ద్రవ రూపంలో ఉండి శరీరంలోని అన్ని భాగాలను అనుసంధానం చేస్తుంది. కాబట్టి రక్తాన్ని ద్రవరూప సంయోజక కణజాలం అంటారు.

- రక్తాన్ని అధ్యయనం చేసే శాస్త్రం హెమటాలజీ.
- ప్రౌఢమానవుడిలో 5 లీటర్ల రక్తం ఉంటుంది.
- రక్తం రుచి కొంచెం ఉప్పగా ఉంటుంది. రక్తం pH 7.4 (బలహీన క్షారం)
- ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్, ఆహార పదార్థాలను రక్తం రవాణా చేస్తుంది.

రక్తం- రంగు

ఆర్థ్రోపొడా, మొలస్కా వర్గం జీవులు మినహా అన్ని జీవుల్లో రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. జీవుల రక్తంలోని ఎర్ర రర్తకణాలపైన హిమోగ్లోబిన్ ఉంటుంది.

- తెలుపు రంగు రక్తం ఉన్న జీవులు.. కీటకాలు (ఆర్థ్రోపొడా వర్గం)
- ఈ జీవుల రక్తంలో Hb (హిమోగ్లోబిన్) ఉండదు. కాబట్టి రక్తం వర్ణరహితం (తెలుపు)గా ఉంటుంది.
- పీతలు, నత్తలు, ఆల్చిప్పల్లో నీలి రంగు రక్తం ఉంటుంది.
- ఈ జీవుల రక్తంలో హిమోసయనిన్ అనే వర్ణద్రవ్యం ఉంటుంది.
- అనిలెడా (పాలికీటా) జీవుల్లో రక్తం ఆకుపచ్చ రంగులో ఉంటుంది.
- ఈ జీవుల్లో క్లోరోక్రువోరిన్స్ అనే శ్వాసవర్ణకం ఉంటుంది.

రక్త ప్రసరణ వ్యవస్థ - రకాలు

రక్త ప్రసరణ వ్యవస్థ రెండు రకాలు.

1) వివృత రక్త ప్రసరణ లేదా స్వేచ్ఛా రక్త ప్రసరణ వ్యవస్థ.
2) సంవృత లేదా బంధిత రక్తప్రసరణ వ్యవస్థ.

వివృత రక్త ప్రసరణ వ్యవస్థ


- రక్తం రక్తనాళాల్లో కాకుండా స్వేచ్ఛగా శరీరంలోని కోటరాలు లేదా కాలువల్లో ప్రవహిస్తుంది.
- ఈ జీవుల్లో రక్తనాళాలు ఉండవు.

ఉదా:

1. ఆర్థ్రోపొడా (కీటకాలు)
2. మొలస్కా (సెఫలోపొడా మినహా)
3. ఇకైనోడర్మేటా
4. నిమ్నశ్రేణి కార్డేటా జీవులు

సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ

- రక్తం రక్తనాళాల్లో ప్రవహిస్తుంది.
- ఈ జీవుల్లో రక్తనాళాలు ఉంటాయి
  ఉదా॥ అనిలెడా, ఆక్టోపస్ (సెఫలోపొడా, మొలస్కా) ఉన్నత స్థాయి కార్డేటా జీవులు, సెఫలోకార్డేటా, సకశేరుక జీవులు (చేపలు ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు).
- జలగ లాలాజలంలో హిరుడిన్ ఉత్పత్తి అవుతుంది. కాబట్టి రక్తాన్ని పీల్చినప్పుడు గడ్డకట్టకుండా ఉంటుంది.
- జలగను చెడురక్తం పీల్చే ప్రక్రియలో ఉపయోగిస్తారు. ఈ పద్ధతిని పిలోటోటమీ అంటారు.
- దోమల లాలాజలంలో హిమోలైసిన్ ఉత్పత్తి అవుతుంది.



సీరం

శరీరం నుంచి సేకరించిన రక్తాన్ని పరీక్ష నాళికల్లోకి తీసుకున్నప్పుడు రక్తం గడ్డకడుతుంది. రక్తం గడ్డకట్టిన తర్వాత పైకి కనిపించే పసుపు రంగు ద్రవాన్ని సీరం అంటారు. సీరంలో ప్రతిరక్షకాలు ఉంటాయి. కానీ రక్తకణాలు, ప్లాస్మా ప్రొటీన్లు, రక్తం గడ్డకట్టే కారకాలు ఉండవు. సీరం అధ్యయనాన్ని సీరాలజీ అంటారు.

రక్తం- భాగాలు

రక్తంలో రెండు భాగాలు ఉంటాయి.అవి..

1) ప్లాస్మా 2) రక్త కణాలు

ప్లాస్మా

రక్తంలోని ద్రవభాగాన్ని ప్లాస్మా అంటారు. ప్రౌఢవ్యక్తిలో సుమారు 2.7 నుంచి 3 లీటర్ల ప్లాస్మా ఉంటుంది. ఇది గడ్డి రంగులో ఉంటుంది.

- రక్తంలో ప్లాస్మా 55 శాతం ఉంటుంది.
- ప్లాస్మాలో 92 శాతం నీరు, 8 శాతం కర్బన, అకర్బన, ఇతర పదార్థాలు ఉంటాయి.
- ప్లాస్మా pH విలువ 7.1
- ప్లాస్మాలో లవణ శాతం 0.85 నుంచి 0.9
- ప్లాస్మాలో అల్బుమిన్, గ్లొబ్యులిన్ అనే ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఆహార పదార్థాల రవాణాలో పాల్గొంటాయి.
- ప్రోత్రాంబిన్, ఫైబ్రినోజన్ అనే రక్తస్కందన పదార్థాలు ఉంటాయి.
- సోడియం, పొటాషియం, అమ్మోనియం, కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్లు, ఫాస్ఫేట్లు, సల్ఫేట్లు తక్కువ పరిమాణంలో ఉంటాయి.
- కర్బన పదార్థాలైన యూరికామ్లం, విటమిన్లు, హార్మోన్లు కూడా తక్కువ మోతాదులో ఉంటాయి.

రక్త కణాలు

రక్త కణాల సేకరణకు రక్తానికి 10 మి.లీ. (0.9%) సోడియం క్లోరైడ్ (NaCl) ద్రావణాన్ని కలుపుతారు.

- రక్తంలో రక్తకణాలు 45 శాతం ఉంటాయి.
- రక్త కణాలు మూడు రకాలు అవి..
  1) ఎర్ర రక్తకణాలు
  2) తెల్ల రక్తకణాలు
  3) రక్త ఫలకికలు

ఎర్ర రక్త కణాలు (ఆర్‌బీసీ)

ఎర్ర రక్తకణాలను ఆంటోనీవాన్ లీవెన్ హుక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఎముక ఎరుపు అస్థిమజ్జలోని నార్మోబ్లాస్ట్ అనే పూర్వకణాల నుంచి ఎర్ర రక్తకణాలు ఏర్పడుతాయి.

- పక్షుల్లో అస్థిమజ్జ ఉండదు. ఎముకలు గాలితో నిండి ఉంటాయి. కాబట్టి పక్షుల్లో ఎర్ర రక్తకణాలను బార్సా అనే అవయవం ఉత్పత్తి చేస్తుంది.
- ఎర్ర రక్తకణాల పరిపక్వతకు విటమిన్ $బి_{12}$, ఫోలిక్ ఆమ్లం అవసరం.
- పరిపక్వం చెందిన ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. కేంద్రకం ఇతర కణాంగాలు ఉండవు.
- వానపాములో ఎర్ర రక్తకణాలు ఉండవు.
- ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని ఎరిత్రోపోయిసిస్ అంటారు
- ఎరిత్రోసైసిస్ అంటే ఎర్రరక్తకణాల విచ్ఛిత్తి
- ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే, అంతరించే ఆర్‌బీసీల సంఖ్య 10×10^{12}.

ఆర్‌బీసీల లక్షణాలు

ఆకారం: బల్లపరుపు లేదా ద్విపుటాకారం (Biconcave) క్షీరదాల్లో మాత్రమే ఉంటుంది.

కేంద్రకం: క్షీరదాల ఆర్‌బీసీల్లో కేంద్రకం ఉండదు. కానీ చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షుల ఆర్‌బీసీల్లో కేంద్రకం ఉంటుంది.

- ఒంటె, లామా అనే క్షీరదాల ఎర్రరక్తకణాలు ద్వికుంభాకారంలో ఉంటాయి. వీటిలో కేంద్రకం ఉంటుంది.
- ఆర్‌బీసీలు పిండదశలో కాలేయం, ప్లీహం నుంచి ఉత్పత్తి అవుతాయి.
- కాలేయాన్ని ఎర్రరక్తకణాల క్రాడిల్ అంటారు.
- పురుషులలో ఆర్‌బీసీల సంఖ్య.. 4.5 నుంచి 6.5 మిలియన్లు (లేదా) 4.5 నుంచి 6.5×10^6 (క్యూబిక్ మి. లీ. రక్తంలో)
- స్త్రీలలో 3.5 నుంచి 5.5 మిలియన్లు (లేదా) 35 – 55 లక్షల ఆర్‌బీసీలు ఉంటాయి.
- ఆర్‌బీసీల గుంపును రౌలెక్స్ అంటారు.
- హిమోసైటోమీటర్‌తో ఆర్‌బీసీలను లెక్కిస్తారు.
- ఆర్‌బీసీల జీవితకాలం 120 రోజులు
- విటమిన్-ఇ లోపంతో ఆర్‌బీసీల జీవితకాలం తగ్గుతుంది.
- ఆర్‌బీసీలు ప్లీహం, కాలేయంలో విచ్ఛిన్నమవుతాయి.
- ఆర్‌బీసీలు విచ్ఛిన్నం చెందే ప్రక్రియను ఎరిత్రోక్లాసియా అంటారు.
- కాలేయాన్ని హిమోపాయిటిక్ + హిమోలైటిక్ అవయవం అంటారు.
- హిమోలైటిక్ చర్యలో కాలేయ కొపర్ కణాలు ఉపయోగపడుతాయి.

హిమోగ్లోబిన్

- హిమోగ్లోబిన్ ఒక సంయుగ్మ ప్రొటీన్. దీనిలో ఉండే మూలకం ఇనుము.
- పచ్చని ఆకుకూరలు, కూరగాయల్లో ఐరన్ లభిస్తుంది.
- హిమోగ్లోబిన్ తయారీకి ఇనుము, గ్లోబ్యులిన్ ప్రొటీన్ అవసరం.
- రక్తంలో Hbని లెక్కించే పద్ధతిని కంప్లీట్ బ్లడ్ కౌంట్ అంటారు.
- ప్రౌఢ వ్యక్తి రక్తంలో Hb-15 గ్రా./డెసీలీటర్
- హిమోగ్లోబిన్ పోర్ఫైరిన్ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది.
- హిమోగ్లోబిన్ నిర్మాణంలో హీమ్, గ్లోబ్యులిన్ అనే భాగాలుంటాయి.

హీమ్

- హిమోగ్లోబిన్‌లోని ఇనుము భాగాన్ని హీమ్ అంటారు.
- ఇది పోర్ఫైరిన్ నిర్మాణం మధ్యలో ఉంటుంది.

గ్లోబ్యులిన్

- ఇది ఒక ప్రొటీన్ భాగం
- గ్లోబ్యులిన్ నిర్మాణంలో 4 అమైనో ఆమ్ల శృంఖలాలు (2 ఆల్ఫా+ 2 బీటా) ఉంటాయి.
- Hbతో అధిక చర్యాశీలత ఉన్న వాయువు కార్బన్ మోనాక్సైడ్
- ఒక Hb అణువు 4 ఆక్సిజన్ పరమాణువులను కణాల వద్దకు తీసుకెళ్తుంది.

తెల్ల రక్త కణాలు (డబ్ల్యూబీసీ)

- డబ్ల్యూబీసీలను ఫాగోసైట్స్, శ్వేత రక్తకణాలు అనికూడా అంటారు.
- తెల్ల రక్తకణాలు రక్తంలోకి వచ్చిన సూక్ష్మ జీవులను చంపి దేహానికి రక్షణ కల్పిస్తాయి. కాబట్టి వీటిని శరీర రక్షకభటులు లేదా రక్తంలోని పారిశుధ్య కార్మికులు అని అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హిమోగ్లోబిన్‌లో ఉండే మూలకం?
   1) మెగ్నీషియం 2) ఇనుము
   3) కోబాల్ట్ 4) మాంగనీసు
2. మానవుడిలో రక్తప్రసరణను కనుగొన్నది?
   1) ఫ్రాయిడ్ 2) అరిస్టాటిల్
   3) విలియం హార్వే 4) డార్విన్
3. ఒక రక్తం చుక్కలోని రక్త కణాల సంఖ్య?
   1) 10,000 2) 1,00,000
   3) అనేకం 4) 2,500 కంటే తక్కువ
4. రక్తం ఒక
   1) ద్రావణం 2) కొల్లాయిడ్
   3) తరల పదార్థం 4) జెల్
5. సీరలాజికల్ పరీక్షలో అత్యంత ముఖ్యమైన ప్రక్రియ?
   1) వర్గీకరణ లక్షణం 2) గుర్తింపు లక్షణం
   3) వైవిధ్య లక్షణం 4) పోలిక లక్షణం
6. కీటకాల్లోని రక్తం రంగు?
   1) ఎరుపు 2) తెలుపు
   3) నలుపు 4) ఆకుపచ్చ
7. ప్రౌఢవ్యక్తుల్లో ఎర్ర రక్తకణాలు ఎక్కడ ఉత్పత్తి అవుతాయి?
   1) మూత్రపిండాలు 2) ప్లీహం
   3) ఎముక మూలుగ 4) కాలేయం
8. మానవుడి రక్తం pH 7.4 అయితే దాని స్వభావం?
   1) ఆమ్ల స్వభావం 2) క్షార స్వభావం
   3) తటస్థ స్వభావం
   4) కొద్దిపాటి క్షార స్వభావం
9. హిమోగ్లోబిన్ ఒక
   1) ఎంజైమ్ 2) చక్కెర పదార్థం
   3) లిపిడ్ 4) ఆర్‌బీసీల్లోని ప్రొటీన్
10. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణం?
   1) ప్లాస్మా 2) ఎరిత్రోసైట్స్
   3) హిమోగ్లోబిన్ 4) పైవేవీ కావు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 2; 6) 2; 7) 3; 8) 4; 9) 4; 10) 3

తారిఖ్ కుతుబ్‌షాహి అనే గ్రంథాన్ని రచించింది ఎవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీ యుగ విశేషాలు

పాలనా విధానం

రాజు(సుల్తాన్) సర్వాధికారి. కుతుబ్‌షాహీలు తాము దేవుడి ప్రతినిధులమని(జుల్ అల్లా) చెప్పుకున్నారు. రాజుకు సలహాలు ఇవ్వడానికి మంత్రి పరిషత్ ఉండేది. ప్రధాన మంత్రిని పీష్వా అని పిలిచేవారు. పీష్వా తర్వాతి స్థానం మీర్ జుంలా(ఆర్థిక మంత్రి)ది. వీరే కాకుండా ఐనుల్ ముల్క్ (యుద్ధ మంత్రి/సర్వ సైన్యాధ్యక్షుడు), మజుందార్(ఆడిటర్ జనరల్), కొత్వాల్ (పోలీస్ అధికారి) మొదలైన అధికారులుండేవారు.

అబుల్‌హసన్ తానీషా కాలంలో గోల్కొండ రాజ్యంలో ఆరు సుబా(రాష్ట్రం)లను ఏర్పాటు చేశారు. సుబాలను 36 సర్కార్లు(జిల్లాలు)గా విభజించారు. సర్కార్లను 517 పరగణా (తాలూకా)లుగా విభజించారు.

కుతుబ్‌షాహీ రాజ్యంలోని సుబాలు

ఒకటో సుబా	- మహ్మద్‌నగర్, మెదక్, కౌలాస్, ముల్కనూరు.
రెండో సుబా	- ఎల్గందల, వరంగల్, ఖమ్మం, దేవరకొండ.
మూడో సుబా	- పానగల్, ముస్తఫా నగర్ (కొండపల్లి), భువనగిరి, అకర్‌కర్.
నాలుగో సుబా	- కోయిల్ కొండ, ఘన్‌పూర్, ముర్తజానగర్(గుంటూరు), మచిలీపట్టణం.
అయిదో సుబా	- నిజాం పట్టణం, ఏలూరు, రాజమండ్రి, సికాకోల్.
ఆరో సుబా	- కర్ణాటక ప్రాంతం.ఇందులో 16 సర్కార్లు ఉండేవి.

రాష్ట్ర పాలకుడిని తరఫ్‌దార్‌గా, జిల్లా పాలకుడిని ఫౌజుదార్‌గా వ్యవహరించేవారు. పరగణా పాలకుడిని తహసీల్దార్ అని పిలిచేవారు.

గ్రామాల్లో పన్నెండు మంది ఆయగార్లు ఉండేవారని నాటి ఫర్మానాలను బట్టి తెలుస్తోంది. వారు.. పటేల్, కులకర్ణి (కరణం), చౌద్రి (వర్తకుల పెద్ద), పోతేదార్ (నాణేల మారకందారు), దేశ్‌పాండే (గణకుడు), నహని (మంగలి), పారిత్ (చాకలి), పూజారి, సుతార్ (వడ్రంగి), కుంభార్ (కుమ్మరి), జోషి (జోతిష్కుడు), వేశహార(మస్కూరి).

సారంగు తమ్మయ 'వైజయంతీ విలాసం'అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులోని వర్ణనను బట్టి దొంగలను పట్టుకుని, దొంగ సొత్తును కొనుగోలు చేసే కంసాలులను విచారించే అధికారే తలారి(తలవరి) అని తెలుస్తోంది.

కుతుబ్‌షాహీలు హిందూధర్మ సూత్రాల్లో జోక్యం చేసుకోలేదు. గోల్కొండ రాజ్యంలో 84 స్థల, గిరి, వన, జల దుర్గాలు ఉండేవి. వీటిలో ఎక్కువ భాగం తెలంగాణలో ఉండేవి. కేంద్ర సైన్యం, జాగీర్దారీ సైన్యం అని రెండు రకాల సైన్యం ఉండేది.

ఆర్థిక పరిస్థితులు

గోల్కొండ రాజ్యంలో సారవంతమైన తీర భూములు ఉండేవి. ప్రజల ప్రధాన సాంస్కృతిక ధోరణులను సమన్వయ పరచడానికి, సాంఘిక అసమానతలను అదుపు చేయడానికి సూఫీ ఉద్యమం తోడ్పడింది.

నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. గోల్కొండ సుల్తాన్లు, వారి అధికారులు హుస్సేన్ సాగర్, ఇబ్రహీంపట్నం, బద్వేల్ లాంటి చెరువులను తవ్వించారు. ఇవే కాకుండా అనేక కాలువలు, బావులను తవ్వించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు. నీటి వనరులకు మరమ్మతు చేయడానికి, ఆయకట్టు భూములకు నీరు అందించడానికి వడ్డెరలను నియమించి, వారికి మేరలు ఏర్పాటు చేశారు.

గోల్కొండ సుల్తాన్ల కృషి వల్ల భూములు విస్తృతంగా సాగులోకి వచ్చాయి. రైతులు వరి, జొన్న, రాగి, పెసర, వేరుశెనగ, కందులతోపాటు పత్తి, పొగాకు, ఆముదం తదితర పంటలను పండించేవారు. అప్పటికే పోర్చుగీసువారు మన దేశంలో పొగాకును ప్రవేశపెట్టారు. పత్తి, పొగాకు పంటల వల్ల ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయం లభించేది. సంత్రాలు, అంజూర, జామ, నారింజ, మామిడి, అరటి, నిమ్మ, దానిమ్మ లాంటి పండ్ల తోటలను పెంచేవారు.

పదిహేడో శతాబ్దంలో గోల్కొండ రాజ్యంలో మేలిరకం ఇనుము, ఉక్కు ఉత్పత్తి అయ్యేవి. వీటితో కత్తులు, బాకులు మొదలైన యుద్ధ పరికరాలను తయారుచేసేవారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన డమాస్కస్ కత్తుల తయారీలో గోల్కొండ ఉక్కును ఉపయోగించారు. నిర్మల్, ఇందూరు పట్టణాలు ఆయుధ పరిశ్రమకు కేంద్రంగా ఉండేవి. గోల్కొండ రాజ్యం వజ్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. గోల్కొండ వజ్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నూతన వజ్రాల గనులు కనుగొన్నారు. వస్త్ర పరిశ్రమకు ఓరుగల్లు పేరొందింది. ఖమ్మం జిల్లాలోని నాగులపంచలో లభించే నీలిరంగును విదేశాలకు ఎగుమతి చేసేవారు. 17వ శతాబ్దం తొలినాళ్లలో 'మిరప' గురించి తెలంగాణ ప్రజలకు తెలిసింది.

సాంఘిక పరిస్థితులు

కుతుబ్‌షాహీల సంస్కృతి తెలంగాణ సంస్కృతిగా రూపుదిద్దుకుంది. ఇతర తెలుగు ప్రాంతాల కంటే మరింత భిన్నమైన సంస్కృతి తెలంగాణలో రూపొందింది. కులీ కుతుబ్‌షా తెలంగాణ ప్రజల వస్త్రాలంకరణను అనుసరించి, వారి అభిమానం చూరగొన్నాడు.

హైదరాబాద్ నగరంలో సుమారు పది లక్షల మంది నివసించేవారు. మొగలులు, ఇరానీలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. హైదరాబాద్‌లో వేశ్యావృత్తి ఉండేది. నాట్యకత్తెలకు ఆదరణ పెరిగింది. అబ్దుల్లా కుతుబ్‌షాతో సహజీవనం చేసిన తారామతి, ప్రేమావతి గొప్ప నాట్యకత్తెలుగా పేరొందారు. కుల వ్యవస్థ కొనసాగింది. కుల కట్టుబాట్లు అధికమయ్యాయి. అనేక ఉపకులాలు స్థిరపడ్డాయి. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. సతీసహగమన దురాచారాన్ని రూపుమాపడానికి కుతుబ్‌షాహీలు ప్రయత్నించారు.

మత పరిస్థితులు

ఈ కాలంలో తెలుగు ప్రజలు స్మార్త, శైవ, వైష్ణవ మతాలను అనుసరించేవారు. ఈ మతాల మధ్య విభేదాలు తీవ్రంగా ఉండేవి. కుతుబ్‌షాహీలు ప్రజల మత విశ్వాసాలను, ఆచార వ్యవహారాలను గౌరవించేవారు. దేవాలయాలకు భూములు దానం చేసేవారు. ప్రతిభను బట్టి తెలుగువారికి అనేక ఉన్నత పదవులిచ్చేవారు. అనేక మంది తెలుగువారు మీరాసిదార్లుగా, జాగీరుదార్లుగా, దేశ్‌ముఖ్‌లుగా, దేశ్‌పాండేలుగా ఉండటమే అందుకు నిదర్శనం. ఈ ఆదరణ వల్ల తెలుగువారు, ముస్లింలు కలిసిపోయి ఒక సహజీవన సంస్కృతి రూపొందింది. తెలుగు- ముస్లిం మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. ఒకరి ఆచారాలు, సంప్రదాయాలను మరొకరు అనుసరించారు. మొహర్రం(పీర్ల) పండుగను తెలుగువారు తాదాత్మ్యతతో జరుపుకొనేవారు. దర్గాలకు వెళ్లేవారు. కందూరు చేసుకునేవారు. అదే విధంగా తెలుగు పండుగలు, ఆచార వ్యవహారాలను ముస్లింలు ఆదరించేవారు.

షబ్-ఏ రాత్ పండుగలో దీపాలు అలంకరించడం దీపావళి నుంచి వచ్చింది. వసంతోత్సవాల్లో రాజులు, ముస్లిం ప్రజలు పాల్గొనేవారు. తిరుపతికి వెళ్లేవారు. అక్కడి బీబీనాంచారమ్మ అలా వెలిసిందే. ముస్లింలలో మంగ్‌నా(నిశ్చితార్థం), వధూవరులను తలుపు దగ్గర ఆపి పరిహాసాలాడటం, వధూవరుల మధ్య అడ్డంగా తెరకట్టడం, తలంబ్రాలు పోసుకోవడం ఇవన్నీ తెలుగువారి ఆచారాల నుంచి వచ్చినవే. వాస్తు శిల్పాల్లోనూ ఈ మిశ్రమ విధానం కనిపిస్తుంది.

కుతుబ్‌షాహీలు పర్షియా నుంచి వచ్చారు. వీరు షియా తెగకు చెందినవారు. తమ మత సంప్రదాయం ప్రకారం పరమత సహనం పాటించారు. సున్నీలను, తెలుగువారిని చిన్నచూపు చూడలేదు. మతయుద్ధాలు చేయలేదు. కులీకుతుబ్ షా మొహర్రం పండుగను ప్రవేశ పెట్టాడు. ఇతడే పీర్ల చావడులను, హుస్సేనీ ఆలంను నిర్మించాడు. షియాలు, సున్నీల మధ్య వైషమ్యాలు కొంత కాలం కొనసాగాయి. బహమనీల కాలంలో ముస్లింలు, ఉర్దూభాష తెలంగాణకే పరిమితం కాగా, కుతుబ్‌షాహీల కాలంలో ఇతర తెలుగు ప్రాంతాలకు కూడా విస్తరించడం నూతన పరిణామం.

కుతుబ్‌షాహీల చిత్రకళ

కులీకుతుబ్‌షా, ఇతర నవాబులు ఢిల్లీ నుంచి చిత్రకారులను రప్పించి పోషించారు. మొగల్ చిత్రకారుల సాన్నిహిత్యంతో కొత్త శైలి రూపుదిద్దుకుంది. దాన్నే దక్కన్ కలం అంటారు. దక్కనీ శైలి సృష్టికర్త మీర్ హసీం. అబ్దుల్లా, తానీషాల కాలంలో ఈ శైలి మరింత వృద్ధి చెందింది.

భాషా సాహిత్యాలు

ఈ కాలంలో ఉర్దూ 'దక్కనీ ఉర్దూ'గా పేరొందింది. దాని ప్రాభవం ఉచ్ఛస్థితికి చేరింది. హైదరాబాద్‌లో 38 వేల పుస్తకాలున్న గ్రంథాలయం ఉండేది. కుతుబ్‌షాహీలు తెలుగులో శాసనాలు వేయించారు. తెలుగు భాషను, కవులను, సంస్కృతిని ఆదరించారు. ఉర్దూలో కవిత్వం రాశారు. జమ్షీద్ కుతుబ్‌షా (1543-50) స్వయంగా కవి. గజల్‌లు, గేయాలు రాశాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా (1550 -80) విజయనగర రాజుల దగ్గర ఏడేళ్లపాటు ఆశ్రయం పొందాడు. ఆ సమయంలోనే తెలుగు నేర్చుకున్నాడు. తెలుగు సాహిత్యంలో మల్కిభ రాముడి గా ప్రసిద్ధి చెందాడు. ఇతడి దర్బారులో ఉమర్ షా మహ్మద్ అంజూ, అమీర్ ఇమాదుద్దీన్, మహమూద్ షిరాజీ, జావీ నవీసుల్, జమాఖాసిం బేగ్ షిరాజీ, హుస్సేన్ కులీమీర్జా మొదలైన పండితులుండేవారు. అద్దంకి గంగాధరుడు, మరింగంటి సింగనాచార్యులు, కందుకూరి రుద్రకవి తదితర తెలుగు కవులను ఇబ్రహీం కుతుబ్‌షా పోషించాడు తెలుగు వనిత అయిన భాగీరథిని ఇతడు వివాహమాడాడు. తారిఖ్ కుతుబ్‌షాహి గ్రంథ రచయిత కుర్షాబిన్ కబ్బాదుల్ హుసేన్ ఇతడి కాలానికి చెందినవాడే.

ఈ యుగంలో కనిపించే తొలి కవి చరిగొండ ధర్మన్న. ఇతడు పెద్దన, సూరన, నందిఘంట కవుల కంటే ముందే రుతువర్ణన, నాయికా వర్ణన, వేటవర్ణన లాంటి అష్టాదశ వర్ణనలు చేశాడు. దీన్ని బట్టి ధర్మనను ప్రబంధ కవిత్వ మార్గదర్శకుడిగా చెప్పవచ్చు. కల్పిత కథ ఆధారంగా ఇతడు చిత్ర భారతాన్ని రచించాడు. గయోపాఖ్యానం, కృష్టార్జున యుద్ధం లాంటి యక్షగానాలు రావడానికి చిత్ర భారతమే మూలం. మహబూబ్‌నగర్ (చరిగొండ సీమ)కు చెందిన ధర్మన్న కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి వెళ్లి, ఎనుముల పెద్దన దగ్గర ఆశ్రయం పొందాడు. చిత్రభారతాన్ని అతడికే అంకితమిచ్చాడు. ఇందులో నాటి చారిత్రకాంశాలు కనిపిస్తాయి. చరిగొండ ధర్మన్న సోదరుడు చరిగొండ నరసింహకవి. ఇతడు కూడా కవే. పింగళి సూరన కంటే ముందే సూరన అనే మరో కవి కల్పిత కావ్యం (ధనాభిరామం) రాశాడు.

పోశెట్టి లింగ కవి నవచోళ చరిత్ర, మల్హణ చరిత్ర, శంకర దాసమయ్య చరిత్ర, వీర సంగమయ్య దేవ చరిత్ర, శిష్య ప్రబోధం అనే ద్విపద కావ్యాలను రాశాడు. పోశెట్టి అనే పేరు ఇప్పటికీ తెలంగాణలో వాడుకలో ఉంది. ఈ కావ్యంలోని కైకిలి(దినసరి కూలి), కొండెంగ, మోటు, ఉరువడి, పుటిక, తునక తదితర పదాలు తెలంగాణాలోనే వాడుకలో ఉన్నాయి. అందువల్ల ఇతడు తెలంగాణకు చెందినవాడే కావచ్చు.

ఆసూరి మరింగంటి సింగనాచార్యులు దశరథ రాజనందన చరితను రచించాడు. ఇది తెలుగు సాహిత్యంలో తొలి నిరోష్ఠ్య రచన. ఇతడే తొలి సారిగా అచ్చ తెలుగులో సీతాకల్యాణం అనే నిరోష్ఠ్య రచన చేశాడు. తొలి త్ర్యర్థి, చతురర్థి (నలరాఘవయాదవపాండవీయం) రచన కూడా ఇతడిదే. తిరునామరచనకు కూడా సింగనాచార్యులే ఆద్యుడు. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షా నుంచి అగ్రహారాన్ని పొందాడు.

మల్కిభరాముడి(ఇబ్రహీం కుతుబ్‌షా) మరో ఆస్థాన కవి అద్దంకి గంగాధరుడు (1525-80). ఇతడిని రామరాజభూషణుడితో పోల్చవచ్చు. ఇతడు 'తపతీ సంవరణోపాఖ్యానం'ను రచించి, ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో మల్కిభరాముడి ప్రేమ కథను వర్ణించాడు. ఈ శృంగార కావ్యంలో సమకాలీన సాంఘిక విశేషాలెన్నో కనిపిస్తాయి.

సిద్ధరామకవి, గంగా ధరుడి సమకాలికుడు. ఇతడు ప్రభుదేవర వాక్యం అనే వేదాంత వచన గ్రంథాన్ని రచించాడు. స్తుతి వచన ప్రక్రియకు ఆద్యుడు కృష్ణమా చార్యుడు. శివస్తుతి వచనాలకు ఆద్యుడు గంగాధరయ్య. వీరిద్దరూ తెలంగాణ వారే. మరింగంటి జగన్నాథా చార్యులు (శ్రీరంగనాథ విలాసం), అప్పలాచార్యులు కూడా మల్కిభరాముడి వద్ద ఆశ్రయం పొందారు.

కందుకూరి రుద్రకవి ఈ యుగంలోని అగ్రశ్రేణి కవుల్లో ఒకడు. ఇబ్రహీం కుతుబ్‌షా దేవరకొండ దుర్గపాలకుడిగా ఉన్నప్పుడే ఇతడికి కుతుబ్‌షాతో పరిచయం ఉంది. కుతుబ్‌షా రాజైన తర్వాత అతడి నుంచి రెంటచింతల (ద్వితింత్రిణీ)ను అగ్రహారంగా పొందాడు. ఇతడు నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని కందుకూరుకు చెందినవాడని తెలుస్తోంది.

ఇతడు 'సుగ్రీవ విజయం'ను రచించాడు. దీన్ని తొలియక్షగానంగా భావిస్తారు. నిరంకుశోపాఖ్యానం, జనార్ధనాష్టకం, బలవదరీ శతకం, జనార్ధనాష్టక స్తోత్రం, గువ్వలచెన్నని శతకం తదితర గ్రంథాలను రుద్రకవి రచించాడు. ఇతడి రచనల్లో నిరంకుశోపాఖ్యానం ముఖ్యమైంది. ఇది శృంగార ప్రధాన సాంఘిక కావ్యం. ఇందులో నాటి సాంఘిక జీవనాన్ని చిత్రీకరించారు.

మల్కిభరాముడి అనుచరుడైన అమీన్‌ఖాన్ తొలి అచ్చతెలుగు కావ్యకర్త పొన్నిగంటి తెలగనను ఆదరించాడు. అప్పటి వరకు కవులు అచ్చ తెలుగులో పద్యాలు మాత్రమే రాశారు. కావ్యాలను రాయలేదు. తెలగన అచ్చ తెలుగు కావ్యం రాసి, పాల్కురికి దేశిమార్గాన్ని సుసంపన్నం చేశాడు.

What is N's position with respect to K?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-2): Study the given information carefully and answer the given questions.

Twenty students are standing in a straight line, facing north. Rina is standing sixth from the left end. There are only three students between Rina and Shweta. Radha is standing exactly between Shweta and Rina. Tina is standing sixth to the right of Radha. Anita is standing fourth from the right end of the line. There are more than four students between Rina and Tina.

1. **How many people are standing between Anita and Tina?**
 1) One 2) Two 3) Three
 4) None 5) More than three
2. **What is Shweta's position with respect to Anita?**
 1) Sixth to the left
 2) Eighth to the left
 3) Seventh to the left
 4) Ninth to the left
 5) None of these
3. **Which of the following will come in place of the question mark (?) in the following series based on the English alphabetical order?**
 ZYW VUS RQO ? JIG
 1) KMN 2) MNK
 3) NLK 4) NMK
 5) NML

Directions (Q. No. 4-8): Study the given information carefully and answer the given questions.

Eight people J, K, L, M, N, O, P and Q are sitting around a circular table, facing the centre, not necessarily in the same order. O is sitting third to the right of M. There is only one person sitting between M and J. There are only three people between J and K. P is an immediate neighbour of J. There are only three people between P and L. N is second to the right of P.

4. **Which of the following is true regarding the given arrangement?**
 1) M is an immediate neighbour of K.
 2) N is an immediate neighbour of J.
 3) P is second to the left of O.
 4) There are four people between N and O.
 5) None is true
5. **Who is sitting second to the left of the one who is sitting second to the left of Q?**
 1) M 2) K 3) N
 4) L 5) J
6. **Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which does not belong to the group?**
 1) PQ 2) KL 3) MN
 4) QO 5) KO
7. **What is N's position with respect to K?**
 1) Second to the left
 2) Second to the right
 3) Third to the left
 4) Third to the right
 5) Fourth to the left
8. **How many people are sitting between K and P when counted from the right side of K?**
 1) One 2) Two 3) Three
 4) None 5) More than three

Directions (Q. No. 9-13): Study the given information carefully and answer the given questions.

Auditions for a show were held in seven different cities of India - Chennai, Bangalore, Cochin, Mumbai, Delhi, Bhopal and Kolkata - not necessarily in the same order during the first seven months of the year 2011 (starting in January and ending in July). The auditions were held only in one city during a month. Auditions in only four cities were held between the Kolkata audition and the Cochin audition. The Kolkata audition was not held in June. Only one audition was held between the Kolkata audition and the Bangalore audition. The Chennai audition was held immediately after the Kolkata audition. The Delhi audition was held immediately before the Bhopal audition. The Bhopal audition was not held in May.

9. **How many auditions were held between the Mumbai audition and the Chennai audition?**
 1) One 2) Two 3) Three
 4) None 5) More than three



10. **Which of the following statements is true according to the given sequence?**
 1) Mumbai audition was held in July.
 2) Delhi audition was held in April.
 3) Cochin audition was held before May.
 4) Kolkata audition was held in January.
 5) None is true
11. **Four of the following five are alike in a certain way based on the given sequence and hence form a group. Which does not belong to the group?**
 1) January - Kolkata
 2) March - Bangalore
 3) June - Cochin
 4) May - Delhi
 5) February - Chennai
12. **During March, the audition was held in which of the following cities?**
 1) Bangalore 2) Kolkata
 3) Mumbai 4) Chennai
 5) None of these
13. The audition in Mumbai was held in which of the following months?

Bank Exams

REASONING

 1) July 2) May 3) February
 4) March 5) None of these

Directions (Q. No. 14-16): Read the following information carefully and answer the questions that follow.

Saurabh, Raman, Sushant, Shoumya, Anu and Swati are six friends. Each of them has a different weight, Anu's weight is more than Saurabh's but less than Shoumya's. Only one person is heavier than Sushant. The one whose weight is second lowest is 46 kg and Sushant's weight is 58 kg. Shoumya is not the heaviest. Swati is not heavier than Saurabh.

14. **Whose weight is the second highest?**
 1) Shoumya 2) Raman
 3) Sushant
 4) Can't be determined
 5) None of these
15. **If Sushant is 8 kg heavier than Anu, what is the possible weight of Shoumya?**
 1) 47 kg 2) 44 kg
 3) 55 kg 4) 60 kg
 5) None of these
16. **Which of the following statements is true?**
 1) Raman's weight is 56 kg.
 2) Swati is heavier than Anu.
 3) Raman is the heaviest.
 4) Shoumya is the heaviest.
 5) None of these

Directions (Q. No. 17-23): Study the following information carefully and answer the given questions.

Eight friends O, P, Q, R, Z, T, U and V are sitting around a circle, facing the centre, but not necessarily in the same order. P is second to the left of U, who is fourth to the right of Q. V is opposite O, who is second to the right of Z. O is not an immediate neighbour of P or U. R is an immediate neighbour of Q.

17. **Who among the following is opposite Z?**
 1) Q 2) R 3) P
 4) T 5) O
18. **Starting from O, if all the friends are made to sit in alphabetical order in clockwise direction, the position of how many (excluding O) will remain unchanged?**
 1) One 2) Two 3) None 4) Three 5) None of these
19. **Who among the following sits third to the left of U?**
 1) O 2) T 3) Q
 4) R 5) Z
20. **Which of the following pairs are the immediate neighbours of T?**
 1) O, Z 2) Q, P
 3) Z, V 4) R, O
 5) None of these
21. **If the places of O and V are interchanged, who is third to the right of Q?**
 1) V 2) O 3) Z
 4) T 5) P
22. **Which of the following is true, with respect to the given seating arrangement?**
 1) O sits on the immediate right of Z.
 2) U sits exactly between V and P.
 3) Z sits second to the right of V.
 4) Q is an immediate neighbour of P.
 5) None of these
23. **T is related to P in a certain way. Similarly, Q is related to U, according to the given seating arrangement. Who among the following is related to Z, following the same pattern?**
 1) Q 2) P 3) V
 4) O 5) R

Answers, Explanations


(1-3):



Anita is 4th from the right end.
Thus, in the row, Anita's position from the left end (20 + 1-4) = 17th

1. 2; 2. 3;
3. 4; Move four letters backwards in the alphabet for the corresponding letter of the next tern.

4 - 8:



4. 2; 5. 1; 6. 5; 7. 3; 8. 2

(9 - 13):

Month	City
January	Mumbai
February	Kolkata
March	Chennai
April	Bangalore
May	Delhi
June	Bhopal
July	Cochin

9. 1; 10. 5; 11.4; 12. 4; 13. 5


(14 -16):

Raman > Sushant > Shoumya > Anu > 58 kg
Saurabh > Swati
46 kg

14. 3; 15. 3;
Anu's weight = 58 - 8 = 50 kg
Shoumya's weight lies between Anu's and Sushant's. Thus, the possible weight of Shoumya is 55 kg.

16. 3

(17-23):



17. 2; 18. 3; 19. 4; 20.1;
21. 2 22. 3; 23. 5

విద్య, ఉద్యోగ సమాచారం



ఎన్‌ఏబీఎఫ్ఐడీలో 66 ఆఫీసర్ అనలిస్టు ఉద్యోగాలు

నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ) 66 ఆఫీసర్స్(అనలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 66
- **పోస్టుల వివరాలు:** లెండింగ్ ఆపరేషన్స్ 31, హ్యూమన్ రిసోర్సెస్ 02, అకౌంట్స్ 03, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రెజరీ 01, లీగల్ 02, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఆపరేషన్స్ 07, అడ్మినిస్ట్రేషన్ 01, రిస్క్‌మేనేజ్‌మెంట్ 09, కార్పొరేట్ స్ట్రాటజీ, పార్ట్‌నర్‌షిప్ అండ్ ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్ 07, కాంప్లియన్స్ 02, ఇంటర్నల్ ఆడిట్ 01
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉండాలి. కొన్ని విభాగాల్లోని పోస్టులకు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యమిస్తారు.
- **వయసు:** 31.03.2024 నాటికి 32 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు ఏడేళ్లు, దివ్యాంగులకు 12ఏళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా..

- ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో 100 మార్కులకు.. ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది. దీంట్లో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఏ: 40 ప్రశ్నలకు 40 మార్కులు. వ్యవధి 30 నిమిషాలు. రీజనింగ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 15 ప్రశ్నలు-15 మార్కులు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలు-10 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్ ప్రెటేషన్ 15 ప్రశ్నలు-15 మార్కులు. సెక్షన్-బీ: ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలకు 60 మార్కులు. వ్యవధి 30 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు.
- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా, కేటగిరీల వారీగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఇంటర్వ్యూకు 100 మార్కులు:
జనరల్ అభ్యర్థులు 40 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 35 శాతం కనీస అర్హత మార్కులు సాధించాలి. రాత పరీక్షకు 70 శాతం, ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.
- **దరఖాస్తుకు చివరి తేది:** 19.05.2025
- **వెబ్‌సైట్:** https://nabfid.org/careers